
# మనం మైనస్ నువ్వు ఈజ్ ఈక్వల్ టు ఒఠ్ఠి నేను!



నాదెళ్ళ అనూరాధ

చినుకు

# మనం మైనస్ నువ్వు
# ఈజ్ ఈక్వల్ టు ఒట్టి నేను !

నాదెళ్ళ అనూరాధ

చినుకు పబ్లికేషన్స్,
గాంధీనగర్, విజయవాడ.

# MANAM MINUS NUVVU
# IS EQUAL TO OTTI NENU !

(An anthology of short stories)

**By NADELLA ANURADHA**

First Edition : **December, 2012**

Copies : **500**

Cover Pages : **Sailesh Balantrapu**

For Copies :

**Nadella Anuradha,**
Flat No.102, Block D,
Vasanthnagar, Poranki,
**VIJAYAWADA - 521 137**
Ph : 0866 2583196, 73860 98516
e mail : tukusgm@gmail.com

DTP, Title, Layout & Printing **:**

**CHINUKU Publications**,
27&28, 3rd Floor, Datta's Naya Bazaar,
Opp: Raj Yuvaraj Theaters, Gandhinagar,
Vijayawada- 520 003.
Ph: 0866-6640595; 98481 32208
editor_chinuku@yahoo.com

**Price : Rs. 100/-**

# ముందుమాట

## ఇప్పటి కథలు

"సృష్టికి ముందుగా ఆదిశక్తి పుట్టింది. తోడు లేదు. కాముకత్వంలో విర్రవీగిపోతోంది. బ్రహ్మను సృష్టించింది. 'నువ్వు నా తల్లివి' అని బ్రహ్మ అన్నాడు. కోపంతో శక్తి బ్రహ్మను బూడిద చేసింది. విష్ణువును సృష్టించింది. పెళ్ళాడమని అడిగింది... తల్లిని పెళ్ళాడలేనని విష్ణువు కూడా అన్నాడు. అతణ్ణి బూడిద చేసి పారేసింది. శివుణ్ణి సృష్టించింది. పెళ్ళాడమని అడిగింది. విషయం గ్రహించి శివుడు ఆలోచించి చెబుతానన్నాడు. శక్తి సరేనంది. దిక్కుతోచని శివుడికి విశ్వకర్మ ఉపాయం చెప్పాడు. తలకూ, ముక్కులకూ, చెవులకూ, మెడకూ, చేతులకూ, నడుముకూ, పాదాలకూ, కాళ్ళకూ, వేళ్ళకూ తాను రకరకాల ఆభరణాలు చేస్తాననీ, శక్తి వాటిని ధరిస్తే గాని పెళ్ళాడడానికి ఒప్పుకోననీ శివుణ్ణి శక్తితో చెప్పమన్నాడు. శివుడు శక్తికి ఆ మాట చెప్పాడు. ఆమె ఒప్పుకుంది. విశ్వకర్మ రకరకాల ఆభరణాలను – జడబిళ్ళ, చంద్రవంక, సూర్యవంక, పాపిటసరం, పాపిటబొట్టు, కమ్మలు, గూబ బావిలీలు, చెంపసరాలు, దండకడియాలు, గాజులు, వుంగరాలు, వడ్డాణం, తోడాలు, కాళ్ల కడియాలు, కాళ్ల మెట్టెలను రకరకాల వాటిని తయారుచేశాడు. శక్తిని ధరించమని శివుడు కోరాడు. శక్తి ఒక్కొక్క ఆభరణాన్ని వేసుకుంటూ చివరగా మెట్టెలు తొడుక్కునే వేళకు, అంతకుముందు ఆమెలో వున్న పొగరు

అణిగిపోయింది. మాటలో, నడకలో, ప్రవర్తనలో నెమ్మదితనం, వినయం, అణిగిమణిగి వుండే తత్వం వచ్చేశాయి. అంతే... ఆదిశక్తి శివుడి అధీనం అయింది”.

కేతు విశ్వనాథరెడ్డిగారు మాండలిక వృత్తిపదాలను సేకరిస్తూ బందరులో పర్యటించినప్పుడు ఆయనకు ఒక స్వర్ణకారుడు చెప్పిన కథగా, ఆయన కాత్యాయని విద్మహే పుస్తకానికి వ్రాసిన ‘స్నేహహస్తం’లో ఉటంకించారు. ఈ కథ  తెలుగు పాఠకులు, ముఖ్యంగా మహిళా పాఠకులతో పంచుకోవాలని నేను ఇటీవల విజయవాడ బందరురోడ్డులోని బంగారపుకొట్లని చూసి వెళ్ళి నప్పుడల్లా అనుకుంటున్నాను... పత్రికలలో స్త్రీల పేజీల్లో వంటలూ అలంకారాలూ, దుస్తులూ, ఇంటి అలంకరణలూ చూసినప్పుడు కూడా ఈ కథ గుర్తొస్తుంది. ప్రస్తుతంలోకి వస్తే...

అనూరాధ కథారచన పందొమ్మిది వందల ఎనభైల్లో ప్రారంభించి నట్లు తెలుస్తుంది. ఎనభయ్యో దశకం స్త్రీల ఆలోచనలకు పదును పట్టినకాలం. ఎనభయ్యో దశకంలో పత్రికలలో స్త్రీలకు కేటాయించిన పేజీల్లో, వారికి సంబందించిన సమస్యలపై చర్చలూ, స్త్రీల సమస్యలను, స్త్రీల అభిప్రాయాలనూ పట్టించుకుని వ్రాసిన వ్యాసాలూ కవితలూ వుండేవి. ఇప్పుడవి బంగారపుకొట్ల స్థాయికి వచ్చాయి. ఒక్క కుదుపుతో బండిని వెనక్కి తిప్పినట్లయింది. ఈ తిప్పింది మార్కెట్ విశ్వకర్మ.

మార్కెట్ మానవసంబంధాల్లో మార్పు వచ్చింది. సమిష్టి సౌఖ్యం గురించికాక వ్యక్తి సౌఖ్యం గురించి మాట్లాడి సకల జనులనూ ఒప్పించగలుగుతోంది. ఒప్పుకోకతప్పదని శాసిస్తోంది. వివాహాన్ని గురించి, మాతృత్వాన్ని గురించి, సహజీవన సౌందర్యాన్ని గురించి పెంచుకున్న అవగాహనను కూడా వస్తు వినిమయ సంస్కృతి మింగేసింది. ప్రేమకు నిర్వచనం మారింది. ఈ మార్పు మనకి అనూరాధ కథల్లో కనిపిస్తుంది.

ఆడపిల్లల చదువు గురించి, వాళ్ల ఆర్థిక స్వావలంబన గురించి ఎంత మాట్లాడుకునివున్నా, ఇంకా ఇప్పటికీ ఆడపిల్ల భవితవ్యం వివాహమే. ఆ వివాహానికి కొంత పెట్టుబడి కావాలి కనుక ముందుకు

చదివించడం లేదా ఏదైనా వృత్తికి ప్రోత్సహించడం అనేవి ఆగిపోతాయి అక్కడ. 'ఎటూ పెళ్లి చెయ్యాలిగా' అనే సూత్రం పనిచేస్తుంది. అట్లాగే యవ్వనావేశంలో కట్నకానుకలు లాభనష్టాల బేరీజులు లేకుండా ప్రేమించి పెళ్ళిచేసుకున్న యువకులు కూడా కుటుంబవత్తిడికి లొంగి, భార్యను 'నువ్వు చచ్చిపోకూడదూ' అనడం కూడా మార్కెట్ మాయాజాలం. కాగా ఇప్పటికీ చచ్చిపోవడమో చంపబడడమో జరుగుతూనే వుంది. 'పెళ్ళంటే...?' కథలో అమ్మాయి తన జీవించే హక్కుని కాపాడుకుని పుట్టింటికి తిరిగొచ్చింది. 'తప్పెవరిది' అనే కథలో మిథ్యా గౌరవం కోసం (నగల కోసం వస్తువుల కోసం) ఆత్మహత్య చేసుకున్న అమ్మాయి, ఆ అమ్మాయికి తన తల్లిదండ్రులపట్లా, సాధారణ జీవితంపట్లా అవగాహన కలిగించలేని భర్తా కనిపిస్తారు.

స్త్రీల ఉద్యోగాలకీ, వారి సంపాదనకీ, శ్రమకీ కుటుంబం ఇచ్చే విలువ ఇప్పటికి మారలేదు. ఉద్యోగంతో, ఇంటిపనితో, పిల్లల పెంపకంతో అలసిపోయిన తల్లికి విశ్రాంతి అవసరమన్న జ్ఞానం పిల్లలకు వుండక, తమ సంతానాన్ని కూడా తల్లినే పెంచమనడం ఇటీవల మామూలైంది. 'బంపర్ ఆఫర్' అనే కథలో తల్లి తన భర్త తన తరపు మాట్లాడి, ఆ పెంపకం నుంచి తనని తప్పించి వుండ కూడదా అనుకుంటుందే కానీ, తను మాట్లాడలేకపోతుంది. చదువూ, ఉద్యోగమూ, ఆర్థిక స్వావలంబనా కూడా ఒక నిర్ణయశక్తిని ఇవ్వకపోవడం ఇప్పటి విషాదం. పిల్లలకోసం కెరీర్ వదులుకుని వాళ్లదే లోకంగా బ్రతికిన తల్లిని, ఆ పిల్లలు పెద్దయినాక పలకరించే తీరిక లేకుండా వుండడం... పైగా నువ్వు ఒక మంచి ఉద్యోగం చేసి వుంటే నిన్ను చూసి ఎంత గర్వపడేవాళ్లం అంటూ మాట్లాడ్డం కూడా మామూలైపోయింది. స్త్రీలు తమకోసం అని ఒక్క పార్శ్వాన్ని కూడా కేటాయించుకోక, ఏ అభిరుచులూ, ఆనందాలూ, వ్యావృత్తులూ అలవాటు చేసుకోక, పిల్లల చుట్టూ గుడుగుడు కుంచం ఆడినంతకాలమూ వాళ్లసంగతి అంతే! చిన్నప్పుడు ఒకే కంచంలో అమ్మ చేతి ముద్దలు తిన్న తోబుట్టువుల మధ్య కూడా కనపడని దూరాలు... ఈ సమస్తమైన మార్పులన్నీ జీర్ణించుకుంటూ బ్రతకడం

కత్తి మీద సామే అయినప్పటికీ వాటిని తలచుకుని వగచే కంటె ప్రత్యామ్నాయాలూ, నివారణలూ వెతుక్కోవడం అవసరం కదా!

అనూరాధ ఈ పాతికేళ్లలో వ్రాసిన కథల్లో, మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులు, స్త్రీల జీవితాలలో రాని మార్పులు, అవి రావాలనే ఆకాంక్ష కనిపిస్తాయి. ఆవేశమూ, ఉపన్యాసాలూ, తీర్పులూ లేకుండా సున్నితంగా కథ చెప్పే పద్ధతి ఆమెది. మరికొంత అధ్యయనం, మరికొంత ఎడిటింగ్‌తో అనూరాధ ఇంకా బాగా వ్రాయగలదు... వ్రాస్తుందని నమ్ముతూ....

**డిసెంబర్ 2012** **- పి. సత్యవతి**

**విజయవాడ**

# నా మాట

పుస్తకాలంటే బోలెడంత ఇష్టం. పుస్తకాల మధ్య చాలా సెక్యూర్డ్‌గా ఫీలవుతాను.

పదకొండేళ్ళ వయసులో మొదటిసారిగా నాన్న ఆఫీస్ మ్యాగజైన్స్‌లో నా రాతల్ని అచ్చులో చూసుకున్నాను.

అందంగా సుదీర్ఘమైన ఉత్తరాలు రాసే నాన్న ప్రభావం నా మీద ఉంది. ఏం రాసినా, 'బాగానే ఉంది. కాని ఇంకా బాగా రాయాలి అనూ' అంటుంది అమ్మ...

అచ్చులో రచన చూసుకున్న ప్రతిసారీ అదే మొదటిసారి అన్నట్లు, 'నా కథ అచ్చయింది, చూడండి' అంటే, ఒక బాధ్యతగా చదివేసి 'బావుంది' అని క్లుప్తంగా చెప్పేసి, 'నాకు ఇవన్నీ అర్థంకావు' అంటూ మొహమాటంగా ఒప్పేసుకునే మావారు...

నా రాతల గురించి చెప్పినప్పుడల్లా, 'యు ఆర్ వండ్రఫుల్ అమ్మా' అంటూ, వాళ్ల రాతల్ని వాళ్ల బ్లాగులకెక్కించుకుంటూ వాళ్ళ జీవితాల్లో కూరుకుపోయిన నా కూతుళ్ళు...

ఈ చిన్నటన్నెల్ దాటి బయట ప్రపంచాన్ని ఇంకొంచెం వివరంగా, దగ్గరగా చూడాలనుకుంటూనే ఇన్‌హిబిషన్స్ మధ్య సతమతమవుతూంటాను.

పదిహేడేళ్ళ వయసులో అత్తవారింట్లో కాలుపెట్టినప్పుడు, 'మా కోడలు కథలు రాస్తుంది' అంటూ అందరికీ పరిచయం చేసిన

మా మామగారు శ్రీ నాదెళ్ల రామ నరసింహశాస్త్రిగారు ఇప్పుడు వుండి ఉంటే ఎంత సంతోషించేవారో…!

చాలా సంవత్సరాలక్రితం శ్రీ మహీధర రామ్మోహనరావుగారు 'కథల పుస్తకం వేయించుకో' అంటే, అప్పటిదాకా అలాటి థాటే లేని నాకు బోల్డు ఆశ్చర్యం.

'77లో సెయింట్ జోసెఫ్స్ కాలేజీ, వైజాగ్‌లో చదువుతున్నప్పుడు, కాలేజీ మ్యాగజైన్‌కి రాసిన ఓ కథను, 'బావుంది, ఏదైనా పత్రికకి పంపు' అంటూ ప్రోత్సహించిన తెలుగు లెక్చరర్ శ్రీమతి ప్రసూనాంబ గారిని, ఆ కథని అచ్చువేసిన 'ఆంధ్రభూమి'ని ఎన్నోసార్లు తల్చుకుంటూ ఉంటాను.

నా కథల్ని అచ్చువేసి, రాసేందుకు నమ్మకాన్నిచ్చి, నన్ను ప్రోత్సహిస్తున్న అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇప్పుడు ఈ పుస్తకం మాత్రం స్నేహితురాలు శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి గారి ప్రోత్సాహంతోనూ, 'చినుకు' ఎడిటర్ శ్రీ నండూరి రాజగోపాల్ గారి సహకారంతోనూ సడన్‌గా తయారైపోయింది.

'ముందుమాట' రాసి పెట్టమని అడిగినప్పుడు, వెంటనే కథలు పట్టుకురమ్మని ఇంటికి పిలిచి, ఓపిగ్గా కథలు చదివిన శ్రీమతి పి. సత్యవతిగార్కి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాననడం చాలా చిన్నమాట.

ఇంకా చాలా చాలా చదవాలి. ఇంకా… కొంచెం రాయాలి కూడా.

ప్రేమతో

మీ

అనూరాధ

# అంకితం



ప్రేమించడం మాత్రమే నేర్పిన

అమ్మా నాన్నలకు ఈ పుస్తకం...!

# ఇదీ వరుస ...


| | | |
|---|---|---|
| 1. | ఔన్నత్యం | 13 |
| 2. | సంకల్పం | 18 |
| 3. | ప్రశ్న | 27 |
| 4. | నిర్ణయం | 35 |
| 5. | మార్పు | 43 |
| 6. | నాన్న పుట్టిన ఊరు | 48 |
| 7. | సరిపడని సూత్రాలు | 58 |
| 8. | తీర్పు | 63 |
| 9. | ఒక అమ్మకి... ఒక మున్నీ | 70 |
| 10. | సాక్షి | 75 |
| 11. | సహజీవన సౌందర్యం | 84 |
| 12. | ఒక సందర్భం | 89 |
| 13. | తప్పెవరిది? | 99 |
| 14. | అనగనగా ఒక మహారాణి | 108 |
| 15. | మనం మైనస్ నువ్వు ఈజ్ ఈక్వల్ టు ఒఠ్ఠి నేను | 117 |
| 16. | బంపర్ ఆఫర్ | 124 |
| 17. | మబ్బు తునక | 130 |
| 18. | దృక్కోణం | 137 |
| 19. | పెళ్లంటే...? | 141 |
| 20. | తోడు | 156 |
| 21. | నోస్టాల్జియా | 162 |

# ఔన్నత్యం

ఖంగుమన్న కంఠం విన్పించి చటుక్కున మెలకువ వచ్చింది. కప్పుకున్న రగ్గు తొలగించి కళ్ళువిప్పి చూస్తే చుట్టూ చీకటి పొరలింకా విప్పుకోనే లేదని గమనించాను. చాలా చలిగా వుంది. తెలవారకుండానే మెలకువ తెప్పించిన ఆ కంఠం తాలూకు వ్యక్తిమీద కోపం వచ్చింది. అది ఫాతిమా గొంతు.

బద్ధకంగా లేచి కూర్చున్నాను పక్కమీద. పక్కనే మంచం మీద ఫణి కదులుతున్నాడు. వాడికీ నిద్రాభంగమైంది కాబోలు... చిన్నగా నసపెడుతూ రాగాన్ని క్రమేపీ పెంచే యత్నం చేస్తున్నాడు. వాడి పక్క మీదకి చేరి వాణ్ణి జోకొట్టడం మొదలుపెట్టాను. అక్క లోపలెక్కడో ఉన్నట్టుంది.

ఫాతిమా ఇంకా ఎవరిమీదో కేకలు పెడుతూనే వుంది. ఇక్కడికొచ్చిన నాలుగు రోజులుగా ఆమెని గమనిస్తున్నాను. తెలవారకుండా పనుల్లోకి జొరబడుతుంది. ఊళ్ళో పనులన్నీ ఆమెవే అన్నట్లు తిరుగుతుంది.పని చేస్తున్నంతసేపూ ఆ నోరు కూడా మూత పడదు. బడబడా మాట్లాడుతూనే వుంటుంది. ఒక్కోసారి కేకలు, అరుపులూను. ఎందుకామె ఆక్రోశం? నాకు అర్థం కాదు.

ముందుగా మంచినీళ్ళ బావినుండి నీళ్ళు తెచ్చి ఇంటింటికీ పోస్తుంది. ఆపని ముగుస్తూనే ఇంకో పని. విశ్రాంతి, అలుపు అనేవి ఎరక్కుండా తిరిగే కాలానికి పోటీగా ఆమె పని చేస్తూనే వుంటుంది.

ఆమె తినే తిండిలో ఏముందో అంత శక్తి నాకు అంతు పట్టదు.

బ్రష్ చేసుకుంటూ పెరడంతా ఆ మంచు తెరల మధ్య తిరుగుతున్నాను. రోజూ చేసుకునే పనులే అయినా అక్క హడావుడిగా తిరుగుతోంది. పెళ్ళయిన ఈ మూడేళ్ళలో ఎంత మార్పు!

చదువు నిమిత్తం పెదనాన్న అక్కని తమ ఇంట దిగబెట్టి వెళ్ళాడు. అది మొదలుగా పెరుగుతున్న ఆత్మీయత తమని దగ్గర చేసింది. పెళ్ళయి
అక్క వెళ్ళిపోతూంటే తన దిగులుకి అంతులేదు.

తమ ఊరికి దూరంగా ఎక్కడో పల్లెలో వ్యవసాయం తనకి ఇష్టం అంటూ స్థిరపడిపోయిన బావగారివెంట వచ్చేసింది. ఇన్నాళ్ళకి తీరిగ్గా తను ఈ ఊరు, పల్లె వాతావరణం చూడాలని, అనుభవించాలని ఆశగా వచ్చింది.

"నేనీరోజు నుండి మిల్లు పనికి వెళ్తున్నానండీ. సాయంకాలం పనిలోకి లేటవుతుంది" పెద్ద గొంతుతో చెబుతోంది.

"వాకిట్లో ముగ్గు వేశావా?" అక్క ప్రశ్న.

"టైము లేదండి. ఈవేళ్టికి మీరే వేసుకోండి" ఆ చెప్పే తీరు నా కస్సలు నచ్చలేదు.

కబుర్ల మధ్య, ఫణితో ఆటల మధ్య సమయమెలా గడిచిందో అప్పుడే మూడయింది.

"ఆంటీ" అంటూ వచ్చారు ఫాతిమా కొడుకులిద్దరూ. అక్క ఇద్దర్నీ కూర్చోబెట్టుకుని ఓపిగ్గా అక్షరాలు నేర్పుతోంది. చిన్నవాడు చురుకైనవాడే కాని చదువుమీద ధ్యాసే లేదు. వాడు అక్కతో అంటున్నాడు.

"ఆంటీ! మాకు రేపు బళ్ళో పాఠాలు చెప్పరు. మా పెద్ద టీచరుగారు, చిన్న టీచరుగారు మమ్మల్నందర్నీ ఊరేగింపు తీసుకెళ్తారు".

"దేనికిరా?"

"పెద్ద టీచరుగారేమో పెద్ద అట్టల మీద ఇదిగో ఇది రాసి తెమ్మన్నారు. వాటికి కర్రలు కూడా కట్టి ఇవ్వాలి ఆంటీ పుచ్చుకుందుకు" పెద్దవాడు వాడి పుస్తకంలో టీచరు వ్రాసిచ్చిన అక్షరాలు అక్కకి చూపుతున్నాడు.

"అక్షరకృష్ణ వర్ధిల్లాలి" అక్షరాస్యత ప్రచారోద్యమంలో ఓ భాగంగా తనవంతు బాధ్యతను నెరవేర్చాలని వాడి ఉబలాటం.

సాయంకాలం ఆరింటిదాకా అక్క వాళ్ళక్కావలసినవి తయారు చెయ్యటంలో బిజీగా వుండిపోయింది. ఆ పైన పనుల్లోకి జొరబడబోతుంటే... ఫణి అమ్మకోసం ఏడుస్తున్నాడు.

"అక్కా! వీణ్ణి తీసుకో, నీ టైమంతా ఆ పిల్లలతో సరిపోయిందివాళ. ఈ పని నేను చూస్తాను. నువ్వు పద" అంటూ అక్క చేతిలో పని బలవంతంగా లాక్కున్నాను.

ఫణికి వెచ్చని నీళ్ళతో స్నానం చేయిస్తోంది అక్క.

"అక్కా !మీ ఫాతిమా ఎందుకంత గట్టిగా మాట్లాడుతుంది. నాకైతే ఆ అమ్మాయి అస్సలు నచ్చలేదు. సగంపని నీకే వదిలిపెట్టి మరో పనికి వెళ్ళిపోతోంది. నీ కస్సలు చెప్పటం తెలీదు"

అక్క నవ్వుతోంది. ప్రశాంతమైన ముఖంలో ఆ చిర్నవ్వు ఎంతో శోభగా వుంది.

"వాణీ! నీకు తెలియదు. నువ్వు చిన్నపిల్లని. ఆమె ఎంత కష్టపడుతుందో నీకు అర్థం కాదు. భర్త పోయాడు. పిల్లలిద్దరూ చిన్నవాళ్ళు. కష్టపడి ఏ పని చెయ్యడానికైనా వెనుతీయదు. ఎవరికేం కావాల్సినా ఆ పనికి ఆమెనే పిలుస్తారు. నాలుగు పనులు చేసుకుంటేనే ఆ తల్లీ పిల్లల కడుపు నిండేది" జాలిగా అంది అక్క.

❖❖❖

యధాప్రకారం ప్రొద్దున్నే నిద్రాభంగం అయిందని తను ఉడుక్కుంటూ వుంటే బావగారు ఆటపట్టిస్తున్నారు.

"వాణీ! శెలవులే కదా అని వెచ్చగా ఎనిమిదింటిదాకా పడుకుందామంటే మా పల్లెల్లో కుదరదు. అందరూ సూర్యోదయాన్ని చూడవలసిందే!"

"మీకు నవ్వులాటగానే వుంటుంది బావగారూ... మీలా మేము ఎనిమిది గంటలకే రాత్రిళ్ళు నిద్రపోము" రోషంగా జవాబు చెప్పాను.

ఫాతిమా మీద రోజు రోజుకీ అసహనం పెరిగిపోతోంది నాలో. మధ్యాహ్నం భోజనాలు ముగించి కబుర్లలో పడ్డాం. క్రితం రోజే చూసి వచ్చిన 'అంకురం' గురించి సీరియస్‌గా చర్చించుకుంటున్నాం అక్క, నేను.

ఎవరో ఘర్షణ పడుతున్నట్లు పెద్దగా అరుపులు కేకలు విన్పిస్తున్నాయి. "అరే, ఫాతిమా గొంతులా వుందే. ఎవరితోనో పాపం గొడవ పడుతోంది" అక్క మాటలకి నేను మౌనంగా ఉండిపోయాను.

ఇంతలో ఫాతిమా కొడుకులు, కూడా ఓ అయిదారేళ్ళ అమ్మాయితో పలకలతో వచ్చారు.

"ఈ అమ్మాయి ఎవర్రా?"

"మా చిన్నోడి స్నేహితురాలు" పెద్దవాడి జవాబు.

"నీ పేరేంటమ్మా?"

"మెహర్" ఆ పిల్ల గొంతుతో పాటు చిన్నవాడి గొంతూ పలికింది.

మెహర్ ముద్దుగా వుంది. అక్క రాసిచ్చిన 'ఆ ఆ' లు దిద్దటం కంటే దాని గుండ్రటి పెద్ద కళ్ళు అన్ని రంగుల్లోనూవిచ్చి సూర్యకాంతితో మెరుస్తున్న బంతిపూల మీదే వున్నాయి.

గేటు విసురుగా తీసిన ధ్వని. వేగంగా పెరట్లోకి వచ్చిందామె. ఎర్రని కళ్ళతో ముఖం కంది, నీరసంగా వుంది. అలసట తెలీనట్లుండే ఆమెనలా చూడటం నాకు కొత్తగా వుంది.

గిన్నెలు వేస్తూ అక్క అనునయంగా అడుగుతోంది.

ఫాతిమా కొన్ని క్షణాలు మాట్లాడలేదు. మధ్యలో ఒకసారి కళ్ళెత్తి నా వంక చూసింది. నా ఉనికి ఆమెకు అభ్యంతరకరం అన్పించి డాబామీదకి దారి తీశాను.

క్రింద చాలా సేపటివరకూ సంభాషణ సాగుతున్న అలికిడి తెలుస్తూంది. సాయం సంధ్యలోని రంగుల్ని ఆ పచ్చని పైర్ల మీదుగా చూడటం ఓ అద్భుత అనుభవం.

“వాణీ! బోర్ ఫీలయ్యావా?” అన్న మాటలకి తిరిగి చూశాను.

“లేదక్కా! ప్రకృతికీ మీకూ ఇంత దగ్గరతనం ఉంది కనుకే మీరింత ప్రశాంతంగా ఉన్నారనిపిస్తోంది” నన్నావరించిన భావుకతకి అక్క నిట్టూర్చింది.

‘ఎక్కడి ప్రశాంతతరా? ఎప్పుడో ఓసారి వచ్చి నాల్గురోజులుంటే అలాగే వుంటుంది. మానవ సమాజానికి పల్లె, పట్నం అన్న వ్యత్యాసం లేదు”

“వాణీ! ఫాతిమా కథ వింటావా? ఆమె ఎందుకలా ఎప్పుడూ ఎవరో ఒకరి మీద కేకలు పెడుతుందని అంటావుకదూ”.

ఈ వేళ ప్రొద్దున్న ఈమె చిన్న కొడుకు, ప్రక్కింటమ్మాయి ఆ ‘మెహర్’ అలవాటుగా ఆడుకుంటూ దేనికో పేచీ పడ్డారు.

మెహర్ తల్లి వచ్చి ఈ పిల్లాణ్ణి కొట్టబోయింది. ఫాతిమా అడ్డువెళ్ళడంతో అసలు గొడవ మొదలైంది.

“స్వయానా కన్నట్లే వెనకేసుకొస్తున్నావే”

“ఆ! వాడు నా కొడుకు. వాణ్ణి ఏమన్నా అంటే ఊర్కొనేది లేదు”

“ఆ తెల్సులే. పసిపిల్లాణ్ణి దొరికాడంటూ పట్టుకొచ్చిన రోజే నాకు అనుమానం వచ్చింది, అన్నాళ్ళూ ఎక్కడ కని సాకావో అని”. ఆమె మాటలకి చుట్టూ నిలబడి చూస్తున్న ఆడ, మగ అందరి ముఖాల్లోనూ కుతూహలం. ఆ మాటలకి, నవ్వులకి ఫాతిమా అవమానంతో కేకలు మొదలు పెట్టింది.

ఆమె పెద్ద  కొడుకు పుట్టిన మూడు నెలలకే వాళ్ళ ఆయన లారీ ఏక్సిడెంట్‌లో పోయాడు.

కొన్నాళ్ళు ముసలి తండ్రి సాయం ఉన్నాడు. అతను పోవడంతో దిక్కులేనిదైంది. అత్త మామల ఆదరణ తక్కువ. ఉన్న మరిది ఒక్కడూ ఆమెను లోకువగా చూడబోతే ఆ ఇంట్లోంచి బయటపడి ఒంటరిగా వుంటోంది.

తనను తాను కాపాడుకుందుకు ఆమె ఒక ఆయుధాన్ని ఎన్నుకుంది. అదే ఆమె నోరు.

ఇంతకీ ఆ చిన్నపిల్లవాడు ఆమె కొడుకు కాదు. పొలం పనుల నుండి వస్తూ ఓ రోజు రోడ్డు పక్కన ఏడుస్తున్న పసిబిడ్డను అనాథలా వదిలి ఎవరికి వారే తప్పుకు పోతూంటే తెచ్చిపెంచింది.

పిట్టగోడ మీద నుండి కన్పిస్తున్న ఆ పసివాళ్ళని ముగ్గుర్నీ చూస్తున్నాను.

"మెహర్! అన్నయ్య తెచ్చిన పువ్వుకంటే మంచి పువ్వు తెచ్చాను" ముద్దబంతిపువ్వు నొకదాన్ని మెహర్ చేతికందించి...

"బాలకృష్ణ  వర్థిల్లాలి" నినాదాలు చేస్తున్నాడు ఆ పసివాడు...ఫాతిమా కొడుకు, చేతిలో అక్క నిన్న తయారు చేసి ఇచ్చిన ప్లే కార్డ్ – "అక్షరకృష్ణ వర్థిల్లాలి"

**('వనితా జ్యోతి' జూలై 1995)**

# సంకల్పం

"స్వప్నా! ఏమైంది నీకు? ఎందుకిలా మాట్లాడుతున్నావ్? డాక్టర్ మధు ముందు మనమంతా ఒక ఒప్పందానికి ఆనాడే వచ్చాం కదా. ఇప్పుడు నువ్విలా మాట్లాడితే ఎలా చెప్పు?" అనునయంగానే చెప్పే ప్రయత్నం చేశాడు మోహన్.

"ఏమో! అప్పుడు నేనివన్నీ ఆలోచించలేదు. ఇప్పుడు వదినతో మాట్లాడేక ఒక్కొక్కటే నాకు స్ఫురిస్తోంది. ఆ పాపాయి అందంగా ఆరోగ్యంగా ఉంటేనే తీసుకుందాం. అవకరాలతో ఉన్న బిడ్డ మనకొద్దు. నేను చూడలేను. పెంచలేను. అసలా ఊహే భరించలేను" – ఫోన్‌లో స్వప్న ఏడుస్తున్న ధ్వని స్పష్టంగా.

ఒక్కక్షణం మతిపోయినట్లయింది మోహన్‌కి.

స్వప్న అమాయకురాలు. ఇన్నేళ్ళుగా ఆమెని ఎడ్యుకేట్ చెయ్యకపోవడం నిజంగా నేరమే.

ఆమె మీద ఎన్నెన్ని ఇన్‌ఫ్లూయన్స్‌లు! ఎందరెందరు ఆమె మనసు మీద దాడి చేస్తుంటారు?!

స్వప్న వదినగారి మీద మోహన్‌కి మొదటిసారిగా కోపం వచ్చింది. ఇద్దరు బిడ్డల తల్లయి ఉండీ, ఎలా అనగల్గిందామె అలా? నవమాసాలూ మోసి, కనిపెంచిన బిడ్డనైతే ఇలా తృణీకరించగలదా? ఇలా ఎలా ఆలోచించగల్గుతోంది?

స్వప్నకెలా నచ్చజెప్పాలి? ఆమెనెలా ఓదార్చాలి? ఇంత దూరాన ఉన్నాడు. ఇంకో నెలలోపు తనక్కడికి చేరుకుంటాడు.

ఇక సుజాత ప్రసవించే రోజులూ ఎంతో దూరంలేవు. రవి, సుజాతలు వద్దనుకుని నిర్ణయించుకుని కూడా తమ మీద సానుభూతితో ఉదారంగా అంగీకరించేరే!

ఆ మానవత్వపు పరిమళాలు స్వప్నని ఇన్‌ఫ్లూయన్స్ చెయ్యనే లేదా! అంత నిస్వార్థంగా ముక్కూ మొఖం తెలియని తమ కోసం ఆ జంట వారి నిర్ణయాన్ని ఎందుకు సడలించుకున్నారని?

ఇన్నాళ్ళూ స్వప్నని అక్కడ వదలిపెట్టి రావడం నిజంగా తను చేసిన పొరబాటే. కాని... ఇలా అయితే ఎలా? ఆమె ఇంగిత జ్ఞానం నశించి ఇలా ఎవ్వరేమంటే దాని గురించి వర్రీ అయితే ఎలా?

"స్వప్నా! స్వప్నా! ..."

ఆమె ఫోన్ పెట్టేసిన ధ్వని. నిట్టూర్చాడు. ఏం జరగబోతోంది?

స్వప్న మనసులో భయాలు పోగొట్టాలి. ఇన్నాళ్ళూ చిన్న విషయాలుగా ఆమెలో తానుపేక్షించిన బలహీనతలన్నింటనీ పూర్తిగా పటాపంచలు చెయ్యాలి.

వ్యక్తిగత జీవితం ప్రక్కన పెట్టి పోటీ ప్రపంచంలో పరుగులెత్తుతున్న తను క్షమార్హుడు కాడు. ఈ పాఠం జీవితంలో లేటుగానైనా నేర్చుకుంటున్నందుకు సంతోషించాలేమో!

❖❖❖

మోహన్ చుట్టూ ఉన్న ప్రపంచంతో సంబంధంలేనట్లు ఆలోచనలో మునిగి ఉన్నాడు. ఆలోచనల బరువుకి అతని కళ్ళూ, ముఖమూ అలసి ఉన్నాయి. శాంతంగా తనున్న పరిస్థితుల్ని, స్వప్న భయాల్ని అర్థం చేసుకొనే ప్రయత్నంలోనే ఉన్నాడు.

ఇన్నేళ్ళూ పుట్టి పెరిగిన దేశానికి దూరంగా, అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ ఒకదాని వెంట ఒకటిగా మెట్లు ఎక్కుతూ వచ్చాడు.

పరుగుపందెం లాంటి జీవితంలో ఇన్ని సంవత్సరాల కాలం ఎలా గడిచిందో అర్థం కాదు. ఏ రెండు మూడేళ్ళకో జన్మనిచ్చిన దేశాన్ని, తల్లిదండ్రుల్ని చూసేందుకు వెళ్ళి రావడం, మళ్ళీ యాంత్రికత మధ్య బ్రతికెయ్యడం!

స్వప్నతో జీవితం బాగానే గడిచిపోతోంది. ఆమె పెంకితనం, పట్టుదల, అహంకారాలు ఒక్కోసారి అతన్ని నిరాశలో ముంచినా, ఆమె ప్రేమ, అమాయకత్వం అంతలోనే క్రొత్త ఆశల్నీ చిగురింప చేస్తూండేవి.

ప్రయాణపు ఆఖరు ఘట్టంలో వున్నాడు. కళ్ళు విప్పి చుట్టూ చూశాడు. జనం ఎవరి హడావుడిలో వారున్నారు. ఎదుట ఉన్న ఓ జంట చేతుల్లో పాపాయితో సమానంగా కేరింతలు కొడుతున్నారు. మళ్ళీ తన ఆలోచనల్లోకి మళ్లాడతను.

ఈ మధ్య గత మూడు, నాల్గు సంవత్సరాలుగా ఎప్పుడు దేశం వచ్చినా ఇంటా, బయటా 'ఇంకా పిల్లల్ని ప్లాన్ చెయ్యలేదూ?' అన్న విస్మయంతో కూడిన ప్రశ్నలు.

స్వప్న తనతో ఈ విధమైన వ్యాఖ్యల గురించి ఎప్పుడూ డిస్కస్ చెయ్యలేదు. ఆమె మనసులో ఆలోచనలేవిటో! అలా అని గుప్తంగా ఏదీ దాచుకునే తత్వమూ కాదు. అదొకరకం. ఒక నిర్లక్ష్యం.

అతను మాత్రం ఆ నిర్లక్ష్యాన్ని అమాయకత్వం కిందే తీసుకుంటాడు. తనకి తాను సర్ధిచెప్పుకుంటూ వస్తున్నాడు.

ఈ మధ్య వరకు మోహన్ జీవితం గురించి ప్రత్యేకం ఏమీ ఆలోచించలేదు. గత రెండుసార్లూ, ఇండియా వచ్చినప్పుడంతా, "పిల్లల్ని ఇంకెప్పుడు కంటారు?" అంటూ ఆట పట్టిస్తుంటే కొంచెం కొంచెంగా మనసుకి పడుతోందా విషయం.

దాదాపు ఎనిమిదేళ్ళకు పై మాటే.

"ఉద్యోగంలో స్థిరపడ్డావు. పెళ్ళి చేసుకో" మంటూ అమ్మా నాన్నల ఒత్తిడి.

అలాగే అతని కోసం అమ్మాయిల్ని చూడడం ఆరంభించారు.

ఆ రోజు శశి దగ్గర్నుంచి ఫోను –

"అన్నయ్యా! ఈ రోజే ఒక అమ్మాయిని చూశాం. పేరు స్వప్నట. నిజంగా ఒక మధురమైన స్వప్నంలా వుందిరా. తెగ గారాబంగా పెరిగినట్లే కన్పించింది. నీకు తగ్గ జోడీ. కన్‌ఫర్మ్ చేసేద్దామని ఉంది. ఏమంటావు?"

చెల్లెలి ప్రశ్నకి సిగ్గుపడ్డాడతను. తనకంటే చిన్నదైనా శశికున్న చొరవ అతనికి లేదు.

"మీ అందరికీ నచ్చితే నాకూ నచ్చినట్లే" అనేశాడు.

స్వప్నతో పెళ్ళి, జీవితం అంతా సవ్యంగానే ప్రారంభమైంది. పెళ్ళయ్యాక ఒక నాల్గురోజులు గోవా వెళ్ళొచ్చారు.

రాగానే, శశి ఎదురొచ్చి, అతన్ని పక్కకి లాక్కెళ్ళి, "అన్నయ్యా! వదిన నీతో మొట్టమొదటగా ఏం మాట్లాడింది? నాకు చెప్పాల్సిందే" అంటూ డిమాండ్ చేసింది.

అతను మొహమాటపడినా ఆమె వదల్లేదు. చెప్పి తీరాలని పట్టుబడితే చెప్పాడు.

"తనకి ఇప్పుడే పిల్లలు వద్దంది"

అన్నయ్య ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది. మోహన్‌కీ స్వప్న ఫ్రాంక్‌నెస్ కొంచెం ఇబ్బంది కల్గించిన మాట నిజమే. నవ్వేశాడు.

అమ్మా, నాన్నలు పెద్దవాళ్ళైపోతున్నారు. అమ్మ చెబుతోంది – "నాన్నా! ఓ నలుసుని కనండిరా. జీవితానికో గమ్యం ఏర్పడుతుంది."

అతనితోపాటు ఆమె మనసులోకి ఆ విషయం ఇంకిన తర్వాత డాక్టర్‌ని కన్‌సల్ట్ చెయ్యడం, పిల్లలు పుట్టే ఛాన్సెస్ దాదాపుగా లేవనే చెప్పడంతో అతని మనసొక్కసారి మొద్దుబారినట్లయింది. చిన్న, చిన్న విషయాలకి అలిగి, పోట్లాడి మారం చేసే స్వప్న ఇప్పుడు  మాత్రం కామ్‌గానే ఉంది. ఎందుకో అర్ధం చేసుకోలేకపోయాడతను.

"నాకు పిల్లలు అక్కర్లేదసలు"

అతనీసారి నిజంగానే విస్మయంలో పడ్డాడు.

తనకు అందనంత దూరంలో ఉన్నదాని కోసం అర్రులు చాచడమే మానవ స్వభావానికి సహజమనుకున్నాడు ఇన్నాళ్ళూ.

'మా వదినని చూస్తున్నానుగా, ఆ పిల్లలిద్దరితో, ఎప్పుడూ అంటూంటుంది ఎందుకొచ్చిన పిల్లలు, ఏం ఉద్ధరించాలని"

స్వప్న నిజంగా అమాయకురాలే!

'స్వప్నా! నువ్వు నాకెప్పుడు అర్ధం అవుతావు? నీ మనసులో ఏముందో నాకెలా తెలుస్తుంది? బాధగా అనుకున్నాడు.

అతని మనసు కృంగిపోయినట్లయింది. తల్లికి ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? శశితో చెబితే అర్ధం చేసుకోగలదనుకున్నాడు.

అన్నయ్య వచ్చాడని సంబరంగా వచ్చిన శశి విషయం విని తట్టుకోలేకపోయింది. ఆమె మనోపథంలో స్వప్న అన్నయ్యతో మొదటిసారిగా మాట్లాడిన మాటలు చటుక్కున మెదిలాయి. 'ఛ' అనుకుని తలవిదిలించుకుంది తన ఆలోచనకి.

రెండ్రోజులు ఆలోచించింది.

"అన్నయ్యా! మీరు ఒక పాపాయిని దత్తత తీసుకోండి" అంది, మనసు కూడదీసుకుని.

మోహన్‌కి అదొక పరిష్కారంగా తోచింది. నిజమే! మెల్లిగా ఎంక్వయిరీ మొదలు పెట్టారు.

దత్తత తీసుకుందుకు కనీసం సంవత్సరకాలం ఇండియాలో ఉండటం చాలా అవసరం అని తెల్సింది.

ఒక్క అడుగు ముందుకు వెయ్యాలంటే ఎన్ని అడ్డంకులు? సరే, ఎటూ ఇండియా వచ్చి స్థిరపడే ఆలోచన ఉండనే ఉంది. ఇక సాధ్యమైనంత త్వరగా అన్నీ తెములుచ్చుకు రావడమే అనుకున్నాడు వెనక్కి వెళ్తూ.

❖❖❖

సడన్‌గా తల్లికి సీరియస్‌గా ఉందని మోహన్ ప్రయాణమయ్యాడు. ఎప్పుడో చిన్నప్పుడు కల్సి చదువుకున్న మిత్రుడే డాక్టర్ రూపంలో ఎదురయ్యాడు. ఎందుకో ఎన్ని సంవత్సరాలు గానో గడ్డకట్టిన ఒంటరితనం ఒక్కసారిగా వదిలిపోయినట్లే అన్పించింది మోహన్‌కి.

తల్లి క్రమంగా కోలుకుంటోంది. డాక్టర్ మధు కూడా చిన్ననాటి నేస్తాన్ని కల్సుకుని, కబుర్లు చెప్పుకుని రిలాక్సవడం హాయిగా ఫీలయ్యాడు.

వృత్తి ఉద్యోగాల నుంచి నెమ్మదిగా స్వవిషయాల్లోకి వచ్చారిద్దరూ. మోహన్ ముఖంలో ఒక అసంతృప్తి రేగడం మధు చూపు నుండి తప్పించుకోలేదు.

"ఏం మోహన్, ఒక్కసారి నిశ్శబ్ధమైపోయావ్?"

మోహన్ తనెదుర్కొంటున్న ఒక ఖాళీతనాన్ని వివరించి చెప్పాడు.

"ఇదొక సమస్య కానేకాదు. ఒక్క చక్కని పాపాయిని పెంచుకుందువుగాని."

"కాని ఎవరిస్తారు? ఎలా? దత్తత తీసుకుందుకు బోల్డు రూల్సు చెబుతున్నారు. అందుకే సాధ్యమైనంత త్వరగా ఇక్కడికి వచ్చేయాలని చూస్తున్నాను."

"నువ్వు నిరాశ పడక్కర్లేదురా. నీ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని నాకనిపిస్తోంది" ధైర్యంగా చెప్పాడు డాక్టర్ మధు.

❖❖❖

"అత్తయ్యగార్కి తేలిగ్గానే ఉందిగా. అమ్మ వాళ్ళతో ఓ వారం గడిపి వద్దాం" అంటూ మొదలుపెట్టింది స్వప్న.

రైలు దిగి ఇరవై నాలుగ్గంటలు కాకుండానే ఫోన్. డాక్టర్ మధు అర్జంటుగా తనను కలవమన్నాడని, మనసంతా తెలియని ఆందోళనతో మోహన్ ఒక్కడే బయల్దేరాడు.

ఇల్లు చేరేసరికి వరండాలో చల్లగాలికి విశ్రాంతిగా కూర్చున్న తల్లి కన్పించాక అతని మనసు స్థిమితపడింది. కాళ్ళయినా కడుక్కోకుండా మధు దగ్గరికి బయల్దేరాడు.

"రా, రా మోహన్! నీకో శుభవార్త. నాకు తెల్సున్న ఒక జంట తమకిక పిల్లలొద్దని, ఇప్పటికే ఇద్దరమ్మాయిలున్నారని, ఈ థర్డ్ ప్రెగ్నెన్సీని టెర్మినేట్ చేసుకుందుకు వచ్చారు. అతని ఉద్యోగం పోవడంతో ప్రస్తుతం చాలా ఇబ్బందుల్లో ఉన్నారు.నాకు నువ్వు గుర్తొచ్చావు.

వాళ్ళని రేపు వచ్చి కలవమన్నాను. ఆ పుట్టబోయే పాపాయిని ఎటూ టెర్మినేట్ చేసుకుందామని వచ్చారు. వాళ్ళకి ఇక మమకారం లేదు. నీ గురించి ఆలోచించి, నువ్వు వాళ్ళని కల్సి మాట్లాడితే బావుంటుందన్పించింది. ఏమంటావు?"

మోహన్‌కి ఒక్కక్షణం తానేం వింటున్నాడో అర్థం కాలేదు. ఈ మధ్య కాలంలో పిల్లల గురించిన ఆలోచన, నిరాశ, నిస్పృహల మధ్య ఇలాటి పాజిటివ్ అంశం ఇంత త్వరగా ఎదురవుతుందనుకోలేదు. ఒక్క క్షణం స్వభావరీత్యా తటపటాయించాడు.

"ఏమంటావురా? భార్యాభర్తలిద్దరూ హెల్దీగా ఉంటారు. నీ కేమైనా అభ్యంతరాలుంటే చెప్పు. వాళ్ళని అడిగి వాళ్ళ అభ్యంతరాలు, ఆలోచనలు ఏమిటో తెల్సుకుందాం".

మోహన్ కళ్లలో సన్నని నీటి పొర. ఈ సంఘటన కోసమేనా తల్లి జబ్బు పడింది? ఎప్పుడో చిన్ననాడు కల్సి, చదువుకుని ఎవరి దారులు వారివైనా తామిందుకేనా కల్సుకున్నది?

స్వప్నతో మాట్లాడాలి...! అవును. ఆమె మాత్రం ఏమంటుంది? తామూ ఆ ప్రయత్నాల్లోనే ఉన్నారు కదా

"మధూ! స్వప్నతో మాట్లాడతానురా ఒకసారి".

❖❖❖

'శశీ! నువ్విచ్చిన సలహా, నీ ఆలోచన ఒక రూపు కొస్తున్నాయి. అది ఇంత త్వరగా జరుగుతుందని ఊహించలేదు. ఆ భార్యాభర్తలిద్దరూ కేవలం ఆర్థిక భారం భరించలేక, ఆ బరువు బాధ్యతల్ని మనం తీసుకుంటే పాపాయిని కంటామని చెప్పారు. చూడు, ఎంత నిస్వార్థంగా కేవలం మా కోసం, మా ఆశ తీర్చడం కోసం ఆమె మరోసారి ఆ బాధ్యతని మోసేందుకు సిద్ధపడుతోంది. ఎందుకు వీళ్ళందరికీ మా మీద ఇంతంత దయ...?! మోహన్‌గొంతు ఉద్వేగంతో కూరుకుపోయింది.

వింటోన్న స్వప్న మనసులో సున్నితమైన భావనలేవో కదులుతున్నాయి. అయితే బయటకు చెప్పుకోవడం చేతకానట్లుండిపోయింది.

❖❖❖

డాక్టర్ మధు సమక్షంలో ఒక ఒప్పందానికొచ్చారు మోహన్ దంపతులు, బిడ్డను కనబోయే తల్లిదండ్రులు రవి, సుజాతలు.

బిడ్డ పుట్టేవరకు వారి ఆర్థిక అవసరాలన్నీ మోహన్ చూస్తాడు. ఆ తర్వాత పుట్టిన బిడ్డను మోహన్, స్వప్నల చేతికందించడం రవి, సుజాతల బాధ్యత.

మధు మరొక్క విషయం కన్‌ఫర్మ్ చెయ్యాలన్నాడు. ఒక్క క్షణం అందరి ముఖాల్లో

ప్రశ్న.

"మోహన్! నువ్వు నా చిన్ననాటి మిత్రుడివి. నువ్వెంత సున్నితమనస్కుడివో నాకు తెల్సు. కాని సుజాతగారి సందేహం సమస్య మీరు తీర్చాల్సింది ఒకటుంది...' సాలోచనగా అడిగాడు.

"వీళ్ళ పాపలిద్దర్నీ మీరు చూశారు, ఎంతో చక్కగా ఉన్నారు. పుట్టబోయే పాపాయి అలాగే ఉంటుంది లేదా ఉంటాడనడంలో సందేహం లేదు. కాని... కాని..."

మధు పూర్తి చేయని మాటలు మోహన్ వెంటనే పట్టుకోగలిగాడు.

"మధూ! నీకూ, రవి, సుజాత గార్లకు ఎలాటి సందేహం ఉండాల్సిన అవసరం లేదు. ఆ పాపాయి ఎలా ఉన్నా, దురదృష్టవశాత్తూ ఏ అనారోగ్యంతోనో, అవకరంతోనో పుట్టినా ఆ బిడ్డ మాదే. ఇది మా నిర్ణయం. వాళ్లు కేవలం మా కోసం ఆ బిడ్డని కనేందుకు సిద్ధపడ్తున్నారు. అది మాకు తెల్సురా" అన్నాడు.

స్వప్న వింటోంది. ఆమె మనసు ఆ వైపుగా ఆలోచించేందుకు, అసలలాటి నెగెటివ్ థాట్‌కే సిద్ధంగా లేదు.

❖❖❖

ఇంటికొచ్చాక తల్లితో, శశితో వివరంగా చెప్పాడు. స్వప్న ఆలోచనలో అసహనం ఆందోళన స్పష్టంగా కన్పించాయి అందరికీ. ఆమెలో ఘర్షణ దేనికో!

"స్వప్నా! ఎందుకో డిస్టర్బ్‌గా ఉన్నావు. ఏమైంది?" డాబా మీద చల్లగాలికి కూర్చున్న మోహన్ భార్యని లాలింపుగా అడిగాడు.

"ఏమీలేదు"

నిట్టూర్చాడతను.

"మీ పనులన్నీ ముగించుకు తిరిగొచ్చే వరకు నేను అమ్మదగ్గర కెళ్తాను".

"నీ ఇష్టం స్వప్నా, ఎటూ మనం సెటిలవబోతున్నది ఇక్కడే. కొన్నాళ్ళిక్కడ అమ్మ దగ్గర కూడా స్పెండ్ చెయ్యి. శశి కూడా వుంది. కనుక నీకూ టైము సర్దాగా గడిచిపోతుంది"

స్వప్న మౌనంగా వింది.

ఎంత దగ్గరనుకున్న వ్యక్తుల మధ్యా కమ్యూనికేషన్ ఎంత అవసరం! దగ్గరకు లాక్కొచ్చి మనసుల్ని మమేకం చేసేది, దూర దూరంగా అపరిచితుల్లా నిలబెట్టేసేది కూడా ఈ కమ్యూనికేషనే!

'స్వప్నా! మన మధ్య ఈ దూరాలు ఎప్పుడు, ఎలా ఏర్పడ్డాయి? ఇలాగే బ్రతికేశాం ఇన్నేళ్ళూ. నీలోని ప్రేమమూర్తిని ఈ ప్రపంచానికి అందించాల్సింది నేనే. నేనే.'

రాబోయే ఆ పసిబిడ్డ తమ జీవితాల్లో వెలుగులు పూయిస్తుందన్న గాఢ నమ్మకంతో అతను ఫ్లయిటెక్కేసాడు. రేపటి మీద ఆశ.

❖❖❖

"అన్నయ్యా! అమ్మని తీస్కుని డాక్టర్ మధు హాస్పటల్‌కి వెళ్లాను. సుజాతగారు ఆ టైములో అక్కడే ఉన్నారు. డాక్టర్ మధు నాకు ఆమెను పరిచయం చేశారు..."

మధ్యమధ్య వంటగదిలోకెళ్ళి వంట పని చూస్తూ శశి అన్నయ్యతో కబుర్లు చెబుతోంది.

"అన్నయ్యా! సుజాతగారు చెకప్‌కి లోపలికి వెళ్ళినప్పుడు ఆమెకు తోడుగా వచ్చిన ఆమె అత్తగారు నాతో ఏమన్నారో తెల్సా...."

ఒక్కక్షణం అన్నయ్య ముఖంలోకి చూసి చెప్పింది.

"....మగబిడ్డ కోసం చూడండ్రా అంటే నా మాట లెక్కపెట్టలేదు. ఇపుడు ఇదిగో, ఇలా మూడో కాన్పుకు సిద్ధమైంది, చూడమ్మా – అయినా ఆవిడ మాటల్లో నిష్ఠూరం వున్నా, ఆశ ఉండడం ఆవిడవైపు నుండి న్యాయమే కదా అన్నయ్యా".

శశి మాటలకు అప్రయత్నంగా ఉలిక్కిపడ్డాడు. అవును కదూ, మన దేశంలో మగబిడ్డకోసం ఆశ పడటం క్రొత్తేమీ కాదు.

మరైతే... సుజాత మగబిడ్డని ప్రసవిస్తే... ఎలాటి పరిస్థితి ఎదురవుతుంది?

సుజాత అత్తగారి కోరికలో న్యాయం ఉంది. కాని తాము పెంచుకున్న ఆశలు!? తాము చేసుకున్న ఒప్పందం?! అఫ్‌కోర్స్, నోటిమాటే, కాని...

ప్రపంచమంతా వ్యాపారసంబంధాల మయమైపోయినా, ఇంకా ప్రేమభావన నిలబడి ఉందంటే దానికి మూలాధారం తల్లి ప్రేమ కాదూ?!

తనేనాడూ ఇది ఆలోచించలేదు. స్వప్నకి చెబితే ఏమంటుందో! బహుశా విస్తుపోతుంది. ఈ కోణంలో ఆమె ఆలోచించి ఉండదు.

స్వప్న కోసం చుట్టూ వెతికాడు. తల్లితో గుడికి, అట్నుంచి మార్కెట్‌కి వెళ్ళొచ్చినట్లుంది అప్పుడే.

ఈ అయిదారు వారాల్లో అమ్మా, శశి, తను ఆమె మనసులో మార్దవాన్ని తట్టి లేపే ప్రయత్నంలో చాలావరకు సఫలురవుతున్నారనిపిస్తోంది ఆమె ధోరణి చూస్తే.

ఎదురింటి చింటూ రివ్వున పరుగెత్తుకొచ్చి స్వప్న ఒళ్ళో చేరి చెవిలో రహస్యంగా ఏదో చెప్పి, 'సరేనా ఆంటీ" అంటూ స్వప్నని సరేననమంటున్న వాడి కళ్ళల్లో వేడికోలు.

"తప్పకుండా వెళ్దాం చింటూ" నవ్వుతూ వాణ్ణి దగ్గరకు తీసుకుని ముద్దెట్టుకుంటున్న

స్వప్న ముఖంలో ఒక ప్రశాంతత, వెలుగు స్పష్టంగా . 'అవును ఈమె నా స్వప్న, ప్రేమమయి' గర్వంగా అనుకున్నాడతను.

అర్థరాత్రో, అపరాత్రో ఆ ఫోన్ కాల్ వస్తుందని ఆ ఇంట అందరూ ఎదురు చూస్తున్నారు. రానేవచ్చింది. సుజాత నొప్పులతో హాస్పిటల్‌లో అడ్మిట్ అయిందని డాక్టర్ మధు కాల్ అది.

ఇల్లంతా ఒక్కసారి నిద్రలేచింది.

హాస్పిటల్ పట్టపగలులా దేదీప్యమానంగా వెలుగులు చిమ్ముతోంది. కారిడార్‌లో మోహన్‌ని అంటిపెట్టుకుని ఒకటే నెర్వస్ అవుతోంది స్వప్న.

"అంతా సవ్యంగా జరుగుతుంది వదినా" అనునయిస్తోంది శశి.

"ఏమ్మా, సిస్టర్! ఆ అమ్మాయి నొప్పులు పడుతోంది. దగ్గర ఎవరైనా ఉన్నారా?" మోహన్ తల్లి ప్రశ్నకి...

"ఆవిడకి తల్లి లేరమ్మా, అత్తగారు ఇంటి దగ్గర ఉండిపోయారట. మేమంతా వున్నాం. వర్రీ కాకండమ్మా" నవ్వుతూ భరోసా ఇచ్చి లోపలికెళ్ళిపోయింది సిస్టర్.

ఈ కేసు విషయం హాస్పిటల్ స్టాఫ్ అందరికీ తెల్సున్నదే.

"మోహన్! సుజాతగారు బిడ్డని ప్రసవించిన వెంటనే మీకందించమని చెప్పారు. బిడ్డ తన కంట పడితేనే ఎక్కడ తనని బలహీనత చుట్టుకుంటుందోనని సుజాత అత్తగారు హాస్పిటల్ వరకైనా రాననేశారట."

వెన్నెల్లా మిసమిసలాడుతున్న పసిబిడ్డని స్వప్న చేతిలో ఉంచాడు డాక్టర్ మధు.

'ఇక మీ వాణ్ణే సుమా' అంటున్నట్లు చిరుపాదాలతో, చిన్నిగుప్పెళ్ళతో స్వప్న గుండెల్లోకి మరింత ఒత్తిగిల్లాడు ఆ పసివాడు.

చెమ్మగిల్లిన కళ్ళతో కోడలి చేతిని ఆప్యాయంగా అందుకుని మోహన్ తల్లి –

"స్వప్నా! మీ ఇద్దరి సంకల్పబలం గొప్పదమ్మా. పుట్టిన బిడ్డని ఏ సంశయాలు లేకుండా పుచ్చుకునేందుకు మీరేనాడో కట్టుబడ్డారు. అవతల వాళ్ళూ వారి మాటను అంత గౌరవంగానూ నిలబెట్టుకున్నారు."

అత్తగారి మాటలకు స్వప్న మనసులోని పశ్చాత్తాప భావం కరిగి కన్నీరైంది.

బిడ్డని మనఃస్ఫూర్తిగా హత్తుకుంటూ, రవి, సుజాతల త్యాగానికి తనివితీరా కన్నీటితో కృతజ్ఞతలు తెలుపుకుంది స్వప్న.

**('రచన' డిసెంబర్ 2005)**

# ప్రశ్న

పల్లె పట్టణం కాని ఊరది. ఆ వాటాలో దిగి రెండు రోజులైనా రోజూ స్కూలుకెళ్ళి రావడంతోనూ, ఊరు, పరిసరాలు, మనుష్యులు క్రొత్తకావడంతోనూ నేనింకా అలవాటు పడలేదు.

ఆదివారం కావడంతో ఆ పూట కాస్త బద్ధకంగా మంచం దిగి వాకిట్లోకి వచ్చాను. ప్రక్కవాటాలో పిల్లలు ఇంటి కాంపౌండులో పూలమొక్కల మధ్య ఏదో వాదులాడు కుంటున్నారు. పిల్లల కనుముక్కు తీరు చక్కగా ఉన్నా పోషణలోపం స్పష్టంగా కన్పిస్తోంది.

నా ఉనికిని గమనించిన పిల్లలిద్దరూ నన్నోమారు పరిశీలనగా చూసి లోపలికి పరుగెత్తారు. నేను పనిచేస్తున్న స్కూల్లోనే చదువుకుంటున్నారు.

స్నానం ముగించి తీరిగ్గా వంట ప్రయత్నంలో ఉండగా వాకిలి చప్పుడై తలుపు తెరిచాను. ఇంటావిడ. ఇల్లు సదుపాయంగా వుందా అని పలకరించి ప్రక్కవాటాలోకి వెళ్ళింది.

అది రెండు రెండు గదులతో రెండు వాటాల ఇల్లు. ముందు ఉమ్మడిగా చిన్న వరండా. ప్రక్కవాటాలోంచి మాటలు స్పష్టంగా విన్పిస్తున్నాయి. 'నెలనెలా అద్దెకోసం ఎన్నిసార్లు తిరగాలి మీ చుట్టూ' అంటూ ఇంటావిడ గట్టిగా అడుగుతోంది. సమాధానం మాత్రం అస్పష్టంగా గొణుగుతున్నట్లుంది.

భోజనం పూర్తి చేసి ముందు గదిలోకి వచ్చాను "పాలున్నాయా?" అంటూ ఆమె వచ్చింది.

"మీ ప్రక్క వాటాలో ఉంటున్నాం మేము" ముఖాన చిరునవ్వు పులుముకున్న మనిషిలో ఎక్కడా ఉత్సాహం లేదు. కట్టిన చీర, జడవేసుకున్న తీరూ నిర్లక్ష్యంగా ఉన్నాయి.

"రండి" అన్నాను ఆమె చేతిలో గ్లాసందుకుంటూ.

"ప్రొద్దుట్నుంచీ ఒక్కటే తలనొప్పి. పాలవాడు రెండ్రోజులుగా రావడంలేదు. ఆయన ప్రొద్దున్నే లేచి ఎటో వెళ్ళారు, కాస్త టీ చేసుకు త్రాగుదామని...."

పాలు తీసుకు వెళ్ళిపోయింది.

పడమటి సూర్యుడు ప్రకృతిలోని రంగులన్నీ పులుముకుని ఏ కుంచెకీ అందని దృశ్యకావ్యంలా ఉన్నాడు.

అమ్మకి, తమ్ముడికి ఉత్తరాలు రాస్తున్నాను డాబామీద. ఆ పిల్లలిద్దరూ దూరంగా నిలబడి ఆసక్తిగా చూస్తూండడం గమనించి పిలిచాను. అన్నపూర్ణ, రఘు వాళ్ల పేర్లు.

"టీచర్! మిమ్మల్ని స్కూల్లోలాగే ఇంటిదగ్గర కూడా పిలవాలా?" రఘు ప్రశ్న వింటుంటే నవ్వొచ్చింది.

ఆ పసివాడి మనసులో టీచర్ తన ప్రక్కవాటాలో కంటికి ఎదురుగా కనిపిస్తుండడం ఎంత అబ్బురంగా ఉందో వాడి మాటలు చెబుతున్నాయి.

చీకటి పడిందని లేచి క్రిందకొచ్చేశాం.

"టీచరుగారితో స్నేహం కట్టేశారర్రా అప్పుడే" అంటూ ఆమె, కామేశ్వరి గుమ్మంలో పలకరించింది.

నెమ్మదిగా ఆ పరిసరాలకి అలవాటుపడుతున్నాను. ప్రక్కింట్లో సందడి మేల్కొన్నంత సేపూ తోడుగా ఉంటుంది. కామేశ్వరికి పిల్లలిద్దరూ బాగా మాలిమి. అతడు ఇంట వుండగా నేనెప్పుడూ చూడలేదు.

రాత్రి తొమ్మిదిదాటాక అతని ఉనికి భార్య మీద అరుపుల ద్వారానో, పిల్లల వీపుల మీద పడే దెబ్బల ద్వారానో తెలుస్తూనే ఉండేది. నిత్యం విన్పించే ఘట్టాలైపోయినా మనస్సు చివుక్కుమనేది.

పిల్లలు సాయంత్రాలు చదువుకునేందుకు నా దగ్గర చేరేవారు. ఇద్దరూ చురుకైన వాళ్లేఅయినా, రఘు ప్రతిదీ తెల్సుకోవాలన్న జిజ్ఞాస చూపించేవాడు.

ఎందుకు, ఏమిటి? అనే ప్రశ్నలు పదేపదే వేస్తుండేవాడు. నా చేత ఓపిగ్గా సమాధానాలు

చెప్పించుకుని మరీ వెళ్లేవాడు. కామేశ్వరి ఒక్కోసారి విసుక్కునేది... 'అస్తమాటూ ప్రతిదానికీ ఎందుకు ఏమిటంటూ ఆ ప్రశ్నలేమిటి? టీచరుగారు చెప్పింది విను' అంటూ. 'అడగ నియ్యండి. ప్రతిదీ ప్రశ్నించి తెల్సుకోవాలనుకోడంలోనే అభివృద్ధి ఉంది' అంటూ నేను అడ్డుపడుతూండేదాన్ని.

ఇంట్లో ఉన్న చిరుతిండి ఏదైనా నాతోపాటు వాళ్లకీ వండిపెట్టేదాన్ని. మొదట్లో మొహమాటపడినా పసిపిల్లలు ఆకలి దగ్గర మొహమాటం మర్చిపోయారు.

వాళ్ళ కడుపునిండా తిండికూడా పెట్టలేని స్థితిలో ఉన్నాడా ఆ తండ్రి? అతనేం చేస్తాడసలు.

ఒకరోజు పిల్లల్ని అడిగాను. ఆశ్చర్యం వేసింది. నిలకడైన మంచి ఆదాయం ఉన్న ఉద్యోగమే. మరెందుకీ పరిస్థితి? ఇంటావిడ, పాలవాడు, మరెవరెవరో అప్పులిచ్చిన బాపతుకాబోలు 'ఎప్పుడిస్తావంటూ' డబ్బుకోసం అతన్ని నిలదీయడం క్రమేపి నా కళ్ళ పడుతోంది.

ఆ రోజు వాసు వచ్చాడు ఊర్నుంచి.

"ఎలా ఉన్నావక్కా" అంటూ .

వాణ్ణి చూడగానే కళ్ళు చెమర్చాయి. ఇంటికీ, అమ్మకీ దూరంగా ఎలా బ్రతికేస్తున్నాను అని నాకే ఆశ్చర్యం వేసింది. ఉద్యోగ బాధ్యతలో పడి అమ్మను, తమ్ముణ్ణి చూడాలన్న ఆలోచనకూడా వాయిదా వేసేస్తున్నాను ఎప్పటికప్పుడు.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేస్తున్నాం. సడన్‌గా ప్రక్కవాటాలోంచి అరుపులూ, దభీమంటూ దెబ్బలు విన్పించాయి. కామేశ్వరి గొంతు కీచుగా, ఏడ్పుపైకి రానీకుండా నోరు నొక్కిన ధ్వని. అతని మాట స్పష్టంగా లేదు, ఆ అరుపుల మధ్య. అయినా అంత హింసకి ఆమె ఏం చేసిందనేది నాకు అర్థం కాలేదు.

వాసు ప్రశ్నార్థకంగా చూశాడు. ఊర్కోమన్నట్లు సైగ చేశాను. భోజనాలు పూర్తి చేసి డాబామీదకెళ్ళే వరకు ఊపిరాడనట్లయింది ఇద్దరికీ. "ఉద్యోగం, సంపాదన బాగానే వున్నాయిరా. ఆయన మాత్రం ఎప్పుడూ శుభ్రమైన బట్టల్లో ఉంటాడు. ఆవిడా, పిల్లలూ దీనంగా ఉంటారు. ఇంట్లో ఖర్చులకేం ఇవ్వడనుకుంటా" అంతకన్న నాకూ తెలీదు.

"అదేమిటి. భార్యాపిల్లల అవసరాలు చూడవలసిన బాధ్యత లేదా అతనికి" వాసు కోపంగా అంటున్నాడు.

"ఏమిటో రా. ఆవిడ దేనికీ నోరు విప్పి మాట్లాడినట్లు కన్పించదు. ఏమీ చదువుకున్న మనిషి కూడా కాదనుకుంటాను. కాస్త అమాయకురాలిలా కన్పిస్తుంది'.

"ఆర్థికంగా ఆవిడ ఏదైనా సంపాదించుకునేమార్గం చూపించవచ్చుగా. నీ చేతిలో ఉన్న పనే కనుక ఆవిణ్ణి కూడా కాస్త ఎడ్యుకేట్ చెయ్యకూడదా?" వాసు అడుగుతూంటే నా కప్పటిదాకా ఆ ఆలోచన రానందుకు నొచ్చుకున్నాను.

వాసు మాటలు విన్నాక కామేశ్వరి గురించే ఆలోచిస్తున్నా. ఆ రోజు స్కూలు నుండి వస్తుంటే వాసంతి చెబుతోంది. వాళ్ళింటి వాళ్లమ్మాయి మిషను కుట్టడం, బట్టలు కత్తిరింపు నేర్పుతుందట. ఆసక్తి ఉన్నవాళ్ళకి లేసులు అల్లటం కూడా నేర్పుతుందట. ఎవరైనా నేర్చుకునే వాళ్ళుంటే వాకబు చెయ్యమందట.

నెలకి ఇరవై రూపాయలిస్తే చాలట ఫీజు క్రింద. నా మనసులో కామేశ్వరి మెదిలింది.

పెరట్లో కాళ్ళు కడుక్కుంటుంటే కామేశ్వరి ఏదో ఆలోచిస్తున్నట్లుగా గుమ్మంలో కూర్చుని ఉండడం చూశాను. టీ చేసి రెండు కప్పుల్లో పోసి ఆమెకో కప్పిచ్చి ప్రక్కనే కూర్చున్నాను.

ఆమె ఎందుకో మునుపటికన్నా నిర్లిప్తంగా, నలిగినట్లు కన్పించింది "రోజంతా ఎలా కాలక్షేపం అవుతుంది మీకు?" యధాలాపంగా అడిగాను.

"ఏముంది, ఖాళీయే. ఇంట్లో నాలుగు సరుకులూ ఉంటే వంట పనుంటుంది. ఒక్కోరోజు గిద్ద బియ్యం మటుకు ఉంటాయి. తెల్లారి ఆ కుంపటి వెలిగించి అత్తెసరు పారేస్తే పని అయిపోయినట్లే" వింటున్నాను.

"చూస్తున్నారుగా, ఆ పిల్లలు కూడా అది కావాలని, ఇది కావాలని దేనికీ గొడవ చెయ్యరు. ఆయన నెలంతా కష్టపడతారు. కాని స్నేహితులు, పేకాట ఆయన లోకం ఆయనది. జేబులో ఏమైనా మిగిలితే ఇంటి ఖర్చుకి చేతిలో పెడతారు. లేకపోతే కూర చెయ్యలేదనో, టిఫిను చెయ్యలేదనో గొడవపెడతారు. మీరు గమనించే ఉంటారు. మా ఇంటి వ్యవహారం. ఆ పిల్లల్ని చూస్తే జాలేస్తుంది. ఏం చెయ్యను? నాకేమైనా చదువా? సంపాదనా?" బాధగా అంది.

"మీరూ చదువుకోవచ్చు. ఏ కుట్టుపనో, లేసుపనో నేర్చుకోవచ్చు" నేను చెప్పదలచుకున్న దానికి నాందిగా అన్నాను.

"అబ్బే నాకేమీ రాదు. ఇప్పుడేం నేర్చుకుంటాను?" సిగ్గుపడింది. కొన్ని క్షణాలు మౌనంగా కూర్చున్నాం.

ఎందుకో ఆమె చిన్నతనపు రోజుల్లోకి వెళ్ళింది. నలుగురాడపిల్లల్లో ఒకర్తెగా, ఆర్థిక సమస్యల మధ్య, తండ్రిపోయాక ఉన్న అన్నగారు ఈ సంబంధం చేసి బాధ్యత తీర్చుకోవడం, చదువు కాని, మరేపనీ నేర్చుకునే అవకాశం లేకపోవడం...ప్చ్!

ఆమెను పరిశీలనగా చూస్తున్న నా కన్పించింది. నిజమే ఆమె వయస్సెంతో వుండదు.

మహా అయితే పాతిక నిండి ఉంటుంది.” మీరు మిషను నేర్చుకోండి కామేశ్వరిగారూ. కాలక్షేపంగా ఉంటుంది. కుట్టడం నేర్చుకుంటే చేతిలో విద్య ఉంటుంది”.

“అవన్నీ ఇప్పుడెక్కడ నేర్చుకోగలనులెండి” బలవంతంగా నవ్వింది.

“ఎందుకు నేర్చుకోలేరు. మా ఫ్రెండ్ వాళ్ళింటి వాళ్ళమ్మాయి నేర్పుతోందిట. నెలకు ఇరవై రూపాయలిస్తే చాలు!”

“అబ్బే ఆ ఇరవై ఉంటే ఇంకో అవసరానికొస్తాయి. అదీకాక ఆయనేమంటారో!” కళ్ళు వాల్చుకు అపరాధిలా చెబుతుంటే మనసు విలవిలలాడింది.

“మీరు పగలల్లా ఖాళీగానే ఉంటారు. ఆయన, పిల్లలు వెళ్ళాక పదిగంటలకి వెళ్ళి రోజూ ఒక్కగంట నేర్చుకోండి. మీరింకేం అభ్యంతరం చెప్పకండి. ఆ ఇరవై నేను కట్టేస్తాను నెలనెలా”.

“ఉహు” అంటూ తల అడ్డంగా తిప్పిందామె మొహమాటంగా

“నేర్చుకున్నాక నాకు జాకెట్లు కుట్టిపెడుదురుగాని, సరేనా” అభ్యంతరం చెప్పే అవకాశం లేకుండా లేచి వచ్చేశాను.

కటింగ్స్ నేర్చుకుందుకు పేపర్ కావాలంటూ పట్టుకెళ్ళింది ఆ తర్వాత రెండ్రోజులకి.

రెండు నెలలుగా ఆమె కుట్టుక్లాసుకి వెళ్ళిరావడం, నలుగురి సంభాషణలు వినడం, ఏదో ఓ టైములో నా దగ్గరకొచ్చి న్యూస్‌పేపర్ తిరగేయడం చేస్తోంది.

ఆమెలో క్రమంగా మార్పు కన్పిస్తోంది. ఆ జడ అల్లుకోవడం, చీరెకట్టులోనూ నిర్లక్ష్యం తగ్గింది.

సాయంకాలం స్కూలు నుండి వస్తూనే తలనొప్పిగా అనిపించి మంచం ఎక్కేసిన నాకు ఏవో అరుపులకి మెలకువ వచ్చింది.

“ఆ టీచరమ్మ నీకు బాగానే నేర్పుతోందిలే పాఠాలు, కుట్లూ, అల్లికలూ అంటూ. రోజూ నీ పెత్తనాలు నేను ఎరగననుకుంటున్నావు కాబోలు. నా కన్నీ తెలుసు. సంపాదించి తెస్తుంటే తిని కూర్చోలేక ఈ వెధవ్వేషాలన్నీ” కొడుతున్న ధ్వని. ఆమె వెక్కిళ్లు బలవంతంగా ఆపుకుంటోంది.

పిల్లలేం చేస్తున్నారో! నిద్రలో ఉలిక్కిపడి లేచారేమో! నా నిస్సహాయస్థితి నాకే సహించరానిదిగా ఉంది.

తెల్లవారి జ్వరం ఎక్కువైందన్పించి లీవ్‌లెటర్ రాసి అన్నపూర్ణని పిలిచాను స్కూల్లో ఇప్పిద్దామని. రెండు మూడు పిలుపులక్కూడా ఆమె రాకపోవడంతో తండ్రి ఇంటే వున్నాడని

అర్ధమైంది.

విసురుగా వరండాలోకి వచ్చాడతను.

'పొరుగిళ్ళ వ్యవహారాలు పట్టించుకోవడం మర్యాదకాదు. మా ఇంటి ఆడవాళ్ళకి బయట బజార్లలో తిరిగే అలవాటు లేదు" అంత విసురుగానూ లోపలికెళ్ళిపోయాడు.

ఆ మాటలు నన్ను ఉద్దేశించి అన్నవే అని అర్ధమైంది. జవాబు గట్టిగానే ఇవ్వాలనుకున్నాను. ఛ అలాంటి మూర్ఖుడితో మాటలేమిటి? జ్వరం తాలూకు నిస్త్రాణ ఆవరించిందొక్కసారి.

నాలుగు రోజులు జ్వరంలో ఒక్కదాన్ని మంచం మీద ఉండడంతో వాసంతి చేసిన సేవలు జ్ఞాపకం ఉన్నాయి. కామేశ్వరి, పిల్లలు అలికిడిలేరు.

ఆ రోజే పథ్యం తిని కూర్చుని పేపరు చూస్తున్నా. వాసంతి అప్పుడే వెళ్ళింది. బెదురు చూపులతో పెరటివైపు నుండి కామేశ్వరి వచ్చింది.

మనిషి కళ్ళల్లో ప్రాణాలున్నాయి. నాకంటే ఎక్కువ లంకణాలు పడిన మనిషిలా వుంది.

"టీచర్‌గారూ! నేను మా ఊరువెళ్తున్నా, పిల్లల్ని తీసుకుని, ఇక ఇక్కడ నాకేమీ లేదు. ఆ రోజు గొడవ మీరూ వినే ఉంటారు. అనవసరంగా మిమ్మల్ని అవమాన పరిచాడాయన. క్షమించండి. మా ఊళ్ళో ముగ్గురు అక్కయ్యలు, అన్నయ్య అంతా వున్నారు. అంతా తలో చెయ్యివేస్తే నేనూ, నా పిల్లలూ బ్రతక్కపోము. ఎప్పుడెళ్ళినా కడుపులో పెట్టుకు ఆదరిస్తారు. ఆ మాత్రం నాకో దారి చూపించకపోరు".

నాకంతా అయోమయంగా ఉంది. ఆమె చెబుతోంది "నాలుగురోజులుగా ఇంట్లో బియ్యం లేవు. ఒక్క పైసా చేతిలో లేదు. నాతోపాటు పిల్లలూ పస్తులుంటున్నారు. ఆయన బయటకెళ్ళి వస్తున్నారు ఒక్కో పూట పిల్లలకేదో టిఫిను తెస్తున్నారు. ఇక ఈ సంసారాన్ని నడపడం నా చేత కాదు. ఇన్నేళ్ళు ఎలా గడిపానో అడక్కండి. ఇదిగో, ఇప్పుడే ఈ వందకాయితం ఇచ్చివెళ్ళాడాయన సరుకులు తెమ్మని. పిల్లలూ, నేనూ బస్సుకి వెళు తున్నాం" అంటూ ఆమె గబగబా వెళ్ళిపోయింది తమ వాటాలోకి. మాటలు రానట్లు కూర్చున్నాను.

గేటు శబ్దంవిని గబుక్కున లేచి పిల్లల్ని పిలిచి పర్సులో ఉన్న రెండు వందకాగితాలు, టేబిల్ మీద బిస్కెట్ ప్యాకెట్ చేతిలో పెట్టాను. ఎవరో తరుముతున్నట్లు వెళ్ళిపోయారా తల్లీపిల్లలు.

జీవితంలో ఎన్నడూ తటస్థపడని సన్నివేశాలు. కన్నీళ్ళు ఆగవు. ఎంతసేపలా మంచం

మీద పడి ఉన్నానో...వాసు వచ్చాడు. వాసంతి ఉత్తరం అంది.

"మన ఊరెళ్దాం పదక్కా. నాల్గురోజులు అమ్మ చేత్తో చేసి పెడితే మామూలవుతావు. అమ్మకూడా ఈ మధ్య కొంచెం జ్వరం పడింది. లేకపోతే తనే వస్తానని బయల్దేరిందసలు" వస్తూనే తొందర చేశాడు వాసు.

నిజమే, ఆ పరిసరాల్లోంచి మార్పుకావాలి.

వారం రోజులు సెలవు ముగిసి డ్యూటీలో చేరేందుకు బయల్దేరుతుంటే అమ్మ కూడా వస్తానంది. పిచ్చి అమ్మ... ఆవిడ వయస్సుకి నేను చేసి పెట్టాల్సిందిపోయి నా కోసం ఆరాటపడుతోంది.

ఇంటిగుమ్మం ఎక్కుతుంటే ప్రక్కింటి తాళం చూసి మనసులో  మళ్ళీ గుబులు పట్టుకుంది. ఈ వారం రోజులుగా కామేశ్వరి, పిల్లలు నా ఆలోచనల్లో మెదులుతూనే వున్నారు.

పోనీలే, అలాంటి బాధ్యత, మమకారం తెలియని మూర్ఖుణ్ణి వదిలి వెళ్ళినందుకు ఎక్కడో సుఖంగా కాలక్షేపం చేసుకుంటూ ఉంటారు అనుకుని మనసుకి సర్ది చెప్పుకునేదాన్ని.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పెరట్లో నూతి చప్టా మీద కామేశ్వరి పిల్లలు మసులుతున్నట్లే అన్పించింది. ముందు వరండాలోకొస్తే మళ్ళీ అదే సన్నివేశం.

సాయంకాలం స్కూలు నుంచి వస్తూ గుమ్మంలో ఎదురైన అన్నపూర్ణ, రఘుల్ని చూసి తెల్లబోయాను. పిల్లల్ని తెచ్చేసుకున్నాడా? ఏమైంది?

పెరట్లో కామేశ్వరి కన్పించింది. నా కళ్ళల్లో ఆశ్చర్యం స్పష్టంగా కన్పించే ఉంటుంది.

రెండు రోజులై కామేశ్వరి వచ్చినా మాట్లాడడం కుదరలేదు. ఆ పూట ఎలాగైనా పలకరించాలని ఇంటికెళ్ళేసరికి వంటింటి గుమ్మంలో కామేశ్వరి అమ్మతో ఏదో మాట్లాడుతుంది. నన్ను చూసి, "జ్వరం తాలూకు నీరసం తగ్గిందా?" అంటూ పలకరించింది.

'నాకేం, శుభ్రంగా తిని తిరుగుతున్నాను. మీ కబుర్లేమిటి?'

ఆమె నవ్వింది. "అలా డాబామీద కూర్చుందాం. కాస్సేపు రండి" అంటూ ఆహ్వానించింది. ఆ చొరవ ఇదివరకెన్నడూ చూడలేదు నేను. తనే చెప్పడం మొదలుపెట్టింది.

"ఎప్పుడు మా ఊరెళ్ళినా ఇంకా ఉండాలి, ఇంకొన్నాళ్ళుండాలి అని ఆశపడేదాన్ని. ఈ మారేమైందో తెల్సా? ఇక్కడికి వచ్చెయ్యడానికే తొందరపడ్డాను. వెళ్లిన రెండ్రోజులకి నా సమస్య నా వాళ్లందరి ముందు పెట్టాను. ఇన్నాళ్ళు నా సంసారం గురించి వాళ్ళకేమీ

తెలియదనే చెప్పాలి. ఆయన అదోరకం తిక్కమనిషి, పెళ్లాం పుట్టింటి వాళ్ళతో కలవడు అనుకునేవారు. తిండి పెట్టేందుకూడా ఇంట్లో ఇన్ని తిప్పలు పెడతాడని తెలియదు. నేనూ ఏనాడూ చెప్పుకోలేదు. ఏదో ఒకరోజు ఆయనే సవ్యమైనదారి లోకి వస్తాడను కునేదాన్ని. నా సమస్య విని వాళ్లేమన్నారో తెల్సా?" ఒక్కక్షణం ఆగింది.

"చుట్టపు చూపుగా ఏడాదికి నెలో రెణ్ణెల్లో ఆదరించగలం కాని, భర్తతో తెగతెంపులు చేసుకువస్తే మేమెక్కడ చూడగలం? అదీకాక ఈ పిల్లలిద్దరూ పసివాళ్ళు. వాళ్ళకోదారి చూడాలి. తండ్రి ఉండి, సంపాదించుకుంటూంటే పరాయి పంచన బతకాల్సిన అవసరం ఏమిటన్నారు.చేజేతులా కాపురం కూల్చుకొస్తే మేం ఏమీ చెయ్యలేం అని చెప్పేశారు. వాళ్లమాట నిజమే. అందరూ అంతంత మాత్రంగా గడుపుకొస్తున్నవాళ్ళే. మా బరువు మోసేస్థాయిలో ఎవరూ లేరు. వాళ్ళన్నట్లు ఇక్కడి కష్టనిష్ఠూరాలు ఎదుర్కోవాల్సింది నేనే, ఒంటిచేత్తో సంసారం లాగలేనంటే నేనూ ఏదో ఒక పని చేస్తాను. నాకా అవకాశం ఇవ్వనంటే మాత్రం ఇకపై నేను ఊరికే కూర్చోలేనని ఖచ్చితంగా చెబుతాను. ఈ నాలుగు రోజులూ ఆలోచించుకునే వచ్చాను".

"కామేశ్వరీ" అన్నాను ఆనందంగా

'అప్పుడే పొగిడెయ్యకండి. రెండు రోజులుగా నేనెందుకెళ్ళానో, ఎందుకొచ్చానో నా ఉద్దేశం ఏమిటో అడిగాడు...చెప్పాను. హేళనలు, వెక్కిరింతలు మొదలుపెట్టాడు. ఇన్నేళ్ళుగా ఎన్నడూ, ఏదీ ప్రశ్నించని నా అవివేకం అతన్ని బలవంతుణ్ని చేసింది. ఇకపై అలా జరగదని అతనూ గ్రహించినట్లే ఉన్నాడు. టీచర్‌గారూ! నేను ఇదివరకటి కామేశ్వరిని కాను" అంటూ కళ్ళల్లో నీటితెర కమ్ముకు రాగా ఆవేశంగా చెబుతోంది.

ఆ నీటిపొరని కమ్మేస్తూ ఆత్మవిశ్వాసం తాలూకు ఒక మెరుపు మెరిసింది.

తనతో పాటు పిల్లలిద్దరి భవిష్యత్తు అయోమయంలో పడేసరికి పరిస్థితులకి ఎదురు తిరగాలన్న ఆలోచన కలిగింది. ప్రశ్నార్థకంలా తయారైన తన అస్తిత్వాన్ని కాపాడుకోవలసింది తానేనని గ్రహించుకుందామె. ఆ పోరాడాలన్న స్ఫూర్తి ఆమెకు పరిస్థితులే నేర్పాయి.

"మీరే చెప్పారు కదా టీచర్, ప్రతీది ప్రశ్నించి సాధించాలని" అంది, పాఠం అంతా అర్థమైన విద్యార్థినిలా కామేశ్వరి.

**('ఆహ్వానం' జూలై 1998)**

# నిర్ణయం

మార్కెట్‌లో కూరలు, పళ్ళు కొనుక్కుని బస్‌స్టాప్‌లో నిలబడింది అరుణ. ఎప్పుడూ చూసే మనుష్యులే, ఎప్పటి రోడ్లే అయినా అలా వివరంగా చూస్తుండి పోయింది. నిద్రలోనూ, మెలకువలోనూ కూడా ఒక అశాంతి ఆమెను చుట్టు ముట్టే ఉంటుంది.

ఎప్పుడూ అన్యమనస్కంగా కన్పిస్తుంది ఎదుటివాళ్ళ కంటికి. ఆమెక్కావలసిన బస్సు రానే వచ్చింది. అసంకల్పితంగానే కదిలి బస్సు ఎక్కి కూర్చుంది. ఆమె ఆలోచనలూ సాగుతూనే ఉన్నాయి బస్సుతోపాటే.

ఏదో స్టాపులో బస్సు ఆగడంతో చటుక్కున ఆమె తల త్రిప్పింది. పిల్లవాడితో బస్సెక్కుతున్న స్త్రీని చూసింది. ఆమెలో ఉన్న చైతన్యాన్నంతా ఆ దృశ్యం తనలోకి లాక్కున్నట్లుగా అరుణ ఒక్కక్షణం అలా బిగుసుకు పోయింది.

ఆ పిల్లవాడు తననెత్తుకున్న తల్లి భుజాలమీద వాలి ఉన్నాడు. దాదాపు పది సంవత్సరాల వయస్సు వుంటుంది. పొడువాటి చేతులు, కాళ్లు నిర్జీవంగా వేళ్ళాడుతున్నాయి. పుష్టిగా ఉన్న ఆ పిల్లవాణ్ని యెత్తుకుని బరువుగా అడుగులు వేస్తూ బస్సులోకి యెక్కి కూర్చుందామె.

బస్సు కదలనే కదిలింది. ఆమె కూర్చునే ప్రయత్నంలో విండో రాడ్ పిల్లవాడి భుజానికి కొట్టుకుంది. చేతిలో సంచీ ప్రక్కన పెట్టి

పిల్లవాణ్ణి ఓదార్పుగా స్పర్శించి, "తగిలిందా నాన్నా?" అంది ఆ తల్లి.

వద్దు వద్దు అనుకుంటూనే అరుణ అటువైపే చూస్తోంది. మనసంతా కలచి వేస్తున్నట్లుంది. కళ్ళల్లో అప్రయత్నంగా నీరు తిరిగింది.

ఆ పిల్లవాడు 'ఊ'అంటూ వెర్రిగా నవ్వుతూ తల్లి మెడని కావలించుకుని కళ్లు మూసుకున్నాడు.

"పిల్లవాణ్ణి ఇంటిదగ్గర విడిచి రావచ్చు కదమ్మా. ఇట్లాంటి పిల్లలతో బస్సులెక్కి దిగడం ఇబ్బంది కాదూ"

ప్రక్కసీట్లో ఆమె ఆ తల్లికి సులువు నేర్పబోయింది.

"ఆసుపత్రికి తీసుకెళ్తున్నానమ్మా పిల్లవాణ్ణి" – ఆమె జవాబు.

ఇలాంటి సలహాలు అలవాటు పడినదానిలా నిర్లిప్తంగా.

అరుణ మనసు విలవిలలాడింది. ఇంటి దగ్గర పాపాయిని వదిలి వచ్చింది... తాళం పెట్టింది.

ఈ మధ్యకాలంలో పాపాయికి ఊహ వచ్చేక ఆమె ఇలా బయట పనుల నిమిత్తం వస్తూనే ఉంది. గబగబ పనులు ముగించుకుని ఇంటికి పరుగెడుతుంది.

శంకరం ఆ పనులన్నీ తను చూస్తానంటాడు. కాని ఆమెకు ప్రాణం ఒప్పదు, అతను ఆఫీసు నుండి అలసి వస్తాడు.

ఇంటి వాతావరణం అనుక్షణం ఆమెలోకి ఒంపే నిస్సత్తువని, ఆవేదనని, అసహనాన్ని కాస్సేపైనా వదిలి బయట ప్రపంచంలోకి వెళ్ళాలని వెళ్తోంది. కానీ ఇల్లు తాళం పెట్టి బయల్దేరిన క్షణం నుంచి ఇల్లు చేరే వరకు అన్యమనస్కంగా, యాంత్రికంగా మాత్రమే ఆమె గడుపుతుంది.

పాపాయి ఒక్కదాన్నీ వదిలి వచ్చిందన్న దుఃఖం, పాపాయి పరిస్థితికి ఉక్రోషం!

ఇంటి తాళం తీస్తూనే వరండాలో కూర్చుని చూస్తున్న రవళిని గుండెలకు హత్తుకుంది. పాపాయి ముఖంలో సంతోషం... "అమ్మా" అంది తల్లి గుండెల్లో తలపెట్టుకుని.

❖❖❖

లంచవర్లో కూడా ఫైళ్ళ మధ్య ఉన్నాడు శంకరం. నాలుగు సీట్ల అవతల ఉద్యోగాల్లో రిజర్వేషన్లు గురించి సతీష్ పెద్ద గొంతుతో మాట్లాడుతున్నాడు. వద్దనుకున్నా అతని మాటలు చెవిన పడుతూనే ఉన్నాయి.

"మా బావమరిది ఉద్యోగం కోసం చెయ్యని ప్రయత్నాలు లేవు. అసలు ఓపెన్ కాంపిటీషన్లో మిగిలేవెన్ని, రిజర్వేషన్లు పోగా. ఆఖరికి విసుగెత్తి మొన్న అంటున్నాడు

ఏ కాలో, చెయ్యో పోగొట్టుకుంటే ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ కోటాలో అయినా ఉద్యోగం వస్తుందేమో అని".

అతని మాటలకు అందరూ నవ్వారు. శంకరం వింటున్నాడు. మనస్సు నీరై పోయింది. కళ్ళముందు పాపాయి కదిలింది. తెలియని విషయం, అనుభవం లేనివిషయం ఎంత తేలిగ్గా మాట్లాడగల్గాడతను. అంతా సవ్యంగా, ఆరోగ్యంగా ఉండి, అన్ని అర్హతలూ ఉన్న వ్యక్తి కూడా అంత నిరాశగా, అసహనంగా ఎందుకు ఆలోచించాలి!

తన భవిత కోసం తానై ఏమీ చేసుకోలేడూ? అసలు అలాంటి స్థితే ఓ పెద్ద హ్యాండీక్యాప్! శంకరం ఆఫీసు నుండి వస్తూనే అరుణ ముఖంలో ఉదాసీనత గమనించి, ఉస్సూరని నిట్టూర్చాడు.

ఇంటికి వచ్చేదారిలోనే ఇంటి వాతావరణం, అరుణ పాపాయితో పడుతున్న సమస్య కళ్ళముందు కొస్తాయి, ప్చ్! ఇక పాపాయికి ఎంత అవస్థ! పరిష్కారం ఏమిటి? ఎక్కడ మంచి డాక్టర్ ఉన్నారంటే అక్కడికి – దేశం అంతా తిరిగారు తామిద్దరూ.

చక్కగా హెల్దీగా పుట్టింది. తొమ్మిది నెలల పాపాయి చకచకా అడుగులు వేస్తుంటే, "దీనికింత చురుకేమిటి అరుణా? నా పోలికే సుమా" అంటూ గర్వంగా నవ్వేవాడతను.

కాళ్ళకు పట్టీలు పెట్టి, పాపాయి ఇల్లంతా కలియ తిరుగుతూ చేస్తున్న హడావుడీ, అల్లరీ చూసి ఆ భార్యాభర్తలిద్దరూ పాపాయి సార్థక నామధేయురాలు అని మురిసి పోతుండేవారు. ఆ ఆనందం ఎంతో కాలం మిగల్లేదు.

పాపాయికి ఒకసారి తీవ్ర జ్వరం వచ్చింది. అది తగ్గుముఖం పట్టేలోపు పాపాయిలో చైతన్యం తగ్గుతూ వచ్చింది. చేతులు, కాళ్ళు శక్తి విహీనంగా వ్రేలాడబడిపోవడం మొదలైంది.

అలా మొదలైన సమస్య ఏ ట్రీట్‌మెంట్‌కీ లొంగలేదు. పాప వయస్సుకు తగ్గట్లు ఆరోగ్యంగానే పెరుగుతోంది. కాని అన్ని పనులూ మరొకరు చెయ్యవలసిందే.

అరుణ, శంకర్‌లిద్దరూ కృంగిపోయారు. నవ్వు అనేది దాదాపుగా ఆ ముఖాల్లో కన్పించదు. ఎవరితోనూ కలవడం, ఎక్కడికీ వెళ్లడం పూర్తిగా మానేశారు. సైన్సు ఇంతగా అభివృద్ధి చెందింది. ఈ సమస్యకి పరిష్కారం మాత్రం ఏ వైద్యమూ చూపించలేకపోయింది.

పాపాయిని ఒంటరి ఖైదీలా పెంచుతున్నామేమో, కాస్త ప్రపంచాన్ని చూడనియ్యాలని ఆలోచించి ఆ వీధిలో ఉన్న చైల్డ్‌కేర్ సెంటర్‌కి తీసుకెళ్ళింది అరుణ.

ఆ సెంటర్ దాదాపుగా పాతిక ముప్పయ్ మంది చిన్నారులతో కళకళలాడుతోంది. రోజూ ఒక రెండు మూడు గంటలు రవళిని అక్కడ ఉంచే ఏర్పాటు ఉందేమో కనుక్కుంది.

సెంటర్ రన్ చేస్తున్న ఆమె తీరిగ్గా వింది. ఎంతో నొచ్చుకుంటూ అంది.

"ఇది మామూలుగా, ఆరోగ్యంగా ఉన్న పిల్లలున్న సెంటరండీ! వీళ్ళతో మీ పాపాయి కలవలేదు కదా. అదీకాక మిగతా పిల్లలు కూడా వాళ్ల ఏక్టివిటీస్ నుండి డీవియేట్ అయ్యే అవకాశముంది. మీ పాపాయిలాటి పిల్లల కోసం వేరే సెంటర్స్ ఏమైనా వున్నాయేమో ఎంక్వయిరీ చెయ్యలేక పోయారా?"

అరుణ ముఖం ఎర్రబడింది. గిర్రున వెనుతిరిగి ఇంటికొచ్చింది. తనూ అందరిలానే చక్కని పాపాయినే కలలు కంది. నవమాసాలు మోసి కన్నది కూడా. ఎందుకిలా అయింది!

ఆ రోజంతా కన్నీరు నింపుకుంటూనే ఉంది. "మీ పాపాయిలాంటి పిల్లలకోసం..." ఆ మాటలు పదే పదే ఆమె మనసును కోస్తున్నాయి. సాయంత్రం శంకర్ ఆమెను చూస్తూనే విషయం అర్థం చేసుకున్నాడు. అతని మౌనాన్ని ఎంతో సేపు భరించలేక, శంకర్‌తో తగువుకి దిగింది.

"ఇలాంటి పిల్లల కోసం వేరే సెంటర్లేమైనా ఉంటాయేమోట. ఏం, ఈ పిల్లకేం తక్కువ? అన్నీ చక్కగా అర్థం చేసుకుంటుంది. అన్నీ మాట్లాడుతుంది. తన అవసరాలన్నింటిని చెబుతుంది. ఇదేమైనా వెర్రిపిల్లా, మిగతా పిల్లలతో కలవకపోవడానికి...."

ఆ పైన మాటలురాక గొంతు పూడిపోయినట్లయి ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

శంకర్ అసహాయంగా చూస్తున్నాడు... ఏమని ఓదార్చాలి? అరుణతో సమానంగా తనూ అనుభవిస్తున్నాడు ఈ గుండెకోతని. ఏమని ఓదార్చగలడు? ఉద్యోగం పేరుతో కాస్సేపు... బయట ప్రపంచంలోకి వెళ్ళొస్తున్నాడు తను. కాని, అరుణ.... ఇల్లు, పాపాయి!... పోనీ, నల్గురితో పరిచయాలు, స్నేహాలు చేసుకుంటే కొంచెం రిలీఫ్ వుంటుందేమో! ట్రాన్స్‌ఫర్ మీద తామిక్కడికి వచ్చి ఎన్నాళ్ళో కాలేదు.

❖❖❖

ఆ రోజు పై పోర్షన్ వాళ్ళింట్లో పేరంటం ఉంది. మరీమరీ రమ్మని పిలిచి వెళ్లారు.

"అందరితోనూ పరిచయం చేసుకున్నట్లవుతుంది వెళ్ళు అరుణా"

శంకరం మాటలతో పాపాయిని అతనికి అప్పగించి వెళ్ళింది.

దాదాపు పది పన్నెండుమంది ఆడవాళ్ళు, పిల్లలు అప్పటికే అక్కడ ఉన్నారు. అందరూ కుతూహలంగా అరుణని గమనించడం మొదలుపెట్టారు. ఆ ఇంటి వారి పాప రెండు సంవత్సరాలు పూర్తయి మూడవ సంవత్సరంలోకి అడుగు పెట్టిందని పుట్టిన రోజు పేరంటం చేస్తున్నారు.

చేతిలో గిఫ్ట్‌ప్యాక్ పాపాయి చేతిలో పెట్టి అక్షింతలు వేసి కూర్చుంది.

'మీరు ఇక్కడికి క్రొత్తగా వచ్చినట్లున్నారు."

"ఎప్పుడూ బయటకే రారు మీరసలు"

"మీ స్వంత ఊరేది?"

"మీకు పిల్లలా?"

"ఒక పాపాయి ఉన్నట్లుంది."

"పాపాయిని తీసుకురాలేదేం?"

ప్రశ్నలు పరంపరగా అరుణని చుట్టుముట్టాయి. చిరునవ్వుతో సమాధానాలు చెప్పి ఆఖరి ప్రశ్న విననట్లే ఊర్కుంది.

"మీ పాపాయికి ఎన్నో సంవత్సరం? తీసుకురాలేకపోయేరా? ఇక్కడ పిల్లల పేరంటం కదా"

"పాపాయి నడవలేదు" అంది ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"వయస్సెంత? డాక్టర్‌కి చూపించలేకపోయారా? ఈ కాలంలో అన్నింటికీ సూపర్ స్పెషాలిటీలున్నాయిగా"

"చూపించేమండి"

"ఇక అంతే అన్నారా ఏమిటి జీవితాంతం?"

"అబ్బో ఆడపిల్ల కూడాను. పెద్దదవుతున్నకొద్దీ చాలా సమస్య"

కుర్చీలో అసహనంగా కదిలింది అరుణ. ఆ టాపిక్ మారిస్తే బావుణ్ణని ఉంది.

ఇంకొకామె అందుకుంది.

"మేము విశాఖపట్నంలో ఉండేటప్పుడు మా వీధిలో రామలక్ష్మిగారు ఉండేవారు. చాలా మంచావిడ. అందరితోనూ స్నేహంగా ఉండేది. వాళ్ళ పిల్లవాడూ ఇలాగే నడవలేడు, ఏ పనీ చేసుకోలేక పోయేవాడు. పద్దెనిమిదేళ్లు వచ్చేవరకు ఆవిడే అన్నీ చేసేది. ఆ పిల్లవాడిని లేవతియ్యడం, బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళడం...నిజంగా నరకం అనుకోండి. అయినా విసుక్కునేది కాదు. తర్వాత కొన్నాళ్ళకి పోయాడా పిల్లవాడు. ఇలాంటి పిల్లలసలు ఎన్నో యేళ్ళు బ్రతకరంటారు కూడాను..."

ఉలిక్కిపడింది అరుణ. ఆ తర్వాత ఏదో చెబుతూనే ఉందావిడ. అప్రయత్నంగా లేచి నిలబడింది అరుణ.

"నేను వెళ్ళాలి" అంటూ ఆ ఇంటావిడతో చెప్పి గబగబా ఇంటివైపు అడుగులు వేసింది. చెవుల్లో హోరు.

వివర్ణమైన ముఖంతో ఇంట్లోకొస్తున్న అరుణని చూసి శంకర్ ఒక్కక్షణం అర్థం కానట్లు

చూశాడు. చేతిలో పాపాయి ఉనికి అతనికి విషయం అవగాహనకు తెచ్చింది.

❖❖❖

సాయంకాలం ఎదురుగా ఉన్న పార్కుకి పాపాయిని తీసుకెళ్ళి కూర్చుంది. పిల్లలు ఆడుకుంటున్నారు. బాల్యం! ఎంత తియ్యనిది. ఎంత నిష్పూచి, ఎంత నిశ్చింత! ఏ దుఃఖాలూ, ఏ కల్మషాలూ తెలియని ప్రపంచం!

పాపాయి వంక చూసింది. చుట్టూ రంగురంగుల బట్టల్లో రివ్వున పరుగులెడుతూ ఆటలాడుకుంటున్న పిల్లల్ని చూస్తూ ఆనందిస్తోంది. పాపాయికక్కాడా ఇలా ఆడుకోవాలనుండదూ?

తనలాంటి తల్లికి పుట్టింది. అది పుట్టాక ఒక్క యేడాది మాత్రం దాని ఆటలు, నవ్వులు ఇల్లంతా మారుమ్రోగాయి. అంతే... ఆ తర్వాతంతా నిశ్శబ్దం. జీవితం అంతా ఇంతేనా?

తమ ముగ్గురి జీవితాలు ఇలా ముడిపడి ఉన్నాయి. శంకర్‌ని తనస్సలు పట్టించుకోవడమే మానేసింది. తనను సంతోష పెట్టేందుకు ఏదో ఒకటి చేస్తూనే వుంటాడు. దేనికీ తను స్పందించలేకపోతోంది. తనిలా దిగులుగా ఉండటాన్ని చూడలేక ఏదైనా ఉద్యోగంలో చేరమంటాడు.

"పాపాయికి ఆయాని పెడదాం ఏ ఇబ్బందీ లేకుండా" అంటాడు.

కానీ, తను లేకపోతే పాపాయికి ఎంత ఇబ్బంది! ఆయా పాపాయిని సరిగా చూస్తుందా? తన ఆబ్సెన్స్‌లో విసుక్కుంటే?

ఒక్కసారిగా ఆలోచనల్లోంచి తృళ్ళిపడింది అరుణ.

"ఏమిటా పరుగులు, కాళ్లు విరక్కొడతాను. ఇసుక చూడు ఎలా పోసేవో మీద" అంటూ ఆడుకుంటున్న పిల్లల మీద విరుచుకుపడిందొకావిడ.

తను ఇందాకట్నుంచీ గమనిస్తోంది. ఆమె ఇద్దరి ముగ్గురి మధ్య సీరియస్‌గా సంభాషణలో ఉంది. పిల్లల్ని దూరంగా వెళ్ళి ఆడుకొమ్మంటూ కసురుతోంది.

ఆమె మాటలకి అరుణ మనస్సు ఒక్కసారి బాల్యంలోకి వెళ్లిపోయింది.

చిన్నతనం రోజులు. తూనీగలాగా పరుగులెత్తి ఆటలాడుకునే తనని ఎవ్వరూ కోప్పడేవారు కాదు. ఆ వీధి వీధంతా తనతోటి పిల్లలే.

తమ ఇంటి పెరటి వసారాలోనో, దొడ్లో పూలమొక్కల మధ్యో, వేపచెట్టు క్రిందో నిత్యం బొమ్మల కొలువులు, పెళ్ళిళ్ళు జరుగుతూండేవి. పండుగ శెలవులు, ఆదివారాలు అయితే తమ ఆటలకి హద్దే ఉండేది కాదు.

పొరుగింట్లో ఉన్న కస్తూరి మామ్మ మాత్రం ఎప్పుడూ గోడ అవతల నుండి తామందర్నీ 'అల్లరి ఆపుతారా, లేదా' అంటూ అదిలిస్తూ ఉండేది. ఆమె ఒంటరిగా ఉండేది. ఆ వయస్సులో చిన్న పిల్లల్ని దగ్గరకు తీసుకుని, వాళ్ళ ఆటలు చూసి మురిసిపోవాల్సింది పోయి పిల్లల్ని చూస్తేనే విసుక్కుని కేకలు పెడ్తూండేది. తన మీద నానమ్మకి, అమ్మకి నిత్యం ఫిర్యాదులు మోసుకొచ్చేది.

తనొకనాడు వాళ్ళింటివైపు ఒంగిన మందారపువ్వు కోసేందుకు గొడెక్కి, తూలి వాళ్ళ పెరట్లో పడింది. ఆ గోడ వారగా చదును చేసి కొత్తిమీర మడి పెంచినట్లుంది. తను వెళ్ళి వెళ్ళి దాని మీద పడింది.

గోడ మరీ ఎత్తు లేకపోవడంతో తనకి పెద్దగా దెబ్బలు తగల్లేదు కాని అక్కడే పెరట్లో పచ్చడి నూరుకుంటున్న కస్తూరి మామ్మ కంట పడనే పడింది. రోటి దగ్గర్నుంచి సరాసరి లేచివచ్చిన ఆవిణ్ణి చూసి భయంతో యేడుస్తూ వాళ్ల వీధి గుమ్మంలోంచి తమ ఇంట్లోకి పరుగెత్తింది తను.

పొరుగువాళ్ళం అన్న మర్యాద కూడా లేకుండా తన తల్లితో, నానమ్మతో కయ్యానికి దిగడం, పెద్దగా అరచి ఆర్భాటం చెయ్యటం, తనకి అలా జ్ఞాపకం ఉండి పోయింది. పైగా వెళ్తూ వెళ్తూ "మీ పిల్లకి అంత దూకుడెందుకో అర్ధం కాదు. అది పెట్టే పరుగులు ఇంకే పిల్లా పెట్టగా నేను చూళ్ళేదు. కాస్తన్నా భయం చెప్పుకోరూ? ఇంకోసారి మా పెరట్లో చేరి అల్లరి చేసినా, పరుగులు పెట్టినా ఆ కాళ్ళు రెండూ విరిచి పారేస్తాను" అంటూ హూంకరించి వెళ్ళిపోయింది.

తను యేడేళ్ళ పిల్ల. తల్లిని కరుచుకు పోయింది. ఆ భయంతో వారం రోజులు హై టెంపరేచర్‌తో మంచం యెక్కింది. సున్నితమైన మనుష్యుల మధ్య గారాబంగా పెరిగిన తను ఆ సంఘటన, ఆమె కోపంతో అరిచిన అరుపులు ఎన్నాళ్లో మర్చిపోలేక పోయింది.

"కాళ్ళు విరిచి పారేస్తాను" అని ఆమె అన్న మాటలు పదేపదే జ్ఞాపకం వచ్చి ఒణికిపోయింది. పరుగెత్తబోయినప్పుడల్లా ఆ మాటలు తనని నిలబెట్టేసేవి.

❖❖❖

"అరుణా! మనింటికి రేపు గెస్టులొస్తున్నారు" అంటూ కబురు తీసుకొచ్చాడు శంకరం.

ప్రశ్నార్ధకంగా చూసింది.

"నా బ్యాచ్‌మేట్స్ సురేష్, శ్రీధర్ ఫ్యామిలీలతో నార్త్ ట్రిప్ పెట్టుకున్నారు. చాలా రోజులైంది కలిసి. రేపు మనింటికి డిన్నర్‌కి వస్తారు. ఇక్కణ్ణుంచే వాళ్ళ యాత్ర ప్రారంభం."

మర్నాడంతా ఇంటికొస్తున్న స్నేహితుల కోసం అన్నీ అమర్చడంలో హడావుడిగా గడిచింది. పాపాయిని కనిపెట్టుకు చూసుకుంటూనే ఉంది.

సురేష్, స్వాతి, శ్రీధర్, రమలు పిల్లలతో వచ్చారు.

పాపాయిని చూసి, "ఏమైంది? ఎలా అయింది? పుట్టుకతోటే ఇలా ఉందా?" అంటూ ప్రశ్నలు.

అరుణ మరేమైనా కబుర్లలోకి మళ్లించాలని చూస్తుంది.

రమ అంటోంది.

"ఇలాంటి పిల్లలతో చాలా కష్టం కదండీ, ఎక్కడికీ వెళ్ళలేం. వీళ్లు పెరుగుతున్నకొద్దీ వీళ్లను లేవదియ్యడం, వీళ్ల పనులు అటెండ్ చెయ్యడం మనకి మించిన పని అవుతుంది. మీరు ఒక మనిషిని పెట్టుకోండి".

"అయినా ఇందులో మీకో ఎడ్వాంటేజ్ లేకపోలేదులెండి. నా కైతే మగపిల్లలే, కాని స్వాతిలాగ కూతుళ్ళకి సంబంధాలు చూడడం పెళ్ళిళ్ళు చెయ్యడంలాంటి బాధలన్నీ లేవు మీకు" నవ్వుతూ అంటున్న రమ ముఖంలో ఆ క్షణాన ఒక మనసులేని పాషాణం కన్పించింది అరుణకి.

స్వాతి వెంటనే, "అదేమిటి రమా, అలా అంటావు" అంటూ మందలించింది.

ఈ మనుష్యులకి ఇన్ని మాటలు, ఇన్నిన్ని తెలివితేటలు, ఇంత దయలేని తనం ఎందుకో! అరుణ మనసు మళ్ళీమళ్ళీ గాయపడుతూనే ఉంది. ఆ గాయాలు ఆమెను ధృడచిత్తను చేస్తున్నాయి.

దురదృష్టవశాత్తూ పాపాయి అనుభవిస్తున్న ఈ నరకం ఎవరు మాత్రం కోరుకుంటారు?

ఊహ తెలుస్తున్నకొద్దీ పాపాయిని ఈ సంఘం ఇంకెన్ని విధాల గాయపరుస్తుందో!

ఈ మనుష్యుల అల్పత్వాన్ని, ఈ లోకం కపట సానుభూతినీ తేలిగ్గా తోసిపారేసే మనోబలాన్ని నా పాపాయికి నేర్పాలి. అది నేను అందిస్తాను.

కథలు చెబితే చక్కగా వింటుంది. ప్రశ్నిస్తుంది. పాటలు పాడితే వింటుంది. తనూ కూనిరాగాలు తీస్తుంది. మంచి సంగీతం విన్పిస్తూంది తనందుకే. సంగీతం నేర్చుకుంటానంటే నేర్పించాలి.

నా పాపాయికి తనకంటూ ఓ ప్రపంచాన్ని నేను క్రియేట్ చేస్తాను. ఇన్నాళ్ళూ పాపాయికి ఎదురైన పరిస్థితికి తనే కృంగిపోయి, మనోనిబ్బరాన్ని కోల్పోయి మూఢురాలిలా ప్రవర్తించింది. ఇకపై తను పాపాయికి అమ్మ మాత్రమే కాదు. ఈ సమాజాన్ని ఎదుర్కొనే ఆదిశక్తి కూడా. అరుణ ధృఢంగా నిశ్చయించుకుంది. ఇలాటి పాపాయిల కోసం తనే ఓ చిన్ని కేర్ సెంటర్ మొదలుపెట్టాలి.

**('రచన' కథాపీఠం ఆగస్టు 2004)**

# మార్పు

ముంబయి వి.టి. ఎప్పటిలాగే జన ప్రవాహంతో ఉక్కిరి బిక్కిరిగా ఉంది.

లోకల్ దిగి ప్రభ, నేను సురేష్ కోసం ముందు నిర్ణయించుకున్న చోటులో లగేజ్‌తో సహా నిలబడ్డాం. ఇంకో అరగంటలో తనెక్కే రైలు ఈ పరిసరాలు దాటి వెళ్ళిపోతుంది. మళ్లీ ఎప్పుడో!

ఈ సిటీకున్న గ్లామర్ మరి ఏ సిటీకీ లేదేమో! నిత్యం పరుగులు తీసే ఈ జన సందోహం, ఈ వేగం... తానెంతగా విసుక్కున్నా ఏదో ఆకర్షణ తనకి ఈ సిటీ పట్ల ఏర్పడి పోయిందన్నది మాత్రం వాస్తవం.

'అత్తయ్యా! అడుగో, సురేష్ వచ్చాడు" అంటున్న ప్రభ మాటలకి కదిలి ముగ్గురం మీనార్ ఎక్స్‌ప్రెస్ వైపు అడుగులు వేశాం. సురేష్‌ని చూడగానే పొద్దున్నే ఇంట్లో జరిగిన సంఘటన మనసులో మెదిలింది.

అతను ఏదేదో మాట్లాడుతున్నాడు. ఆఫీసులో పర్మిషన్ తీసుకుని తానెలా పరిగెత్తుకు వచ్చాడో హుషారుగా చెబుతున్నాడు. ప్రభ ఉత్సాహంగా వింటోంది. ముఖం కాంతివంతంగానే వుంది. లోపల బాధపడుతోందా, ఏమో! ఇంత నిండుతనం, గాంభీర్యం ఎక్కడ తెచ్చుకుంది ఈ పిచ్చిపిల్ల!

నా కోసం రిజర్వు చేసుకున్న బెర్త్ దగ్గర సామాన్లన్నీ సర్దిపెట్టాక

‘ఆంటీ! ప్రయాణంలోకి మీ కింకా ఏమైనా కావాలా? ఇంకో రెండు పత్రికలు తెచ్చిపెట్టనా” అంటూనే మరో రెండు పుస్తకాలతో తిరిగొచ్చాడు.

ఎదుటి వ్యక్తికి ఏం కావాలో ఎంతో శ్రద్ధగా అమర్చే అతని స్వభావం ప్రశంసించ దగ్గదే, కాని... ఏమో, ఒక్కోసారి అతని ప్రవర్తన మరో రకంగా ఉంటుంది.

ప్లాట్‌ఫారం మీద ప్రభ, సురేష్ ఇద్దరూ హాయిగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎంతో సహజంగా, ప్రేమగా కన్పిస్తోందా జంట చుట్టూ ప్రపంచానికి. నేనే ఎక్కువగా ఆలోచిస్తున్నానా?

రైలు కదిలింది. హ్యాండ్‌బ్యాగ్ తెరిచి టికెట్ ఒకసారి చూసుకుని మూసేస్తుంటే ప్రభ ఉత్తరం కంట పడింది. చేతిలోకి తీసుకున్నాను.

“నా ప్రియమైన అత్తయ్యా ! బావున్నావా? నా పెళ్లి అయిన దగ్గర్నుంచీ నా ఇంటినీ, సంసారాన్నీ చూసేందుకు వస్తానని ఎన్ని వాగ్దానాలు చేశావ్! సురేష్, నేను కాకుండా ఇందూ, మీనా కూడా మా సంసారంలోకి వచ్చారు. అయినా నువ్వు ఒక్కసారైనా వచ్చి నీ మాట నిలబెట్టుకోలేకపోయావ్! సురేష్ అమెరికా ప్రయత్నాలు సక్సెస్ అయ్యాయి. ఇంకో నెలలో తను వెళ్ళిపోతాడు. ఆ పైన పిల్లలూ, నేనూ!

“సురేష్ వెళ్ళేలోపు నువ్వొస్తావని ఎదురు చూస్తున్నాం. మమ్మల్ని నిరాశచెయ్యకు. రిజర్వేషన్ చేసుకుని వెంటనే ఫోన్ చెయ్యి. నీ ప్రభ.”

ప్రభ ఏడేళ్ల పిల్లగా ఉన్నప్పుడు తన దగ్గరకు తెచ్చుకుంది. తన అన్న, వదిన కూతుర్ని చూడాలనుకున్నప్పుడు వచ్చి వెళ్తుండేవారు. కాని ప్రభ మాత్రం అమ్మానాన్నల కోసం ఎన్నడూ బెంగపడేది కాదు.

ప్రభని పూర్తి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో పెంచింది తను. ఎక్కడా ఎలాంటి ఓటమి అంగీకరించేది కాదు. ధైర్యం, చొరవ, తెలివితేటలతో ఎప్పుడూ తన తోటివారి మధ్య ప్రత్యేకంగా ఉండేది.

ఉద్యోగరీత్యా తను దేశం అంతా తిరిగింది. రిటైరైన ఈ ఏడాదిలో ప్రభ రమ్మని వత్తిడి చెయ్యడం ఎక్కువైంది. ఎప్పటి కప్పుడు ఏవో ఆటంకాలే. ఆఖరికి పిల్లలు దేశం వదిలి దూరాలెళ్ళిపోతున్నారన్న ఆత్రంతో తను రైలెక్కింది.

గత వారంరోజులుగా ప్రభ, సురేష్, ఆ పసివాళ్లతో ఎలా గడిచిపోయిందో అంత వేగంగా! రైలు దిగిన దగ్గర్నుంచీ ‘అత్తయ్యా’ అంటూ పసిపిల్లలా తన వెంట తిరిగింది.

భర్త ఉన్నంత సేపూ అతని తోడిదే లోకం. సురేష్ ప్రతి పని ఆమె చేతుల మీదుగానే జరగాలి. ఇదివరకు భోజనానికి లేచి రమ్మంటేనే చిరాకు పడేది.

ఈ వారం  రోజులుగా తను గమనించింది. గలగలమంటూ తానెక్కడుంటే అక్కడ చుట్టూ ఉన్నవారిని హోరులో ముంచెత్తేస్తూ ఉండేది. ఇప్పుడా ఉరకలు లేవు.

సురేష్ ఏదో చెబుతూంటాడు. ఆమె ఊ కొడుతుంది. అతన్ని జాగ్రత్తగా, శ్రద్ధగా అటెండ్ అవుతుంది. సాయంకాలం పిల్లల్ని తయారు చేసి చూస్తుంది.

అతను వస్తాడు. స్నానం చేసి రిలాక్స్ అయ్యేవరకు పెదవి విప్పడు. ఆ పైన పిల్లల మధ్య పసివాడు అవుతాడు. ఒక్క అరగంట తర్వాత వాళ్ళు ఆటలాపి తమ కోసం కేటాయించిన గదిలోకెళ్లి నిద్రపోవాల్సిందే.

'అత్తయ్యా' అంటూ దగ్గర కూర్చుంటే మాత్రం పసిపిల్లలా కబుర్లు చెబుతుంది. ఎలాంటి అరమరికలు లేనట్లుండే ఆ బోళాతనం అలాగే ఉంది.

'సురేష్ చూడు, అత్తయ్యా! నా కోసం ఎంత కష్టపడుతున్నాడో – తెల్లవారిన దగ్గర్నుంచీ ఊపిరాడనంత బిజీ, పనీ. నేను మళ్ళీ జాబ్‌లో చేరతానంటే వద్దంటాడు.

పిల్లల్ని, నన్ను సుఖపెట్టడమే తన ధ్యేయం అంటాడు. అన్నీ తనే చూసుకుంటాడు. ఒక్క విషయంలోనూ – అది పెద్దదైనా, చిన్నదైనా ఏ నిర్ణయమూ తీసుకోలేను నేను".

సురేష్ అహర్నిశలూ "నిన్నింకా కంఫర్టబుల్‌గా చూసుకోవాలి" అంటూ చెప్పే మాటలు ప్రభ మీద బాగా ప్రభావం చూపిస్తున్నాయి. అతనికలా ఇష్టం.

"ప్రతి చిన్న విషయానికి ఆమె తన దగ్గరికి రావాలి. తన మీద ఆధారపడాలి. అవన్నీ తను స్వయంగా తీర్చి ఆమెను సంతోషపెట్టాలి అన్నట్లుంటుంది అతని ధోరణి.

ఎక్కడ కందిపోతుందో అన్నట్లు చూసే అతనే సహనాన్ని కోల్పోయినప్పుడల్లా అంత రఫ్‌గానూ ప్రవర్తిస్తున్నాడనిపిస్తుంది. అతని ప్రవర్తనని ఆక్షేపించదు. నిరసించదు. నిశ్శబ్దంగా భరిస్తుంది.

చదువుకునే రోజుల్లో తన ఆత్మాభిమానానికి ఎక్కడైనా చిన్న ఛాలెంజ్ ఎదురైందంటే పెద్ద ఎత్తున ఎదుర్కొనే ప్రభ ఇప్పుడు మౌనంగా అతని అసహనాన్ని, అహంకారాన్ని భరిస్తోంది. అతని ప్రేమ ఆమెనలా కట్టి ఉంచుతోందా?

ప్రభ చాలా మారింది. నా కంటికి స్పష్టంగా తోస్తోంది 'అత్తయ్యా! ఎదురింటి భాటియా ఆంటీకి మన బొబ్బట్లు, పులిహోర ఎంతిష్టమో తెల్సా' అంటూ ఆ పూట చేసిన స్పెషల్స్ పట్టుకుని ఎదుటి ఫ్లాట్‌కెళ్ళింది.

భాటియా కూతురు కాబోలు ఒక్క నిముషం తర్వాత తలుపు తీసింది. మంచి నిద్రలోంచి లేచి వచ్చినట్లుంది. 'లంచ్ చేసి నిద్రపోయే టైమని నీకు తెల్సు కదా ఆంటీ. ఇప్పుడే డిస్టర్బ్ చేసి ఇవ్వన్నీ ఇవ్వాలా?' అంటోందా అమ్మాయి విసుగ్గా.

మర్యాదకైనా చిరునవ్వులేదు. చిన్న థ్యాంక్స్ లేదు. ప్రభ ఎలాంటి ఫీలింగ్ లేకుండా అసలేం పట్టించుకోనట్లు నాతో కబుర్లలోకి దిగడం నాకు ఆశ్చర్యంగా తోచింది. ఎంత సెన్సిటివ్‌గా ఉండేది. ఇప్పుడు  దేన్నీ సీరియస్‌గా తీసుకుంటున్నట్లే కన్పించదు.

❖❖❖

సాయంకాలం టీ తాగుతుంటే సురేష్ ఫోన్‌కాల్.

"ఆంటీ! మీరంతా ఈ పూట చెంబూర్ వెళ్లి వచ్చేయండి. నేను వచ్చేసరికి ఆలస్యమవుతుంది."

చెంబూర్ నుండి వస్తూంటే ప్రభ చెబుతోంది – "బలానీ ఆంటీ ఏమీ మారలేదు. అశోక్ చూడు పెళ్ళయ్యాక ఎంత మారిపోయాడో! నోరు విప్పి ఒక్కమాటైనా మాట్లాడాడా? ఇదివరకైతే నువ్వు పది రూపాయలు లంచం ఇచ్చినా పావుగంట కూడా నోరు మూసుకుని ఉండననేవాడు."

అవును. ఆ మార్పు కనిపిస్తోంది. కాని ప్రభ!

ఇంటికొచ్చేసరికి పిల్లలు నిద్రకు తూగుతున్నారు. గబగబా కుక్కర్ పెట్టి, పిల్లల డ్రెస్ మార్చి, వాళ్లకు తినిపించి  నిద్రపుచ్చేంతలో అతను రానే వచ్చాడు.

"ఎలా జరిగింది చెంబూర్ యాత్ర" అంటూ భోజనానికి కూర్చున్నవాడల్లా టేబిల్ మీద రోటి లేకపోవడం చూసి అంతెత్తున ఎగిరిపడ్డాడు.

అప్పటిదాకా అంత సరదాగా ఉన్న మనిషి ఒక్కసారిగా మూడ్ మారిపోయింది. తానొక పరాయి వ్యక్తి అక్కడ ఉంది. అంత నిస్సంకోచంగా అతనలా ప్రవర్తించడం తనకు ఇబ్బందికరంగా అన్పించింది.

ఆకలి లేదంటూ అతను లేచి వెళ్ళిపోయాడు.

క్షణం ఆగి, ప్లేట్లో వడ్డించుకున్నది తిని తామూ లేచారు.

తెల్లవారి మళ్లీ మామూలుగా భార్యచేత అన్ని సేవలూ అందుకుని ఏం జరగనట్లే వెళ్ళిపోయాడు.

పనులన్నీ ముగించుకుని తీరిగ్గా కూర్చున్నాక ప్రభ బాధపడింది. భోజనం విషయంలో సురేష్ ఖచ్చితంగా ఉంటాడని తెలిసీ తను ఆ పూట రోటీ చెయ్యకుండా వంట ముగించడం తన  అపరాధమేనంటుంది.

ఒక్కపూట అతను సర్దుకోలేడా? తన ఇంట్లో తనక్కావలసినట్లు ఉండాలనుకోవడం

బాగానే ఉంది. కాని ఇంట్లో అతిథి ఉంది. బయటకెళ్లి రావడంతో వీలు కాలేదు అని సరిపెట్టుకోవచ్చును. ఆమె కూడా చెప్పదేం?

❖❖❖

ఆ రోజు తన ప్రయాణపు హడావుడి. తెల్లవారిన దగ్గర్నుండీ ఒక్కక్షణం నిలవకుండా పరుగులెత్తుతూ అన్నీ తయారు చేస్తోంది. సురేష్ ఆఫీసుకు తయారవుతున్నాడు. ఇంతలో ఏదో ఫోన్‌కాల్. దాదాపు పది నిమిషాలు సీరియస్‌గా మాట్లాడాడు. ఇంతలో పిల్లలిద్దరూ ఆటల మధ్య హాల్లోకి పరిగెత్తుకొచ్చారు. అంతపని తొందరలోనూ ప్రభ కిచెన్‌లోంచి రానేవచ్చింది.

ఫోన్ క్రెడిల్ చేస్తూనే 'ప్రభా' అంటూ గావుకేక పెట్టాడు. ఆ కోపంలో టిఫెన్ కూడా చెయ్యకుండా వెళ్లిపోయిన సురేష్‌ని చూసి ప్రభకి దిగులు.

అదెంత ముఖ్యమైన కాల్ అయినా పసి పిల్లలున్న ఇంట కొంత డిస్టర్బెన్స్ తప్పనిదే. అది అతను అర్థం చేసుకోడేం. అతను నవ్వితే నవ్వాలి. కోపం వస్తే ఎదుటివాళ్ళు మౌనంగా భరించాలి. అతని నిరంకుశత్వం, స్వార్థం ఆమెకు అర్థం కావెందుకు? అతను వెళ్ళాక అన్యమనస్కంగా ప్రభ అంటోంది.

"ఒక్క పిసరు కోపం, విసుగూ ఉన్నాయి. కాని అత్తయ్యా తను మా కోసం పడే ఆరాటం చూస్తే తనకి నేనేం చెయ్యగలనా అన్పిస్తుంది?"

అతను భార్యాబిడ్డలకోసం కష్టపడుతున్నాడు. నిజమే, అతను సుఖపెడతానంటున్నాడు. ఆ లాలసలో తన వ్యక్తిత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని వదులుకుంటోంది ఇష్టపూర్వకంగా.

భౌతికమైన సుఖాలకెప్పుడూ తాను విలువ ఇవ్వలేదు. తన చేతుల్లో పెరిగిన ప్రభ! ఇంత మార్పెలా వచ్చింది? కాలంతోపాటు సమాజ వాతావరణంలో వచ్చిన మార్పు ప్రభ వ్యక్తిత్వం మీద పూర్తిగా ఉంది. నేనేం చెప్పను? అది పూర్తిగా ఆమె జీవితం. తనకు నచ్చిన విధంగా జీవించే అధికారం పూర్తిగా ఆమెదే!

**('ఆంధ్రప్రభ' వీక్లీ, 4 సెప్టెంబర్, 1996)**

# నాన్న పుట్టిన ఊరు

రామం నా కొలీగ్. వెడ్డింగ్ కార్డ్ అందిస్తూ, "ఆంధ్రా చూడాలంటావు కదూ, అందులోనూ అందమైన తూర్పుగోదావరి జిల్లాలో పెళ్ళి ప్రయాణానికి మన వాళ్ళంతా బయల్దేరుతున్నారు. రెడీగా ఉండు" హెచ్చరించాడు.

ఆ క్షణంనుండీ నా ఆలోచనలు చెయ్యబోయే ఆంధ్రా ట్రిప్ మీదే ఉన్నాయి. ఇంటికెళ్తూనే అమ్మతో చెప్పాను. ఆనందంతో ఆవిడ కళ్ళు క్షణం పాటు మెరిశాయి. అంతలోనే ముఖంలో వుదాశీనత అలుముకుంది. నాన్నతో చెప్పలేక పోయాను.

పుట్టి పాతికేళ్ళు వచ్చినా మా స్వగ్రామం, తాత నానమ్మల ముఖాల్ని చూడనీయకుండా నాన్న పట్టుదల అడ్డుపడుతోంది. వుద్యోగరీత్యా ముంబయి మహానగరానికొచ్చిన నాన్న వెనక్కి తిరిగి తను పుట్టి పెరిగిన ఊరు, పరిసరాలు, తనను కని పెంచిన తల్లిదండ్రుల్ని ఒక్కసారి కూడా చూడాలనుకోలేదు.

ఆ పట్టుదల నాకూ నా వాళ్ళకూ మధ్య అడ్డుగోడలా నిలిచిపోయిందిన్నేళ్ళూ. కాని అమ్మ!... పుడుతూనే అనాథగా పుట్టిన అమ్మ జ్ఞాపకాల్లో కూడా నానమ్మ ఊరు పట్ల అభిమానం ఉంది.

జీవితం పట్ల ఒక నిర్ణయం చేసుకుని ఆనందంగా ఉన్న కొడుకుని తాతయ్య ఎందుకర్థం చేసుకోడు?

తరాల అంతరాలు ఇవేనా? ఒక తరానికి చాలా సహజంగా,

న్యాయంగా తోచినవి ఇంకో తరానికెందుకు అసహనాన్ని కల్గిస్తాయి? ఆయనకి నచ్చని విషయాన్ని రేపు నేను ఔనంటే నా పట్ల నాన్న ఇలాగే ప్రవర్తిస్తాడా?

ఎన్నో సందేహాలు నాకు...

❖❖❖

రామం పెళ్ళికి మా మిత్రబృందం అంతా ముందుగానే బయల్దేరారు.

ఆఫీసులో పని ఉండటంతో నేనొక్కణ్ణీ ఒక రోజు ఆలస్యంగా బయల్దేరాను. ప్రయాణం అంతా ఒంటరిగా చేస్తూండడం ఒక విధంగా నాకు హాయిగానే ఉంది.

ఆంధ్రలోకి ప్రయాణం చెయ్యడం నాకిది మొదటిసారి కాకపోయినా హైదరాబాదు దాటి నేనెన్నడూ ముందుకెళ్ళలేదు.

తాతయ్యని, నానమ్మని చూసిరావాలని నాన్న పసితనం గడిపిన ఆ పల్లె వాతావరణంలో తనివితీరా గడిపిరావాలని ఎంతగా ఎన్నిసార్లు అన్పించినా ఒక్కణ్ణి నేనుగా ముందడుగు వెయ్యలేకపోయాను.

నాన్న పట్టుదల నాకు తెల్సు. కన్న తండ్రిగా ఆయన నాపట్ల చూపించే ప్రేమ నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉంటుంది. అందుకే ఆయనకు నచ్చని విషయం అని తెల్సి నేనెప్పుడూ తాతయ్యగారి ఊరు వెళ్దామని అడగలేదు.

తాతయ్య పేరే నాకు పెట్టి నన్ను 'నాన్నా' అంటూ పిల్చుకునే నా తండ్రి మనసు తల్చుకుంటే గుండె ఆర్ద్రమవుతుంది. ఆ తండ్రీ కొడుకుల్ని నేను కలపలేనా?

ఇన్నేళ్ళూ చదువు, ప్రొఫెషన్ అంటూ రొటీన్ బ్రతుకు గడిపేశాను. ఈ కుటుంబాన్ని ఒక్కటి చెయ్యవలసిన బాధ్యత నాకుంది సుమా...

❖❖❖

రైలు లేటుగా, చాలా లేటుగా రాజమండ్రి చేరడం గమనించలేదు. దాదాపు పన్నెండు గంటలపైనే పట్టింది అసలు చేరవలసిన టైముకి.

తెల్లవారు ఝాముున స్టేషన్‌లో దిగి ప్లాట్ ఫారమ్మీద జనాల మధ్య కొద్దిసేపు కూర్చుండిపోయాను.

నలుపు తెలుపుల ప్రకృతి దృశ్యం సహజంగా, అందంగా రెప్పవేయనీయడం లేదు. టాక్సీ పరుగులెడుతోంది. మనసంతా భరించలేని ఉద్వేగం.

అసలు నేను పెళ్ళి చూసేందుకు వచ్చానా? ఊహు నా మనసంతా 'పొడగట్ల పల్లి" చుట్టూ పల్టీలు కొడుతోంది.

నాన్నకి చెప్పలేదు నా ప్రయాణంలోని ఆంతర్యం. అమ్మ మాత్రం ఎంత కదిలిపోయింది మా నిధి ఏదో అక్కడున్నట్లు. తనని నిరాదరించిన ఆ పల్లె పట్ల ఆమెకెందుకో మమకారం!

నేనిప్పుడు ఆ పల్లెను, నాన్న పరుగులెత్తిన ఆ ఇంటి అరుగులు, ఈతలు కొట్టిన చెరువు, ఆటలాడిన తోటలు, దొడ్లూ అన్నీ చూసి రావాలి. కాని నాన్నకి తెలిస్తే సహించగలడా?

ఇన్నేళ్ళుగా ఒక్కసారి కూడా ఆయన తన ఊరు, తన వాళ్ల గురించి ప్రస్తావించనే లేదు. మనసులో ఏముందో మరి, నేను వెళ్ళి చూసివచ్చానంటే హర్షిస్తాడా? నన్ను వెలివేస్తాడా?

సడన్‌గా టాక్సీ ఆగింది. ఆలోచనల్లోంచి బయటపడ్డాను.

“ఏమైంది?”

“చూస్తాను సార్” అంటూ దిగాడు డ్రైవర్.

చిన్న రిపేర్ అనుకున్నది కాస్తా పెద్దదైంది. చుట్టూ పరిసరాలు మాత్రం కంటికి పచ్చపచ్చగా హాయిగా ఉన్నాయి.

ఆ మహానగరంలో మా జీవిత వేగానికీ, ఈ ప్రజల జీవితాలకి ఎంత వ్యత్యాసం! నిముషం నిలబడేందుకు వ్యవధిలేని మా బ్రతుకులు... వేగం అంటే ఎరుగని మనుష్యుల్లా వీళ్ళు తాపీగా తిరుగుతున్నారు.

రోడ్డు దిగి నడక మొదలుపెట్టాను. ఏం ఊరో ఇది? బహుశా తాతగారి ఊరు కాదు కదా. నా గుండె చప్పుడు నాకే స్పష్టంగా విన్పిస్తోంది...

ఏ ఊరన్న ప్రశ్న నా నోట్లో ఉండగానే ఎదుటనున్న బోర్డు నా కంటబడి ఉక్కిరి బిక్కిరిగా ఊపిరాడనట్లయింది. కాలు కదలదే అడుగు తీసి వేద్దామంటే.

“ఎవరింటికెళ్ళాలంటున్న ఎదుటివ్యక్తి ప్రశ్నకి బలవంతంగా నోరు పెగుల్చుకుని ‘కారు రిపేరంటూ” గొణిగాను.

ఎదురుగా చెరువు... దాన్ని ఆనుకుని చిన్నగుడి, చెరువు చూడగానే అమ్మ చెప్పిన నాన్న బాల్యం తాలూకు స్మృతులు.

❖❖❖

నాన్న నానమ్మ చేతిలో ఒకే ఒక్కసారి దెబ్బలు తిన్నాడట అదీ ఎదురింట్లో వసంత అనే అమ్మాయికి పెళ్ళివారొచ్చిన సందర్భంలోనట.

నాన్న మిత్ర బృందంలో అమ్మాయే వసంత. కాకపోతే రెండు మూడేళ్లు పెద్దది. ఈ పెళ్ళి చూపుల ప్రహసనం నాన్నకీ, వాళ్ళ మిత్రులకీ ఊహ తెలిశాక అదే మొదటిసారి.

కుతూహలంగా అరుగు మీద కూర్చుని పెళ్లివారు రావడం, కాఫీ, ఫలహారాలు ఆరగించడం, సిగ్గు పడుతూ వసంత చాప మీద కూర్చోవడం, వసంతక్క పాట పాడటం అంతా చూస్తూనే ఉన్నారట వీళ్ళంతా.

ఆ వీధిలోనే రాజులత్త అనే ఆవిడ ఉండేదట. చిన్నప్పుడే వైధవ్యం పొంది, ఒంటరిగా ఉంటూ ఊళ్ళో వాళ్ల కబుర్లన్నీ మోస్తూ కాలక్షేపం చేస్తూ ఉండేదట.

ఈ పెళ్ళి చూపుల వ్యవహారం ఆవిడా గమనిస్తోంది. ముత్తైదువ కాకపోవడంతో ఎదుటబడి వెళ్ళి తతంగాన్ని చూసే ఛాన్స్ లేదు. నాన్నని, ఈ పిల్లగ్యాంగ్‌ని పిలిచి, "ఏరా, మీ వసంతక్క పెళ్ళిఖాయం అయినట్లేనా ఏమిటి? బావగారేం చేస్తారుట? అని దీర్ఘాలు తీసిందట.

నాన్న దుడుకుతనం తెలియనిదేముందీ... గబగబా పెద్ద హీరోలా వసంతక్క ఇంట్లోకి చొరబడి. "అక్కా! బావగారేం ఉద్యోగం చేస్తున్నారు?" అన్నాడట పెళ్ళివారి ముందే.

ఆ పిల్ల తెల్లబోయి సిగ్గుతో లోపలికి వెళ్ళిపోయిందట. ఇంతా చేసి మాటలు పొసగక ఆ సంబంధం తప్పిపోవడంతో వసంత వాళ్ల అమ్మ వచ్చి నానమ్మ దగ్గర నాన్న పెళ్లివారి ముందు అడిగిన ప్రశ్నకి చిలవలు పలవలుగా, "ఎంతగారం అయితే మాత్రం పిల్లవాణ్ణి పెంచుకోవడం అదేనా?" అని ఒక్క వరసన సాధించిందట.

అసలు సంబంధం తప్పిపోవడం అంతా దీని మూలాన అన్నట్లు ఆవిడ చేసిన అల్లరికి నానమ్మకి ఉక్రోషం వచ్చిందట. ఆవిడటు వెళ్ళాకా నాన్నని పిలిచి రెండు దెబ్బలు వేసి తను ఏడుస్తూ కూర్చుందట.

నాన్న మాత్రం ఆ దెబ్బల్ని దులిపేసుకుని చెర్లో ఈతలు కొట్టేందుకు స్నేహితులతో కల్సి వెళ్ళిపోయాడట.

ఎన్నెన్ని జ్ఞాపకాలు! ఎంత మధురిమ వీటి నల్లుకుని! కాని నాన్న ఎంత గంభీరంగా ఉంటాడు! తనకి నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని వస్తే తన వివేచన, నిర్ణయం పట్ల తాతయ్య నిరాదరణకి కృంగి పోయారట. నాన్నమ్మని కంటితో చూసుకోనైనా లేదట.

తన మీద నమ్మకంతో, తనని ఆమోదిస్తారన్న అంతులేని విశ్వాసంతో ఊళ్ళోకి అడుగు పెట్టి అవమానాల పాలై, కొత్త పెళ్ళి కూతురిని కూడా అవమానానికి గురిచేసి నందుకు నాన్న అహం దెబ్బతింది. అంతే... అదే నిర్ణయం. ఆనాడు ఆ చెరువుగట్టున తాతయ్యిచ్చిన తీర్పుతో తిరిగి ఆ ఊరి ఊసెత్తలేదు.

మమతని, మమకారాన్ని మించిన పంతం! దీనికి అర్థం ఏముంది? జీవితం అంతా కష్టపడి పోగేసుకునేది "నాది" అనే భావనేగా, ఆ 'నాది' అనేది 'కన్నతల్లి', 'పుట్టిన ఊరు' కంటే మిన్నగా ఏముంటాయి? నాకు అర్థంకానిదిదే.

నాన్న బాల్యం నా కెంత థ్రిల్లింగ్‌గా ఉంటుంది. వింటుంటే. ఎంత అందమైన రోజులు! ఆ రోజుల్లో బాల్యాన్ని ఎంత కమ్మగా అనుభవించే వారో!

నాన్న చిన్నతనం గురించిన కబుర్లు అమ్మ ఎప్పుడూ ఒక క్రొత్త ఉత్సాహంతో చెబుతూనే

ఉంటుంది. విన్న ప్రతిసారీ ఆ రాత్రి కలలో నానమ్మని, తాతయ్యని, పొడగట్లపల్లిని తనివితీరా చూసి తెల్లవారి అమ్మకి గర్వంగా చెప్పేవాణ్ణి, నాన్న పుట్టిన ఊరు చూసొచ్చేనంటూ.

"ఎంత మంచి కలలు కంటావురా కన్నా" అనేది అమ్మ. నాకు మాత్రం అది కలే అంటే నమ్మశక్యం అయ్యేది కాదు. నేను నిజంగా చూసి, స్ప ృశించి వచ్చినవి అమ్మ కలంటుందేం అనుకునేవాణ్ణి.

నా ఊహ తెలియడం క్రెష్‌లోనే. అమ్మ, నాన్న ఉద్యోగాలకి వెళ్తూ నన్ను క్రెష్‌లో వర్షా ఆంటీ దగ్గర వదిలి వెళ్ళేవారు. పగలు నా ప్రపంచం అంతా అక్కడ బొమ్మల మధ్య, నాలాంటి పసివాళ్ళ మధ్య ఆటలతో గడిచిపోయేది.

ఆ తర్వాత నర్సరీలో వేసినా, మధ్యాహ్నం క్లాసు అవ్వగానే మళ్ళీ వర్ష ఆంటీ తన వెంట తీసుకెళ్ళేది. రాత్రి చీకట్లోనే అమ్మనాన్నల రాక నా కోసం.

నేను ట్వెల్త్ క్లాస్‌లో ఉండగా అమ్మ అనారోగ్యంతో ఉద్యోగానికి వీడ్కోలు చెప్పింది.

❖❖❖

ఆలోచనల మధ్య ఎంతసేపు ఆ చెరువు గట్టున నిలబడిపోయానో! చెరువు మెట్లు దిగుతూంటే ఎవరో పై నుండి హెచ్చరించారు.

"మెట్లు జారుడుగా ఉంటాయి బాబూ".

తల త్రిప్పి ఫర్వాలేదన్నట్లు చిన్న నవ్వు నవ్వి మెల్లగా మెట్ల అంచుల వెంబడి దిగడం మొదలుపెట్టాను. ఇంకో రెండు మెట్లు దిగితే ఆ నీటిని స్ప ృశిస్తాను. ఆ స్పర్శ....నాలో చెప్పలేని భావాల్ని కదిలిస్తోంది.

ఏదో హాయైన అనుభూతి నన్నల్లుకుందొక్క క్షణం. కాలు జారబోయాను, వెనుక బలంగా ఎవరిదో చెయ్యి నన్ను భుజం పట్టి ఆపింది.

తల త్రిప్పాను. ఇందాక హెచ్చరించిన పెద్ద మనిషే. బహుశా అరవై, డెబ్భైల మధ్య ఉండొచ్చు. దృఢంగా ఉన్నాడాయన. ఆయన చేతిని అందుకుని రెండు మెట్లు పై కొచ్చాను. సిగ్గనిపించి చెయ్యి వదిలాను.

"ఎవరింటికి?" ఊరికి క్రొత్తవాడిలా ఉన్నావ్?" గంభీరమైన గొంతు. దారి మార్గంగా ఆగాల్సి వచ్చిందని చెప్పాను.

"పద" అంటూ ముందుకు నడిచిన ఆయనననుసరించక తప్పలేదు. చుట్టూ పరిశీలనగా చూస్తూ నడుస్తున్న నేను ఉలిక్కిపడి ఆగాను, 'ఒరేయ్ సూరీ' అన్న కేకతో.

తననలా పిలిచే మిత్రులెవరూ లేరే! అమ్మ ఒక్కతే నన్నలా పిలుస్తుంది. ప్రక్కన నడుస్తున్న తాతగారూ ఆగారు.

వెనక్కి తిరిగి చూస్తే పెద్ద పెద్ద అంగలతో ఆ వయసుకి సాధ్యమేనా అన్పించేంత వేగంతో ఓ మీసాల తాతగారు మమ్మల్ని సమీపిస్తున్నారు.

"ఏరా, నిన్ననేగా కాస్త పథ్యం తిన్నదీ. అప్పుడే ఊరి మీదకి బయల్దేరావ్"

"రాత్రి కంటిమీద కునుకులేదురా నర్సింహా. తెల్లవారుఝామున ఎప్పుడో పట్టి నట్లుంది. మెలకువ వచ్చి చూస్తే ఏమీ తోచదు. చెరువుగట్టు వరకు వచ్చేసరికి ఈ కుర్రాడు ఎదురయ్యాడు. ఈ ఊరివాడు కాదు. కాస్త కాఫీ ఇచ్చి పంపుదామని"

'సూరి' పేరుతో పలికిన ఈ వృద్ధుడు నా తాతయ్యేనా? అయితే ఈ మీసాల తాత నర్సింహం తాతన్నమాట. నాన్న చెబుతుండేవాడట – నర్సింహం పెదనాన్న పెద్ద ఎద్ద మీసాలతో ఆడుకుంటున్న తామందర్నీ ఎలా అదిలించి, బెదిరించేవాడో, ఆ మీసాలు పుచ్చుకుని రెండు కొసలూ కలిపి ముడివేయాలని తామంతా ఎలా పథకాలు వేసేవారో...!

నవ్వొచ్చింది. నేనైతే నా కలల్లో ఎన్నోసార్లు ఈ పెద్దమనిషి మీసాల్ని నిరాటంకంగా ముళ్ళు వేసేసేవాణ్ణి. పాపం చిన్నప్పుడు నాన్న సాధించలేని ఘనకార్యం అది.

ఆలోచనల్లోంచి బయటపడి నర్సింహం తాత ప్రశ్నలకి సమాధానాలివ్వడం మొదలెట్టాను. మాట్లాడుతున్నంత సేపూ ఆయన కళ్ళలో ఏదో అంతుపట్టని ప్రశ్న కదులుతున్నట్లే తోచింది.

ఆ పెద్దాయన ఓ ఎత్తు అరుగుల ఇంటి ముందు ఆగాడు. మరోసారి ఉలిక్కిపడ్డాను.

ఆ ఎత్తు అరుగుల ఇల్లు నానమ్మదే కదూ. నాన్న ఎప్పుడో అమ్మకి చెప్పారట. కరణంగారి ఇల్లు ఊళ్ళో అన్ని ఇళ్ళకంటే ఎత్తు అరుగులతో కట్టిన డాబా ఇల్లని.

అదిగో, ఆ అరుగులు దాటి లోపల మండువాలో కన్పిస్తూనే ఉంది ఉయ్యాల బల్ల. చాలా పెద్దది. గట్టి గొలుసులతో, చిన్ని గజ్జెలతో ముద్దుగా ఉందది. ఇదే నాన్న పుట్టిన ఇల్లు. ఇదే ఇదే! సందేహం లేదు.

తలెత్తి నా ముందు నిలబడిన ఆ వృద్ధుణ్ణి చూశాను. అవును! ఈయనే తాతయ్య. నా భావాల్ని చదువుతున్నంత నిశితంగా నా లోపలికి అలా చూస్తున్నాడేమిటీయన?

అమ్మ నాకు పది పన్నెండేళ్ళ వయసులో చెబుతూండేది. తాతయ్యకు నాన్న ఒక్కడే సంతానం అనీ నాన్న ఏనాడైతే స్వతంత్రించి అమ్మను పెళ్ళి చేసుకున్నాడో ఆ క్షణం నుండి తండ్రి కొడుకుల మధ్య ఎలాంటి సంబంధాలు మిగల్లేదనీ. అలాంటి పరిస్థితికి తనే కారణం అని అమ్మ లోలోపల మధన పడుతూండేది.

నాకు ఆశ్చర్యం వేస్తుంది. అమ్మ అనాథలా పుట్టడం ఆమె తప్పా? కులం, గోత్రం అంటూ తెలియని ఆమెను పెళ్లి చేసుకున్న కారణంగా ఆ క్రొత్త జంటను ఊరి పొలిమేరల్లోనే వెనక్కి తరిమేసిన తాతయ్య మనసు నా కస్సలు జీర్ణం కాలేదు.

తాతయ్య అమితంగా ప్రేమించేది ఒక్కగానొక్క కొడుకుని! మరి?

గబుక్కున నడిచి ఆ అరుగుమీద కూర్చుండి పోయాను. ఆ అరుగు మీద స్తంభాలు! వీటిని అల్లుకునేనా నాన్న ఆటలాడి, పరుగులు తీసేవాడు!

'ఇదిగో, కాస్త కాఫీ పట్రా" అంటూ ఆయన లోపలికి దారి తీశారు. నా పరిస్థితి నాకే అర్థంకానట్లుంది. పెదవి కదపలేను.

భరించలేని ఉద్వేగంతో శరీరం నా పట్టు కోల్పోయిందేమో అన్పిస్తోంది.

"లోపలికి రా బాబూ" – ఆ వృద్ధురాలు, అదే నానమ్మ నన్ను పిలుస్తోంది.

"ఏమమ్మా వీణ్ణి అప్పుడే ఊళ్ళోకి వెళ్లనిచ్చేవేం? సుస్తీపడి నీరసంతో ఉన్నాడు. కాని ఆ నడక, ఆ ఠీవి మాత్రం ఏమీ మారలేదు సుమా. దూరాన్నుంచే పసిగట్టేను వీణ్ణి, వీడి నడకనీను" మిత్రుణ్ణి మెచ్చుకోలుగా అన్నాడు నర్సింహం తాత.

ఎంచక్కగా చెప్పేడు! అమ్మ నా నడకని ఎప్పుడూ మురిపెంగా చూస్తూంటుంది, ఎంత ఠీవిగా, నడుస్తాడు నా బాబు అంటూ.

నాన్న ఎప్పుడూ చెబుతూంటాడట నా నడక, ఆ నిలబడే తీరు అన్నీ అచ్చం తాత పోలికలే అని. అమ్మ ఎన్నిసార్లు చెప్పిందని!

నన్ను నేను కూడతీసుకుని లోపలికి నడిచాను.

అమ్మ చెబుతూంటుంది – నాన్నని నానమ్మ ఎంత అపురూపంగా పెంచుకొచ్చిందీ! కొడుకు దుడుకుతనాన్ని, ఊళ్ళో సృష్టించుకొచ్చేతగవుల్ని ఎంతో ఓర్పుగా తీర్చేదట.

కొడుకు చదువుకోవాలి, బాగా చదువు కోవాలి. ఆ ఆశే కన్న ప్రేమని ప్రక్కకి పెట్టి చదువు పేరుతో దూరాలు పెరిగినా మౌనంగా ఏడ్చేదట. కొడుకును చూడాలన్న ఆశ ఎప్పుడంటే అప్పుడు తీరేది కాదు. ఏడ్చిఏడ్చి కంట్లో పువ్వులు ఏర్పడ్డాయట!

ఆ బాధనంతా శెలవులకి పరుగెత్తుకొచ్చి పసిపిల్లాడిలా తనను చుట్టుకునే కొడుకుని చూసి ఇట్టే మర్చిపోయేదట. హాస్టల్ చదువుకెళ్తూ తల్లి ప్రక్కన లేకపోతే నిద్ర పట్టని నాన్న నానమ్మ చీరెని పెట్టెలో ముందుగా సర్దుకునే వాడట. వీధి గుమ్మంలో కొడుకుని బండెక్కించి నానమ్మ గుండెలవిసేలా ఏడ్చేదట.

హాస్టల్‌లో ఉన్నన్నేళ్ళూ 'చీరె గోపాలం' అంటూ నాన్నని ఎంత ఎగతాళి చేసినా మౌనంగా భరించేవాడట... పిచ్చినాన్న!

ఆ చీరె చెరగులో ముఖం దాచుకుని నానమ్మ 'నాన్నా గోపీ', 'గోపన్నా' అంటూ పిలిచినట్లే భావించుకుని బెంగబెంగగా నిద్రపోయేవాడట నాన్న.

ఎన్ని జ్ఞాపకాలని! ఇవ్వన్నీ అమ్మతో నాన్న చెప్పుకుంటాడంటే తనకి నమ్మబుద్ధికాదు. ఎంతెంత పట్టింపులున్నా గుండెలో మమకారం ఎక్కడికి పోతుంది?

ఉయ్యాల బల్ల మీద కూర్చోబోయాను. నాకెంతో పరిచితం అయిన చోటది.

‘ఆగు’ ఆ గొంతులో కాఠిన్యం నన్ను తికమక పెట్టింది.

“ఆ పిల్లవాడికేం తెల్సు ఆ బల్ల మీద కూర్చోకూడదని. ఇటు కూర్చోబాబూ... ఇంద... కాఫీ తీసుకో”

గ్లాసందుకుని విచిత్రంగా ఆయన వైపు చూస్తూ కూర్చున్నాను. ఆయన గంభీరంగా తనలో తను ఒదిగిపోయినట్లు  కూర్చున్నాడు.

ఆ ఉయ్యాల బల్ల మీద తానెన్నిసార్లు ఎక్కి ఆడేడని తన కలల్లో! ఇప్పుడీయన అభ్యంతరం చెబుతున్నాడు.

నానమ్మ గొంతు సన్నగా గొణుగుతున్నట్లు విన్పిస్తోంది.

“కడుపున పుట్టిన ఒక్కగానొక్క కొడుకుని దూరం చేసుకున్నారు. వాడు పెరిగిన ఆ ఉయ్యాల బల్లమీద ఎవ్వరూ కూర్చోరాదని నిషేదం పెట్టారు. ఏమిటో ఈ మనిషీ!”

నాకు కాఫీ సహించలేదు.

“సూరి మామయ్యా” అంటూ ఓ మధ్య వయస్కురాలు ఇంట్లోకి వచ్చింది.

“మామయ్యా! నా బొంబాయి ప్రయాణం ఈ రాత్రికే. అదే నీతో చెప్పి వెళదామని...” అంటూ ఏదో చెప్పాలన్నట్లు చూసిందావిడ క్రొత్తవాడి నక్కడున్నానని నన్నోసారి పరకాయించి చూసింది.

మనసు  చెదిరిన వాడిలా చురుక్కున చూశాడు తాతయ్య ఆమె వైపు.

‘నువ్వు కోపం తెచ్చుకోకూడదు మరి. మన గోపాలం అడ్రస్సుంటే ఇస్తావేమో...”

ఆమె మాటలు పూర్తికాకుండానే ఆయన లేచి బయటకు వెళ్లిపోయాడు. ఆ వెనుకే నర్సింహం తాతాను.

“అత్తా చూశావా?” అందామె వృద్ధురాలితో ఫిర్యాదు చేస్తున్నట్లు.

“ఏం చెప్పమంటావే వసంతమ్మా! ఒంట్లో కాస్త నలత చేసిందంటే వాణ్ణి కలవరిస్తారు. ఆ భ్రమ కొద్దీ ఆ చెరువు గట్టున కూర్చుంటారు.  లేకపోతే ఆ అరుగు పట్టుకు కూర్చుంటారు. పోనీ పిల్లాణ్ణి చూసొద్దాం అంటే వినరమ్మా. వాడి ఆచూకీ ఆ మాత్రం పట్టుకోలేకపోతామా? నేనేం చెయ్యను” నానమ్మ కన్నీరు పెట్టుకుంటోంది.

వసంతన్న ఆమె ఓదారుస్తోంది.

“లేదులే అత్తా, బాధపడకు. ఇన్నేళ్లయినా ఇంత పట్టింపు ఉంటుందనుకోలేదు. అందుకే అడిగాను. గోపాలం అయినా ఒక్కసారి పంతం వదిలి వచ్చి వెళ్లచ్చు. వాడికి వాడూ అలాగే ఉన్నాడు. చిన్నప్పటి మొండితనం అలాగే ఉంది. ఎలాగూ వెళ్తున్నాను, మా చిన్నమ్మాయిని కాపురానికి తీసుకెళ్ళి బొంబాయిలో దింపి, వాడ్ని చూసొద్దామనుకుని ఆశపడ్డాను, పోనీలే”

"చూసిరావే అమ్మా... నా కళ్ళతో చూసిరా. ఈ వెర్రి అమ్మని జ్ఞాపకం పెట్టుకున్నాడో లేదో చూసిరావే. అమ్మా నాన్న బతికే ఉన్నాం అని చెప్పిరావే వసంతమ్మా! నా గోపన్న నన్ను చూసేందుకు వస్తాడమ్మా. ఏదో నాడు వస్తాడు"

నానమ్మ దుఃఖం చూడలేక చటుక్కున లేచి బయటకు నడిచాను. ఆ వృద్ధులిద్దరూ ఎవరి లోకంగా వాళ్ళున్నారు. నేనేమవుతాను వాళ్లకి?

అరుగు దిగుతూంటే అప్రయత్నంగా 'అమ్మా' అన్న కేక నోటి నుండి వచ్చింది. బొటన వేలు చిట్లి చివ్వున రక్తం కారింది. గోరు మధ్యకి తెగిపోయింది. గుండెలో గడ్డ కట్టిన దుఃఖం కన్నీరై ఉరికేసేలా ఉంది. "ఏమైందం'టున్న ప్రశ్నకి జవాబు చెప్పకుండానే ముందుకు నడిచాను. 'ఏమవుతారు బాబూ సూర్యనారాయణ గారికి?" ఎదురుగా ప్రశ్న విప్పించుకోనట్లే నడుస్తున్నాను.

❖❖❖

రాజమండ్రి స్టేషన్‌లో రిజర్వేషన్ ఛార్ట్ చూసుకుని బోగీలోకి ఎక్కారు నా మిత్ర బృందం అంతా. ఎదురు సీట్లో పరిచయం ఉన్న ముఖంలా కన్పిస్తే మరోసారి ఆమె వంక చూశాను.

ప్రొద్దున్న తాతయ్య ఇంట చూసిన వసంతన్న ఆమె. అవును! ఆ పేరు నాకు బాగా పరిచయం ఉన్నదే అనుకున్నాను. ఈవిడ పెళ్ళి చూపుల ప్రహసనమే కదూ నాన్నకి నానమ్మ దెబ్బలు తగిలేలా చేసింది.

అప్రయత్నంగా నవ్వొచ్చి ముఖం ప్రక్కకు తిప్పుకున్నాను.

"నీ గురించి ఇందాకటి నుండి స్టేషనంతా గాలిస్తున్నాను బాబూ" వసంతమ్మగారి మాటలకి కుతూహలంగా చూశాను.

"పొద్దున్న మా మామయ్య ఇంట చూశావుగా. జ్ఞాపకం వచ్చానా? మా మామయ్య చెప్పాడులే నువ్వు ఈ రైలుకే వెళ్తున్నావని. నీ కైతే మా గోపాలం అడ్రస్ బాగా తెలుస్తుందన్నాడు"

ఏ మాత్రం కొత్త లేకుండా ఆమె అలా మాట్లాడుతుంటే ఆమె వెనుక తాతయ్య ప్రోత్సాహం నా కర్థం అయింది.

ఏమిటి? వాళ్ళ గోపాలం అడ్రసు నాకు బాగా తెల్సునటా? అంటే తాతయ్య నన్ను గుర్తుపట్టాడా? అయినా అంత బింకంగా ఎలా ఉన్నాడు? నేను మాత్రం లేనూ? ప్చ్!

తన ముఖంలో భావాల్ని పట్టించుకోకుండా వసంతాంటీ తన ధోరణిలో చెప్పుకు పోతోంది.

"బొంబాయిలో దిగాక మా అల్లుణ్ణి పరిచయం చేస్తాను. అడ్రస్ ఇస్తావు కదూ"

అంటూ ఆవిడ నిద్రకుపక్రమించింది.

ప్రయాణం, పెళ్ళి బడలికకి మిత్రులంతా నిద్రలోకి జారిపోయారు.

తాతయ్య ఎంత గడుసువాడు? అన్యాపదేశంగా తన బాధ్యతేమిటో తెలియజేశాడు. నాన్నని రెండు భుజాలమీద ఎక్కించుకునైనా తీసుకొస్తాడు తను. తాతకు వారసుడు మరి!

ఇన్ని ఆలోచనలు, ఇంత థ్రిల్ అమ్మతో ఎప్పుడెప్పుడు పంచుకుందామా అన్న ఆరాటంలో నిద్ర మాటే మర్చిపోయాను.

❖❖❖

అక్కడ పల్లెలో తాతయ్య మాత్రం నిద్రపోయాడా? ఉహు... నర్సింహం తాతతో అరుగు మీద కూర్చుని ప్రొద్దున్న తాను చెరువు గట్టున తన మనవణ్ణి ఆ నడక తీరు చూసి పోలికని ఎలా ఆనవాలు పట్టాడో చెబుతున్నాడు.

"ఒరేయ్ నర్సింహా! ఆ పిల్లవాడు, అదేరా నా మనవడు నన్ను చూసేందుకు తనంత తానుగా వచ్చేడో, యధాలాపంగా వచ్చేడో, వాళ్ల నాన్నతో ఒప్పందం చేసుకు వచ్చేడో వాడూ బయటపడలేదు. నేనెందుకు బయట పడాలి? నా సందేశం సరిగా పట్టుకుంటే నా కొడుకుని నా కళ్ల ముందుకు తెస్తాడురా వాడు. ఏరా! నేను చేసింది రైటేనంటావా కాదా?" అంటూ చెబుతూనే బావురుమన్నాడు.

❖❖❖

అమ్మ మేలుకొలుపు వింటూనే, "అమ్మా! రాత్రి కలలో తాతయ్యని, నానమ్మని చూసొచ్చానమ్మా. తాతయ్య నన్ను పోల్చుకున్నాడు కూడా" అంటూ హుషారుగా అమ్మ వైపు ఒత్తిగిల బోయాను.

కప్పుకున్న దుప్పటి అంచు తగిలి కాలి బొటనవ్రేలు చురుక్కున మండింది. అప్రయత్నంగా లేచి కూర్చుని కాలివంక చూస్తే గోరు తెగిన బొటనవ్రేలు కట్టు ఊడి గాయం పచ్చిగా కన్పించింది.

అయోమయంగా అమ్మ వైపు చూశాను. అమ్మ మాత్రం అన్నీ తెల్సునన్నట్లు నవ్వుతోంది.

**('రచన' ఫిబ్రవరి 1997)**

# సరిపడని సూత్రాలు

పురుషుడికుండే అవకాశాలతో పోల్చడానికి వీల్లేకపోయినా, స్త్రీ ఇప్పుడు అన్ని రంగాలలో ప్రవేశించి ప్రతిభను చూపుతోంది. అయితే, పురుషుడికి ప్రతిబంధకం కాని పెళ్ళి స్త్రీకి ఎందుకవుతున్నట్టు? ఈ 'మూడుముళ్ళు' స్త్రీకి విముక్తినిచ్చేదెప్పుడు?

విశాఖ ప్లాట్‌ఫారమంతా హడావుడిగా వుంది. గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి వున్న గ్లామర్ ఆ స్టేషన్లో అంతా ఇంతా కాదు. చిన్నప్పటి నుండి తను చూస్తూనే వుంది. ఎప్పటికప్పుడు అక్కడేదో అద్భుతం చూడబోతున్నట్టు ఆత్రంగా, ఆశగా జనం చుట్టుముట్టి వుంటారు.

ముఖ్యంగా ఉత్సాహంతో ఉరుకులెత్తే యువతనీ, ఆ చైతన్యాన్నీ చూస్తే మనసు తెలియని ఆనందంతోఉరకలు వేస్తుంది. విండోలోంచి బయటకి చూస్తున్నాను. బుక్ స్టాల్ దగ్గర నిలబడిన ఓ ఇరవైయేళ్ళ సల్వార్ కమీజు చేతిలోని పుస్తకాన్ని పరిశీలిస్తూనే మధ్యమధ్య ఎవరి కోసమో అన్నట్లు చూస్తోంది. ఏ వ్యాపకం లేక షికారుగా వచ్చిన కుర్రకారంతా ఎక్కడికక్కడ తెగ సందడి పోగేస్తున్నారు. ఎన్నెన్నో ముఖాలు. అన్నీ పరిచయమున్నట్లే అన్పిస్తూ వుంటాయి. విశాఖతో నా అనుబంధం ఎన్నేళ్ళది! ట్రాన్స్‌ఫర్ దృష్ట్యా నాలుగేళ్ళు దూరమైనా మళ్ళీ అవే పరిసరాలు, పాత జ్ఞాపకాల మధ్య మళ్ళీ రెండేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. ఇంకో మజిలీ ఇక పైన....

సిగ్నల్ ఇచ్చినట్టుంది. రైలు కదిలింది. మళ్ళీ ఎప్పటికో ఈ విశాఖ గాలులు? ప్లాట్‌ఫారం మీద మిగిలిపోయిన వీడ్కోలు వదనాలు, గాలిలోకి లేచిన చేతులు. అప్పటిదాకా అక్కడక్కడే పరిమళించిన సంపెంగలు వేగం అందుకుంటున్న రైలుతో పాటు కొంతదూరం ప్రయాణం చేసి వచ్చాయి. చేతిలో వీక్లీ తెరువబోయి ఒక్కసారి కంపార్ట్‌మెంటంతా చూశాను. చుట్టూ హడావుడి పరుచుకుని వాళ్ళంతా. ఏ కదలికా లేని నిశ్చలన చిత్రంలా నేను! క్రొత్తగా పెళ్ళైన జంట కాబోలు ఆ కిటికీ వారగా. అతనేదో ఉత్సాహంగా చెబుతున్నాడు. ఆమె అతనివైపే ఆరాధనగా చూస్తూ మధ్యమధ్య క్రొత్తదనం వదలని సిగ్గుతో కళ్ళు వాల్చుకుంటోంది. ఆమె పొడవాటి నాసిక మీద మెరుస్తున్న చిరుచెమటని యథాలాపంగా తన వ్రేళ్ల కొసలతో తాకబోయి అతను చటుక్కున సర్దుకుని కూర్చున్నాడు. అప్రయత్నంగా నా కంట పడిన దృశ్యం. చూపులు తిప్పుకుని చేతిలో వీక్లీ  పేజీలు తిరగేస్తున్నాను. వివాహం అనేది ఇద్దర్నీ ఇంత సన్నిహితుల్ని, ఆత్మీయుల్ని చేస్తుందా? తన కెందుకీ వ్యవస్థ మీద నమ్మకం కలగడంలేదు?  నా ప్రమేయం లేకుండానే నా మనసు ఎన్నేళ్ళ క్రితమో జరిగిన ఆ సంఘటనవైపు మళ్ళింది.

ఆ రోజు బాంక్ ఇంటర్వ్యూకి వెళ్ళేందుకు తను హడావుడి పడుతూ తయారవుతోంది. అమ్మ తన గదిలోకి వచ్చింది.

“జయా! నాన్నగారేం చెబుతున్నారో  విన్నావు కదా. ఇంకో నెల రోజులు కూడా లేదు, పెళ్లి ముహూర్తం. పెళ్ళి అనగానే ఎటూ అతనితో వెళ్ళిపోయేదానివే. ఇప్పుడీ ఉ ద్యోగం వచ్చినా దీనికోసం నువ్విక్కడ వుంటావా, ఏమన్నానా?”

విసుగ్గా చూసింది తను. పెళ్ళి, పెళ్లి! డిగ్రీ పరీక్షలై హాయిగా ఊపిరి కూడా పీల్చుకోలేదు. సరదాగా రాసిన బాంక్ పరీక్ష ఇంటర్వ్యూ వరకూ వచ్చింది. తన తొలి విజయం. భూమిమీద తన కాలు నిలపడం లేదు. ఇంతలో ఈ పెళ్ళి ప్రపోజల్. అతను ఎయిర్ ఫోర్స్‌లో చేస్తున్నాడు. తనను చూసి అంగీకారం తెలిపాడు. ఒక్కగానొక్క కూతుర్ని అంతంత దూరాలు పంపాలని ఓ ప్రక్క బెంగ వున్నా, మంచి హోదాలో వున్న అల్లుడు దొరకడంతో అమ్మ నాన్న పొంగిపోయారు.

“అమ్మా! ప్లీజ్, నన్ను అర్థం చేసుకోండి. నా సంతోషం కోసం అయినా ఈ ఇంటర్వ్యూకి వెళ్లనివ్వండి” చెప్పిందే చెప్పాల్సి రావడంతో నాలో అసహనం. పెళ్ళి పట్ల ఇంకా ఓ అభిప్రాయం, అభిరుచి లేని తనకు అదొక తలనొప్పిగా అన్పించింది.

పెళ్ళి వారం రోజులుందనగా ఆ పెళ్ళి కొడుకు తండ్రి హార్ట్ ఎటాక్‌తో కాస్త అనారోగ్యం పాలవడం, వాళ్ళు దాన్ని అశుభంగా భావించి పెళ్ళి డ్రాప్ చేసుకోవడం, తను అపాయింట్

మెంట్ ఆర్డరు అందుకుని జాబ్‌లో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి. తనకు పెళ్ళి పట్ల విముఖత కలగడం, అమ్మానాన్నలు దిగులుతో ...ఓహ్!

"కొంచెం సర్దుకుంటారా?" అన్న గొంతు విని తలెత్తి చూశాను.

'ఈమె ఎవరో బాగా తెలుసున్న ముఖంలా వుందే' అనుకుంటూ జరిగి కాస్త చోటిచ్చాను. ఆమె కూడా నా వైపు ఒకటికి రెండుసార్లు చూస్తున్నట్లనిపించి తల తిప్పి మరోసారి జ్ఞాపకం చేసుకుందుకు ప్రయత్నించాను. ఇన్నేళ్ళుగా ఈ ఊరితో జీవితం ముడిపడి వుండడంతో ఎన్ని ముఖాలని... స్పష్టాస్పష్టంగా... స్కూల్ డేస్ నుండీ గతం అంతా కదిలి కళ్ళ ముందుకొస్తూంది...ఆ...జ్ఞాపకం వచ్చింది. ఈ అమ్మాయి పద్మావతి కదూ. తమ ఇంటి సమీపంలో పాతబడిన పెంకుటిల్లు! ఆ ఇంటి ముందు నుండి వెళ్ళుతున్నప్పుడల్లా ఇంటివసారాలోని కుట్టుమిషన్ టకటకలు...అవును బాగా జ్ఞాపకం వచ్చింది. తన బ్లౌజులన్నీ ఈ అమ్మాయేగా కుట్టి తెచ్చేది. చాలా మారింది. వయసుతోపాటు కాస్త గంభీరంగా తయారైంది. అప్పటి నాజూకుతనం లేదు. నన్ను గుర్తు పట్టిందో లేదో!

"మీరు పద్మావతి కదూ" నేనే పలకరించాను.

ఆమె ముఖంలో ఆనందవీచిక అరక్షణంపాటు. తన ఉనికిని ఎవరో జ్ఞప్తిలో వుంచుకుని పలకరించడం ఆనందమే కదూ.

"నన్ను గుర్తు పట్టలేదేమో మీరు. దొండపర్తిలో వుండేవాళ్ళం మీ ఇంటి దగ్గరలోనే"

ఆ అమ్మాయి గుర్తుతెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. నేను బాగా మారిపోయానా? ఏమో!

"మీరు జయశ్రీగారు కదూ, మేడ మీద వుండేవారు" నా కళ్ళు చెమక్కుమనడం ఆమెకు కన్పించే వుండాలి.

"మీ అమ్మగారూ, నాన్నగారూ బావున్నారా? ఇప్పుడెక్కడుంటున్నావు నువ్వు?" పూర్వపు చనువుతోనే అడిగాను.

"నాన్న పోయి చాలా కాలమైంది. అమ్మా, నేనూ ఆ ఇంట్లోనే వుంటున్నాం" గొంతులో కొంచెం విషాదం ధ్వనించింది.

"మీ తమ్ముడుండేవాడు కదూ. చదువు పూర్తయి ఏదైనా ఉద్యోగం చేస్తున్నాడా?"

"లేదండీ. వాడు ఇంకా సెటిలవలేదు. వాడి గురించే మా మామయ్యతో మాట్లాడాలని బయల్దేరాను"

"నువ్వు ఏం చేస్తున్నావ్?"

ఆమె నుండి వెంటనే సమాధానం ఏమీ రాలేదు. మౌనంగా వుండిపోయింది. అడక్కుండా వుండాల్సిందేమో ఈ ప్రశ్న.

"మీరు విశాఖ ఎప్పుడొచ్చారు?" నా గిల్టీ ఫీలింగ్‌ని పోగొడుతూ పద్మావతి సంభాషణ మార్చింది.

"రెండేళ్ళుగా నేను ఇక్కడే వుంటున్నాను. ఇప్పుడు ట్రాన్స్‌ఫర్ మీద హైదరాబాదు వెళ్తున్నాను"

"అవునా" ఆశ్చర్యంగా చూసింది. రెండేళ్ళుగా ఎక్కడా తటస్థపడలేదు ఈ నగర జీవితంలో.

ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఆమే అంది.

"మీరు ఆనాడు చెప్పినట్లు లోన్ తీసుకుని వుంటే బావుండేది"

ఆ సంఘటన నాకూ బాగా గుర్తుండిపోయింది. తను ఓ రోజు అంది – "పద్మా! నువ్వు బాంక్‌లోన్ తీసుకుని ఓ నాలుగు మిషన్లు కొనుక్కుని నలుగురు మనుషుల్ని పెట్టుకుని చెయ్యవచ్చు కదా!"

పద్మావతి ఏం మాట్లాలేదు. ఆమె ముఖం కాస్త కందినట్లయింది.

దాదాపు తన వయస్సే వుండవచ్చేమో. తన కంటే రెండు మూడేళ్ళు చిన్నపిల్లే కావచ్చు. ఆమె మనోభావం తనకర్థం కాక చూస్తుండిపోయింది. "లేదండీ, నేను... నాకు పెళ్ళిచేసి పంపేస్తారు ఎటూ. అప్పటిదాకా ఊరికే కాలక్షేపానికి...నాకా మిషన్ చాలు" ఆ తర్వాత నన్ను అర్థం చేసుకోవమన్నట్లు ఆగిపోయింది. తనకప్పుడనిపించింది, యుక్త వయస్సు వచ్చిన ఆడపిల్ల మనసునీ విధంగానే మలుస్తూ వస్తోంది మన సమాజం. తను అంతకంటే ఇంకేం చెయ్యనక్కర్లేదని అమాయకంగా నమ్ముతోంది. ప్చ్!...

అమ్మమ్మల, అమ్మల నాటి రోజులు దాటి కాలం ముందుకు జరుగుతూ పోతూ వున్నా సమాజంలో కొన్ని అలవాట్లు రీతి రివాజులు ఎక్కడివక్కడే యథాతథంగా వున్నాయి. అమ్మమ్మ స్కూల్ చదువే ఎరగదు. అమ్మ ఎలిమెంటరీ స్కూలు దాటి హైస్కూల్ వరకు వస్తూనే ఆగిపోవలసి వచ్చింది. తమతరంలో చదువుకుందుకు ఎలాటి అవరోధాలు లేవు. స్థోమతను బట్టి చదువులు. ఆడపిల్ల అయినా మగపిల్ల వాడైనా చదివించాల్సిందే. బ్రతుకు తెరువులు వెతుక్కోవలసిందే. కాని పెళ్ళి ఆడపిల్ల జీవితాన్ని ప్రభావితం చేస్తూనే వుంది. జీవితం సాఫీగా సాగాలంటే అది తాళి కట్టిన భర్త చేతిలో వుంది. ఆడపిల్ల పెళ్ళి ఈ చదువులతో, ఉద్యోగాలతో మరింత జటిలమై, మరిన్ని సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తోందెందుకు? జీవితంలో వ్యక్తి గతంగా ఎంత రాణించినా పెళ్ళి, దాని పర్యవసానాలు

ఆమె జీవితాన్ని నియంత్రిస్తున్నాయి.

పద్మావతిని ఎప్పుడో పదేళ్ళ క్రితం లోను తీసుకుని తన కాళ్ల మీద తనను నిలబడమని ప్రోత్సహించినా కేవలం పెళ్ళి ప్రస్తావనతో ఆమె ముందడుగు వెయ్యక నిలబడిపోయింది. అదే జీవితానికి తుది మలుపు అన్నంత పిచ్చి భ్రమతో ఎన్నేళ్ళు వృథా పుచ్చింది! ఈ పాటికి తనని తాను పోషించుకోవడమే కాక ఇంకో పదిమందికి ఆశ్రయం ఇవ్వగల్గేదే కదా, ఎంత పురోగమించాం అనుకున్నా ఆడపిల్ల జీవితానికి సమాజం నిర్ణయించిన సూత్రాలు ఏ మాత్రం మారలేదు.

కృత్రిమ విలువలకు పాకులాడే ఈ నాటి సమాజంలో ఆడపిల్ల జీవితాన్ని నిర్దేశించి, తీర్చిదిద్దే విలువ నిజంగానే పెళ్ళికి ఏమాత్రం వుందని?

**('ఆంధ్రజ్యోతి' వీక్లీ 'ఈ వారం కథ' – ఫిబ్రవరి 14, 1992)**

**1993లో శ్రీ ఎ.కె. ప్రభాకర్ సంకలనంగా తెచ్చిన**

**'స్త్రీవాద కథలు' పుస్తకంలో చోటు చేసుకుంది.**

# తీర్పు

దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను. ఏం జరిగిందసలు? నిజంగా జరిగిందా? లేక ఇదంతా ఒట్టి పీడకలేనా? పీడకలైతే ఎంత బావుణ్ణు! ఆ సంఘటన జరిగి ఇరవై నాలుగు గంటలవుతోంది. కాని వాస్తవాన్ని జీర్ణించుకోవడం సాధ్యం కావడం లేదు.

తెలివి ఉందో లేదో తెలియని స్థితి. కళ్ళు తెరిచి చూస్తే అదే సంఘటన కళ్ళముందు. భయంతో కళ్ళు గట్టిగా మూసుకున్నా అదే, అదే! ఏడ్పు వస్తూంది.

నవ్వుతూ, తుళ్ళుతూ స్టూడెంట్స్ మధ్య నేనూ ఓ స్టూడెంట్‌లాగా గడిపేశానిక్కడ. హాస్టల్‌లో ఉన్న రెండు వందల స్టూడెంట్స్‌లో ఎవరికేం తగువొచ్చినా, ఏ సందేహం వచ్చినా, ఏ బాధ కలిగినా నేను పరిష్కరించాల్సిందే. వాళ్ళ అల్లరి భరించలేక విసుక్కుంటే తల్లి వెంట తిరిగే పసిపిల్లల్లా కాళ్లకి, చేతులకి అడ్డుపడి మరింత దగ్గరయ్యేవారు.

క్లాసెస్ అయ్యాక సాయంత్రం లీజర్‌నీ నాతోనే. నాకంటూ సమయం దొరకడం లేదని ఉక్రోషం వచ్చినా, నిస్సహాయురాల్ని అయ్యేదాన్ని వాళ్ళతో కల్సి నవ్వాలి. పాడాలి. అల్లరి చెయ్యాలి. కబుర్లు చెప్పాలి. ఈ పిల్లలంతా నా వాళ్ళేనని గర్వంగా ఉండేది.

అరవింద అందరిలోకీ నా కంటికి మరీ పసిపిల్లలా,

అమాయకంగా కనిపించేది. ఆ వయసుకు సహజమైన ఉత్సాహం, అల్లరి లేక ఉదాసీనంగా కన్పించేది. హోమ్ సిక్‌నెస్ కాబోలు!

అప్పుడే స్కూలింగ్ ముగించుకుని పై చదువుల కోసం ఇంటినీ, అమ్మానాన్నల్ని వదిలి వచ్చారని నా కెంతో బెంగగా అనిపించేది.

హోమ్‌సిక్ హాలిడేస్ ముగించుకుని పిల్లలంతా బెంగ వదుల్చుకుంటూ చదువుల్లోకి మళ్ళుతున్నారు.

అరవిందను గమనిస్తూండేదాన్ని, డైనింగ్‌హాల్లో, ప్లే గ్రౌండ్‌లో, స్టడీ అవర్స్‌లో లైబ్రరీలో ఎక్కడా ఎవ్వరితోనూ కలిసేది కాదు. ఆమె ఒంటరితనం వదిల్చేందుకు నేనే వెళ్ళి పలకరిస్తూండేదాన్ని, ముందు ముభావంగా ఉన్నా క్రమంగా చిర్నవ్వు అలవాటు చేసుకుంది. మార్కులు బాగా వస్తుండేవి. కాని ఫస్టు మార్కులొచ్చినా మిగిలిన పిల్లల్లా కేరింతలు కొట్టేది కాదు.

లీజర్‌టైమ్‌లో పిల్లలంతా క్రికెట్, సినిమాస్టార్‌ల గురించిన గాసిప్ పోగేస్తుంటే అరవింద మాత్రం దూరంగా ఉండేది.

ఆ వయసుకామె ప్రవర్తన అసహజంగా కన్పించేది. మనస్తత్వం అని సరిపెట్టుకోలేక పోయేదాన్ని. సాధ్యమైనంతగా నా సమయాన్ని అరవింద చుట్టూనో, ఆమె గురించిన ఆలోచనలతోనో గడపడం నాకే వింతగా ఉండేది. ఎందుకో జవాబు దొరికేది కాదు. జాలి అనుకుంటే అది ఎందుకో అర్థం కాదు. ప్రేమ అనుకుంటే...నిజమే,అందర్నీ ఇష్టపడినా ఈ అమ్మాయి మిగతా పిల్లల్లోని గడుసుదనం ఎరగనిదే, ఎలా బ్రతుకుతుందో అన్పించేది. నేను మరీ ఎక్కువ ఆలోచిస్తున్నానేమో!

ఆ రోజు డైనింగ్ హాల్లో సంఘటన నా కంట పడింది. రాబోయే ఆదివారం 'ఫ్రీ సండే' కనుక ఎవరి పేరెంట్స్ వస్తారో, ఎవరెవరు ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నారో కబుర్లు దొర్లుతున్నాయి.

"అరవిందా! మీ పేరెంట్స్ ఎప్పుడూ రారేంటి? నీకు చూడాలని ఉండదా?"

ఎప్పటిలాగే అరవింద నోరిప్పలేదు.

ఎవరో సమాధానం చెబుతున్నారు.

"తన పేరెంట్స్ డాక్టర్స్...బిజీ ప్రాక్టీస్...అది వదులుకుని ఏం వస్తారు?"

"అయితే అరవింద డాక్టర్ అవ్వాల్సిందే".

"వాళ్ళ అమ్మాయిని చూసేందుక్కూడా తీరిక లేదా పాపం?" వాళ్ళందరికి ముఖాల్లో నవ్వులు.

ప్లేటు పుచ్చుకుని బయటకు వెళ్ళిపోయింది అరవింద ఎర్రబడ్డ ముఖంతో. గబుక్కున లేచి వెళ్ళి పిల్లల్ని మందలించాను.

❖❖❖

ఖాళీ సమయం దొరికితే పుస్తకాలు ముందేసుక్కూర్చునేది. లేకపోతే అందమైన బొమ్మలు గీస్తూండేది. జీవకళ ఉట్టి పడేది ఆ బమ్మల్లో. అన్నింటికంటే మదర్ అండ్ చైల్డ్ బొమ్మ అనేక రూపాల్లో గీస్తుండేది అరవింద.

దీపావళికి వారం రోజులు శెలవులొచ్చాయి. పిల్లల ఉత్సాహం చెప్పనలవి కాకుండా ఉంది. అరవిందలో ఎలాంటి ఉత్సాహం లేదు. ఎందుకీ స్తబ్దత ఇంత పసిపిల్లలో?

రంచనుగా శెలవులు ముగించుకుని నేను డ్యూటీలో చేరాను. హాస్టల్‌లో చాలామంది మరోవారం సెలవులు గడిపేందుకు పర్మిషన్ కావాలంటూ రిక్వెస్ట్ లెటర్స్ పంపారు.

ఒక్కోరూమ్‌లో నలుగురుండాల్సింది ఒక్కొక్కరు మాత్రం ఉన్నారు. సెలవులు ముగించుకు వచ్చిన అరవిందని పరిశీలనగా చూశాను. ఉహు, అదే నిర్లిప్తత!

ఆరాత్రి స్టడీఅవర్స్ ముగిశాక కూడా అరవింద గదిలో లైట్ వెలగడం చూసి ఆమె రూమ్ వైపు వెళ్ళాను. సన్నగా ఏడుస్తున్న ధ్వని ఆ నిశ్శబ్దంలో.

రూమ్ తలుపు తట్టి లోపలికెళ్ళి కూర్చున్నాను.

అనునయంగా అడిగాను, ఏమైందంటూ.

"మిస్! నాకు భయంగా ఉంది" అంటూ మళ్ళీ కన్నీళ్ళు నింపుకుంది.

నా మనసు గిలగిలలాడింది.

"చెప్పమ్మా! ఏమైంది నీకు" అనునయంగా అడిగాను.

"ఎవరైనా ఏమైనా అన్నారా?"

సమాధానం లేదు.

వెక్కిళ్ళు అంతకంతకూ ఉధృతమయ్యాయి.

"ఏమైందమ్మా? మమ్మీ డాడీ జ్ఞాపకం వస్తున్నారా? అరవిందా! నాకు చెప్పవూ?"

ఒక్కోమాట కూడబలుక్కుంటూ చెబుతోంది.

తన స్కూలింగ్ అంతా హాస్టల్‌లోనే. తల్లిదండ్రులిద్దరూ విదేశాల్లో ఉండడంతో అమ్మమ్మ దగ్గర పెరిగింది. సెలవులిచ్చినా అమ్మమ్మ, ఆ పల్లె మినహా ఏమీ తెలియదు.

ఈ మధ్యలో అమ్మమ్మ పోవడం, తల్లిదండ్రులు తిరిగి వచ్చి ప్రాక్టీస్‌తో బిజీ అయిపోవడం. వారి మధ్య వచ్చే స్పర్థలూ ఆమెకు ఇల్లంటే ఒక అభద్రతా భావాన్ని కలిగించాయి. తన కోసం అమ్మా నాన్న హాస్టల్‌కి రారు. ఉత్తరాలు రాయరు. తనంటే ఆసక్తే చూపించరు. తను డాక్టర్ అవ్వాలట. పదేపదే అది వింటుంటే తనకి భయం వేస్తోందిట.

"మిస్! నేను డాక్టర్‌ని కాలేను" అంటూంటే దగ్గరకు తీసుకుని వర్రీ కావద్దని బుజ్జగించాను.

❖❖❖

ఆ సంఘటన తర్వాత అరవింద పట్ల మరింత శ్రద్ధ వహించడం మొదలుపెట్టాను. నలుగురితో కలిసి కూర్చునేలా బలవంత పెట్టేదాన్ని, ఆమె ఒంటరితనం పోగొట్టేందుకు ప్రయత్నిస్తూండేదాన్ని.

మొదటి సంవత్సరం పరీక్షలై ఒక్క పది రోజులు అంతా సెలవులకెళ్ళారు. "మిస్! హాలిడేస్‌లో ఇంటికి వెళ్ళాల్సిందేనా?" అరవింద ప్రశ్నకి ఉక్కిరిబిక్కిరిగా అన్పించింది. ఏం చెప్పను?

ప్రొఫెషన్, సంపాదన మినహా మరింకేం పట్టనివాళ్ళకి పిల్లలు మాత్రం ఎందుకు?

రెండో సంవత్సరం మొదలైంది. ఒక ప్రక్క ఎమ్‌సెట్ కోచింగ్, మరో ప్రక్క సీనియర్ ఇంటర్ సిలబస్ పూర్తి చెయ్యడానికి పిల్లలకి చాలా బిజీషెడ్యూల్ ఇచ్చారు. ఇంత పోటీ, టెన్షన్‌ల మధ్య ఈ పిల్లల సహజత్వం ఏమైపోతుందో?!

ఫస్టియర్ మార్కులతో చూస్తే అరవింద చదువులో వెనుకబడుతోందని ముందునుండీ గమనిస్తూనే ఉన్నాను. ప్రతి రోజూ హెచ్చరిస్తూనే ఉన్నా. ఆ హెచ్చరికలు ఆమెనింకా స్తబ్ధంగా చేస్తాయేమోనని బుజ్జగిస్తూండేదాన్ని. అయినా ఎందుకో చాలా డల్‌గా తయారవుతోంది. దేనికీ పెదవి విప్పదు. ఆమె మనసులో ఏముందో?

లోకల్ గార్డియన్ ఆమె ఆంటీ వస్తూండేది ఒక్కోసారి. అయినా అరవిందలోఎలాంటి ఉత్సాహం ఉండేది కాదు.

ఆమె ధోరణికి నాకు భయం వేస్తోంది. ఒక్కసారి ఆమె తల్లిదండ్రుల్ని పిలిపించాలి. ప్రిన్సిపాల్ దగ్గర నా అభిప్రాయం చెప్పాను.

"అనవసరంగా వాళ్ళని ఇంతదూరం రప్పించాలా" అని ఆమె వాదన. మొత్తానికి స్పెషల్ కేస్ క్రింద ఒక్కసారి వచ్చి వెళ్ళమని అరవింద పేరెంట్స్‌కి మెసేజ్ పంపడానికి నిర్ణయానికొచ్చారు కాలేజ్ అథార్టీస్. తృప్తిగా నిద్రపోయానా రాత్రి.

సిలబస్ పూర్తయి ఎమ్‌సెట్ మోడల్‌టెస్ట్ కండక్ట్ చేశారు. మోడల్ టెస్ట్‌లో అర్హత పొందిన వారికే స్పెషల్ కోచింగ్ ఏర్పాటు చేశారు.

లంచ్ టైమ్‌లో డైనింగ్ హాల్లో అరవింద కన్పించలేదు. తన రూమ్‌కి బయల్దేరాను. ఆ రోజు ఎమ్‌సెట్ మోడల్ టెస్ట్ మార్కులిచ్చారని తెలుసు. చదువులో వెనుకబడుతోందని హెచ్చరిస్తున్నా ప్రయోజనం లేకపోయింది. ఆమెకు ఆసక్తి లేకపోయాక ఎందుకీ బాధ అనిపించింది.

‘అరవిందా! భోజనానికి పద”

“ఎమ్‌సెట్ మార్క్స్ ఇచ్చారా? పేపర్ ఇలా తీసుకురా?”

ఏ ఒక్కదానికీ జవాబు లేదు. కళ్ళు తుడుచుకుని భయంగా చూస్తూ కూర్చుంది.

“మిస్! మీకు తెల్సా, ఎమ్‌సెట్‌కి నేను క్వాలిఫై అవలేదు. మమ్మీ డాడీ బాగా కోప్పడతారు” మళ్ళీ మళ్ళీ చెబుతోంది. ఏడుస్తోంది. ఈ పిచ్చిపిల్ల చాలా అప్‌సెట్ అయింది. ఎలా ఓదార్చాలి?

ఆ రాత్రి ఎమ్‌సెట్‌కి క్వాలిఫై అయిన వాళ్ల పేర్లూ, మార్కుల లిస్ట్ చూస్తున్నాను నా రూమ్‌లో. స్టడీ అవర్‌కి ఇంకా టైముంది.

అరవింద గుమ్మంలో నిలబడింది. పిలిచి ప్రక్కన కూర్చోబెట్టుకున్నాను.

మధ్యాహ్నం పడిన బాధ తాలూకు చిహ్నాలు ఆ లేత ముఖంలో స్పష్టంగా కనిపిస్తు న్నాయి. మనసు రంపంతో కోస్తున్నట్టుంది. ఈ పిల్లలతో ఇంత ఎటాచ్‌మెంట్ పెట్టుకోకూడదనుకుంటాను. కాని నా వల్ల కాదే.

లిస్ట్ చూస్తానంటూ తీసుకుంది. ఆ ముఖంలో ఏ భావాలూ లేవు. ఒత్తి నిర్లిప్తత కారిడార్లో పిల్లలేదో గొడవ పడుతున్నారని లేచి బయటకొచ్చాను.

❖❖❖

ఆదివారం కావడంతో వీక్లీ టెస్ట్ ముగించుకుని పిల్లలంతా విజిటర్స్ కోసం చూస్తున్నారు. ఫ్రీ సండే కావడంతో అంతా ఒక్కరొక్కరుగా తమ విజిటర్స్‌తో బయటకు వెళ్తున్నారు. నెమ్మదిగా హాస్టల్ అంతా సందడి కోల్పోయింది.

నా కళ్ళు ఎవరి కోసమో నిరీక్షిస్తున్నాయి. ఒక ప్లెజెంట్ సర్‌ప్రైజ్‌లా అరవిందకి తెలియాలి. తన కోసం అమ్మా నాన్నా వచ్చారంటే ఆ ముఖంలో గర్వంతో కూడిన ఆనందం చూడాలి. తనకే పట్టరాని ఆనందంగా ఉంది.

అరవింద గురించి అన్ని విషయాలు వాళ్ళతో మాట్లాడాలి. రానే వచ్చారు. డైరెక్ట్‌గా ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వెళ్ళిపోయారు. సంభాషణ సీరియస్‌గా సాగుతోంది.

“చదివించుకోగలిగిన తీరికే ఉంటే ఇక్కడెందుకండీ ఉంచడం? చిన్నప్పట్నించీ మెరిట్ స్టూడెంట్. ఇక్కడికొచ్చాక ఇలా తయారైంది. మీరైనా ఒక్కసారి మా దృష్టికి తీసుకురాలేదు”.

నెలనెలా పంపే ప్రోగ్రెస్ కార్డు కూడా వాళ్లు చూస్తున్నట్లే లేదు. ప్రక్కనే ప్రిన్సిపాల్ రూమ్‌లోంచి నాకు స్పష్టంగా వినిపిస్తోంది సంభాషణ.

ఎమ్‌సెట్ మోడల్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన స్టూడెంట్స్ లిస్ట్ కోసం కబురొచ్చింది.

అరవింద కోసం కబురెళ్ళిందో లేదో లేచి వరండాలోకి వచ్చాను. వరండా చివరినుండి తలెత్తి చూస్తే సీనియర్ స్టూడెంట్స్ రూమ్స్ కనిపిస్తున్నాయ. మెట్ల వైపుగా వెళ్లబోతే

అరవింద వస్తూ కనిపించింది.

ఆరాటం అణుచుకోలేక అక్కణ్నుంచే అరిచాను.

"అరవిందా! మమ్మీ డాడీ వచ్చారు. త్వరగా రా"

ఏం విన్నాను? అన్నట్లు ఒక్కక్షణం ఆగి పోయింది.

"వన్ మినిట్ మిస్" అంటూ వెనక్కి తిరిగి పైకి పరుగెత్తింది.

క్షణం నిరుత్సాహపడ్డాను. నేనాశించినట్లు పరుగెత్తుకు రాలేదు. మేడమ్ పిలుస్తున్నా రంటూ బాలు వచ్చాడు.

"రాధికా! అరవింద ఎమ్సెట్‌కి క్వాలిఫై అయింది కదా. లిస్ట్ మొదట్లోనే తన పేరుంది".

ఆవిడ అందించిన లిస్టు అందుకున్నాను అయోమయంగా.

నిజమే! ఆల్ఫబెటికల్ ఆర్డర్‌లో అరవింద పేరే ప్రథమంగా ఉంది. ఇదేమిటి? నిన్నటి అరవింద దుఃఖం...ఆలోచనలు ఒకదాని వెనుక ఒకటిగా.

రాత్రి లిస్ట్ అరవింద చేతికివ్వడం, ఏదో గొడవ అవుతుందని తాను లేచి వెళ్ళడం... అయితే అరవింద... ఇలాంటి పని చేస్తుందా? నమ్మలేను.

ప్రిన్సిపాల్‌కి జవాబేం ఇవ్వక 'వన్‌మినిట్' అంటూ ఆ టెస్ట్ పేపర్స్ కోసం ఆఫీసు రూమ్‌లోకి వచ్చాను. కప్‌బోర్డ్ లాక్ చేసి ఉంది. కీస్ కోసం వెతుకులాట...ఒక పది నిముషాలు.

మనసంతా ఆందోళన. హడావుడిగా ఆ పేపర్స్ క్రిందా మీదా వెదుకుతూంటే జ్యోత్స్న వచ్చింది ఏమిటి వెతుకుతున్నావంటూ...

"అరవింద పేపర్ కన్పించడంలేదు, జ్యోత్నా ప్లీజ్!" అంటూ బండిల్ తన కందించాను.

"ఏమిటంత నెర్వస్‌గా ఉన్నావ్?" ఆమె వెదుకుతూంది.

ఇంతలో ఏదో హడావుడి రూమ్ బయట. ఎవరో పరుగెడుతున్న ధ్వని కారిడార్‌లో. కొన్ని జతల కాళ్ళు పరుగులు గోలగోలగా.... అర్థంకాక నేనూ పరుగెత్తాను. అందరం సీనియర్స్ రూమ్స్ వైపుగా...

మై గాడ్! ఏమైంది? అరవింద రూమ్ మూసి ఉంది. అడుగు పడక నిలబడ్డాను. ఏమైంది? అరవింద లోపల ఉందా? నేను పిలిచినా బయటకు రాదా? ఎందుకు రాదు...పిలవాలి.

"అరవిందా! అరవిందా!" నోట్లోంచి మాట రావడం లేదు. నాలో ఏదో జరుగుతోంది. హమ్మయ్య ! అదిగో...

ఆ గది తలుపులు ఎవరో తెరిచారు.

అరుపులో, ఏడుపులో అర్థం కాని కేకలు...

నా కేదో అర్థం అయినట్లే ఉంది. అరవిందా! ...నీకేమైంది? ఇదిగో వస్తున్నానన్నావ్... ఇంతలోనే ఏమయింది?

కంటి ముందు ఒక్కసారి చీకటి కమ్మడం మాత్రం తెలుసు.

❖❖❖

"రాధికా! ప్లీజ్ కంట్రోల్ చేసుకో. ఇదిగో చూడు, అరవింద పుస్తకాల నిండా నీ పేరే. నీకో ఉత్తరం రాసింది, చూడు"

జ్యోత్స్న పలకరింపుకి ఇరవై నాలుగు గంటలక్రితం జరిగిన ఆ సంఘటన మళ్ళీ కంటి ముందుకొచ్చింది. మళ్ళీ... మళ్ళీ... దుఃఖం పొంగుకొస్తోంది.

"రాధికా! ప్లీజ్! చూడు... అరవింద పుస్తకాల నిండా నీ పేరే...ఐ లవ్ రాధికా మిస్ అంటూ...ఈ ఉత్తరం చూడు."

'మిస్! ఆ లిస్ట్‌లో నా పేరు ఎలా వచ్చిందా అనుకుంటున్నారా? నిన్న రాత్రి మీ రూమ్‌కొచ్చి నేనే రాశాను. తప్పుకదా మిస్. నాకు తెలుసు. కాని నేను క్వాలిఫై అవలేదంటే మమ్మీ డాడీ...అమ్మో! భయం వేస్తోంది మిస్. అసలు చచ్చిపోవాలంటే కూడా భయం వేస్తోంది..."

త్వరత్వరగా రాయడంతో అలుక్కుపోయినట్లున్నాయి అక్షరాలు.

అసలు ఆ కాస్త గ్యాప్‌లో ఎలా జరిగింది ఇంతఘోరం? ఉరి వేసుకోవాలన్న ఊహ, ఆ ముడి వేసుకునే తీరు ఎప్పుడు నేర్చుకుంది? ఇంకా మెట్ల మీద క్రిందకి దిగివస్తూ ఎదురైన ఆ రూపమే వెంటాడుతోంది. ఆ పసికూనలో రేగుతున్న భావాల్ని పట్టుకోలేక పోయాను. ఆ చిన్నారిని నిష్కారణంగా బలి తీసుకున్నాను. సమస్య పరిష్కరిస్తున్నా ననుకున్నాను. కాని అరవింద ఇలాంటి తీర్పు చెబుతుందని నేనూహించలేకపోయాను!

**('రచన' జూన్ 2002)**

# ఒక అమ్మకి... ఒక మున్నీ

అమ్మా! నిన్ను చూసే క్షణాలు ఇంకా కొన్నిగంటలు వెనక్కి వెళ్ళాయి. ఎన్నాళ్ళయింది నిన్నుచూసి!

ఎన్నేళ్ళు!?

అవును. ఇది నా ఒక్కదాని సమస్య కదూ, ఈ ప్రపంచానికేం పట్టిందీ?

ఇక్కడి వాతావరణం... ఇక్కడేమిటి! ప్రపంచం అంతా అల్లకల్లోలంగానే వుంది. నేను బయల్దేరబోతున్న ఫ్లయిట్‌లో బాంబు పెట్టారన్న హెచ్చరికతో కొన్ని గంటలపాటు ప్రయాణాలన్నీ ఆగిపోయాయి.

ప్రయాణం మొదలయ్యేందుకు ఇంకా కొంత వ్యవధి వుంది. ఈ సమయం నాకెంత విలువైందో ఎవరికి అర్థం అవుతుంది?

నాన్నని, నిన్ను, అత్తమామల్ని, తోబుట్టువుల్ని, స్నేహితుల్ని అందర్నీ చూసి నన్ను నేను జీవంతో నింపుకోవాలన్న కల కార్యరూపం పట్టేందుకు, దాదాపు మూడు సంవత్సరాలు పట్టింది.

సంసారం, పిల్లలు, చదువులు, అర్థంకాని అసంతృప్తి... వీటన్నింటి మధ్యా జీవితం ఉక్కిరిబిక్కిరిగా ఊపిరాడకుండా తయారైంది. వీటిలో దేనినీ వదిలించుకోలేను. నాకంటూ సమయం చేసుకోవడం చేతకావడం లేదమ్మా.

ఆ చిన్న పట్టణంలో, మీ ఇద్దరి పరిమిత ఆదాయంతో మమ్మల్నందర్నీ ఎంత చక్కగా పెంచారమ్మా! ఆశ్చర్యం వేస్తుంది.

నువ్వు చెబుతుండేదానివి కదూ...!

'ఒట్టి సంపాదన కోసం మాత్రమే కాదు మున్నీ... చదువుకోవాలి. అవకాశం వున్నంత వరకూ చదువుకోవాలి. జీవితాన్ని వివేకంతో తీర్చిదిద్దుకునేందుకు చదువు, ప్రపంచ జ్ఞానం ఎంతో అవసరం' అంటూ.

కాలానికి తగ్గట్టు చదువు, దాని వెంట కెరీర్ జీవితంలో సహజంగా యిమిడిపోయాయి. వాటివెనుకే నా జీవితంలోకి వచ్చిన మధు! నిజం చెబుతున్నానమ్మా, జీవితం పరుగుపందెం కావడం నాకిష్టంలేదు. అయినా ఆ జీవితంలోకే ప్రవేశించాను. అదే ప్రపంచంగా జీవించేస్తున్నాను.

పెళ్ళినాడు కాదు కదా, ఈ నాటికీ మధుతో కొన్ని విషయాలు గట్టిగా చెప్పలేను. ఎందుకంటావ్?!

మధుతో ఎన్నో విషయాలు డిస్కస్ చేస్తాను. వాదిస్తాను. కాని అతను నిరంతరం కోరుకునే పరుగు పందెంలాంటి జీవితం నాకు వద్దు అని ఎందుకు చెప్పలేను. లోలోపల నేను కూడా ఈ జీవితాన్నే కోరుకుంటున్నానా? ఈ హిపోక్రసీ ఎక్కడ ఎప్పుడు మొదలైంది నా జీవితంలో?

నిత్యం మధు కనే కలల్ని నా కళ్లతో దర్శించడం ఎన్నేళ్లుగా అలవాటు పడిపోయానమ్మా. అమ్మా! నీ పేరు తల్చుకుంటేనే మనసెందుకలా కరిగి నీరవుతుంది?

నాకు ఎన్నోసార్లు ఒక విషయం జ్ఞాపకం వస్తుంటుంది. ఏంటో తెలుసా అమ్మా! నిన్నూ, నీ తెలివితేటల్నీ, నీ చదువునీ, వాటి తాలూకు ప్రయోజనాల్ని అన్నింటినీ పొందుతూ కూడా నాన్న నీ మీద చేస్తుండే పెత్తనం!

తండ్రిగా అంత ఆదర్శవంతంగా వుండే నాన్న భార్యని మాత్రం తన చెప్పు చేతల్లో వుంచుకోవాలన్న ధోరణి నేను చిన్నప్పట్నించీ గమనిస్తూనే వుండేదాన్ని.

కాలేజీ చదువుకొచ్చాక, ఓ వ్యక్తిత్వం ఏర్పడ్డాక నీ ముందు అంటుండేదాన్ని – 'అమ్మా! నీలా మాత్రం నేను జీవించలేను' అని.

ఇంట్లో యిందరికీ ఏ లోటూ రాకుండా చూసుకుంటూ, బయట ఉద్యోగపు ఒత్తిళ్లను అవలీలగా మోస్తున్న నిన్ను నాన్న ఏ ఒక్క విషయంలోనూ, ఏ సందర్భంలోనూ ఒక వ్యక్తిగా తనతో సమాన హోదానిచ్చేవారు కాదు. నీతో సంప్రదించే వారు కాదు. నువ్వు మాత్రం చిర్నవ్వుతో ఆయన ఆజ్ఞల్ని, ఆంక్షల్ని భరిస్తూనే వుండేదానివి.

ఆయనతో సమానమైన చదువు, హోదా, జీవితానుభవం వుండి కూడా నువ్వెందుకిలా సబ్మిసివ్‌గా వుండాలని నాకు నాన్నమీద కోపం వస్తుండేది. అన్ని విషయాల్లోనూ మాట నెగ్గించుకునే నాన్నంటే ఒక్కోసారి వ్యతిరేక భావం కలుగుతుండేది.

కాని మా కోసం నిరంతరం తపన పడి, మా ప్రతి చిన్న అవసరాన్నీ అడక్కుండా

తీర్చాలని ఆశ పడే నాన్న! ప్రియమైన నాన్న! అంత ప్రేమగానూ నిన్నూ చూసు కున్నట్లుండేవారు. అంతలోనే అంతా, అన్నీ కేవలం తన ఇష్టాయిష్టాలతోనే.

ఇదంతా ఎందుకు చెబుతున్నానో తెల్సా అమ్మా? మధుక్కావలసిన జీవితాన్ని నాదిగా చేసుకుని ఎందుకు జీవించేస్తున్నానని నా మీద నాకు కోపం. పిల్లల విషయంలో, ఆఫీసు పని విషయాల్లో ఎంతో ఎసర్టివ్‌గా వుండే నేనెందుకిలా వుంటానో అర్థంకాదు.

మధు నాన్నలాగా పెత్తనం చేస్తున్నట్లు కన్పించడు. మృదువుగా తన అభీష్టాలను వ్యక్తం చేస్తాడు. చెల్లించుకుంటాడు. ఇదో రకం.

నేనూ పెద్దదాన్నవుతున్నాను. ఎదుగుతున్న నా పిల్లలభావాలు అరిగించుకోలేక, సమర్థించనూ లేక, ఈ సొసైటీ నుండి దూరంగా, అతి దూరంగా నా చిన్నారుల్ని తీసుకుని ఎక్కడికైనా పారిపోవాలని వుందమ్మా. కాని ఎవరికోసమైతే ఈ దిగుళ్లు పెంచుకుంటున్నానో వాళ్ళే నాదంతా చాదస్తంగా, అర్థంలేనివిగా కొట్టిపారేస్తుంటే... ఏం చెయ్యనమ్మా?

అమ్మా? అప్పట్లో నేనడిగే ప్రశ్నలకి నువ్వు చిరునవ్వుతో ఇచ్చే సమాధానాలు నా చెవుల్లో ఇంకా గింగురుమంటూనే వున్నాయి.

“మున్నీ! జీవితం విలువైనది. అర్థం లేని పంతాలతో, అహంకారాలతో ఏమీ పొందలేము. అతను ప్రేమించే మనిషైతే చాలు అతని పొసెసివ్‌నెస్ అర్థం చేసుకోగల్గాలి. ప్రేమతోనే అతన్ని జయించగలం. ప్రేమించడం తెలియని వాడైతే మాత్రం నువ్వు చెప్పినట్లు ఆ జీవితానికి అర్థం లేదు....”

“నువ్వింకా చిన్న పిల్లవి. జీవితాన్ని పాజిటివ్ దృక్పథంతో చూడడం నేర్చుకో. అది తెలియకే ప్రపంచంలో ఇన్ని సమస్యలు...ఇంత దుఃఖం”

ఎంత చక్కగా చెప్పేవమ్మా! తెల్లవారిలేస్తే నీ మాటలు మనసులో మెదులుతూనే వుంటాయి. ఒక్కసారి వచ్చి నీ ఒడిలో పడుకుని, నీ మెడచుట్టూ చేతులు పెనవేసి తనివితీరా నిన్ను చూడాలనుకుంటాను. నన్ను విన్పించాలనుకుంటాను. ఇదే తీర్చుకోలేని కోరికై నన్ను ఊరిస్తూంటూంది. ఇన్ని వేల మైళ్ల దూరంలో ఎందుకు బ్రతకాలో నా కర్థం కాదు.

మధుతో ఎన్నోసార్లు చెబుతాను...మనం మన దేశం వెళ్ళిపోదాం మధూ అని. చక్కగా నవ్వుతాడు...“మనకంటే మంచి అవకాశాలు మన పిల్లలకివ్వాలనే కదూ ఇంతదూరం వచ్చింది. మరి వాళ్ల చదువులు పూర్తిచేసి జీవితాల్లో స్థిరపడనీ, వెళ్ళిపోదాం” అంటాడు.

ఇంకా ఎంతకాలం నిరీక్షిస్తే ఆ క్షణాలొస్తాయి?

"మీ అమ్మానాన్నలు మాత్రం పుట్టి పెరిగిన పల్లెలు వదిలి ఉద్యోగరీత్యా పట్టణాలకొచ్చి స్థిరపడలేదా? వాళ్ళు వాళ్ల పల్లెలు వదలకూడదనుకుంటే నిన్నెంతవరకూ చదివించ గల్గేవారు? వాళ్ళకంటే మెరుగైన జీవితాలు మీకివ్వాలనే కదూ వాళ్లు ప్రయత్నించింది" అంటూ ప్రశ్నిస్తాడు.

"పిల్లలు యిక్కడ స్థిరపడ్డాక వాళ్లని వదిలి వెనక్కి వెళ్లగలమా?" అంటే "వాళ్ళ జీవితాలు వాళ్ళవి. మన బాధ్యతలు ముగించుకు మనం వెళ్లి పోదాం" అంటాడు మధు.

ఇదేమిటమ్మా? వాళ్లకి దూరంగా అయినా నేను వుండగలనా? మధు చెప్పేదంతా సాధ్యమేనా అని నాకు ఎన్నెన్నో ప్రశ్నలు. నా ప్రశ్నలన్నీ నువ్వే వినగలవు. నన్ను సమాధాన పరచనూ గలవు. అన్ని ప్రశ్నలకీ నీ దగ్గర సమాధానం దొరుకుతుందమ్మా.

ఇన్నేళ్లూ మీ అందర్నీ విడిచి ఇంతదూరం వచ్చేనన్న బెంగ, ఇకపై పిల్లల్ని వదులుకోవాలన్న దిగులు కాబోలు. జీవితమంటే బెంగలేనా అమ్మా? నవ్వుతున్నావు కదూ నా ఆలోచనలు చూసి.

సంక్రాంతికి నీ దగ్గరికి రావాలని ఎంతగా ప్రయత్నించేనో! చిన్నప్పుడు హాఫ్ ఇయర్లీ పరీక్షలెప్పుడవుతాయా, సంక్రాంతి శెలవులెప్పుడొస్తాయా అని ఎదురు చూసేవాళ్లం! విశాలక్క, శారదక్క నన్ను చిన్న పిల్లవంటూ గొబ్బిళ్లు పెట్టేందుకు, ముగ్గులు వేసేందుకు రానిచ్చేవారు కాదు. పెరట్లో డిసెంబర్ పూలు, చామంతులు, బంతి పువ్వులు కోసుకురమ్మని పురమాయించేవారు.

ఆ పనిమాత్రం నేను చెయ్యనంటూ అలిగి యేడ్చేదాన్ని, ఆ చీకటి వదలని చలిలో అరుగు మీద కూర్చోబెట్టుకుని నన్ను సముదాయించే నువ్వెన్నిసార్లు జ్ఞాపకానికొస్తావోనమ్మా.

పనులన్నీ పక్కనబెట్టి మా సరదాలన్నీ ముచ్చటగా తీర్చే నీ ఓర్పు, రూపు కళ్లకు కట్టినట్లున్నాయమ్మా.

అందుకే సంక్రాంతి నాటికి అక్కడికొస్తే మనందరం ఆ జ్ఞాపకాలను మళ్లీ మరోసారి సజీవంగా అనుభవంలోకి తెచ్చుకోవచ్చని ఆశపడ్డాను.

ఎప్పుడైనా అపురూపంగా ఖాళీదొరికితే పిల్లల్ని కూర్చోబెట్టుకుని ఈ కబుర్లన్నీ చెబుదామనుకున్నా ఆ అనుభవం వాళ్ల వూహక్కూడా అందదు. వాళ్ల ముఖాల్లో అయోమయం నాలో ఉత్సాహాన్నంతా నీరు కారుస్తుంది.

చిన్నప్పుడు నాన్న చుట్టూ చేరి మేమంతా "మాకు నాన్నంటే ఇష్టం" అంటుండేవాళ్ళం. నీ ప్రశాంతమైన ముఖంలో ఎప్పుడూ అదే చిరునవ్వు.

నాన్న అంటే అరుదుగా దగ్గరకు తీసుకుని గారం చెయ్యటమే కాని అమ్మా అంటే నిరంతరం నిలువెల్లా ఆత్మీయతే అని మెల్లిమెల్లిగా అర్థమైంది.

ఇన్నాళ్ల ఎదురు చూపులు పూర్తయి బయల్దేరబోయే ముందు ఈ అవాంతరం... కన్పించని ఎవరిమీదో కోపం వస్తోందమ్మా.

ఎందుకమ్మా ప్రపంచం ఇంత చెడుగా తయారవుతోంది? ఇన్ సెక్యూరిటీ! బతికే క్షణం ఏదీ నీది కాదు. బయట ప్రపంచపు ఎన్నెన్ని ఇన్‌ఫ్లూయెన్స్‌లు మన జీవితాలమీద!

నాది, నా కోసం లాంటి తాపత్రయం మనిషికి ఎక్కువై పోతోంది కదూ రాన్రానూ. అదీ హద్దులు ఎరుగనంతగా.

మధుతో ఈ ప్రయాణం ఇలా మరికొన్ని గంటలు వాయిదా పడిందని చెబితే,

"హాయిగా ఇంటికొచ్చేయ్‌రా, అందరం కల్సి వీలు చూసుకు వెళ్దాం" అంటున్నాడు.

చూడమ్మా. నేనింతగా ఆరాటపడుతున్నా అర్థం చేసుకోడు. పైగా "నాకు మాత్రం మా అమ్మానాన్నల మీద బెంగలేదా?" అంటున్నాడు.

ఇక్కడ ఎయిర్ పోర్ట్‌లో ఓ మూల కూర్చుని నీకిదంతా రాస్తున్నాను. నా రాకకంటే ముందే ఈ మెయిల్ నిన్ను చేరుతుంది.

ఇంటిదగ్గర పిల్లల్ని వదిలి వస్తున్నానన్న దిగులు లేకపోలేదు. కాని మిమ్మల్ని చూడాలన్న ఆశ గుండె పట్టనంతగా పెరిగి, పెరిగి నన్ను నిలువ నీయడం లేదమ్మా.

ఎయిర్ పోర్ట్‌కు బయలుదేరుతూ దివ్యని దగ్గరకు తీసుకుని 'బెంగపెట్టుకోకు నాన్నా" అంటున్న నన్నూ, నా కళ్లలో నీటిని చూసి తెల్లబోయింది. పైగా బెంగెందుకని నవ్వుతూంది చూడు.

ఇల్లు దాటిన మరుక్షణం మాత్రం నా ఆలోచనలనిండా కేవలం మీరు మాత్రమేనమ్మా.

ఇదిగో ఇక టైమ్ కావొస్తోంది. వుంటానమ్మా.

నీ

మున్ని

**('నవ్య' వీక్లీ, జనవరి 18, 2006)**

# సాక్షి

'శశీ...!'

మెల్లగా తలుపు తట్టింది సావిత్రి. ఎలాంటి సమాధానం లేదు. నెమ్మదిగా తలుపు తోసి లోపలకు వెళ్ళింది.

గదిలో వెచ్చగా ఉంది. శశి, పాపాయి గాఢనిద్రలో ఉన్నారు. లేపేందుకు మనస్కరించక వెనక్కి వచ్చింది. ఇంకా మూడో నెల రాలేదు పాపాయికి. తల్లిపక్కలో ఒదిగి హాయిగా నిద్రపోతోంది. రాత్రి పుస్తకం చదువుతూ నిద్రలోకి జారినట్లుంది. తల వైపు మంచం కింద పుస్తకం పడి వుంది.

తలుపు దగ్గరకి లాగి బయట వసారాలోకి వచ్చింది సావిత్రి. రాత్రి నుండీ పడుతూనే వుంది వర్షం. పెద్దవాన కాకపోయినా ఆగకుండా కురుస్తోంది. కాంపౌండ్‌లో పూలమొక్కలు వర్షంలో తడిసి ముద్దవుతున్నాయి. మబ్బుపట్టిన ఆకాశం ఎందుకో దిగులుగా తొంగి చూస్తోందనిపిస్తోంది.

ఈ వర్షం మాయలో పడిందంటే ఆమె అక్కడినుండి మరి కదల్లేదు. చటుక్కున తల విదిల్చి వంటింటివైపు కదిలింది.

ఇంతకీ సమస్య సమస్యగానే మిగిలింది. చిన్నుని స్కూలుకి పంపాలా వద్దా ఈ వర్షంలో. ఈపూటకి వెళ్ళకపోతేనేం వాడు. నాలుగేళ్ళ పసి వెధవ. హాయిగా తాత పక్కలో వెచ్చగా నిద్ర

పోతున్నాడు. కృష్ణమూర్తి ఆఫీసుకు వెళుతూ ఆ వీధి చివర కిండర్ గార్డెన్‌లో వాణ్ణి దింపి వెళ్ళిపోతాడు. వాడు లేస్తే ఏ పనులూ సాగవు. వాణ్ణి తయారు చేసి, ఓ ఇడ్లీ తినిపించి, పాలు తాగించేందుకు సరిగ్గా గంట పడుతుంది.

కృష్ణమూర్తి లేచాక ఆయన ఏమంటాడో! ఈ లోపు వంటింటి పని పూర్తి చేసుకుంటే సరి. క్షణం క్షణం టైము చూస్తూనే వంట పనులు ముగించుకుని గదిలోకొచ్చేసరికి తాతా మనవలిద్దరూ నిద్రలేచి మంచం దిగేందుకు సిద్ధమవుతున్నారు.

"ఏమండీ! ఈ వర్షంలో స్కూలుకి పంపాలంటారా?"

"ఇక్కడే కదూ. నేను డ్రాప్ చేస్తాను వాడికి కాస్త కాలక్షేపం స్కూలుకి వెళితే. ఇంట్లో ఉంటే వాడికి ఏం తోస్తుంది?!" కృష్ణమూర్తి బ్రష్, పేస్ట్ అందుకున్నాడు.

చిన్నుకి అమ్మమ్మ ప్రశ్న బాగానే అర్థం అయింది.

"అమ్మమ్మా! నేను స్కూలుకి వెళ్లను. ఈ రోజు చెల్లితో ఆడుకుంటాను" అన్నాడు తనో నిర్ణయానికి వచ్చి.

"వద్దురా. ఇంట్లో నీకు తోచదు నాన్నా. చెల్లి చిన్న పిల్ల కదూ, నీతో ఆడుకోలేదు. స్కూల్లో అయితే నీకు రాహుల్, అనీష్, సుమి – అందరూ ఉంటారు ఆడుకుందుకు" మనవణ్ణి మంచం దింపి తయారు చేసేందుకు సిద్ధమైందామె.

వాడు గొడవ మొదలుపెట్టాడు – ఈ రోజు సూల్‌కి వెళ్ళను అంటూ.

"అమ్మకి మెలకువ వస్తుందిరా. పాపాయి లేచి ఏడుస్తుంది. గట్టిగా గొడవ చెయ్యకు"

ఆమె మాటలు లెక్క చెయ్యకుండా వాడి మానాన వాడు ఏడుపు మొదలుపెట్టాడు.

"సావిత్రీ! కాఫీ!" అంటూ వచ్చిన కృష్ణమూర్తి "వాడికిలేని అయిడియా ఇచ్చావ్ అనవసరంగా" అంటూ విసుక్కున్నాడు.

ఐదు నిమిషాలు గడిచాయి. పది నిముషాలు గడిచాయి. ఏడుపు ఆగలేదు.

'చిన్నూ!' అంటూ గదిలోంచి లేచి వచ్చింది శశి.

"ఎందుకు ఏడుపు ప్రొద్దున్నే" విసురుగా కొడుకు జబ్బ పట్టుకుని లేవదీసింది.

"నేను స్కూలుకి వెళ్ళను" స్పష్టంగా చెప్పాడు తల్లితో.

"వెళ్ళకపోవడం ఏమిటి? టైమవుతోంది, పద"

వాణ్ణి బాత్‌రూము వైపు లాక్కెళ్ళి, "అమ్మా! వీణ్ణిచూసుకో" అంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

సావిత్రికి ఉసూరుమనిపించింది. పసి వెధవ. తను అన్నమాటలకి వాడు స్కూలుకి వెళ్ళక్కర్లేదు అనుకున్నాడు. అనవసరంగా ప్రొద్దున్నే వాణ్ణి ఏడ్పించింది. బాత్‌రూమ్ బయట వెక్కుతున్న మనవణ్ణి దగ్గరకు తీసుకుని, స్కూల్‌కి తయారు చెయ్యడంలో నిమగ్నురాలైంది.

ఆ రోజు ఆదివారం. పాపాయిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి. శశి తయారవుతోంది. తల్లి గదిలో మంచం చుట్టూ తిరుగుతున్నాడు చిన్ను.

"అమ్మా! నీతో నేనూ వస్తాను" అన్నాడు హక్కుగా.

"వద్దు చిన్నూ. హాస్పిటల్‌లో చాలా రష్‌గా ఉంటుంది. పాపాయికి వాక్సిన్ వేయించి తీసుకు వస్తాను" – బ్యాగ్ సర్దుకుంటూ కొడుక్కి బుజ్జగింపుగా చెప్పింది.

"ప్లీజ్, అమ్మా!"

స్కూలుకి వెళ్ళడం మొదలయ్యాక 'సారీ, ప్లీజ్' లాంటి మాటలు నేర్చుకుని చక్కగా వాడుతుంటాడు. కొడుకు తెలివికి మురిసిపోయింది శశి.

"ఒరేయ్. నీ కెంత మంచి మానర్స్‌రా! నా బంగారు తండ్రివి కదూ. ఇంట్లో ఆడుకో" అంటూ వాడి బుగ్గలు నిమిరి పసిదాన్ని తీసుకుని ముందు గదిలోకి వచ్చింది.

"అమ్మా! వెళుతున్నాను. వీణ్ణి పట్టుకో" అంటూ చిన్నూని తల్లికి అప్పగించి వెళ్ళిపోయింది శశి.

చిన్ను ఏడుపు ఆపడం చాలా సేపటి వరకూ సావిత్రికి చేత కాలేదు. వాడి చిన్ని మనసుకు ఈ మధ్య తల్లి తనని దూరంగా పెట్టేస్తోంది అన్న విషయం కష్టం కలిగిస్తోంది. చెల్లి వచ్చాక అమ్మ తనతో ఇదివరకటిలా ఆడుకోవటం లేదు. ఎప్పుడూ బొమ్మలతో ఆడుకోమంటుంది. లేకపోతే అమ్మమ్మతో కథలు చెప్పించుకోమంటుంది.

సావిత్రి సముదాయించబోయినా వాడు దూరంగా బొమ్మల మధ్య కూర్చుండి పోయాడు. వాడిచేత అన్నం కూడా తినిపించ లేకపోయిందామె.

కృష్ణమూర్తి బయట నుండి వస్తూ మనవడు చిన్నబుచ్చుకున్న ముఖంతో ఒక్కడూ వుండడం చూసి – "సావిత్రీ! వీడు ఇలా డల్‌గా ఉన్నాడేం? నాకు భోజనం పెట్టేయ్... అన్నట్లు వీడు అన్నం తిన్నాడా?" అన్నాడు.

"వాళ్ళ అమ్మ వాణ్ణి హాస్పిటల్‌కి తీసుకువెళ్ళలేదని అలిగాడు. అన్నం పెట్టాలని చూసినా తినడంలేదు" – సావిత్రి దిగులుగా చెప్పింది.

"తీసుకురా... వాడూ నాతోపాటు తింటాడు"

డైనింగ్ హాల్లో తాతయ్య పక్కన కూర్చున్నాడు. కాని వాడు అలక సాగిస్తూనే వున్నాడు. బలవంతాన ఒక ముద్ద నోట్లో పెట్టినా అది నమలకుండా బుగ్గన పెట్టుకు కూర్చున్నాడు.

"ఏరా! ఇదివరకిలా అలిగేవాడివి కాదు. చెల్లి పుట్టాక అల్లరి, పేచీలు నేర్చు కుంటున్నావా?"

కృష్ణమూర్తి మాటలకి సావిత్రి సమాధానం చెప్పింది.

"అవును మరి, చెల్లి రాని క్రితం వాడే మహరాజు. వాళ్ళ అమ్మ వాడి చుట్టూ తిరిగేది. వాడితోనే దానికి రాత్రి పగలు. ఇప్పుడు చంటిపిల్ల ఆలనా పాలనా చూసుకునేసరికి దానికి సరిపోతోంది. వీడికి అన్నం తినిపించేందుకు కూడా దానికి కుదరడం లేదు. ఆ తేడా వీడికి బాగా అర్థం అవుతోంది. అందుకే ఈ అలకలు" నిట్టూర్చింది సావిత్రి.

శశి హాస్పిటల్ నుండి వచ్చేసరికి చాలా ఆలస్యమైపోయింది.

"అబ్బబ్బ! చాలా రష్‌గా ఉందమ్మా. ఊళ్ళో జనం అంతా అక్కడే ఉన్నారేమో అనిపించింది. అన్నం పెట్టెయ్యమ్మా"

నిద్రపోతున్న పాపాయిని గదిలో పడుకోబెట్టి భోజనానికి కూర్చుంది శశి. భోజనం ముగింపుకొచ్చాక అడిగింది.

"అమ్మా! వీడేడీ? అన్నం తిన్నాడా?"

"నువ్వెళ్ళాక చాలా గొడవ పెట్టాడు. అలిగి అన్నం వద్దన్నాడు. నాన్న వచ్చాక ఆయనతో రెండు ముద్దలు తిన్నాడు. ఆయనతో పాటు ఆ గదిలో నిద్రపోయాడు".

"మరీ పేచీలు ఎక్కువైపోతున్నాయి వాడికి" విసుక్కుంది శశి.

తలుపు దగ్గరగా వేసుకుని పాపాయి ప్రక్కన మంచం మీద వాలిపోయింది.

సాయంత్రం ఐదు కావొస్తోంది.

రివ్వున గదిలోకి దూసుకొచ్చాడు చిన్ను "అమ్మా" అంటూ.

గాఢ నిద్రలో ఉన్న శశి చటుక్కున కళ్ళు తెరిచింది. ప్రక్కన నిద్రపోతున్న పసిది ఉలిక్కిపడి ఏడుపు అందుకుంది.

ముఖం మీద ముఖం పెట్టి, "అమ్మా" అంటూ కావలించుకుంటున్న చిన్నుని ఒక్కసారి విదిలించింది. చేతిలో చాక్‌లెట్ బార్ తింటూ రావడంతో బుగ్గలు, నోరు పులుముకుని ఉంది. తినడం ఆపి ఒక్కసారిగా నిలబడిపోయాడు.

"వెళ్ళు...తింటూ తింటూ రావద్దన్నానా ఈ గదిలోకి! చెల్లి నీ అరుపుకి భయపడి ఏడుస్తోంది చూడు"

బిత్తరపోయి వాడూ ఏడుపు అందుకున్నాడు.

"అమ్మా! కాసేపు వీణ్ణి అవతలకి పిలు" తల్లికి వినిపించేలా చెప్పి పాపాయిని చేతుల్లోకి తీసుకుంది.

చిన్ను అమ్మమ్మ ఒళ్ళో కూర్చుని టి.వి. చూస్తున్నాడు. వాడి కళ్ళు టి.వి. స్క్రీన్ మీద ఉన్నా మనసు మాత్రం కలతబారింది. వాడి కళ్ళనిండా దిగులు.

సావిత్రి గమనిస్తూనే ఉంది. డెలివరీ అయ్యాక శశి పూర్తిగా కోలుకోలేదు. అందుకే ఈ రెండు  నెలలుగా చిన్ను బాధ్యతని పూర్తిగా తను తీసుకుంది. వాడు తల్లిమీద బెంగ పెట్టుకున్నాడనిపిస్తోంది. భోజనం సరిగా చెయ్యడంలేదు.

శని, ఆదివారాలు – రెండు రోజులు స్కూలుకి సెలవు. ఆ రెండు రోజులు తల్లి చుట్టూ తిరుగుతాడు అటెన్షన్ కోసం. తల్లి ప్రక్కనే క్రొత్తగా చెల్లి ఉంటోంది. వాడి పసిమనసుకి ఇదంతా అర్థం కావడం లేదు.

తండ్రి దూరంగా ఉన్నాడు. అమ్మమ్మ ఎంత ప్రేమ చూపించినా, తాతయ్య ఎంత గారాం చేసినా తల్లి దగ్గరకు తియ్యడంలేదన్న దిగులు వాణ్ణి వేధిస్తోంది.

సావిత్రి మనవణ్ణి దగ్గరగా తీసుకుంది అనునయిస్తున్నట్లుగా.

ప్రొద్దున్నే పనులు ముగించుకుని కూతురి గదిలోకి వచ్చింది సావిత్రి.

"శశీ! చిన్ను నీ మీద బెంగ పెట్టుకున్నాడే. వాణ్ణి కొంచెం ఓపిక చేసుకుని దగ్గర కూర్చోబెట్టుకో! రోజూ వాడితో కాసేపు గడుపుతూ ఉండు. వాడు తిండి కూడా సరిగా తినడం లేదు!"

తల్లి మాటలకి వింతగా చూసింది.

"అదేమిటమ్మా! నువ్వు, నాన్నగారు వాణ్ణి నెత్తిమీద పెట్టుకుని చూస్తున్నారు. వాడి గురించి వర్రీ అవుతావెందుకు"

"శశీ! మేమెంత దగ్గర తీసినా తల్లివి నువ్వు చేరదియ్యడం లేదు. ఇన్నాళ్ళూ వాడికి నీ తోడిదే లోకం. ఇప్పుడూ పూర్తిగా నీ నుండి విడివడి ఉండాల్సి రావడం వాడికి అర్థం కావడం లేదు. నువ్వు వాణ్ణి దేనికో దానికి కసురుకునో, విసురుకునో దూరంగా పంపేస్తున్నావని వాడికి తోస్తోంది. వాడు నిన్ను బాగా మిస్ అవుతున్నాడు. ... నువ్వు హాస్పటల్‌కి వెళ్ళాక నన్ను అడుగుతున్నాడు... 'అమ్మమ్మా ! అమ్మ హాస్పటల్ నుండి ఇంకా చాలా పాపాయిల్ని తెస్తుందా?' అని. వాడికి అర్థం అయిందల్లా నువ్వు ఒకసారి హాస్పటల్ నుండి వస్తూ పాపాయిని తెచ్చావు. అప్పటి నుండి వాణ్ణి పట్టించుకోవడం లేదు. ఇంకా పాపాయిల్ని తెస్తావేమో అని వాడి బెంగ".

"అమ్మా! వాణ్ణి మాత్రం ఎందుకు చూసుకోను. నువ్వు, నాన్న ఉన్నారన్న భరోసాతో

వదిలేస్తున్నాను. అయినా అస్తమానం 'అమ్మమ్మా' అంటూ నీ వెనకే ఉంటాడు కదా, కబుర్ల కోసం, తాయిలాల కోసం. నా మీద బెంగ పెట్టుకుంటాడని నాకు తోచలేదమ్మా"

'ఎవరైనా అమ్మ తరవాతేనే శశీ. నీ తర్వాతే మేమంతా...స్కూల్ నుండి వచ్చాక కాస్సేపు నీ దగ్గర కూర్చుబెట్టుకుంటూ ఉండు. పాపాయ్‌ని నేను చూసుకుంటాను"

ఆ రోజు మనవణ్ణి స్కూల్ నుండి తీసుకొచ్చి, బట్టలు మార్చి తయారు చేసి టిఫిన్ తినిపించి తల్లిదగ్గరకు పంపింది సావిత్రి.

తల్లి దగ్గర కూర్చుని వాడి బొమ్మలు, పుస్తకాలు చుట్టూ పరిచి ఏవేవో కబుర్లు చెబుతున్నాడు. వాడి ముఖంలో ప్రపంచాన్ని జయించిన ఆనందం.

సావిత్రి హాయిగా ఊపిరి పీల్చుకుంది.

రోజూ స్కూల్ నుండి వస్తూనే తల్లి దగ్గరకు వెళ్ళి వాడి కబుర్లన్నీ చెప్పాలి. వాడి లోకం చాలా వుంది.

ఆ సాయంత్రం పనిమనిషి రాలేదు. వంటింట్లో పనులు తెమలడం లేదు సావిత్రికి.

"శశీ! వచ్చి బత్తాయిరసం తీసుకుంటావుటే"

తల్లి పిలుపు విని శశి లేచి వెళ్ళింది. రసం తీసుకుని వెళ్ళిన శశి సడన్‌గా కేకలు వెయ్యడం వినిపించి సావిత్రి పరుగెత్తుకొచ్చింది.

చిన్ను జబ్బపుచ్చుకుని గది బయటకు లాక్కొచ్చింది శశి.

"చూడమ్మా! నేనలా వచ్చేసరికి వీడేం చేసాడో" తల్లికి ఇంకేమీ వివరించలేక తలుపు భళ్ళున వేసుకుంది శశి.

పనులు ముగించుకుని సావిత్రి హాల్లోకి వచ్చింది.

"ఏమే శశీ! చిన్ను ఏం చేశాడు? సాయంత్రం అంతలా కోప్పడ్డావు? బాగా భయపడ్డాడు వాడు"

"వీడితో ఎలా వేగాలో తెలీడంలేదమ్మా. నేను పళ్ళరసం తీసుకు వచ్చేసరికి పాపాయి ముఖం మీద వాడి కారు బొమ్మ పెట్టి చూపిస్తున్నాడు. అది ఊపిరాడక గిజగిజలాడుతోంది. సమయానికి వెళ్లాను కనుక సరిపోయింది... రెండు రోజుల క్రితం నేను ప్రక్కనే వున్నాను. తింటున్న చాక్‌లెట్ దాని నోట్లో కుక్కెయ్యబోయాడు. ఎలాగమ్మా ఇలా?" బేలగా అడిగింది శశి.

"ఇవన్నీ తప్పవు శశీ! మనం వెయ్యికళ్ళతో కాచుకోవాలి పసివాళ్ళని"

"ఏమోనమ్మా. నాకు తెలియదు. వీడిని కొన్నాళ్ళు నీ దగ్గర వదిలేసి వెళ్ళనా అని ఆలోచిస్తున్నాను. పసిదానిని ఎప్పుడు ఏం చేస్తాడో అని భయం వేస్తోంది".

"అలాంటి పని చెయ్యకు శశీ! ఇప్పటికే వాడు నీ మీద బెంగతో నీ అటెన్షన్ కోసం తపిస్తున్నాడు. వాడికి చెల్లెలంటే ఎంత ఆపేక్షో...! 'అమ్మమ్మ చెల్లికి అన్నం పెట్టేవా?' అని అడుగుతాడు రోజూ. మొన్న ఉయ్యాల పేరంటం రోజు ఉయ్యాల్లో పాపాయిని ఎవ్వర్నీ ఎత్తుకోవద్దనీ, అది తన చెల్లెలనీ ఎంత గొడవ చేశాడు! గుర్తు లేదూ"

తల్లి మాటల్లో నూరు శాతం వాస్తవం ఉందని శశికి తెలుసు.

నిద్రకి లేచి వెళుతూ, 'అమ్మా! శిరీష ఊరు నుంచి వచ్చింది. రేపు మధ్యాహ్నం భోజనానికి వస్తానని చెప్పింది. దానిక్కూడా వండు" అంటూ స్నేహితురాలి రాక గురించి తల్లికి సమాచారం అందించింది.

❖❖❖

సాయంత్రం చిన్ను స్కూలు నుండి వస్తూనే ఎప్పటిలా గదిలోకి పరుగెత్తుకొచ్చాడు. శశితో గదిలో ఉన్న శిరీషని చూసి ఒక్క అడుగు వెనక్కి వేసినవాడు అంతలోనే తల్లి దగ్గరకు పరుగెత్తి "అమ్మా...." అంటూ ఏదో అనబోయేంతలో, "చిన్నూ! ఈ ఆంటీ నీ కబుర్లు వినేందుకు వచ్చింది. త్వరగా తయారై రా" అంది శశి.

శిరీష వైపు ఆసక్తిగా చూస్తూ నెమ్మదిగా అమ్మమ్మ దగ్గరకు వెళ్ళాడు.

❖❖❖

రాత్రి మరీ ప్రొద్దు పోలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. బయట అప్పుడో చినుకు, ఇప్పుడో చినుకు చేస్తున్న చప్పుడు మినహా రోడ్లన్నీ నిర్మానుష్యంగా నిద్రపోతున్నట్లున్నాయి.

శశి మనసంతా పశ్చాత్తాపంతో కృంగిపోయింది. నిద్రపోతున్న కొడుకు దగ్గరకు వెళ్ళింది. పాలుకారే ఆ బుగ్గలు, ముఖం మీద పడుతున్న ఒత్తయిన జుత్తు, నిద్రలోనూ దిగులుతో ముడుచుకున్న బుల్లి సున్నాలాటి నోరు.

వీడు.. ఈ పసివాడు గత రెండు మూడు నెలలుగా తన కంటి కెందుకు సడన్‌గా పెద్దవాడైపోయినట్లు కనిపిస్తున్నాడో శశికి అర్థం అవుతోంది. ప్రక్కనే ఉయ్యాల్లో పాపాయి నిద్రలో చిన్నగా కదిలింది. ఆ చిన్ని పెదవుల మీద పరుచుకున్న విశాలమైన నవ్వులు.

సాయంత్రం జరిగిన సంఘటన పదేపదే శశి కళ్ళముందు కొస్తూంది.

శిరీష చిన్నుతో కబుర్లు చెబుతూ చాలాసేపు ఉండిపోయింది. తను తెచ్చిన బొమ్మలు, డ్రాయింగ్ బుక్స్, కలర్స్ అన్నీ వాడి చేతికిచ్చింది. వాడు ఆనందంగా డ్రాయింగ్ బుక్ తెరిచి రంగుల లోకంలో మునిగిపోయాడు.

"చిన్నూ ! పాపాయిని మా ఇంటికి తీసుకుపోతున్నాను. అందుకే వచ్చాను" అంటున్న శిరీష మాటలకి చిన్నూ చాలా గొడవ చేశాడు.

"ఇది నా చెల్లి. నేనివ్వను'

వాడి పొసెసివ్‌నెస్ చూసి మరీ మరీ వాణ్ణి ఉడికించింది శిరీష.

'శిరీ! నీ కబుర్లు సరే. మధ్యాహ్నం సరిగ్గా భోజనం చెయ్యలేదు. అమ్మ నీ కోసం పకోడీలు చేసింది. ఇవైనా తిను" స్నేహితురాల్ని కొసరి తినిపించే ప్రయత్నం చేస్తోంది శశి.

సాయంత్రం చీకటి పడుతోంది.

"శశీ! వెళతానే – అమ్మ ఎదురు చూస్తుంటుంది. వెళ్ళేలోపు మళ్ళీ వచ్చేందుకు ప్రయత్నిస్తాను"

గుమ్మం దాకా వెళ్ళిన స్నేహితురాళ్ళ కబుర్లు అక్కడ మరో అరగంట సాగాయి.

ఆమె వెళ్ళాక సావిత్రి కూతుర్ని భోజనానికి పిలిచింది.

"శశీ భోజనం వడ్డించేస్తున్నానురా. పాపాయి పడుకుంది కదా. లేస్తే నేను చూసుకుంటాను"

తల్లి పిలుపుకి వంటింట్లోకి వెళుతూ గదిలోకి ఒకసారి తొంగి చూసింది.

పాపాయి నిద్రలో ఉంది. చిన్ను రంగుల్లో ఉన్నాడు.

సడన్‌గా పాపాయి ఏడుపు వినిపించి కంచం దగ్గర్నుండి లేచి పరుగెత్తింది శశి. ఆమె గదిలోకి వచ్చేసరికి చిన్ను పాపాయి మీదకి ఒంగి సముదాయించే ప్రయత్నం కాబోలు చేస్తున్నాడు.

"ఏం చేసావురా నిద్రపోతున్నదాన్ని" – గభాలున వాణ్ణి ఇవతలకు లాగి పసిదాన్ని చేతుల్లోకి తీసుకుంది.

"ఏం చెయ్యలేదమ్మా. చెల్లిని ఏడవవద్దని చెబుతున్నాను"

"ఏం చెయ్యకపోతే నిద్రపోతున్న పిల్ల ఎందుకు అంతలా ఏడుస్తుంది. చెల్లాయి దగ్గరకు రాకు నువ్వు. పో... అమ్మమ్మ దగ్గరికి"

తల్లి కసురుకోవడంతో చిన్న మొహం వేసి వెనక్కి తిరిగాడు చిన్ను.

పాపాయి చాలాసేపు ఏడుస్తూనే ఉంది. పాపాయి ఏడుపుతో శశికి ఒక్కసారి నిస్సత్తువ ఆవరించింది. ఈ పిల్లల్ని తను సవ్యంగా పెంచగలదా? కళ్ళలో నీళ్ళు తిరిగాయి. డెలివరీ అయ్యాక శరీరానికి పూర్తి సత్తువ ఇంకా రాలేదు. ఆ నీరసంతో అస్తమానూ కోపం వచ్చేస్తోంది. కొన్నాళ్ళు చిన్నూని తల్లి దగ్గర విడిచి భర్త దగ్గరికి వెళ్ళాలా అని ఆలోచిస్తుంది కాని వాణ్ణి విడిచి ఉండగలదా తను? వాడు పాపాయిని చూసి జెలసీ ఫీలవుతున్నాడా

అని భయం వేస్తోంది. పాపాయిని తల్లి వొడిలో చూసినప్పుడు ఎక్కడో ఆడుకుంటున్న వాడు కాస్తా తల్లి చుట్టూ తిరిగి ఆమె అటెన్షన్ కోసం అర్ధం లేని అల్లరి చేస్తున్నాడు చిన్ను.

"పాపాయి చిన్నది కదా - నువ్వు పెద్దవాడివి అయ్యావు. చక్కగా నీ బొమ్మలతో ఆడుకో"

తల్లి మాటలు చెవిని పెట్టుకోక 'నన్నూ ఎత్తుకో' అని గొడవ మొదలు పెడతాడు. వాణ్ణి సమాధానపరచలేక విసుక్కుంటోంది.

"అమ్మా! వీడిని నా గదిలోకి పంపొద్దసలు. పాపాయిని ఏం చేశాడో అంతలా ఏడ్చింది. పడుకున్నదాన్ని ఏడిపించాడు. అసలు దాన్ని చూస్తేనే వీడికి నచ్చట్లేదు. బాగా కుళ్ళు గుణాలు వస్తున్నాయి వెధవకి"

తల్లి కేకలకి చిన్ను అమ్మమ్మని కావలించుకున్నాడు. వాడి బుగ్గలమీద ధార కట్టిన కన్నీళ్ళు కూడా శశి కోపాన్ని ఆర్పలేక పోయాయి.

"దెబ్బలు పడక ఇలా తయారయాడసలు" చిన్ను మీదకి రాబోతున్న కూతుర్ని చూసి, "నీ కేమన్నా మతిపోయిందటే, శశీ. పసివాణ్ణి పట్టుకుని ఏమిటా మాటలు?"

తల్లి మాటలకి ఉక్రోషంగా గదిలోకి వెళ్ళిపోయింది. వంటిల్లు చక్కబెట్టుకుని కూతురికి పాలగ్లాసు తీసుకొచ్చింది సావిత్రి.

పడక్కుర్చీలో చేతుల్లో పాపాయితో అలాగే కూర్చుంది శశి. నిద్రపోతున్న పాపాయిని నెమ్మదిగా ఉయ్యాల్లో పడుకోబెట్టింది. పాపాయి కుడిచేతి మీద ఎర్రగా కందినట్లు వుండడం చూసి కొంచెం కొబ్బరి నూనె రాసింది.

తల్లి తెచ్చిచ్చిన పాలు త్రాగి పక్కమీద పడుకోబోతూ మంచం క్రింద ఏదో పడి వుండడం గమనించి, ఒంగి చేత్తో తీసింది.

పకోడీ...దానిచుట్టూ ఎర్రచీమల బారు... పాపాయి ఏడుపుకు సాక్షిగా...

శశికి ఒక్కసారి షాక్ కొట్టినట్లయింది. ఇందాక శిరీష తింటూ తింటూ మంచం మీద కూర్చుంది పాపాయిని పలకరిస్తూ.

పాపాయి మంచం దగ్గర ట్యూబ్‌లైట్ పని చెయ్యకపోవడంతో చిన్నబల్బు వేసింది శిరీషతో మాట్లాడుతూ. క్రింద పడిన పకోడిని ఎవరూ గమనించలేదు.

శశి మనసుకి సమాధానం చెప్పలేకపోయింది. చిన్నూని తింటూ తింటూ గదిలోకి రావద్దని ఆంక్షలు పెట్టింది. తను మాత్రం స్నేహితురాలి కోసం ఫలహారం గదిలోకి తెచ్చింది.

ఆమె మనసంతా మళ్ళీమళ్ళీ అపరాధభావంతో ముడుచుకుపోయింది.

**('రచన' కథాపీఠం జూలై 2012)**

# సహజీవన సౌందర్యం

కాలేజీలో వసుంధర మేడమ్ లేనిలోటు స్పష్టంగా తెలుస్తోంది. గత సాయంత్రమే ఆమెకు వీడ్కోలు సమావేశం జరిపారు. ఆమె రిజైన్ చేసి వెళ్ళిపోతున్నారు. ఆ నిరాడంబరత, చక్కని వ్యక్తిత్వం స్టూడెంట్స్‌నేకాక ప్రిన్సిపాల్‌ని, తోటి లెక్చరర్స్‌ని కూడా ఆమె పట్ల ఆకర్షితుల్ని చేశాయి.

ఆమె జీవితంలో చాలా భాగం ఇక్కడే గడిచిపోయినా, తాను ఆశించినదేదో జీవితంలో లభించలేదన్న అసంతృప్తితో ఆమె క్రొత్త మజిలీకి ప్రయాణమైనట్లు భారతి వింది.

ఆమె తపన అర్థం చేసుకున్న భారతిలాంటివారు కొందరున్నా, సవ్యంగా జరిగిపోతున్న జీవితాన్ని కాదని మళ్ళీ క్రొత్తగా ఆరంభించాలన్న ఆమె ధోరణిని చాలామంది విమర్శిస్తూనే ఉన్నారు.

అన్నిరకాల అభిప్రాయాలు చెవిన పడుతూనే ఉన్నా చెదరని చిర్నవ్వుతో హుందాగా వెళ్ళిపోయారామె.

మధ్యాహ్నం క్లాసులేక స్టాఫ్ రూమ్‌లో కూర్చుండిపోయింది భారతి. లైబ్రరీక్కూడా వెళ్ళాలనిపించలేదు. ఎందుకో నిరుత్సాహంగా అన్పించింది.

కరెక్షన్ వర్క్ చేస్తున్నదల్లా పెన్ను మూసి కుర్చీలో వెనక్కి జారగిలపడింది సుభాషిణి.

పెళ్ళయిన కొన్నేళ్ళదాకా వసుంధర మేడమ్ జీవితం బాగానే ఉండేదట. తర్వాత్తర్వాత ఈవిడ తెలివితేటలు, చక్కదనం, సహనం ప్రతిదీ ఆ భర్తగార్కి సహించరానివిగానే వుండేవిట. ఆయన బాధపడలేక ఈవిడ కూతురితో సహా బయటికొచ్చి ఉద్యోగంలో చేరిందట. ప్రస్తుతం ఆ అమ్మాయి చదువు పూర్తయి ఉద్యోగంలో స్థిరపడింది. ఈవిడ అక్కడికేనట ఇప్పుడు. అసలు ఈ పెళ్ళిళ్ళు చేసుకోవడమంత బుద్ధి తక్కువ లేదు. అందుకే ఇలా చీకూ చింతా లేకుండా హాయిగా ఉన్నాను"

సుభాషిణి మాటలకు సుందరి అడిగింది.

"ఈ కబుర్లన్నీ ఎక్కడ సేకరించావు తల్లీ?"

"వసుంధర మేడమ్ అక్కయ్యగారింట్లోనేగా మేముంటున్నది"

"నీ అంత ముందు చూపుతో ఆలోచించలేదు మరి. ఇదుగో ఇలా పెళ్ళి, పిల్లలు, సంసార జంఝాటంలో పడిపోయాం. అయినా ఏదో బాగానే జరిగిపోతోందిలే... చిన్న చిన్న చికాకులు ఏవో ఉండకపోవు"

ఈశ్వరి నవ్వుతూ చెబుతున్న మాటలకి సుందరి చుర్రున చూసింది.

"నీకేం... మీ ఆయన మంచి హోదాలో ఉన్నాడు. ఆ సంపాదన, అంతస్థుకైనా కాస్త గౌరవం ఇవ్వకపోతే ఎలా? మాలాంటి వాళ్లకి వచ్చేవి పెద్ద పెద్ద చికాకులు, పెద్ద తలనొప్పులేలే"

అనాసక్తంగా కూర్చున్నా సంభాషణంతా భారతి చెవుల పడుతూనే ఉంది. తల త్రిప్పి శారద వైపు చూసింది ఆమె ముఖంలో పలుచని చిర్నవ్వు పరుచుకుని ఉంది. ఆమెలో కన్పించే వయసుకి మించిన గాంభీర్యం భారతిని ఆమె వైపు లాగుతూంటుంది.

సుందరి అలా అంటుందేమిటి? మంచి హోదాలో ఉండి, బాగా సంపాదిస్తున్న భర్తనైతే భార్య గౌరవించేస్తుందా? అంతకు మించి భర్త అన్న వ్యక్తిలో మరే అర్హతా కోరుకోదా?

ఇలాంటి అభిప్రాయం తానింతకుముందు వినలేదే...! వినడానికే వెగటుగా ఉంది. మనసంతా చేదు చేదుగా అన్పిస్తోంది భారతికి.

"పద భారతీ, పోదాం"అంటున్న సుభాషిణి పిలుపుక్కానీ టైము గమనించలేదామె.

❖❖❖

"ఏమిటంత స్పీడు? నేను వచ్చి కూర్చునే వరకూ ఆగలేవూ? ముందుగా వడ్డించొద్దని నీ కెన్నిసార్లు చెప్పాను" విసురుగా కుర్చీలాక్కుని కూర్చున్నాడతను.

టేబిల్ మీద అన్నీ ఉన్నా పొరపాటున కూడా అతను వడ్డించుకోడు.

తనూ అతనితో పాటు ఉద్యోగానికి వెళ్లవలసినదే. ముందూ వెనుకా ఎన్ని సర్దుకుంటే టైముకి అందుకోగలదు? తెల్సుండీ అదో రకం సాధింపు.

అసలీ వడ్డించడాలు, అందించడాలు అన్నీ ఇంతగా పాటించడం తను అత్తవారింటి కొచ్చాకే చూసింది.

ప్రకాష్ తల్లి ఆడ, మగ విచక్షణ ఖచ్చితంగా పాటించాలనే సంప్రదాయపు మనిషి. అలా అనీ కోడలు ఇంటి పట్టున చల్లగా కూర్చుని ఇంటి పనులు చూసుకుంటే చాలనుకోదు. ఉద్యోగం చేస్తూ ఇంటి ఆర్థిక స్థితిగతుల్ని చూసుకోవాలంటుంది.

"ఎన్నాళ్ళయినా ఈ వంట ఇంతకంటే బాగా చేతనవదా? కడుపు నిండా తినేందుక్కూడా లేదు. ప్రొద్దున లేచిన దగ్గర్నుంచి పరుగులు. ఒక్కటీ శ్రద్ధ పెట్టి చెయ్యవు" అతని ధోరణి కొత్తకాదు. తను నోరు విప్పకపోతే అతనింకేదో అంటాడు.

"పరుగులు పెట్టకపోతే ఎలా అవుతుంది నాకు? పనిపిల్ల రాక ఆ పనీ నా మీద పడింది"

"ఆс... చేస్తున్నావులే మహా ఉద్యోగం. లోకంలో ఎందరు చేయడంలేదు ఇంతోటి వుద్యోగం. పైగా పసిపిల్లలతో చేసుకు మరీ వస్తున్నారు"

ప్రకాష్ వెళ్ళిపోయాడు. టిఫిన్ బాక్స్ తీసుకుని బస్టాపు వైపు బయల్దేరిందామె. ప్రొద్దున లేస్తూనే మనసులో ప్రశాంతత హరించి మరీ వదలి పెడతాడు... ప్చ్!

అతని స్వభావం తెల్సీ ఎంత వద్దనుకున్నా ఆలోచనలు వదిలిపెట్టవు. ముందు ఈ ఆలోచనలకి తల ఒగ్గడం మానుకోవాలి. ఎంత మాటన్నాడు?

"పిల్లలతో కూడా తెములుచ్చుకుని ఉద్యోగాలకెళ్తున్నారట"

అతని చెల్లెలి బాధ్యత తీరేవరకు పిల్లలే వద్దన్నాడు. ఏ చెల్లెలి పెళ్ళికి ఆగాడో ఆమె పురిటికి రాబోతూంది.

అతనేమిటో ఇన్నాళ్ళయినా తనకి అర్థం కాదు. తామిద్దరి మధ్య ఇంతంత దూరాలున్నా యెందుకు? భారతి మనసంతా భారంగా తయారైంది. ఎక్కవలసిన బస్సు రావడంతో నిర్లిప్తంగా బస్కెక్కి కూర్చుంది.

❖❖❖

ఆ రోజు శారద కూతురి పుట్టిన రోజు. ఆ వేడుక అంత ఆర్భాటంగా జరగడం భారతికి కాస్త ఆశ్చర్యంగానే అన్పించింది.

భారతి మనసులో సందేహం సుభాషిణినోట ప్రశ్న రూపంలో రానేవచ్చింది.

“శారదగారూ! మీరు ఇంత సింపుల్‌గా ఉంటారు. మీ ఇంట్లో ఫంక్షన్ ఇంత పెద్ద ఎత్తున జరగడం ఆశ్చర్యంగా ఉందండీ”

శారద నవ్వుతూ చంద్రవైపు చూసి మరో పని అందుకునే ప్రయత్నంలో పడింది.

ఆమె భర్త చంద్ర సమాధానం చెప్పాడు.

“ఈ విషయంలో శారద నా కోసం ఒప్పుకుందండీ. ఆవిడకి నచ్చని విషయాల్లో ఇదొకటి. కాని నా సరదా కోసం తను ఇబ్బంది పడైనా సహిస్తుంటుంది ఇలాంటివి. మీకు తెల్సుగా తనది పుస్తక ప్రపంచం. నాకిలాంటి సందడి, స్నేహితులే ప్రపంచం” అందరితో పాటు భారతి ఆశ్చర్యంగా చూసింది శారదను.

ఆమె మాత్రం ఐస్‌క్రీమ్ కప్పుల్ని ట్రేలో సర్దటంలో నిమగ్నమై ఉంది.

భారతి అతని జవాబుని అర్ధం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. నిజంగా ఎంత చక్కని అవగాహన! ఎదుటి మనిషిని తన ఇష్టాలకు అనుగుణంగా మలుచుకోవాలని నిర్బంధంగా ప్రయత్నించడమే కాని సామరస్య పూర్వకంగా ఒక అవగాహనకు వచ్చేందుకు ఎన్ని జంటలు ప్రయత్నిస్తున్నాయి! తన మాట మాత్రం నెగ్గాలన్న అహం! అసలు సమస్య లన్నింటికీ అహం కాదూ కారణం?! తానొక మెట్టు దిగి చేతిని అందిస్తే స్నేహ పూర్వకంగా అందుకునే యత్నం ఎదుటి వ్యక్తి కాస్త ఆలస్యంగా అయినా చెయ్యడూ?

బస్టాప్‌లో సడన్‌గా జ్ఞాపకం వచ్చింది భారతికి – పార్టీకి వెళ్ళి తాను లేటుగా వస్తానన్న సంగతి ప్రకాష్‌తో చెప్పనేలేదు. ప్రతీది పద్ధతిగా జరగాలనే అతనెంత చిరాకు పడతాడో తనకు తెల్సు. ఈ ఉరుకుల పరుగుల మధ్య తాను ప్రతి విషయం సరిగా జ్ఞాపకం వుంచుకోలేకపోతోంది.

“శారదా వాళ్ళాయన చూడు, ఎంత తెలివిగా జవాబు చెప్పాడో. తామిద్దరూ గొప్ప ఆదర్శదంపతుల మన్నట్లు మనందరి ముందు పెద్ద ఫోజు” సుభాషిణి మాటల్ని ఖండిస్తూ....

“ఛ... అలా అంటావేమిటి సుభా. వాళ్ళిద్దరూ ఒకరి కోసం ఒకరన్నట్లుగా ఉన్నారు”

“సర్లే. నీలాంటి పిచ్చి మొద్దుకి అలాగే అన్పిస్తుంది. తనిష్ట ప్రకారం పార్టీ జరుపుతూ ఎంత గడుసుగా మాట్లాడాడో చూడు. హిపోక్రసీ”

సుభాషిణి వ్యాఖ్యానానికి భారతి నొచ్చుకుంది. ఆ వ్యాఖ్యలో నిజముంటే నిత్యం తన కంటపడే శారద ముఖంలోని ప్రశాంతత. అదీ అంత సహజంగా సాధ్యమేనా?

మరి.... తన సంగతి? ప్రకాష్ గురించి ఆలోచనరాగానే ఆమె మనసు ముడుచుకు పోయింది. తామెందుకిలా ఉన్నారు? అవగాహన కాక అతని పట్ల తనకెందుకీ అసహనం?

“భారతీ! ఏమిటి నీ ఆలోచన? ఇంకా ఆ విషయమేనా?”

"సుభా! నువ్వు తప్పుగా ఆలోచిస్తున్నావే. శారద, ఆమె భర్త ఒకరి అభిప్రాయాల్ని ఒకరు మన్నించుకుంటున్నారు. సహజీవనానికి చక్కని నిర్వచనం చెబుతున్నారనిపించింది నాకు"

"ఒకరి ఇష్టాలనొకరు మన్నించుకోవడం కాదక్కడ. ఒకరితో ఒకరు రాజీపడి వ్యక్తిత్వాలు చంపుకు బ్రతుకుతున్నారు. పైగా అదో ఆదర్శంట" సుభాషిణి గొంతులో కాఠిన్యం.

గత పదేళ్ళుగా ఒకే చోట కల్సి చదువుకుని, ఒకేచోట పనిచేస్తున్నా స్నేహితురాలి మనస్తత్వం ఒక్కోసారి అంతుబట్టదు భారతికి.

చుట్టూ ప్రపంచంలో నిత్యం ఎదురయ్యే హిపోక్రసీని చూసి చూసి ఆమె తోటి మనుష్యుల పట్ల ఒకలాంటి శతృత్వం పెంచుకుంటోందనిపిస్తోంది భారతికి.

శారద, చంద్రలను చూశాక భారతి ఆలోచనలు మరో దోవ పట్టాయి.

ప్రకాష్ పట్ల తను మాత్రం ఏం సానుభూతితో ప్రవర్తిస్తోంది...తనకి నచ్చనివి మాత్రమే ఎందుకు చూస్తోంది?

"సుభా! ఆపవే. ఒకరితో ఒకరు కొంత వరకైనా రాజీ పడకపోతే ఏ ఇద్దరు మాత్రం సహజీవనం చెయ్యగలరు? మనం హాస్టల్‌లో ఉన్న రోజులు ఒక్కసారి జ్ఞాపకం చేసుకో. వర్షంలో తడవడం నీ కెంత అసహ్యమైనా నా కోసం ఆ చినుకుల్లో ఎన్నిసార్లు బీచ్ వరకూ తోడుగా రాలేదూ! సినిమాలంటే నాకెంత చిరాకైనా నీ కోసం ఎన్నిసార్లు క్లాసులు కూడా బంక్ చేసి సినిమాహాళ్ళ చుట్టూ తిరగలేదు?! అంత మాత్రాన మనం మన వ్యక్తిత్వాలేం చంపుకోలేదే. నీ కోసం నేను, నా కోసం నువ్వుచేసే ఈ త్యాగాలు మనకెంత గర్వంగా అనిపించేవో నీ కసలు గుర్తుందా? కల్సిబ్రతుకుదాం అని నిర్ణయించుకున్న జంట ఒకరి ఇష్టాలు ఒకరు మన్నించుకునే సంస్కారం నేర్చుకుంటే జీవితం ఎంత అందంగా ఉంటుంది! అర్ధంలేని అహాన్ని ఒక్క పిసరు ఆవలకు విసిరి మనసుల నెందుకు విశాలం చేసుకోకూడదో చెప్పు" ఉద్వేగంతో భారతి కనులు, గొంతు తడిబారాయి.

స్నేహితురాల్ని విస్మయంగా చూసింది సుభాషిణి.

బస్సు దిగిన భారతి మనసులో రకరకాల ఆలోచనలు. ప్రకాష్‌కి ఇంటా బయటా వున్న సమస్యలు తెల్సి తనెందుకు ఇన్నాళ్ళూ అతని వైపు నుండి ఆలోచించలేదు? అర్ధం చేసుకుందుకు ఒక్క ప్రయత్నమూ చెయ్యలేదు?!

ఇంటిగుమ్మం ఎక్కబోతున్న భారతి కంటికి వరండా అంచున నిలబడి చూస్తున్న ప్రకాష్ కన్నుల్లో తన రాకకోసం అతను పడిన ఆత్రమే కన్పించింది.

**('రచన' జూలై 1998)**

# ఒక సందర్భం

తెల్లవారుతూనే ఇంటిముందు దిగిన ప్రసాదుని చూసి ఇంట్లో మళ్ళీ ఒక కదలిక వచ్చింది. అప్పటికే లేచి మొదటి కాఫీ త్రాగుతున్న ప్రసాదు అక్కలిద్దరూ గబగబా ఎదురొచ్చారు. మరదలు ఉష వార్త ఇంట్లోకి పట్టుకెళ్ళింది.

"ఏరా! కబురు తెలిసిన పది రోజులకి ఇప్పటికి వచ్చావా?" చిన్నక్క ప్రశ్నలో చిన్న నిష్ఠూరం లేకపోలేదు.

ప్రయాణపు బడలికతో కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటున్న ప్రసాదు నిస్సహాయంగా చిన్న నవ్వు నవ్వాడు. అతనికి తెలుసు ఈ ప్రశ్న ఎదుర్కోవలసి వస్తుందని.

కాని తను మాత్రం ఏం చేస్తాడు? ఉన్న పళాన సెలవు మీద వచ్చెయ్యాలంటే ఎలా? పొట్ట చేత పట్టుకుని దేశంకాని దేశంలో ఉంటున్నాడు.

ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితులకి ఉద్యోగ భద్రత ఎక్కడ మాత్రం ఉంది! ఆలోచనలు విదిలించుకుని, 'అమ్మ ఎలా ఉంది?' అంటూ లేచి లోపలికి నడిచాడు.

విశాలమైన ఇల్లు. అంతే విశాలమైన పెరడు. ప్రసాదు చిన్నతనం అంతా గడిచిన ఇల్లు. పెరట్లోకి వెళ్లాడు కాళ్లు కడుక్కుందుకు. ఒక్క క్షణం తెలియని హాయేదో అతన్ని కమ్మేసింది. అదేమిటో అర్థంకాక ఆశ్చర్యపడ్డాడతను.

అతనితో పాటు అక్కచెల్లెళ్లు, తమ్ముళ్ళు, మరదళ్ళు అందరూ తల్లి మంచం చుట్టూ చేరారు.

కొడుకు చేతుల్ని పుచ్చుకుని అలా ఆరాటంగా అతని వైపే చూస్తుండిపోయింది మహాలక్ష్మమ్మ. దాదాపు ఎనభైయేళ్ల వయసులో అనారోగ్యంపాలై పిల్లలందర్నీ ఒక్కసారి చూస్తే ఇక ఈ జన్మకి విముక్తి అనుకుందావిడ.

దేశంలో లేని పెద్ద కొడుకు కోసం తపించింది. ఇదుగో వస్తున్నాడంటూ చెబుతూనే ఉన్నారు. ఆసుపత్రిలో మరుపు చెరుపుల మధ్య ఆశనిరాశలతో కొడుకుకోసం వారం పాటు కొట్టుకుందా ప్రాణం.

డాక్టర్లే ఆశ్చర్యపోయేలా మళ్ళీ తేరుకుంది. డిశ్చార్జ్ అయి ఇల్లు చేరింది.

పది రోజుల్నుండి ఇల్లు పెళ్ళివారిల్లులా ఉంది. జనంతో నలుగురున్న కుటుంబం. వండి పెట్టేందుకు, ఇంటాబయట పనులకు చేతిలో మనుషులున్నారు. పెళ్ళిళ్ళయ్యి ఎక్కడెక్కడో స్థిరపడిన పిల్లలంతా కల్సి రావడం అనేది ఎప్పుడో కాని సందర్భ పడటమే లేదు. వాళ్ళు సంసారబాధ్యతలతో, ఉద్యోగ బాధ్యతలతో కూరుకుపోయున్నారు మరి.

ఎన్నేళ్ళ తర్వాతో కొడుకుని చూసిన ఉద్వేగంతో మాట పెగలనేలేదు. కళ్ళతోనే కుశలం అడిగిందావిడ. కోడలు, పిల్లలు కన్పించలేదన్న నిట్టూర్పు గొంతులోనే నిలిచిపోయింది.

ప్రక్కనే వాలు కుర్చీలో మౌనంగా కూర్చున్న తండ్రిని పలకరించాడు ప్రసాదు.

“నాన్నా! మీ ఆరోగ్యం బావుంటోందా?”

“ఊ’ అంటున్న తండ్రిని పరికించి చూశాడు. అంత గంభీరమైన మనిషిని వయసు బాగా కృంగదీసింది. బాగా వడిలిపోయి ఉన్నారాయన.

భార్య అనారోగ్యంతో హాస్పిటల్ పాలవడంతో ఆయన బలం అంతా ఎవరో లాగి పారేసినట్లయిపోయింది. ఇంటినిండా కూతుళ్ళు, కోడళ్ళు తిరుగుతూ ఆయనకి కావలసినవి వేళకి అమరుస్తూనే ఉన్నారు. అయినా ఆయన పడుతున్న వ్యథ ఎవరితోనూ చెప్పుకోలేనిది.

❖❖❖

“ఏరా అన్నయ్యా, వదిన్ని కూడా తీసుకు రావలసింది. పిల్లవాడు మ్యానేజ్ చేసుకోగలడు కదా” చెల్లెలు వాణికి జవాబుగా, “కిరణ్‌కి సెలవు దొరకలేదే...తనూ రావాలనుకుంది. చాలా యేళ్ళయింది ఎటూ అందర్నీ చూసి” ప్రసాదు మాటలకి...

‘సెలవులు ఎవరికి మాత్రం ఇస్తున్నార్రా? ఇది ఎలాంటి సందర్భం మరి. అమ్మ లేచి బట్ట కడుతుందని డాక్టర్లు కూడా అనుకోలేదు రా... ఎలాగోలా ఎమర్జెన్సీ అని రావాల్సిన మాట’ పెద్దక్క కాస్త సీరియస్‌గానే చెప్పింది.

అతని దగ్గర సమాధానం లేదు మరి. సడన్‌గా అక్కడి వాతావరణం ఇబ్బందికరంగా తోచింది.

ప్రొద్దున్నే టిఫెన్ పళ్ళేలతో డైనింగ్‌హాల్లో చేరిన అందరూ సడన్‌గా ప్రయాణం అయి రావడానికి ఎంతెంత ఇబ్బందులు పడ్డారో చెప్పుకొస్తున్నారు.

స్వంతఇంట్లో అత్తమామల మధ్య ఉన్న రెండోకోడలు జయ అందరి మాటలు మౌనంగా వింటూ, ఎవరికి కావలసినవి వారికి అందిస్తోంది.

వంటావిడకి అవసరమైన పురమాయింపులు చేస్తోంది. అత్తగారి గదిలోకి వెళ్ళి ఆవిడకు కాలసినవి అమర్చి, మామగారు తిన్న ఇడ్లీ పళ్ళెం తెచ్చి పెరట్లో వేసింది.

పనులు చేసి పెట్టేందుకు చేతిక్రింద మనుషులున్నా ఎవరికి ఎప్పుడు ఏది అమర్చాలో చూడడం, పాలు, పెరుగు, అవసరమైన సరుకులు చూసి తెప్పించుకోవడంతో ఊపిరి పీల్చుకుందుక్కూడా టైము దొరకడం లేదు.

తల్లికి కాస్త బావుందీ, ఇంట్లో అందరూ ఉన్నారన్న ధైర్యంతో భర్త రవి ముఖ్యమైన ఆఫీసు పనిమీద క్యాంపు కెళ్ళాడు. అందుకేనేమో ఇంత మందిలో తిరుగుతున్నా ఒంటరితనం తోస్తోంది. అయినా ఇంట్లో అందరి మధ్య తిరగడం ఒక తెలియని సుఖాన్ని, ధైర్యాన్ని ఇస్తోంది.

ప్రొద్దున్నే కాఫీ, టిఫెన్లు అయ్యాక ఎవరికి వాళ్లు చిన్నచిన్న గ్రూపులుగా విడిపోయి లోకాభిరామాయణంలో పడ్డారు.

మహాలక్ష్మమ్మ అటుగా వచ్చిన పనిపిల్లని దగ్గరగా పిలిచింది.

“పిల్లలంతా ఏరీ?”

‘అందరూ డైనింగ్‌రూమ్‌లో టిఫెన్లు చేస్తూ మాట్లాడుకుంటున్నారమ్మా” ఆవిడ మనసంతా ఒక రకమైన ఆనందం నిండి పోయింది.

పిల్లలంతా కలసి ఒకేసారి ఇంటికి వచ్చి ఎన్నేళ్ళయిందో అని ఆలోచనలో పడింది.

దాదాపు పదిహేనేళ్ళు...ఆఖరివాడు శేషు పెళ్ళికి కాదూ అందరూ కలిసింది.

ఎవరికీ టైములు కుదరవు. అందరూ కలిసి కంటినిండుగా వచ్చి వెళ్ళండిరా అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ చెవిన పెట్టరు. ఉద్యోగాలు, దూరభారాలు, కుటుంబ బాధ్యతలు...ఇలా అందరికీ కలిసి వచ్చి ఉండాలంటే తీరడమే లేదు.

ఆవిడ పెళ్ళయి కొత్త కోడలుగా ఆ ఇంట అడుగుపెట్టింది. మరుదులు చిన్నవాళ్లు, ఆఖరి ఆడపడుచు పెళ్ళి తమ చేతిమీదే జరిగింది. జీవితం అంతా ఆ ఇంటి బాధ్యతల మధ్య నడిచిపోయింది.

అత్తింటి బాధ్యతలు పూర్తయేసరికి కడుపున పుట్టిన పిల్లలు ఎదిగారు. వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు, పురుళ్ళు... ఒకటేమిటి? ఆఖరికి ఇద్దరు మనవరాళ్ళకి కూడా ఇంట్లోనే పురుడు పోసిందావిడ.

తనేనా అన్నీ చేసింది?! తల్చుకుంటే నమ్మబుద్ధి కాదు.

మామగారి పూజకావలసిన సామాగ్రి దగ్గర్నుంచి అమర్చేది. ఏ క్షణాన ఎలాంటి మూడ్‌లో ఉంటాడో తెలియని భర్తతో ఎన్నిరకాల అనుభవాలు! విసుగులూ, అవమానాలే తెల్లారిలేస్తే. ఏనాడూ ఒక మెప్పుదల ఎరగదు. విరక్తి అన్పించే మనసుకి సర్ది చెప్పుకుంటూ ఉండేది. ఇంటిగుట్టు మనసు వరకే.

తన చేతులతో ఇంతమందిని పెంచింది. వచ్చి పోయే బంధువులకి వండి వార్చింది. అందరి అవసరాలు తీర్చింది. వయసు క్రమంగా శరీరాన్ని కృంగదీస్తూ వచ్చింది.

ఇప్పుడిక తన పనులు చేసుకుంటూ, భర్తకావలసిన సేవలు చేస్తూ చేతనైన పూజా పునస్కారాలతో రోజులు వెళ్ళదీస్తోంది. ఇంతలో ఇలా జబ్బు పడటం...

ఆసుపత్రి నుండి వెనక్కి వస్తుందని అనుకోలేదు. ఇక ఇది ఆఖరి ఘట్టమనే అనుకుంది. ఈ వృద్ధుడు కాలం ఎలా గడుపుకుంటాడో అని తల్లడిల్లిపోయింది. అందుకేనేమో ప్రాణం వెనక్కి తిరిగొచ్చింది.

ఇల్లంతా ఇంత నిశ్శబ్దంగా ఉందేం? పిల్లలంతా ఏమైపోయారు. ఇలా వచ్చి కూర్చుని కబుర్లు చెప్పుకోరాదూ? లేచివెళ్లి వాళ్ళ మధ్య కూర్చునే శక్తి ఇంకా శరీరానికి చేకూరలేదు.

ఆవిడ మనసులో ఒకటే ఆరాటం. పిల్లలంతా కళకళలాడుతూ తిరుగుతున్న ఆ ఇంట్లో తనూ కలియదిరుగుతూ, తన చేత్తో వండి, వడ్డించి వాళ్లు తింటుంటే చూడాలి. త్వరగా శక్తి రావాలి. లేచి పిల్లల్ని చూసుకోవాలి. ఆలోచనల మధ్య ఎప్పుడో నిద్రలోకి వెళ్ళిపోయిందావిడ.

❖❖❖

వాలుకుర్చీలో కళ్లు మూసుకు పడుకున్న నరసింహంగారి ఆలోచనలు కూడా భార్య ఆలోచనలకి విరుద్ధంగా లేవు. పిల్లలందర్నీ చుట్టూ కూర్చోబెట్టుకుని వాళ్ళని వినాలని వుంది. కాని అంత చనువుగా తనను చుట్టుముట్టి కబుర్లు చెప్పే అలవాటు పిల్లలెవ్వరికీ లేదు. ఆయన పెంచిన తీరు, ఆ డిసిప్లిన్ ఇన్నేళ్ళ తర్వాత కూడా అలా చెక్కు చెదరకుండా ఉంది.

తన తండ్రి పెద్ద వయసులో ఆయన్ని, ఇంటినీ కనిపెట్టుకు ఉండటమే కాక ఆయన బాధ్యతలన్నీ తన భుజం మీద వేసుకున్నాడు. ఈ కాలానికి పిల్లలంతా ఉద్యోగరీత్యా తలో దిక్కూ వున్నారు. రెండో కొడుకు రవి కుటుంబం మాత్రం ఉద్యోగరీత్యా తాత్కాలికంగా తమ దగ్గర వుండే అవకాశం వచ్చింది. ఏ ట్రాన్స్‌ఫరో వచ్చి వాళ్ళు వెళ్ళిపోతే ఇల్లంతా బావురుమంటుంది. రోజులు గడుస్తూనే ఉంటాయి. కాని స్వంత ఊళ్ళో, స్వంత ఇంట్లో పిల్లలతో కలిసి జీవించగల్గితే ఎంత బావుంటుంది. విచిత్రం.,

ఇదివరకెప్పుడూ ఇలాంటి ఆలోచనే రాలేదు. పిల్లల బాధ్యతలు తెమిలి, వాళ్ళని వాళ్ళ జీవితాల్లోకి పంపేశాక భార్యతో తృప్తిగా చాలా యేళ్ళే జీవించారాయన. ఇప్పుడెందుకో పిల్లలందరూ నిత్యం ఇలా తమ చుట్టూ ఉంటే బావుణ్ణని ఉంది. అది తీరని కోర్కె అని తెలుసు. కాని మనసు ఆశపడటం మానదు కదా.

❖❖❖

'ఏరా ప్రసాదూ! ఇండియా వచ్చి సెటిలవుతావా? నీ కూతురి పెళ్ళి కూడా చేసేశావు. కొడుకు ఉద్యోగస్తుడయ్యాడు. నువ్వూ, మీ ఆవిడా ఇన్నేళ్ళూ సంపాదించింది చాలదా ఏమిటి?'

పద్మక్క మాటలకి ప్రసాదు ఒక్క క్షణం జవాబివ్వలేదు. ఏం చెప్పాలి? ఇండియా వచ్చి సెటిలవడం తామిద్దరూ ఎప్పుడూ ఆలోచించలేదు. పిల్లలిద్దరి భవిష్యత్తు అక్కడే ముడిపడి వుంది. తమకింకా రిటైర్‌మెంటు వయసూ రాలేదు. అయినా వెనక్కొచ్చి ఇక్కడ చేసేది మాత్రం ఏముంది?

ఇలాంటి ప్రశ్నలు,వ్యాఖ్యలు వింటుంటే అసహనంగా ఉంది. ఇక ఇలాంటి సందర్భాలు రాకుండా వుంటే బావుణ్నని వుంది. ఇన్నేళ్ళుగా ఎవరి జీవితాలు వాళ్ళు బిజీగా గడిపేస్తున్నారు. ఇకపై మాత్రం గడవదా?

"ఏరా! కిరణ్‌కిష్టంలేదేమిటి... ఇండియాలో సెటిలవడం?"

"ఆవిడవరకూ ఎందుకక్కా...వీడికే ఇష్టం ఉన్నట్లు లేదు' రెండో అక్క మాటలకి అతని మనసు చివుక్కుమంది.

"అలాంటిదేం లేదు. మేమింకా ఏమీ ఆలోచించుకోలేదు. చూడాలి" అన్నాడు అప్పటికి దాటవేస్తూ. తమ్ముడు చిన్నబుచ్చుకున్న మొఖంతో జవాబివ్వడం చూసి పద్మ, చిన్నక్క కూడా పశ్చాత్తాపపడ్డారు, 'అయ్యో, వాడి మనసు నొప్పించామేమో' అని. కాని ఒప్పుకుందుకు పెద్దరికపు అహం అడ్డొచ్చి ఊర్కున్నారు. తమ్ముడు వచ్చేసి తమకి దగ్గరగా ఉండాలన్న ఆరాటం మాత్రం మనసంతా ఉంది.

తన కూతురు రూప పెళ్లి చెయ్యడం వరకే తెల్సు వీళ్ళందరికి. ఆ తర్వాత వచ్చిన సమస్యలు, కూతురి జీవితం చక్కదిద్దేందుకు తాము పడ్డపాట్లు ఎవరికీ తెలియదు. కొడుకు చదువు మధ్యలో వచ్చిన ఇబ్బందులు, ఆ యాతన... నిట్టూర్చాడు. మెల్లిగా చిక్కులు వీడి అంతా సర్దుకుంది ఇప్పుడిప్పుడే. ప్రసాదు ఆలోచనల్లోంచి బయటపడి తనూ కబుర్లలో పడ్డాడు.

వాణి అంటోంది.

'వదినా! ఇంటి పెత్తనం అంతా నీదే కదూ. మహారాణిలా ఉన్నావు. పెరట్లో, వాకిట్లో

పని వాళ్లు, వంటింట్లో వంటావిడ, అన్నింటికీ నీ మీద ఆధారపడిన అత్త మామలు, అదృష్టం అంటే నీదే'.

జయ నవ్వి ఊరుకుంది. తోటి కోడలు ఉష మాత్రం ఊరుకోలేకపోయింది.

"నిజంగా, వాణి వదినా, జయక్క చాలా అదృష్టవంతురాలు. స్వంత ఊళ్ళో స్వంత ఇంట్లో హాయిగా ఉంది. పిల్లల చదువులకి సెపరేటు రూమ్స్, అన్నీ అమర్చేందుకు చేతిలో మనుషులు, అక్కడ మేము అద్దె ఇంట్లో అన్నింటికి సర్దుకుని బ్రతికెయాల్సిందే. బాబుగాడు హైస్కూల్ చదువుకొచ్చాడు. చిన్ని కూడా ఏడేళ్ళ పిల్ల. ఇద్దరికీ ఒక్కక్షణం పడదు. చదువుకున్నా, ఆడుకున్నా, పడుకున్నా ఆ గదిలోనే వాళ్ళు. సిటీలైఫ్ అంటే విసిగి పోతున్నామనుకో". ఆమె మాటల్లో కాస్త ఈర్ష్య తొంగి చూడకపోలేదు.

"మీరూ హాయిగా బదిలీ చేయించుకు వచ్చెయ్యండి. ఇంత ఇల్లుంది మన ఊళ్ళో" వదినగారి మాటలకి...

'అంత అదృష్టం ఉండొద్దూ, బదిలీ కావాలంటే మాకెవరిస్తారు?' ఉష మాటల్లో నిజాయితీ ఎంత ఉందో ఆమెకే తెల్సు. సిటీ జీవితం పట్ల ఆమెకున్న వ్యామోహం అలాంటిది.

పిల్లలు నాలుగు రకాల భాషలు మాట్లాడుతూంటే గర్వంగా ఉంటుందామెకి. అదీ కాక స్టేట్స్‌లో ఉన్న తన అక్క పిల్లల ముందు తన పిల్లలు ఎక్కడా తీసిపోకూడదని పంతం.

"లక్ష్మక్కా, మీ రెండో వాడిది లవ్ మారేజ్ కదా. ఆ అమ్మాయి మీతో బాగా కల్సిపోయిందా?" వాణి కుతూహలంగా అడిగింది.

"అయ్యో రామ, ఏం చెప్పమంటావ్? వాడికి నచ్చింది, వాడి ఇష్టానికి వ్యతిరేకంగా మేమూ ఏమీ చెప్పలేక పోయాం. వాడెక్కడ నొచ్చుకుంటాడో అని ఇదేమిటని కూడా అడగలేదు. అవతల ప్రక్క ఆ అమ్మాయి తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. ఇంత చేసి చక్కగా పెళ్ళి చేసి, ఇంట్లో పెట్టుకుంటే ఎంత సేపూ తన పుట్టింటి గొప్పలు. 'మా అమ్మయితే ఇలా చేస్తుందాంటీ, అలా చేస్తుందాంటీ' అంటూ ఒక్క వరస చెప్పుకొస్తుంది. ఇక్కడి వస్తువు అక్కడ పెట్టదు. తన ఉద్యోగం, తన లోకం అంతే"... ఆవిడ మాటలో మాత్రమే నిష్టూరం వినిపిస్తుంది. మనసు మాత్రం మరో విధంగా ఆలోచిస్తుంది.

అత్తవారింట చంటి పిల్లలతో ఉద్యోగ బాధ్యతలతో, ఇంటి పనులతో గిలకలా తిరిగే జ్యోతి గుర్తొస్తుంటుందావిడకి. కూతుర్ని తెచ్చుకుని నాల్గు రోజులు చేసి పెడదామన్నా రావడానికే ఆ పిల్లకి కుదరదాయె.

కూతుర్ని చూసి గర్వ పడుతూంటుంది. సవ్యసాచిలా ఇంటాబయటా నెగ్గుకొస్తున్న కూతుర్ని చూసి మురిసిపోతుంటుంది. తన కూతురిలా నలిగిపోకూడదని కోడల్ని

అపురూపంగా చూసుకుంటుంది. ఒక్కోక్షణం మనసు బలహీనపడి కూతురి కోసం దిగులు పడుతూంటుంది.

ఇవన్నీ అందరికీ తెలుసున్నవే. అంతెందుకు? మరదళ్ళని కూడా ఆప్యాయంగా చూసుకుంటుంది.

'వాణీ! ఇంతకీ మీ మరదికి సరైన ఉద్యోగం వచ్చిందిటే' పద్మ ఆరాగా అడిగింది.

'సరైన ఉద్యోగం అనడం ఎందుకు. అత్తగారి గారంతో కొంత, క్రికెట్ పిచ్చితో కొంత చదువుకొనే రోజుల్లో చేసిన అశ్రద్ధ అతన్నలా ఎదగనీయకుండా ఉంచేసింది.

ఒకప్పుడు క్రికెట్ ప్లేయర్‌గా ఉద్యోగం తెచ్చుకున్నాడు. కొన్నాళ్ళు టోర్నమెంట్లూ, అవీ అంటూ తిరిగేడు. ఎడమచేతి మణికట్టుకి దెబ్బ తగలడం, ఆ దెబ్బ మానక చెయ్యి స్వాధీనం లేక కొంతకాలం...ఇప్పుడిక పూర్తిగా ఆడటమూ మానేసినట్లే.

మేనరికం ఉందని పెళ్ళి చేసారు. ఒక కొడుకు.చాలీచాలని జీతం, పెరుగుతున్న ఖర్చులు... మా అత్తగారూ రోజూ గొడవే, 'వాడికి కాస్త నెలనెలా ఏదైనా పంపాలిరా, ఇబ్బంది పడుతున్నాడు' అంటూ.

ఇక్కడ మా ఇబ్బందులు ఆవిడకు పట్టవు. పోనీ ఆస్తులు ఏమైనా ఉన్నాయా అంటే ఏమీలేవు కదా. నెలనెలా వెసులుబాటు చేసుకుని ఎంతో కొంత పంపుతూనే ఉన్నా ఆవిడ ప్రేమ, సానుభూతి మాత్రం మరిది కుటుంబం వరకే. నేనూ, నా పిల్లలూ ఏమీ కాని వాళ్ళమే ఎప్పుడూ" వాణి గొంతులో ఉక్రోషం.

రక్త సంబంధీకుల మధ్య తన గోడు చెప్పుకుని కాస్త ఊరట చెందాలన్న తాపత్రయం.

జయ ఆలోచిస్తోంది. వీళ్ళందరూ తనకు ఇరవై యేళ్ళుగా తెల్సు. అందరూ మంచి మనసులున్న మనుషులు.

తన భర్త రవి ఆఫీసులో చెయ్యని నేరానికి సస్పెండైనప్పుడు ప్రసాదు బావగారు, మరిది శేషు, ముగ్గురు ఆడపడుచుల భర్తలూ ఎంతగానో ఆదుకున్నారు. తన పుట్టింటి వరకూ విషయం వెళ్లకుండా అందరూ నాల్గువైపులా తమను కమ్ముకున్నారు. ఆఫీసులో భర్త కట్టవలసిన డబ్బు నాలుగు చేతులు వేసి కట్టేసేరు.

స్వంత ఇంటికోసం కట్టబోయిన అడ్వాన్సు డబ్బు పెద్ద ఆడపడుచు భర్త తమ అవసరం కోసం తెచ్చి ఇచ్చి, ఇంటిని కొనడాన్ని వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత తమ పరిస్థితులు చక్కబడ్డాయి. రవి సమస్య నుండి బయట పడ్డాడు.

ఇన్నేళ్ళుగా జరిగిన ఏ సంఘటనా తన జ్ఞాపకాల్లోంచి జారిపోలేదు. పోదుకూడా.

అందరూ కల్సి కూర్చున్న క్షణాల్లో ఎక్కడెక్కడి ఉక్రోషాలూ బయటకొస్తాయేమో.

'ఏం వదినా! ఈ పూట 'టీ'లు లేవా ఎవరికీ?'

వాణి మాటలకి ఉలిక్కి పడి లేచింది.

'నేనూ వస్తున్నా జయక్కా' అంటూ ఉష కూడా వెనకే వెళ్ళింది.

అప్పటికే 'టీ'లు గ్లాసుల్లో పోసి ట్రేలో సర్దుతున్న మాణిక్యమ్మ వీళ్లని చూసి పలకరింపుగా నవ్వింది.

❖❖❖

మహాలక్ష్మమ్మ, నరసింహంగార్ల మనసులు ఓపలేని ఆనందంతో మురిసిపోతున్నాయి.

పిల్లలందర్నీ చుట్టూ కూర్చోబెట్టుకుని కబుర్లు, ఎప్పటెప్పటివో, ఎక్కడెక్కడివో... కూతుర్లు, కొడుకులు, కోడళ్ళు, మనవలు, మనవరాళ్ళు... అందర్నీ కళ్ళారా చూసుకుంటున్నారు. ఆ ముసలి శరీరాల్లోకి అంతంత ఓపిక ఎప్పుడు, ఎలా వచ్చిందో వాళ్ళకే అర్ధం కాలేదు. నాలుగు రోజుల్లో చెప్పలేనంత వుత్సాహాన్ని పుంజుకున్నాయి ఆ అలసిన శరీరాలు.

తండ్రి చనువుగా మాట్లాడటం అరుదైన విషయం. ఆశ్చర్యంగా చూస్తున్నారు. గంభీరంగా పిల్లలక్కావలసినవి అడక్కుండా అమర్చి పెట్టే తల్లి పసిపిల్లలా అన్ని కబుర్లు చెబుతూంటే అయిదు పదులు దాటిన పిల్లలు కూడా నిజంగా పసి పిల్లలై పోయారు. ఆవిడ మాట్లాడుతోంది.

'ఒరేయ్ ప్రసాదూ, రవీ, శేషూ...' అని ఒక్క క్షణం ఆగి కోడళ్ళు, కూతుళ్ళ వైపు తిరిగిందావిడ...

"....పద్మా, లక్ష్మీ, వాణీ, జయ, ఉషా! మీరందరూ ఇలా ఒక్కసారి కల్సి ఈ ఇంట్లో తిరగడం...అదీ దాదాపు పదిహేను సంవత్సరాల తర్వాత ...నాన్నగార్కి, నాకూ చాలా సంతోషంగా ఉందర్రా. అల్లుళ్ళు కూడా వీలు చేసుకు వచ్చారు. ఒక్క కిరణ్ రాలేకపోయింది. పాపం, అది మనందర్నీ మిస్ అయిపోయింది".

నానమ్మ నోటి వెంట 'మిస్' అన్న పదం విని శేషు కూతురు రమ్య అడుగుతోంది, 'నానమ్మా! నీకు ఇంగ్లీషు వచ్చా...?'

నానమ్మ హాయిగా నవ్వుతూంటే గర్వంగా ఆమెనే చూస్తుండిపోయింది.

"నా పిల్లలని చెప్పుకోవడం కాదు. మచ్చలేని చందమామలురా మీరంతా.

అందర్నీ ఒక్కసారి ఇలా చూడగలమో లేదో అని నాన్నగారూ, నేనూ ఎప్పుడూ అనుకుంటూ ఉంటాం. మళ్ళీ ఇలాంటి ఒక సందర్భం చూడగలమో లేదో తెలియదు..."

ఆవిడ గొంతు మూగబోయింది దుఃఖభారంతో.

అందరి కళ్ళూ చెమర్చాయి.

"మీ అందరికీ ఇష్టమైన భోజనం వండి పెట్టాలని, ఈ చేతులతో కొసరికొసరి తినిపించాలని ఉందిరా. ఇంకొక్క నాలుగు రోజులు పోతే ఆ ఓపిక కూడా వస్తుంది నాకు తెల్సు...."

మధ్యలో "అమ్మా...." అంటూ ప్రసాదు అందుకున్నాడు... తల్లి సెంటిమెంటల్‌గా ఆలోచిస్తోందని అనుకున్నాడు. ఆవిణ్ణి నిరాశపరచడం ఇష్టం లేకపోయినా ఉన్న విషయం చెప్పాలనుకున్నాడు.

'అమ్మా! నా ప్రయాణం ఎల్లుండే. ఒక్క వారం శెలవు దొరికింది మరి' గిల్టీగా అన్నాడు.

ఆవిడ ఉలిక్కి పడింది. నాలుగు రోజులుగా ఇంట్లో సందడి చూసి ఇదే శాశ్వతం అనే భ్రమలో బ్రతికేస్తోందామె.

'అవునే అమ్మా! నా రెండో కోడలికి నెలల నిండాయి. పురిటి రోజులు. చేసుకోలేదు. అటు వాళ్ళ అమ్మ ఎటూ వదిలేసింది. నేనూ లేకపోతే ఎలా? రేపు బయల్దేరాలమ్మా',

లక్ష్మి మాటలకి ఆవిడ మెల్లిమెల్లిగా వాస్తవంలోకి వచ్చే ప్రయత్నం చేస్తోంది.

ఉష ఆశ్చర్యపోయింది. వదినగారి మాటలకి కోడలి మీద కంప్లయింటు చెప్పిన వ్యక్తేనా ఈవిడ?

'మేమూ బయల్దేరాలమ్మా' అంటున్న శేషుని రమ్య అడుగుతోంది.

"నాన్నా! మనం అసలు ఎందుకు వెళ్ళాలి?" జవాబు లేని ప్రశ్న.

మహాలక్ష్మమ్మ ఇక మాట్లాడలేకపోయింది. భర్తవేపు బేలగా చూసింది. పిల్లలందర్నీ పట్టిపట్టి చూసింది.

ఆవిడ మనసులో సడన్‌గా ఒక కోరిక కెరటంలా ఉవ్వెత్తున! ఈ క్షణాన వీళ్ళందరి మధ్య ప్రాణం పోతే బావుణ్ణు. ఏనాడూ తనకంటూ ఏ కోర్కెలు కోరుకోలేదు. నిత్యం పూజించే ఆ పరమాత్ముడు తన ఈ ఒక్కకోర్కె తీర్చడూ. అంతలోనే కంటికెదురుగా వయసు భారంతో ఒరుగులా ఉన్న భర్తని చూసింది.

కళ్ళు మూసుకు నిశ్శబ్దంలోకి జారిపోయిందావిడ. మూసుకున్న కనురెప్పల మధ్య వెనుక వెల్లువై ఉబికే కన్నీటికి ఆనకట్ట వేసేందుకు విఫలయత్నం చేస్తోంది.

బలహీనమైన చేతులతో తన చేతుల్ని చుట్టిన తల్లి స్పర్శ ఏం నివేదించిందో, ప్రసాదు తప్పు చేసిన వాడిలా తలొంచుకున్నాడు. తల్లి అనారోగ్యంతో హాస్పిటల్‌లో ఉందని తెల్సి తప్పనిసరై బయల్దేరాడు.

ఇరవై యేళ్ళుగా పూర్తిగా భిన్న ప్రపంచంలో అయిన వాళ్ళకి దూరంగా బ్రతికెయ్యడం అలవాటైపోయాక ఇక్కడికి తనని లాక్కొచ్చే అంశాలేవీ కన్పించడం లేదు మరి.

హృదయ స్పందనలు విన్పించనంతగా కెరీర్, దానితో పాటు అధిగమిస్తూ వస్తున్న రకరకాల ఛాలెంజెస్! పుట్టి పెరిగిన దేశం కాని, జన్మనిచ్చిన తల్లిదండ్రులు కాని, రక్తం పంచుకు పుట్టిన తోబుట్టువులుకాని ఎవరూ, ఏదీ మనసులో మిగలనంతగా అక్కడి

జీవితంలో కూరుకుపోయాడు. ఎప్పుడో ఓ బాధ్యతలా తల్లిదండ్రుల క్షేమం కనుక్కోవడంతో సముద్రాలకావల మిగిలిపోయాడు.

కాని ఇప్పుడు... ఈ వారం రోజులుగా ఆ ఇంటి వాతావరణంలో అయిన వాళ్ళ మధ్య గడిపిన ఈ క్షణాలన్నీ అతన్ని తట్టి లేపాయి. జీవితంలో ఎదుగుతున్న కొద్దీ తనలో పెరుగుతున్న అశాంతికి కారణం అర్థమైంది. ఇన్నేళ్ళుగా తాను ఏం కోల్పోతూ వచ్చాడో, ఏ అనుబంధానికి దూరమై బ్రతికేస్తున్నాడో స్పష్టమైంది.

ఇక మళ్ళీ మళ్ళీ ఈ రావడాలు తన వల్ల కాదు అనుకుని ప్రయాణమై వచ్చిన తన ఆలోచనకి సిగ్గుతో ముడుచుకు పోయాడు. వారం రోజుల క్రితం ఇంట్లోకి అడుగు పెడుతూ తను అనుభవించిన హాయికి అర్థమేదో మనస్సుకి అందింది.

తన స్పర్శతో అతని మనఃశరీరాల్నిండా వెచ్చని మమతానురాగాల్ని ప్రవహింప చేసిన ఆ మాతృమూర్తి చేతుల్ని చెమర్చిన కళ్ళతో ఆర్తిగా హృదయానికి హత్తుకున్నాడు

**('నవ్య' వీక్లీ ఆగస్టు11, 2010)**

# తప్పెవరిది?

ఆ రోజుతో లీవ్ పూర్తయి ఆఫీసులో జాయినైన నాకు ప్రకాష్ సస్పెండ్ అయ్యాడన్న వార్త చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అతను చాలా సిన్సియర్ వర్కర్. చిన్నప్పటినుండి కష్టపడి పైకి వచ్చాడు. లేమితనంలో పుట్టి ఆ కష్టాలను స్వానుభవంలో చూసి ఉండడం వలన పట్టుదలతో కాస్త ఆర్థిక బలం పుంజుకునేందుకు చదువులో జాగ్రత్తగా పైకొచ్చాడు. మనిషి మితభాషి. ఉద్యోగంలో జాయినైనరోజే తన పరిచయాన్ని చేసుకున్నాడు, ఆ సెక్షన్‌హెడ్‌నైన నాతో.

ఇంతకీ ప్రకాష్ సస్పెండ్ అయిన కారణం విని నా నోట మాటరాలేదు. అతని భార్య సుమతి ఆత్మహత్య చేసుకుందట. సరిగ్గా ఏణ్ణర్థం క్రితం ఆఫీస్ స్టాపంతా అటెండయ్యాం ప్రకాష్ పెళ్ళికి. చిన్నపిల్ల. నిండా ఇరవై యేళ్లు కూడా ఉండవు. చలాకీగా వుండేది. మనసంతా వికలమైపోగా ఫైళ్ళు మూసి ప్రక్కన పడేసి సంగతేమిటో కనుక్కుందామని రాజు సీటు దగ్గరకెళ్లాను.

"ఏం రాజూ మన ప్రకాష్ సంగతేమిటి వివరంగా చెప్పు, ఇంతలో ఈ ఘోరం ఎలా జరిగిపోయింది".

"ఏముందండీ, ఈ ఆడవాళ్ళు ఎంతకైనా తగుదురండీ. మొన్న వాళ్ళమరదలు పెళ్ళికి వెళ్ళేందుకు మెడలో నగ ఏమీ లేదని నసిగితే

ఆఫీసులో ఐదువేలు లోను పెట్టి మరీ చేయించాడట, బంగారు హారమేదో. ఆవిడకి ఆ నగ నచ్చలేదని అంత అఘాయిత్యం చేసింది".

'అదేమిటి, నగ నచ్చకపోవడం ఏమిటి? ప్రాణం తీసుకోవడం ఏమిటి? వివరంగా చెప్పు రాజూ' అంత బాధలోనూ అతని వ్యాఖ్యానానికి అసహనం ధ్వనించింది నా ప్రశ్నలో. దాన్ని మించి నా గొంతులో పట్టరాని బాధ సుళ్ళు తిరుగుతోంది.

"ఇంకేముందండి చెప్పేందుకు? నగ నచ్చలేదు, మార్పించమని ఆవిడ గోల పెట్టిందట. మజూరీ ఖర్చయినా కల్సిరాదు. కొన్నాళ్లు వాడు ఆ తర్వాత చూద్దామని ప్రకాష్ అన్నాడట. వీల్లేదు, చచ్చిపోతానని బెదిరించి అంతపనీ చేసిందావిడ" క్లుప్తంగా చెప్పాడు రాజు.

వింటూ చలనం లేనట్లుగా ఉండిపోయాను. సుమతి నాకు బాగా చేరికైపోయింది ఏణ్ణర్థంగా.

ప్రకాష్ ఇంటికీ, మా ఇంటికీ ఎక్కువ దూరంలేదు. అందుకే పెళ్ళయి క్రొత్తగా కాపురానికొచ్చిన భార్యని పొరుగున ఉన్న నా దగ్గరకు తీసికొచ్చి పరిచయం చేశాడు. మొదటి పరిచయంలోనే 'అక్కా – ' అంటూ వరసకూడా కలిపి ఎంతో అమాయకంగా, ఆప్యాయంగా మాట్లాడిందా అమ్మాయి. అప్పటికి సంసార జీవితం తాలూకు బరువు బాధ్యతలు, స్వార్థం ఏమీలేవు ఆమెలో. నిష్కల్మషం...

"అక్కా! ప్రకాష్ చూడు నావంట బావుండదంటాడు"

"అక్కా! సినిమాకి వెళ్దామంటే అనవసరం ఖర్చంటాడు. చూడు' అంటూ రోజూ నేను ఆఫీసునుండి వచ్చేసరికి ఏదో ఒక ఫిర్యాదు మోసుకొచ్చేది. ప్రకాష్ ఆమె వెంట వచ్చినా పెదవి కదిపేవాడు కాదు.

నా వెనుక, వెనుకే తిరుగుతూ "నువ్వు టీ భలేగా కాస్తావక్కా... మా ఇద్దరికీ నీ చేతి టీ ఎంతిష్టమో తెల్సా" అంటూ కాంప్లిమెంటు అందిస్తూండేది తరచుగా.

'ఎంత శుభ్రంగా, పొందిగ్గా సర్దుకున్నావక్కా మా ఇళ్ళలో ఇలా సర్దుకోవాలని కూడా తెలియదు'

ఏ టిఫిన్ పెట్టినా ఆప్యాయంగా తినేది, 'అమ్మ చేతివంట గుర్తొస్తోంది' అనేది మురిపెంగా.

ఎపుడైనా ప్రకాష్ తల్లి తండ్రులొస్తే మాత్రం ముఖం చిట్లించేది. 'చూడక్కా, ఆ మనుషులెంత అశుభ్రంగా ఉంటారో' అని వ్యాఖ్యానించేది. వాళ్ళు మట్టినే నమ్ముకున్న మనుషులు. తరతరాలుగా తాత తండ్రులు పుట్టి పెరిగిన అదే ఊళ్ళో, అవే పరిసరాల మధ్య ఉన్న కాస్త భూమికి తోడు కాస్త కౌలుభూమి కూడా చేసుకునే కుటుంబం వారిది.

ప్రకాష్‌కి తల్లి తండ్రుల పట్ల అప్యాయతాభిమానాలున్నా తను చదువుకుని బయటకు వచ్చేసి సంపాదనాపరుడై, వాళ్ళుండే పరిస్థితులు తను పుట్టి పెరిగిన పరిసరాలపట్ల ఒక లాటి ఏహ్యాభావం ఉండేది అని గమనించాను. భార్య తన కళ్ళెదుటే తల్లిదండ్రుల్ని నిరసిస్తూంటే చూస్తూ సహించలేక పోయేవాడు. కాని భార్యకి ఒక్కమాట ఎదురు అనేవాడు కాదు. అందుకే స్వంత ఊరునుండి ఎవరొచ్చినా తను మాత్రం ఇల్లు విడిచి అర్ధరాత్రి వరకూ ఎక్కడెక్కడో తిరిగొచ్చేవాడు.

తను మానసికంగా ఎంత బాధపడుతున్నా భార్యకి తెలియజేసేవాడు కాదు. నేను ఎన్నోసార్లు సుమతితో చెప్పాలనుకునేదాన్ని అలా ప్రవర్తించకూడదని పెద్దవాళ్ళపట్ల. కాని నేను చెప్పబోయినపుడల్లా “అక్కా! ఇంకేదైనా మాట్లాడు, ప్లీజ్” అంటూ దాటవేసేది. క్రమేపీ కొన్నాళ్ళకి తనంతట తానే తెల్సుకుంటుందన్న భావనతో నేనూ సర్దిచెప్పుకున్నాను.

సుమతి ఒంట్లో నలతగా ఉంటుందని ఓరోజు ప్రకాష్ చెప్పాడు.

ఆరోగ్యంగా ఉండే సుమతికి ఇంతలో ఏమైందని ఖంగారు పడ్డాను. గబగబా సాయంకాలపు వంట ముగించుకుని సుమతిని హాస్పటల్‌కి తీసుకెళ్ళాను. డాక్టర్ ఆమె గర్భవతి అని నిర్ధారించారు. సుమతి కళ్ళలో ఆనందం, దాన్ని మించిన సిగ్గుని చూశాను. నాకూ ఎంతో సంతోషమన్పించింది. భార్యాభర్తల అనుబంధాన్ని బలంగా పెంచేందుకు దోహదపడటంలో సంతానం పాత్ర చాలా ఉంటుందనుకుంటూ ఉంటాను.

నా జీవితంలో వివాహ ప్రస్తావన లేకపోయినా స్నేహితుల సంసారాల్ని చూసి, చుట్టుపక్కల కుటుంబాల్ని చూసి నాకు ఎన్నెన్నో ఆలోచనలు రేగుతుంటాయి.

కుటుంబ సభ్యుల మధ్య ఉండే అనుబంధాలు నేను ఎదుటి వారిని చూసి గ్రహించాను. చిన్ననాటి సంఘటనలూ నా జ్ఞాపకాల్లో ఇంకా అస్పష్టంగా లేకపోలేదు. అమ్మ, చిన్న తమ్ముడు, నేను, వెచ్చని పొదరిల్లు మా ఇల్లు... భయంకరమైన ట్రైన్ ఏక్సిడెంట్.

ఒంటరినన్ను తప్పనిసరి బాధ్యతగా పెంచి పెద్దచేసిన బాబాయ్!

కొన్నాళ్ళపాటు అమ్మదగ్గరికి వెళ్తానంటూ వెళ్లిన సుమతి రావడానికి నెల రోజులపైనే పట్టింది. వచ్చిన తర్వాత మునుపటి సుమతిని చూడలేకపోతున్నాను అని చాలాసార్లు అన్పించింది. ఏదో మార్పు, ఆ ముఖంలో ఏదో అశాంతి, ఆరాటం. ఆమెలో అసంతృప్తి ఛాయలు. ఎప్పుడూ ఏదో ఘర్షణ పడ్తూండేది ప్రకాష్‌తో. మునుపటిలా ఉత్సాహంగా నా దగ్గరకి రావడమూ లేదు.

ఒక సాయంత్రం ఏమీ తోచక సుమతి వాళ్ళింటికేసి బయల్దేరాను. గుమ్మంలోనే భార్యాభర్తల తగవు నన్ను నిలబెట్టేసింది.

‘ఇది కూడా ఓ సంసారమేనా? కూర్చుందుకు నాలుగు కుర్చీలు లేవు. కట్టుకుందుకు నాలుగు మంచి బట్టలు లేవు. పెళ్ళెందుకు, సంసారం నడపడం చేతకాకపోయేక”

నిజంగా సుమతి ఇలా మాట్లాడడం గత ఆరు నెలలుగా ఎప్పుడూ వినలేదు. క్రొత్త జంట. వాళ్ళ చిలిపి తగాదాలు గమనించడం వరకే నా పని ఇన్నాళ్ళూ. ఇప్పుడు?

‘సుమతీ అర్ధం చేసుకో. నా సంపాదనెంతో నీకు తెల్సు. తమ్ముళ్ళ చదువు బాధ్యత నాకు వుంది. ఉన్నంతలో జాగ్రత్తగా ఖర్చుపెట్టుకుంటే మనకి దేనికీ లోటుండదు’.

‘అవును రెండు పూటలా తిండి పెట్టగలరులే. మా నాన్న సంబరపడి పోయి తెచ్చాడు బంగారంలాంటి సంబంధం అని. బంగారం మాటకేం గాని ఓ ఇత్తడి రేకన్నా కొనుక్కో గల్గే తాహతుందా మనకి?”

ఒక్కక్షణం ఆగి అంది.

‘చదువుకుని ఉద్యోగం వెలగబెడ్తున్నారని నా స్నేహితురాళ్ళంతా మనమేదో గొప్ప స్థాయిలో ఉన్నామని చెప్పుకుంటున్నారు. ఇక్కడ ఓ ముద్దూ ముచ్చటా లేదు” సుమతి గొంతు తీవ్రంగా ఉంది.

‘సుమతీ! ఎవరితోనూ పోల్చుకోకు. మనకున్న అంతస్థు ఇది. ఒకరు అనుకోవడాని కేముంది”

ప్రకాష్‌నుండి జవాబులేదు. నేను మరిలోపలికి వెళ్లలేక వెనక్కి తిరిగాను.

రెండు రోజులు సుమతి కనపడలేదు నేనూ వెళ్ళేందుకు సాహసించలేదు. కాని రొటీన్‌లో ఏదో లోపించినట్లు ఫీలయ్యాను.

ఆ రోజు ఆఫీసునుండి వచ్చి ‘టీ’ కలుపుకునే ప్రయత్నంలో ఉండగా కళావిహీనమైన ముఖంతో సుమతి వచ్చింది. ఇది వరకటి హడావుడిలేదు. మౌనంగా కూర్చుంది తను. పరిశీలనగా చూస్తూ కూర్చున్నాను. ఇంకా టీనేజ్ దాటని వయసు. ముఖంలో పసితనం వదల్లేదు. ఆమె లేత మనసు మీద స్నేహితురాళ్ళమాటలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు చాలా ప్రభావం చూపాయి. ఆ రోజు నేను విన్న మాటలు నా చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. ఆమె తప్పుదారిలో ఆలోచిస్తోంది. మెల్లిగా నచ్చచెప్పాలి. మిధ్యా గౌరవాలు సంసారాల్ని కూలుస్తాయి అని చెప్పాలి. ఆ మారుమూల పల్లెల్లో వ్యవసాయాన్ని నమ్ముకు బ్రతకడం అలవాటై పోయి ఉద్యోగస్థుడనేసరికి ఓ భ్రమలో ఉన్నారు. ఎలా మొదలు పెట్టాలా అని ఆలోచిస్తున్న నేను సుమతి మాటలకి ఉలిక్కి పడ్డాను.

“అక్కా! ప్రకాష్‌కి నువ్వన్నా చెప్పు. ఒక్క సరదా కూడా లేదు. ఇంట్లో ఒక్క వస్తువు లేదు. నేనేదో సుఖపడిపోతున్నానని అమ్మా, నాన్న అనుకుంటున్నారు. వాళ్ళు నన్ను

చూసేందుకు వస్తే నాకు ఎంత చిన్నతనంగా ఉంటుందో చెప్పక్కా"

ఆందోళన, అర్థంలేని ఆవేదనతో, కలతబారిన ఆమె ఆరోగ్యాన్ని లక్ష్యపెడుతున్నట్లు లేదు. కళ్ళక్రింద నల్లని వలయాలు, మనిషి చాలా బలహీనంగా కనపడుతోంది.

తనున్న ప్రస్తుత పరిస్థితిలో ఎంత ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి, తన ఆరోగ్యం పుట్టబోయే పాపాయిమీద ప్రభావం చూపదూ! "సుమతీ! నువ్వు చిన్న పిల్లవి, సంసార బాధ్యతలు తెల్సుకోవాలి. ప్రకాష్ మొన్న మొన్ననే కదా ఉద్యోగంలో చేరింది. కాస్త నిలదొక్కుకోవద్దా. అందులోనూ వెంటనే పెళ్లి. అతనూ చిన్నవాడే. ఓ ప్రక్క తల్లిదండ్రుల్ని, తోబుట్టువుల్ని చూసే బాధ్యత ఉంది. మరో ప్రక్క సంసార బాధ్యత. తొందర్లోనే మీ ఇంట్లో చిన్న పాపాయి రాబోతోంది. ఆర్థికంగా అతనికున్న స్థోమత అర్థం చేసుకోవలసింది ముఖ్యంగా నువ్వు. నీ తోడ్పాటు లేకుండా అతను తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేడు. పైగా మానసిక అశాంతితో నలిగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది..."

సుమతి వింటోందా? ఆమె ఆలోచనలు ఎలా ఉన్నాయో అని ఒక్క క్షణం ఆగాను.

సుమతి ముఖం అప్రసన్నంగా ఉంది.

"అక్కా! నువ్వు చెప్పేది నాకు అర్థమైంది. ఉన్నది ఇద్దరు మనుషులం. అక్కడ మా ఊళ్ళో అంతా నేనేదో ఇక్కడ గొప్పగా ఉన్నానని అనుకుంటున్నారు. ప్రకాష్ చూస్తే ఎప్పుడూ ఏదో చెప్తాడు. నువ్వు చెప్పక్కా, పెళ్ళయి ఇన్ని నెలలైనా ఎన్నడైనా సుమతీ... నీ కోసం ఇది తెచ్చాను అని అన్నాడా? నేనుమాత్రం ఏం కోరరాని కోరికలు కోరానని? ఇంటికోసమేకదా. ఇంకాస్త సౌకర్యంగా, హాయిగా ఉండాలనుకోవడం తప్పా అక్కా?" ఆపుకోలేని కన్నీళ్ళు చెంపలమీదికి జారాయి.

నా మనసు ఆర్ద్రతతో చెమర్చింది. పిచ్చిపిల్ల. చెప్పుడు మాటలవల్ల ఎంత నలిగిపోతోంది మానసికంగా.

"సుమతీ! నీవు ముందు కన్నీళ్ళు పెట్టడం మానేయ్. అసలు నువ్వున్న పరిస్థితిలో ఆనందంగా ఉండాలి. నీ ఆరోగ్యం చక్కగా ఉంటేనే పాపాయి ఆరోగ్యంగా ఉంటుంది. అనవసరమైన విషయాలు ఆలోచించి మనసు కష్టపెట్టుకోకు. ప్రకాష్‌ని కష్టపెట్టకు. ప్రకాష్‌కి మాత్రం ఉండదా నిన్ను సంతోషంగా ఉంచాలని, అపురూపంగా చూసు కోవాలని". నచ్చజెబుతున్నట్లు చెప్పిన నా మాటలు ఆమెకేం ఓదార్పు నిచ్చాయోకాని కళ్ళు తుడుచుకుని కాస్సేపు అలా మౌనంగా కూర్చుంది.

'సారీ అక్కా, ఏదేదో మాట్లాడాను' అంటూ ఆ రోజు వెళ్ళిపోయింది. ఆ తర్వాత నాకు తెల్సుండగా సుమతి ప్రకాష్‌తో ఘర్షణ పడలేదు ఆరు నెలల క్రితం పురిటికి వెళ్ళి

పువ్వంటి పాపాయితో తిరిగొచ్చింది.

సుమతికి పాపాయి పుట్టిందని తెలియగానే ప్రకాష్‌తో పాటు నేనూ వెళ్ళాను. అది చాలా చిన్నగ్రామం. సుమతి మీద అభిమానంతో తనను చూసేందుకు వచ్చానని వాళ్ళంతా పొంగి పోయారు. సుమతి తర్వాత అమ్మాయి సుగుణ నన్ను పరిశీలనగా ఆసక్తిగా గమనించడం చూసి నవ్వొచ్చింది. కాని ఆ చుట్టుప్రక్కల వాళ్ళదగ్గర సుమతి తల్లిదండ్రులు తమ అల్లుడు కలెక్టర్ హోదాలో ఉన్నాడన్నంత గొప్పగా చెప్పుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. ఇంటి అల్లుడంటే అందరికీ అపురూపమే మరి కాని అది అతిశయోక్తిగా మారితే?... సుమతి మనసుమీద మళ్ళీమళ్ళీ ఎలాంటి విషప్రభావం చూపుతుందో అని భయం వేసింది. సుమతి స్నేహితురాళ్ళంతా 'నీకేమే పెద్ద ఉద్యోగస్థుడి భార్యవి' అంటూ పదేపదే అనడం కూడా నా చెవిన పడకపోలేదు ఎదురుగావున్న నా కేసి అర్థవంతంగా సూటిగా చూసింది ఆక్షణాన సుమతి. ఆమెలో ఘర్షణ తిరిగి రేపుతున్నారా ఈ జనం? ఆమె ఈ వాతావరణం నుండి త్వరగా బయటపడితే బావుణ్ణనిపించింది.

దైనందిన జీవితంతో విసిగిపోయిన నాకు సుమతి వాళ్ళింటికెళ్తే ఎంతో హాయిగా ఉండేది. పసిపాప సందడి సామాన్యమైనదా? తేలికైన మనసుతో ఇంటిదారి పట్టేదాన్ని. ఒక రోజు మాధురి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది, వాళ్ళు పూనానుండి బాంబేకి బదిలీ అయినట్లు, ఓ సారి వచ్చి తమతో కొన్నాళ్లు ఉండి వెళ్లమని. ఈ ప్రపంచంలో నాకు ఉన్నదే స్నేహితులు. నన్ను, నా ఉనికిని, ఇంత అభిమానంగా కావాలనుకునేవాళ్ళు మాత్రం ఎవరున్నారు. నిజమే, సెలవుపెట్టి కొన్నాళ్ళు ఎటైనా వెళ్ళి రావాలని మనసులో ఉంది. ఆలస్యం చెయ్యక బయలుదేరాను. నెలరోజులు స్నేహితులందర్నీ కలిసి వాళ్ల సమక్షంలో నా ఒంటరి జీవితపు ఛాయల్ని కూడా మర్చిపోయిన నేను తిరిగొచ్చేసరికి ఈ పిడుగులాంటి వార్త!

సంగతి విని కొన్ని గంటలైంది. నెలల తరబడి లంఖణాలు చేసినంత నిస్సత్తువ. మనసంతా మొద్దుబారి పోయింది. ఏమిటి జరిగింది? కళ్లముందు నిన్నమొన్న జరిగినట్లున్న సుమతి ప్రకాష్‌ల చిలిపితగాదాలు... వాళ్ల కోపతాపాలు... ఏమిటిదంతా? ఎందుకింత ఘోరం జరిగిపోయింది. కనీసం హైస్కూల్ చదువు కూడా లేని సుమతి ఆలోచనా తీరు లోపమా? లేని గొప్పను అంతస్థును ఊహించుకుని మాట్లాడిన ఆమె తల్లిదండ్రుల, స్నేహితుల తప్పా? జీవితం పట్ల సరైన అవగాహన కలగనీయని ఆ పరిసరాల ప్రభావమా? ఒక రకంగా అది వారి అమాయకత్వమే. కాని దాని ఖరీదు ఓ నిండు ప్రాణం?

అబ్బ, కణతలు పగిలిపోతున్నాయి. భరించలేని వేదన. ఇంటికెప్పుడొచ్చానో నాకే తెలియదు. అన్యమనస్కంగా లేచి 'టీ' కలుపుకు నోటిముందుంచుకోబోతే సుమతి ప్రశంసలు

గుర్తుకొచ్చాయి. గొంతులోకి ఒక్కచుక్క దిగలేదు. బాధగా కప్పు ప్రక్కన పెట్టాను.

ఒక్కసారి ప్రకాష్‌ని కలవాలి. అసలు ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో అతను?! లేచి చెప్పుల్లో కాళ్ళు దూర్చాను.

అలవాటైన ఆ ఇంటి తలుపులు దగ్గరగా వేసున్నాయి. ఇల్లంతా అదోరకపు విషాదపు తెర కమ్ముకున్నట్లనిపించింది. వసారాలో ఎవరెవరో ఉన్నారు. తడబాటు కప్పి పుచ్చుకుంటూ ఒక్కక్షణం అందర్నీ పరిశీలనగా చూశాను. ఒక మూలగా చేతిలో నిద్రపోతున్న పసిపిల్లని పెట్టుకుని కూర్చున్న సుమతి తల్లి లేచి వచ్చి నా భుజాలు పట్టుకు ఒక్కసారి బావురుమంది.

“చూడమ్మా, అదెంతపని చేసిందో, కన్నపేగుని కూడా కాదనుకుని...అంతపట్టుదల దేనికొచ్చిందో. ఇరవయ్యేళ్ళన్నా లేకుండానే భూమ్మీద బంధనాలన్నీ త్రెంచుకుపోయింది?” వెక్కిళ్ళమధ్య ఆవిడ దీనంగా, అస్పష్టంగా ఏదో అంటూనే ఉంది. ఆ తల్లి కడుపుకోత నేను అర్థం చేసుకోగలను. కాని ప్రక్కన వున్న ఆ పసికందు...

కళ్ళు తుడుచుకు చెబుతోంది.

“ఇంత ఘోరం జరిగినా మాకు రెండ్రోజులు కబురు తెలీదుతల్లీ అల్లుడుగారు దాన్ని పొట్టన పెట్టుకుని తనకేం తెలీదంటాడు. నమ్మమంటావమ్మా. పెళ్ళయిన దగ్గర్నుంచీ ఎందుకో ఒకందుకు చిరాకులే. ఆ పిల్ల చస్తానని బెదిరించింది. చిన్నపిల్లే, సముదాయించాలని తెలీనట్లు ఆఫీసుకు వెళ్లాడో, ఇంత కిర్సనాయిలు పోసి తనే ఓ అగ్గిపుల్ల గీశాడో, పిల్ల కాలి బూడిదయ్యాక పరుగెత్తుకొచ్చాడట. ప్రక్కింటి వీరమ్మగారు చెబుతోంది. పోలీసులొచ్చి మా అడ్రసుకాని, మా వియ్యంకుడిగారి అడ్రసుకాని కావాలంటే నోరిప్పలేదట. తన తప్పేం లేకపోతే అంత మాటరానివాడై పోతాడమ్మా?” ఆవిడ గొంతులో అంతవరకూ ఎక్కువవుతున్న అక్కసు...

ప్రకాష్ తల్లిదండ్రులు దోషుల్లా తలలు వాల్చుకుని దీన వదనాలతో కూర్చున్నారు. ఏమని సముదాయించను? అసలు ప్రకాష్ ఏడి? అతని బాధని ఎవరైనా అర్థం చేసుకున్నారా? అసలు విషయమేమిటో గ్రహించారా? మెల్లిగా లోపలకు వెళ్ళాను. లోపల ఒంటిగా చీకటి గదిలో నిర్జీవంగా చలనం లేనట్లు పడుకున్నాడు ప్రకాష్ వాలుకుర్చీలో. అతనికళ్ళు కాంతి హీనంగా ఉన్నాయి. నన్ను చూసి కాస్త కదలిక అతనిలో. లేచి కూర్చున్నాడు.

మౌనంగా ఉన్న నన్ను చూసి దోసిట్లో మొహం దాచుకున్నాడు. నేనేం మాట్లాడలేదు, అతని ఆవేదన తీరేదాకా అలా నిలబడిపోయాను. ఎదురుగా గోడమీద ఫోటో ఫ్రేమ్‌లో

పెళ్ళి దండలతో కళకళలాడే ముఖాలతో సుమతి, ప్రకాష్...అప్రయత్నంగా కన్నీళ్ళూరాయి. చటుక్కున తేరుకున్నాను. సంగతేమిటో కనుక్కుని అతన్ని ఓదార్చాలని వచ్చాను. నేనే ఇలా నిగ్రహం కోల్పోతే...?

'ప్రకాష్...'

ఎఱ్ఱబడిన కళ్ళతో తలెత్తి చూశాడు.

'చూడండి, తను ఎలా చేసిందో...'

"ప్రకాష్...తను చిన్నపిల్ల. అర్థమయ్యేలా ఎందుకు చెప్పలేకపోయారు? మీ మౌనంతో ఆమె ప్రశ్నలకు, సమస్యలకు సమాధానం ఎలా దొరుకుతుందనుకున్నారు? తను చూసిన ప్రపంచం ఎంతని? అమ్మా నాన్న, స్నేహితులే కదా. బాధ్యత తెలియనిలోకం. ఇంత ఘోరం ఎందుకు జరగనిచ్చావ్ ప్రకాష్" ఆవేదనగా ఆవేశంగా అతన్ని నొప్పిస్తున్న విషయం మరచి ఏదేదో మాట్లాడేశాను...

"జీవితం విలువైనదని, అర్థంలేని అల్ప విషయాలకి బలితీసుకునేంత హీనమైనదికాదని ఆ అమ్మాయికి అర్థమయ్యేలా ఎందుకు చెప్పలేకపోయావ్? ప్రకాష్....ఈ మిథ్యాగౌరవాలు ప్రాణాల్ని బలితీసుకునేంత ఖరీదైనవా..." నా గొంతులో దుఃఖం తన్నుకొచ్చింది. జీవితం పట్ల కక్ష పెంచుకున్న సుమతిని నేను కాపాడలేకపోయానన్న వ్యధ మనసును మండిస్తోంది.

'మీరుకూడా...' ఆ పై అర్థయుక్తంగా అతను అసంపూర్తిగా వదిలేసిన వాక్యం ఏమిటో నేనూహించగలను.

"అసలింతఘోరం జరిగినా సుమతి వాళ్లవాళ్ళకి, మీ వాళ్ళకీ ఎందుకు కబురు పంపలేదు. దానివలన మీమీద అనవసరమైన అపోహలు కల్గే అవకాశం ఉందని తోచలేదా?"

అతను నోరు విప్పాడు... "నిజం చెబుతున్నాను మీకు. నా మీద అనుమానపడతారు అన్న సంశయంకంటే సంఘంలో ఓస్థానం అంటూ ఏర్పరచుకుంటున్న నేను నా వాళ్ళని ఏహోదాలో చెప్పుకోవాలో తెలియలేదు. అందుకే...నేను నోరు విప్పలేక పోయాను".

తలవాల్చుకుని చెబుతున్న అతని మాటలు వింటున్న నాకు అంతదాక అతని గాంభీర్యం వెనుక ఎంతో లోతైన ఆంతర్యం ఉందని గౌరవించిన నేను... భరించలేని ఏహ్యాభావం కలిగింది. తానిపుడింతవాడై తల్లిదండ్రుల స్థితిని చెప్పుకునేందుకు సిగ్గుపడ్డాడా? తను పెరిగిన పరిసరాలపట్ల అతను పెంచుకున్న వ్యతిరేకభావం నాకు అప్పటికి పూర్తిగా అర్థమైంది.

అయితే జీవితంలో ఇంత దారుణమైన దెబ్బతగిలినా అతను విలువనిచ్చి గౌరవించే

విషయాలు హోదా, అంతస్థులా? ఒక్క క్షణం అక్కడ నిలవ లేక పోయాను.

గిరుక్కున వెనుతిరిగి బయట వరండాలో కొచ్చి నిలబడ్డాను. మానవ సంబంధాలు ఇంత కలుషితం ఎప్పుడయ్యాయి. అది ఈ నవీన కాలపు జనంలో వచ్చిన విపరీత ధోరణా? ఎటు వెళ్తున్నాం మనం?

వరండాలో ఓ ప్రక్కగా ఇరవై యేళ్ళ అమ్మాయి పాపాయిని సముదాయించే ప్రయత్నంలో ఉంది. ఎవరో? తల్లిలేని ఆ పసికందుకు మాతృత్వపు మమకారాన్ని అందించగలవారెవ్వరు?

"అదిగో, ఆ పిల్ల ప్రకాష్ మేనమామ కూతురట…ప్రకాష్‌కిస్తారట' అన్నమాటలు నా సందేహాల్ని పుటుక్కున తెంచాయి.

చెవులు రెండూ గట్టిగా మూసుకుని బయటకు వచ్చేశాను. నా వెనుక సుమతి చేసిన ప్రాణత్యాగం అర్థంలేనిదన్నట్లుగా ఈ సమాజం నిర్దయగా రిక్తహస్తాలతో ముందుకు సాగిపోతూనే వుంది.

**('యోజన' 16-31 డిసెంబర్ 1989)**

# అనగనగా ఒక మహారాణి

ఇల్లంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది. పెళ్ళివారితోపాటు వచ్చిన అతిథులంతా వెళ్ళిపోయారు.

తమను సాగనంపేందుకు స్టేషను వరకూ రమ్మని పెళ్ళికూతురు లలితని కాబోయే అత్తగారు వెంటబెట్టుకు తీసుకెళ్ళింది. లలిత తర్వాతది శ్రీదేవి తెల్లవారి పరీక్ష ఉందని గదిలో చదువుకుంటోంది.

వెంకమ్మతోపాటు పెరట్లోకి, ఇంట్లోకి తిరుగుతూ శ్రీలక్ష్మి ఎక్కడివక్కడ సర్దిస్తోంది. ప్రొద్దుట్నుంచీ ఆ ఇంట్లో ఒక పండుగ వాతావరణం అలుముకుంది. పట్టుచీరెల గరగరలు, అగరు పరిమళాలు, పూల సువాసనలు ఇల్లంతా కమ్ముకున్నాయి.

శ్రీలక్ష్మి మనసు కృంగిపోయింది ఆరోజు నలుగురిమధ్య జరిగిన సంఘటనతో. ఇలాంటి అనుభవాలు నిత్యం ఎదుర్కొంటున్నవే. కాని కాబోయే వియ్యాలవారిముందు, వారి బంధువులందరి సమక్షంలో...ఆ సన్నివేశం ఆమె మనసును పదేపదే గ్రుచ్చుతోంది.

గుమ్మానికి పచ్చగా మెరుస్తున్న మామిడాకు తోరణాల్ని చూస్తూ మనసుని చిక్కబట్టుకుంటోంది.

లోపల చదువుకుంటున్న శ్రీదేవి వంటింటివైపు వచ్చి తల్లికోసం చూసింది. వెంకమ్మ తోమిన గిన్నెలు, పళ్ళేలు సర్దిపెడుతోంది.

“వెంకమ్మా! అమ్మేది?”

“వీధి వరండాలో ఉన్నట్టున్నారమ్మా”.

తల్లి ముఖం చిన్నబోయి ఉండటం గమనించింది. దగ్గరగా వచ్చి “అమ్మా! అలసటగా ఉందా? కాఫీ తెచ్చిపెట్టనా?” అడిగింది.

“వద్దు శ్రీలూ, నువ్వు వెళ్ళి చదువుకో. అసలే ఈ రోజు అంతా హడావుడితో సరిపోయింది. వెళ్ళు”.

తల్లి గాంభీర్యం చూసి ఆమె ఒంటరిగా ఉండాలనుకుంటోందని గ్రహించింది.

❖❖❖

కళకళలాడుతున్న కూతురి ముఖం చూసి తన దృష్టే తగులుతుందని భయపడింది శ్రీలక్ష్మి. పెరట్లోకి తీసుకెళ్ళి కాస్త ఉప్పు తీసింది.

“ఏమిటమ్మా, నీ చాదస్తం” – లలిత విసుగుని ఆవిడ లెక్కచెయ్యలేదు.

“అమ్మా! నేనిప్పుడు భోజనం చెయ్యను. నాకు వడ్డించకు” అంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

తన ఒక్కడికే వడ్డించడం చూసి, “ఏం మీరెవ్వరూ వడ్డించుకోలేదేం?” – విశ్వనాథం ప్రశ్న.

“పిల్లలు తర్వాత తింటామన్నారు”

“ఇప్పటికే ప్రొద్దుపోయింది. ఇంకెప్పుడు? అందరికీ వడ్డించు” అన్నాడాయన భోజనం ముందు కూర్చుని.

‘పోనీ...’ భార్యమాటల్ని మధ్యలోనే త్రుంచి, ‘వడ్డించు’ అని, ‘లలితా’ అంటూ కేక పెట్టాడు.

‘నేనిప్పుడు తినను నాన్నా’.

కూతురి గొంతులో నిరశన ఆయన దృష్టిని దాటిపోలేదు.

‘ఏం, ఎందుకని?’

‘తినాలని లేదిప్పుడు’

కూతురి పెంకి సమాధానం విని ఆయన చిరాకు పడ్డాడు.

“ఏమిటీ పెంపకం? ఇది చూసేనా గర్వపడుతూంటావ్?” – ఆయన కోపం భార్య వైపు తిరిగింది.

“నాన్నా! అమ్మని ఏమీ అనకండి. ఇందాక అంతమందిలో మీరు అమ్మని చాలా చిన్నతనం చేసి మాట్లాడారు”

ఆయన నివ్వెరపోయాడు కూతురి మాటలకి.

"ఏం మాట్లాడుతున్నావ్?" – ఆ గర్జింపుకి లలిత బెదరలేదు.

"అంతమంది ముందు అమ్మ గురించి మీరేం మాట్లాడారో గుర్తు తెచ్చుకోండి, అసలు తప్పంతా అమ్మది. మీ మాటల్ని శాసనాల్లా అమలు చెయ్యడమే కాని ఒక్కనాడూ తన అభిప్రాయం ఇది అని చెప్పదు. ఫ్చ్".

"...అంత తేలిగ్గా ఆవిడకేం తెలియదు అని చెప్పేసారు. తెలియదని ఎప్పుడైనా తెలియచెప్పేందుకు ప్రయత్నించేరా? అసలు మీరు అమ్మకిచ్చే గౌరవం ఏమిటో ఆ మాటల్లోనే అర్దమవుతుంది ఎవరికైనా"

గతంలో లలితని చూసి వెళ్ళిన పెళ్లివారు ఆ రోజు సాయంకాలం వచ్చి సంబంధం ఖాయం చేసుకుంటామని ముందుగా కబురంపి మరీ వచ్చారు. పెళ్ళికొడుకుతో సహా పది పన్నెండుమంది పెళ్ళివారు వచ్చారు.

కాఫీ ఫలహారాలు మర్యాదలు అయ్యాక పెళ్ళిమాటలు మాట్లాడుకుంటున్నారు.

పెళ్ళి కొడుకు తల్లి, "రండి వదినగారూ, మీరు ఎక్కడో పనుల్లో ఉంటే ఎలా?.... ఇలా వచ్చి కూర్చోండి. అందరం కలిసి పెళ్ళి ఎలా చెయ్యాలో మాట్లాడుకోవద్దూ" శ్రీలక్ష్మిని స్నేహపూర్వకంగా ఆహ్వానించింది.

శ్రీలక్ష్మి గుండె ఉప్పొంగింది. తనూ వచ్చి కూర్చుంది.

"మీ పెద్దమ్మాయి పెళ్ళి చేసిన అనుభవం కూడా వుంది. మీరే చెప్పాలి, ఎలా చేస్తే బావుంటుందో" – వియ్యపురాలి మాటలకి శ్రీలక్ష్మి భర్తవైపు చూసింది.

చుట్టూ అటువైపు, ఇటువైపు వాళ్లు దాదాపు ఇరవై మంది దాకా వున్నారు.

"ఆవిడకేం తెలియదులెండి. నాకూ పిల్లలకి వండిపెట్టడం మినహా ఆవిడకేం తెలియదు. సలహాలు, సంప్రదింపులు ఆవిడకు రావు".

విశ్వనాథం మాటలకి ఒక్కక్షణం అందరూ నిశ్శబ్దమపోయారు.

"భలేవారే. వంటింటికే పరిమితం అనుకునే మన ఆడవాళ్ళిచ్చే సలహాలు మరింకెవరూ ఇవ్వలేరు. ఇది మాత్రం ఒప్పుకోవలసిందే బావగారూ" అంటూ వియ్యంకుడు వాతావరణాన్ని తేలిక చేసే ప్రయత్నం చేశాడు.

శ్రీలక్ష్మికి ఒక్కసారి ఊపిరాడనట్లయింది. ఒక ప్రక్కగా కూర్చుని పెళ్ళికొడుకుతో మాట్లాడుతున్న లలిత ఒక్కసారి తల త్రిప్పి తండ్రివైపు చూసింది. తనను తను కంట్రోల్ చేసుకుని మరింతగా కబుర్లలోకి దిగింది.

❖❖❖

విశ్వనాథం భార్యవేపు చూశాడు.

"ఏమిటిది? కూతుళ్ళకి ఏం నేర్పుతున్నావ్? నేను మాట్లాడిన దాంట్లో తప్పేముంది? నీకేం తెల్సు వ్యవహారాలు మాట్లాడేందుకు. వాణి పెళ్ళి ఎలా చేసేనో, ఏం చేసేనో నాకు తెల్సు. నీకు తెలియని విషయాన్ని తెలియదన్నాను. ఇన్నేళ్ళుగా ఒంటి చేత్తో లాక్కొస్తున్నాను. ఇప్పుడు నీకు పెత్తనం కావలసి వచ్చిందా?"

శ్రీలక్ష్మి దగ్గర సమాధానం లేదు. కాని ఆమె దగ్గర ఇన్నేళ్ళుగా ఏనాడూ నోరిప్పి అడగని ఎన్నెన్నో ప్రశ్నలు మాత్రం ఉన్నాయి. ఆయన భోజనం చెయ్యకుండానే లేచి వెళ్ళిపోయాడు.

ఆమెను ఒక్కసారిగా నిస్సత్తువ కమ్ముకుంది. తన చేతుల్లో పెరిగిన లల్లి తండ్రిని ఎంత సూటిగా ప్రశ్నించింది. ఆ ప్రశ్నలో న్యాయమున్నా తానెందుకు అడగలేక పోయింది – ఆలోచనలు ఎక్కడెక్కడికో పరుగులు తీస్తున్నాయి.

పెళ్ళయి తను అత్తవారింటికి వస్తున్నప్పుడు తల్లి కళ్లనీళ్ళతో చెప్పిన మాటలు శ్రద్ధగా వింది. ఆవిడ అత్తింట్లో చాలా ఆరళ్ళు పడింది.

"అత్తమామలు, భర్త చెప్పినట్లు నడుచుకో. ఇక్కడ చేసినట్లు అల్లరి, అలగడం అక్కడికెళ్ళాక కుదరవు. మర్యాదగా, పెద్దరికంగా మసలుకో. అదే నీకూ మాకూ మంచి పేరు తెస్తుంది" – పుట్టింట్లో మహారాణిలా పెరిగింది. తనకు చేతనైనంత పెత్తనం సాగించింది.

❖❖❖

అత్తవారింట్లో ప్రతి విషయానికి అత్తగారు,మామగారు ఘర్షణ పడటం, ఎవరి వాదన నెగ్గితే వాళ్లు మాట నెగ్గించుకోవడం చూసింది. భర్తకి కూడా సహనం తక్కువని తొలినాళ్ళలోనే గ్రహించుకుంది.

తను ఎలా ఉండకూడదో అర్థం చేసుకుంది. అంతే!...అలాగే గడిచాయి ఇన్నేళ్లూ.

ముగ్గురు ఆడపిల్లల్ని పెంచి పెద్ద చేసింది. రెండో పిల్ల లలిత ముగ్గుర్లోకి స్వతంత్ర భావాలున్న పిల్ల. ఇంట్లో పెద్ద వాళ్ళని నిత్యం ప్రశ్నలతో వేధించేది.

పసితనంలో కథలు చెప్పించుకుందుకు నానమ్మ, తాతగార్ల దగ్గర చేరేది.

తాతగారు రోజూ 'అనగనగా ఒక రాజు...' కథే చెబుతున్నారని గొడవ చేసేది.

"అనగనగా ఒక రాణి కథ చెప్పండి తాతగారూ" అంటూ నిలదీసేది. పెద్దాయన మనవరాలి మాటలకి ఆశ్చర్యపోయాడు.

"ఇదిగో, ఇది చూసేవుటే! అనగనగా రాజుకథ వద్దట, ఒక రాణి కథ చెప్పమంటోంది"

– భార్యతో పరిహాసంగా అన్నాడాయన.

"లలితమ్మా! అన్నీ అనగనగా ఒకరాజు కథలే. రాణీ కథలుండవు" అంటూ మనుమరాల్ని వెక్కిరించాడాయన.

"ఎందుకుండవు? మా అమ్మని అడుగుతా" – అలిగి తాత ఒడి దిగి వెళ్లబోతే, "నే చెబుతాను, రావే" అంటూ నానమ్మ పిలిచింది.

ఆవిడకి కోడల్ని సరదాగా ఏదైనా అనాలని ఉండేది.

"అనగనగా ఒక రాణి – అంటే మీ అమ్మ. హాయిగా కావలసినవి వండుకు తింటూ పిల్లలతో ఆడుకుంటూ ఉంటుంది. పాపం, మీ నాన్నగారేమో కష్టపడి, ఉద్యోగం చేసి, రాణికి కావలసినవన్నీ అమరుస్తూ ఉంటాడు" అంటూ చెప్పుకొస్తున్న నానమ్మ కథ అర్థంకాక అయోమయంగా లేచి తల్లి దగ్గరకు పరుగెత్తింది మూడేళ్ళ లల్లి.

❖❖❖

"అమ్మా! నిన్న జరిగినదానికి బాధపడుతున్నావు కదూ" తల్లి మెడ చుట్టూ చేతులేసి చిన్నపిల్లలా అడుగుతున్న కూతుర్ని దగ్గరగా కూర్చోబెట్టుకుంది శ్రీలక్ష్మి.

"లల్లీ! నువ్వు నాన్నగారితో రాత్రి అలా మాట్లాడి ఉండకూడదు"

"అమ్మా!...." ఆశ్చర్యంగా చూసింది తల్లివైపు.

"అమ్మా ! నేను మాట్లాడిన దాంట్లో తప్పేముంది? నేను ఇన్నేళ్ళుగా చూస్తున్నాను. మనింట్లో అన్ని నిర్ణయాలు నాన్నగారే తీసుకుంటారు. నువ్వు దేనికీ ఏమీ చెప్పవు. ఎందుకు? నీ కంటూ అభిప్రాయాలుండవా? లేక నాన్నగారు అడగరని నీకు చెప్పేందుకు అభిమానం అడ్డొస్తుందా?"

"ఎప్పటికప్పుడు నిన్ను అడుగుతూనే ఉన్నాను నీ అభిప్రాయం కూడా చెప్పమని. మా చదువుల విషయంలోనూ నాన్నదే తుదినిర్ణయం. ఆయన్ని కాదని నాకు కావలసిన చదువు కోసం నేను పోరాడాను. చెల్లి మళ్ళీ నీలాగే తయారవుతోంది. ఎందుకమ్మా ఇలా?"

"లల్లీ! నిర్ణయాలు ఎవరు తీస్కోవాలి, ఎవరి మాట నెగ్గాలని కాదమ్మా. ఇంటికి, సంసారానికి కావలసిందీ, సరైనదీ అయితే ఎవరు నిర్ణయిస్తే ఏమైంది? దీనికోసం ఘర్షణ ఎందుకు?"

"అదే, అందుకే అమ్మా! నువ్వెందుకు నిర్ణయాలు తీసుకోవు? నువ్వెందుకు తెలుసుకోవు?"

"కనీసం ఇలా చేద్దామా? ఇది బావుంటుందా? అన్న సంప్రదింపులు కూడా

భార్యాభర్తల మధ్య అవసరం లేదా అమ్మా? ఘర్షణ కూడదని అన్నీ తలొంచుకుని అంగీకరించాలా?"

"అమ్మా! ఒక్కమాట చెప్పు. నాన్నగారన్న మాటలకు నీ మనసు నొచ్చుకుంది. అవునా? మామయ్యగారు, అత్తయ్యగారు చెప్పినట్లు ఒక్కరి నిర్ణయంకంటే ఇద్దరు కల్సి కూర్చుని సంప్రదించుకుంటే ఇంకా చక్కని నిర్ణయాలు తీసుకోవచ్చు కదా"

లలిత తల్లి ఒడిలో తలపెట్టుకుని పడుకుని ఉంది. ఏదో తెలియని బెంగ.

"లల్లీ! పెళ్ళయి అత్తవారింటికి వెళ్తున్నావు. అన్నింటికీ ఇలా ఆవేశపడకూడదమ్మా" కూతురి వంక అనునయంగా చూస్తూ చెప్పింది.

"అమ్మ! నీలా మాత్రం నేనుండను"

"ఉండొద్దులే. మీ జెనరేషన్ వేరు. చదువుతో పాటు లోకాన్ని చూసి ఎన్నెన్నో తెల్సుకుంటున్నారు".

లల్లీ ! నాన్న మాటలకి బాధపడలేదా అని అడిగేవు. ఎందుకు బాధపడను? కొత్తవాళ్ల ముందు అలా మాట్లాడుతుంటే. కాని అలా మాట్లాడకూడదన్న విషయం నాన్నకి తెలియాలి.

లల్లీ! ఈ నాలుగ్గోడల మధ్య మాత్రమే తిరుగుతున్నా ఎన్నెన్నో అనుభవాలు ...

నీకు బాల ఆంటీ జ్ఞాపకం ఉంది కదూ. ఇద్దరం ఇంటర్ వరకు కల్సే చదువుకున్నాం.

నన్ను ఆ పైన చదివించనని చెప్పి పెళ్లి చేసేశారు తాతయ్య. ఎంత గారంగా పెంచినా, ఇంకా చదువుకుంటానని ఎంత పేచీ పెట్టినా నా మాట చెవిన పెట్టలేదు తాతయ్య.

బాల మాత్రం డిగ్రీ చదివి, టీచర్ ట్రైనింగ్ చేసి ఉద్యోగంలో చేరాకే పెళ్ళి చేసుకుంది. తల్లి లేకపోయినా మేనమామ దగ్గర పెరిగింది. తండ్రి రెండో పెళ్ళి చేసుకోవడంతో అటువైపు బంధం నామమాత్రంగా అయిపోయింది.

చిన్నప్పట్నుంచి చాలా ధైర్యంగా ఉండేది. తన పెళ్ళినాటికి నేను ఇద్దరు పిల్లల తల్లిని. అక్కా, నువ్వు చిన్న పిల్లలు. ఇంట్లో బాధ్యతలతో పెళ్ళికి వెళ్ళలేక పోయాను.

ఆ తర్వాత పండక్కి అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్ళినపుడు కలుసుకున్నాం. క్రొత్తగా పెళ్ళయిన జంటని అమ్మమ్మ పండక్కి పిలిచింది. బాల భర్త మాధవరావుని అప్పుడు చూసాను. మనిషి బాగానే ఉన్నాడు. తెగ కబుర్లు చెబుతాడు.

'బాల చాలా తెలివైనదండీ, ఇంత కాంపిటీషన్‌లోనూ గవర్నమెంటు జాబ్ తెచ్చుకుంది. నేనుమాత్రం ప్రైవేటు ఉద్యోగిని' – భార్య గురించి గొప్పగా చెప్పుకున్నాడు. అతని

ధోరణి కాస్త అతి అన్పించింది. అమ్మమ్మ మాత్రం, 'పోనీలే తల్లి లేని పిల్ల. చక్కటి భర్త దొరికాడు బాలకి' అని మురిసిపోయింది.

తర్వాత్తర్వాత అతను చెలాయించే పెత్తనం భరించలేక బాల చాలా ఘర్షణ పడుతూండేది. ఆమె కష్టపడి సంపాదించుకునేదాని మీద కూడా అతనిదే అథార్టీ. భర్తపేరుతో బాలని చాలా అజమాయిషీ చేసేవాడు.

డబ్బుని నీళ్ళలా ఖర్చు పెట్టేవాడు. ఏదో బిజినెస్ పెట్టాలనో, స్థలం కొంటాననో డబ్బు ఇమ్మనేవాడు. కొడుకు పుట్టాడు. ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. బాల సంపాదన మీదే ఇల్లు నడుస్తూండేది. అతనికి బాధ్యతలు తెల్సిరాలేదు.

అతన్ని మార్చుకోవాలని ఎంతో ప్రయత్నించింది. అతను చేసే అప్పులు తీర్చలేక చివరికి విడిగా ఉండేందుకు నిర్ణయించుకుంది.

ఎప్పుడో ఏడాదికో, రెండేళ్ళకో కల్సుకునేవాళ్ళం. తన సంసారం చూస్తే దిగులు వేసేది. చదువుకుంది. మంచి ఉద్యోగం చేసుకుంటోంది. కాని సుఖం సంతోషం లేవు. ఆమె పట్ల అసూయతో, మగవాడి నన్న అహంకారంతో అతను పెట్టే బాధలన్నీ భరించి భరించి విరక్తితో విడాకులకి పెట్టుకుంది. జీవితం అంటే ఎంత మమకారంతో ఉండేదో, అంత మార్పుని తీసుకొచ్చాడు అతను.

ఇంతలో అతనికి ఏక్సిడెంటు అయి మంచాన పడటం, ఉద్యోగం పోవడంతో అతని పరిస్థితికి జాలితో అతన్ని ఆదరించింది.

లల్లీ! జీవితం సింపుల్‌గా, అందంగా కన్పిస్తుంది ఒకసారి. మరోసారి కఠినంగా కన్పించి భయపెడుతుంది... ఇలాగే ఉంటుందని... ఇలా ఉండాలని ఏ సూత్రాలూ లేవు. నువ్వు ఈ కాలం పిల్లవి. నువ్వు చెప్పే అర్థం, నీ విశ్లేషణ తప్పకుండా ఇంతకంటే బావుంటుంది."

దీర్ఘంగా ఊపిరి పీల్చుకుంది శ్రీలక్ష్మి.

తల్లి ముఖంలోకి చూస్తూ శ్రద్ధగా వింది. ఎప్పుడొచ్చి కూర్చుందో శ్రీలు వాళ్ళిద్దర్నీ వింటూ, చూస్తూ వుంది.

ఎప్పుడో ఒకటి రెండు సార్లు బాల ఆంటీని కల్సిన జ్ఞాపకం మెదిలింది శ్రోతలిద్దరి మనసుల్లో.

చదువుకొని తన కాళ్ల మీద తను నిలబడిన స్త్రీ జీవితాన్ని కూడా భర్త, పెళ్లి ఇంత ఇన్‌ఫ్లుయెన్స్ చేస్తున్నాయి. నువ్వా నేనా అని కాక మనం అన్న భావన ఎందుకు కన్పించడం లేదు.

'అమ్మా! భార్యని తనతోటి వ్యక్తిగా గౌరవించే భర్తలే లేరా?'

'ఎందుకు లేరు లల్లీ. మన వెంకమ్మ భర్తే ఉన్నాడు కదూ. జ్ఞాపకం లేదూ – క్రితం సంవత్సరం కూతురు చదువు విషయంలో ఇద్దరి ఆలోచనలూ ఒక కొలిక్కిరాక సలహా కోసం వచ్చేరు'

ఆనాటి సన్నివేశం మొన్న మొన్న జరిగినట్లే ఉంది శ్రీలక్ష్మికైతే. ఆ సంఘటన ఒక అపురూపమైన జ్ఞాపకంగా ముద్రపడిపోయింది ఆమె మనసులో. లలిత కూడా మర్చిపోలేదు ఆ విషయాన్ని.

"అమ్మా! మా విజయ పైకి చదువుకుంటాననంటోంది. ఇదేమో కూతుర్ని ఎలాగైనా చదివించాలంటోంది. నా ఆదాయం అంతంత మాత్రం. ఇంకా స్కూలు చదువు పూర్తికాని శ్రీను ఉన్నాడు. వాణ్ణి చదివించాలి. విజయని కూడా చదివించాలంటే నాకు చాలా బరువైపోతుంది. దాని బదులు పెళ్ళి చేసి పంపిస్తే దాని బతుకు అది బతుకుతుంది. ఇలాగంటే తల్లీ కూతురు వినడం లేదమ్మా"

భర్త మాటలు పూర్తి అయ్యాక వెంకమ్మ నోరు విప్పింది.

"అమ్మా ఆయనతో సమానంగా తేలేకపోయినా, నేనూ కష్టపడతాననంటున్నాను. అవసరమైతే పల్లెలో ఉన్న ఆ కాస్త పొలం అమ్మేద్దామంటున్నాను. కుదరదంటున్నాడమ్మా"

భార్య మాటల్లో ధ్వనించిన నిష్టూరం అతన్నోక్షణం ఆలోచనలో పడేసింది.

"ఆ కాస్త చెక్క తాత ముత్తాతల నుండి వస్తున్న ఆస్తిగా నా కొడుక్కి మిగిల్చి ఇద్దామని ఉందమ్మా. కాని వెంకమ్మ మాత్రం చదువు విషయంలో పట్టుదలగా ఉంది. నాకూ చదివించాలనే ఉంది, కాని బరువు మొయ్యగలనో లేదోనని..."

"ఆ బరువేదో ఇద్దరం మోద్దామంటున్నాకదయ్యా. ఆ పొలం మనకేం ఒరగబెడ్తోంది. పిల్లల్ని చదివించుకుంటే వాళ్ల బతుకులు బావుంటాయి. మనకంటే ఓ మెట్టు పైకెక్కి సుఖపడతారు"

శ్రీలక్ష్మికి ఒక అద్భుతాన్ని చూస్తున్నట్లు తోచింది. భార్యాభర్తలిద్దరూ కల్సి ఆలోచించుకుని తమకి ఏది సరైనదో నిర్ణయించుకోలేక తనకి పెద్దరికాన్ని ఆపాదించారు. అతని మాటల్లో భార్య అభిప్రాయం పట్ల ఉన్న కన్‌సర్న్‌కి ఆమె మనసు చెమర్చింది.

రెండేళ్ల క్రితం లలిత చదువు విషయంలో భర్త కూతురు మధ్య జరిగిన రాద్ధాంతం ఆమె కళ్లముందు కదిలింది. తల్లిగా తన పాత్ర ఏమీ లేదందులో. నిమిత్తమాత్రురాలిగా ఉండిపోయింది. తన మీద అలిగిన లల్లి కోసం కూడా తను నోరు విప్పలేకపోయింది.

"అమ్మా! ఇద్దరూ కల్సి ఒక జీవితం పంచుకున్నప్పుడు బాధ్యతలూ ఇద్దరికీ చెందుతాయి. నీకేం కానట్లు నువ్వెలా మౌనంగా ఉంటున్నావ్? ఒకరి ఇష్టాయిష్టాల్నిబట్టి మాత్రమే ఎందుకు జరుగుతోంది జీవితం?"

కూతురి ప్రశ్నలకి ఏం చెప్పాలో తెలియలేదు.

జీవితం ఇద్దరిదీ అంటుంది. కలిసి కూర్చుని అభిప్రాయాలు కలబోసుకోవాలంటుంది. కాని భర్త దృష్టిలో భార్యగా తనకంటూ ఒక అస్తిత్వం ఉంటే కదూ.

ఎప్పటెప్పటివో, ఎన్నెన్నో సన్నివేశాలు కళ్ళముందుకొచ్చాయి.

క్రొత్తగా పెళ్ళయిన రోజులు... అత్త మామలు ఏదో పెళ్ళికని పొరుగూరు వెళ్ళారు. అత్తవారింట ఇంకా క్రొత్త వదల్లేదు.

భర్త ఆఫీసు నుండి వచ్చేక భోజనం వడ్డించింది. చిన్నతనం, మనసులో ఏవేవో సరదాలు, ఊహాగానాలు ముసురుతూండేవి.

భర్తతోపాటు తనూ వడ్డించుకుందామనుకుని ఒక్కక్షణం ఆలోచించింది. అతడే చెబుతాడు ఆ మాట అని చూసింది. లేదా ఇద్దరం ఒకే కంచంలో తిందామంటాడేమో!

ఆ ఆలోచనకే సిగ్గుపడిపోయింది. అయితే అతను మాత్రం స్నానం చేసి వచ్చి తాపీగా భోజనం చేసి వీధి వసారాలోకి వెళ్ళిపోయాడు.

అది ఆమె వయసుకి, మనసుకి పెద్దషాక్...ఆశ్చర్యం!

కథల్లోలా కాక నిజ జీవితంలో ఇలాగే ఉంటుందేమో అని తెల్లబోయింది. అది ఆమె చూసిన మొదటి వాస్తవం!

అతని నీడలాగే అతని వెంట ఇన్నేళ్ళూ నడిచింది. కాని అతనికి ఏమీ కాలేక పోయిందా? జీవితం చాలా భాగం గడిచే పోయింది. హృదయం అలా ఎదురు చూస్తూనే ఉంది – ఒక ఆత్మీయ స్నేహపూర్వకమైన పలకరింపుకి, మనసా వాచా కర్మణా జీవిస్తున్న జీవన సహచరుడి పిలుపుకి. నోరువిప్పి అడిగి పిలిపించుకోవడం తెలియనేలేదు.

తల్లి ముఖంలో ఏ నీలినీడలు కదలాడేయో. లల్లి మళ్ళీ చెప్పింది.

“అమ్మా! నేను మాత్రం నీలా ఉండను. సందీప్‌తో అన్నీ ముందే మాట్లాడతాను. ఏ నిర్ణయమైనా అతనిదో, నాదో కాకుండా ఇద్దరిదీ కావాలని. ఒక క్రొత్త ఆదర్శ లోకాన్ని నిర్మిద్దామని చెబుతాను”

కూతురి కళ్ళల్లో స్థిరనిశ్చయం తాలూకు ఆత్మవిశ్వాసం చూసి మనసారా నవ్వింది శ్రీలక్ష్మి.

భవిష్యత్తులో క్రొత్త ప్రపంచాన్ని చూడబోతున్నానన్న నిశ్చింత, తృప్తి ఆమె ముఖంలో మెరిశాయి.

**(‘రచన’ కథాపీఠం జూలై 2010)**

# మనం మైనస్ నువ్వు ఈజ్ ఈక్వల్ టు ఒట్టి నేను

రాత్రి చీకట్లు పూర్తిగా వదలలేదు. మాధురి ఉత్సాహంగా పక్కమీంచి లేచింది. తలుపులు, కిటికీలు అన్నీ తెరిచి ఉదయపు ఆనందాన్ని ఇంటి నిండా ఆహ్వానించింది. చిన్న తమ్ముడు శ్యామ్ వస్తాడు. చాలా యేళ్ళే అవుతోంది తీరిగ్గా కలిసి. ఉద్యోగ బాధ్యతలతో ఎక్కడో దూరంగా ఉంటున్నాడు.

ఇన్నాళ్ళకి మేనకోడలి చదువు పుణ్యమా అని ఊళ్ళోకి వస్తున్నాడు. కూనిరాగాలతో ఇల్లంతా మళ్లీమళ్లీ సవరిస్తూనే వుంది. శ్రీకాంత్ ఓరకంట భార్యని గమనిస్తూనే ఉన్నాడు. చాలా రోజుల తర్వాత ఆమెలో ఒకప్పటి ఉత్సాహాన్ని చూస్తున్నాడు.

మాధురి చాలా చాలా ఆలోచించేసుకుంటోంది. మేనకోడలు రమ్యకి ఇక్కడ సీటిస్తే తన దగ్గరే ఉంచుకుని చదివిస్తుంది. ఇంటికి మళ్లీ కళవస్తుంది. ఒంటరితనాన్ని తరిమెయ్యవచ్చు.

పెరట్లో నిలబడితే కనుచూపుమేరా పరుచుకున్న ఆకుపచ్చని సముద్రం. ఊరికి దూరంగా ఇల్లు కట్టుకున్నందుకు దొరికిన వరం. కంటి నిండుగా చూస్తూండిపోయింది.

'చిట్టి తమ్ముడు వస్తున్నాడు. ఈ రోజు ఇంటివాళ్ళకి కాఫీ దొరుకుతుందా? తమ్ముడితో కల్సి అల్లరేనా?' శ్రీకాంత్ వెక్కిరిస్తున్నాడు, ఆమె తన్మయత్వాన్ని చూసి.

ఎదురుగా నందివర్ధనం నిండా పువ్వులతో అల్లరల్లరిగా కన్పించింది. అప్రయత్నంగా ఆమె ముఖమంతా నవ్వు పరుచుకుంది. చిన్ననాటి మధురమైన జ్ఞాపకాలను నిత్యం కళ్లముందుకు తెస్తుంది.

పుట్టింట్లో ఈలాంటి నందివర్ధనం దగ్గరే కదూ శ్యామ్ మాయమవుతూ వుండేవాడు. పెళ్ళయి అక్క అత్తవారింటికి వెళ్ళిపోయిందన్న దిగులుతో జ్వరం తెచ్చుకున్నాడని తెల్సి తమ్ముణ్ణి చూసేందుకు భర్తతో కల్సివచ్చింది.

తీరావచ్చి పలకరించబోతే చటుక్కున పెరట్లో మొక్కల్లోకి వెళ్ళిపోయి, ముక్కు ఎగబీలుస్తూండేవాడు. రా రమ్మని పిల్చినా, బ్రతిమాలినా దగ్గరకు రాకుండా ఉక్రోషంతో దూరంగా తిరిగేవాడు.

ఎప్పటికో అలక తీరి దగ్గరకు వచ్చినా, 'నువ్వెందుకు విశాఖపట్నం వెళ్ళిపోయావ్? నన్నెందుకు తీసుకు వెళ్ళలేదు' అని ప్రశ్నించేవాడు. శ్రీకాంత్‌ని శత్రువుని చూసినట్లు చూసేవాడు.

పది పన్నెండేళ్ళ ఎడం ఉండటంతో మాధురి దగ్గర గారాలు పోతుండేవాడు. అక్క పెళ్ళి అంటే అందరితో సంబరాలు చేసుకున్నాడు కాని, అక్క వెళ్ళిపోవడం వాడి పసిమనసుకు అందలేదు.

ఎలాంటి మమతానురాగాల మధ్య పెరిగారు అమ్మ ఇంట తామంతా! ఆ రోజు పగలంతా సమయం గడవనట్లే తోచింది మాధురికి. సాయంత్రం కావొస్తూంది. ఫోన్ మ్రోగడంతో మొక్కల మధ్య తిరుగుతున్న మాధురి చటుక్కున ఫోనందుకుంది.

'హలో అక్కా!...' అవతలవైపు నుండి శ్యామ్ గొంతు.

'చెప్పరా' అంది ఉత్సాహంగా.

శ్యామ్ చెప్పినది వింటూనే ఆమె ముఖం కళావిహీనంగా మారిపోయింది. అతను చెప్పినదంతా విని 'అది కాదురా...' అంటూ ఏదో చెప్పబోయింది.

'లేదులే అక్కా. ఈ ఏర్పాటు అందరికీ సౌకర్యంగా ఉంటుంది. ఆలోచించే చేసానులే. కలుస్తాంగా' అంటూ ఫోన్ పెట్టేసేడు.

ఆమె మనసు చివుక్కుమంది. ఒక్కసారిగా ఏదో తెలియని నిరుత్సాహం, దిగులు ఆవరించి ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుండిపోయింది.

పిల్లల పెంపకంలో ఎక్కడ అశ్రద్ధ చేస్తుందో అని చేస్తున్న ఉద్యోగం వదిలేసింది. పిల్లల చదువులు, వాళ్ల మంచి చెడ్డలు చూసుకుంటూ నిముషం తీరిక లేకుండా గడిపింది.

పిల్లల చదువులై కంటికి కనపడని దూరాలు వెళ్ళిపోయేదాకా చుట్టూ ప్రపంచం పట్టనట్టు బ్రతికేసింది.

అక్కడికీ శ్రీకాంత్ ఎన్నోసార్లు హెచ్చరిస్తూనే వుండేవాడు. 'పిల్లలు, పిల్లలంటూ అదేలోకంగా బ్రతుకుతున్నావ్. వాళ్ళు రేపు బయటకు వెళ్ళిపోతే ఆ ఖాళీని భరించడం కష్టం అవుతుంది. ఓ వ్యాపకం చూసుకో కాలక్షేపానికి' అంటూ. అతని మాటలకి విసుక్కునేది కాని వాస్తవాన్ని లీలగా మాత్రం గ్రహించలేక పోయింది.

ఆ ఖాళీదనం ఎదురయ్యేసరికి అదృష్టవశాత్తూ బాబాయి కూతురు లత బదిలీమీద వచ్చి తమ పొరుగున ఉండటంతో కొంత ఓదార్పు నిచ్చింది. లత బిజీగా ఉండేది. ఆమె పిల్లల పట్ల తెలియకుండానే మాధురి మమకారాన్ని పెంచుకుంది. వాళ్ళ చదువుల్లో కొంత సాయం చెయ్యడం, వాళ్ల కబుర్లు వినడం....'

శ్రీకాంత్ నవ్వుతూండేవాడు "బావుంది పిల్లల కోడిలా ఎప్పుడూ పిల్లల్ని వెంటేసుకుని గడిపేస్తావ్. ఓ పదిమంది పిల్లల్ని పెంపకానికి తెచ్చుకో" అంటూ వేళాకోళం చేస్తూండేవాడు"

లత వాళ్ళు ట్రాన్స్ఫరై వెళ్ళిపోతూంటే మళ్ళీ ఆ పిల్లల మీద బెంగతో కొన్నాళ్లు సతమతమైంది.

మాధురి పదిమందిలో పుట్టి పెరిగిన మనిషి. ఎందుకో ఒక ఒంటరితనం ఆవరిస్తుంటే సహించలేకపోతోంది. ఏదో బెంగ బెంగగా అన్పిస్తుంది. ఎవరికివాళ్ళు ఉద్యోగరీత్యా ఎక్కడో ఉన్నారు. ఏడాదికి కాకపోయినా రెండేళ్ళ కొకసారైనా కనీసం కల్సుకోవడం కష్టమైపోతోంది.

ఆమె ఆలోచిస్తూంటుంది... తనకేనా ఈ ఒంటరితనం? అందరికీ అనుభవంలోకి వస్తోందా? అని.

శ్యామ్ కూతురు ఏదో ఎంట్రన్స్ పరీక్షలని, కౌన్సెలింగ్‌కనీ తమ ఊరు వస్తుందని తెలిసి నాలుగు రోజులు వాళ్ళమధ్య సందడిగా గడపొచ్చని ఆశ పడింది.

తీరా శ్యామ్ ఫోన్ చేసి హోటల్లో రూమ్ బుక్ చేసుకున్నామని, ఎటూ నాల్గు రోజులు ఊళ్ళోఉంటాం కనుక ఏదో ఒక పూట వచ్చి కలుస్తామని చెప్పేసరికి చెప్పలేనంత నిరాశ.

"మధూ, ఏమిటంత దీర్ఘాలోచన? చాలా షాపింగ్ చేసుకొచ్చినట్లున్నావ్" శ్రీకాంత్ పలకరింపుకి ఆలోచనల్లోంచి బయట పడింది.

❖❖❖

రాత్రి భోజనం చేస్తూ శ్రీకాంత్ ఆఫీసు కబుర్లు చెబుతున్నాడు.

"అదేమిటో మధూ, పూర్వం రోజుల్లోలా అందరూ కబుర్లు చెప్పుకుంటూ, రిలాక్స్‌డ్‌గా

పని చేసుకోవడం, కల్సి లంచ్ చెయ్యడం పోయిందోయ్. ఎవరికి వాళ్ళే ఏదో అర్థం కాని బిజీ. చాలా మెకానికల్‌గా గడిచిపోతోంది.

ఎవరితోనైనా మనసు విప్పి మాట్లాడుకోవడం మాట ప్రక్కన పెట్టు. హలో అని పలకరించుకునే తీరుబాటే ఉండట్లేదు. ఎప్పుడు చూసినా చేతిలో సెల్‌ఫోన్‌తో బిజీగా కన్పిస్తుంటారు. ఇంతగా కనెక్టివిటీ పెరుగుతోందనిపిస్తున్నా ఎవరికి వారికి ఈ వెలితి తప్పడం లేదు.

మధూ! నీకు గుర్తుందా మనం విశాఖపట్నంలో ఉన్న రోజులు! ఎంత లైవ్లీగా గడిచేవి సాయంత్రాలు! శని ఆదివారాలొస్తే ఎంత సందడి! ఎన్ని కుటుంబాల వాళ్ళం కలిసేవాళ్ళం, ఎంత సరదాగా గడిపేవాళ్లం!

ఆ రోజులే వేరులే. ఇప్పుడలాంటి లైఫ్‌స్టయిల్ ఎక్కడా కన్పించనే కన్పించదు.

ఇంతకీ ఇదంతా ఎందుకు చెబుతున్నానో తెల్సా?

నీకు పరమేశ్వరరావుగారు గుర్తున్నారా?"

అరక్షణం కూడా ఆలోచించనక్కరలేకుండానే ఆమె చెప్పింది.

"గుర్తులేకేం?! రెండు మూడేళ్ళ క్రితం దాకా కార్తీకమాసం వనభోజనాలకి ఆయనదేకదూ హడావుడి. రెండేళ్ళుగా మిస్ అవుతున్నాం. పిల్లల దగ్గరకెళ్ళేరా? ఇప్పుడెక్కడున్నారు?"

"చాలాకాలం తర్వాత ఆయన ఈ రోజు బ్యాంక్ కి వచ్చారు. చాలా డల్‌గా కన్పించారు. వయసు కూడా ఎనభైల్లోకి వచ్చేసింది.

ఆయనేం చెప్పారో తెల్సా, ఓల్డ్ ఏజ్‌హోమ్‌కి షిఫ్ట్ అవుతున్నారుట ఈ నెలాఖరుకి?"

మాధురి ఆశ్చర్యపోయింది. ఉత్సాహానికి మారుపేరులా ఉండేవారు. ఒక్కక్షణం తీరికలేకుండా పనులు కల్పించుకుని తిరుగుతూండేవారు. పిల్లలు జీవితాల్లో స్థిరపడ్డారు. గిరిజగారు అన్ని ఏక్టివిటీస్‌లోనూ ఆయన వెనకే ఉండేవారు. ఆయనకు తగిన భార్య.

రెండేళ్ళక్రితం కల్సినప్పుడు మొబిలిటీ కాస్త కష్టం అన్పిస్తోందన్నారు. ఆ తర్వాత పిల్లల దగ్గరికి వెళ్లారని వింది. ఇప్పుడు ఈ నిర్ణయం ఆశ్చర్యంగానే ఉంది. ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో మరీ మోనాటనస్‌గా అయిపోతుంది జీవితం అని అంటుండేవారు. చివరివరకూ స్వతంత్రంగానే జీవించాలనే వారాయన. ఆ మాటే అంది శ్రీకాంత్‌తో...

రిటైరై ఇరవయ్యేళ్లు అయ్యాక ఇప్పుడు ఆయన అలసట ఫీలవుతున్నారు. అది కూడా కాదేమో! చుట్టూ ఉన్నవాళ్లంతా తన వాళ్ళే, తన కుటుంబమే అని నమ్మి బ్రతికిన మనిషి.

రానురాను సొసైటీ 'నేను' వరకే పరిమితం అవుతూ మరింతగా కుచించుకుపోతూంటే ఆ స్వార్థం చూడలేక, చుట్టూ ఉన్న మనుషుల్లో తనెలాంటి మార్పునీ తీసుకురాలేకపోయినందుకు ఆయనలో ఒక నిర్వేదం మొదలైంది. ఆవిడ శారీరకంగా చాలా బలహీనమయ్యారు.

గత ఇరవైయ్యేళ్ళుగా కాలనీలో పెరిగిన పిల్లలంతా ఆయనదగ్గర పెరిగిన వాళ్లే. వాళ్ళూ పెరిగి పెద్దయి దూరంగా వెళ్ళిపోయారు. ఒక్క పిలుపు, పలకరింపుకూడా కరువయ్యాయి.

చుట్టూ ఘనీభవించినట్లున్న నిశ్శబ్దాన్ని భరించలేక ఈ నిర్ణయం తీసుకున్నారు. పిల్లల దగ్గరకెళ్ళినా వాళ్ళ బిజీ జీవితాల మధ్య తాము ఇమడలేమని చెప్పారు" నిట్టూర్పును బలవంతంగా అణచుకున్నాడతను.

మాధురి మనసు తమ్ముడి ఫోన్‌కాల్ తెచ్చిన నిస్పృహతో మథన పడుతూనే ఉంది. చిన్నప్పటి రోజుల్ని పదేపదే తల్చుకుంది... అవి అద్భుతమైన జ్ఞాపకాలు.

ఇంటినిండా పిల్లలతో అమ్మ క్షణం తీరిక లేకుండా ఉండేది. అయినా పెదనాన్నగారి వాసు, చిన్నత్త కూతురు రాజి చదువు నిమిత్తం తమ ఇంట్లోనే ఉండేవారు.

అమ్మ అందరికీ పెద్ద కంచంలో అన్నం కలిపి వరసగా ముద్దులుచేసి చేతుల్లో పెట్టేది. ఎంత ఓపిక, ఎంత సరదా అమ్మకి.

తెల్లవారి ఎప్పుడు లేచేదో, తామంతా ఒక్కొక్కరూ లేచి తయారు అవుతూంటే స్కూల్ యూనిఫారాలందించి, ఆడపిల్లలందరికీ రెండేసి జడల్చొప్పున వేసి తయారుచేసేది. భోజనాలు పెట్టి, క్యారేజీలు రెడీ చేసేది. రాజి సెలవుల్లోనూ ఇంటికి వెళ్ళననేది. కూతురు కోసం చిన్నత్త తనే వచ్చి తమ బ్యాచ్‌లో చేరిపోయేది.

మాధురి పిల్లలతరం వచ్చేసరికి కొంత మార్పు తెలుస్తూ వచ్చింది. స్కూల్‌కెళ్లే వయసులో సెలవులకంటూ అమ్మమ్మ, నానమ్మల ఇళ్లకి వెళ్ళినా రా(న్రాను మాకు ఇక్కడే బావుందంటూ సెలవుల్లోనూ ఊరువిడిచి నల్గురితో కల్సేందుకు ఆసక్తి చూపేవారు కాదు.

చదువులు, రకరకాల అభిరుచులు డెవలప్ చేసుకోవడం వ్యక్తిగతంగా గోల్స్, వాటికోసం నిత్యం కష్టపడటం....

ఏ పిల్లల్ని చూసినా ఇలాగే పెరుగుతూ వచ్చేరు. నల్గురితో కలవడం, తమ జనరేషన్ వాళ్ళలాగా అల్లరి, ఆటలు పూర్తిగా మాయమైపోయాయి వాళ్ళ జీవితాల్లో. దేనికో ఆరాటం... ఏదో మిస్ అయి పోతాం ఈ క్షణం వదిలితే... ఇంతే. ఇలాగే గడిచిపోయాయి. వాళ్ళతో సమానంగా తమనీ పరుగులు పెట్టించారు.

రిలాక్స్ అయేందుకు కాస్త సమయం కేటాయించాలన్నా ఒక పెద్ద 'నో' చెప్పెయ్యడమే. 'రేపులేదు' అన్నట్లు ఈ రోజు కష్టపడటం. ఆ లేదేమో అన్న రేపుకోసం ఈ రోజు జీవించడాన్ని వాయిదా వేసెయ్యడం!

ఇందాక శ్యామ్ మాట్లాడుతూ, 'ఒక్కక్షణం... రమ్య హాయ్ చెబుతుంది' అంటూ అవతల ప్రక్క కూతుర్ని లైన్లోకి రమ్మంటున్నాడు. 'డాడీ టైమ్‌లేదు. నువ్వు మాట్లాడెయ్' అనడం మాధురి స్పష్టంగా వింది.

నిట్టూర్పును అణుచుకుంది. తమ పిల్లలూ ఇలాగే ఉన్నారు. ఒకరిని ఒకరు పలకరించుకోవడం, కల్సుకోవడం ఇంతగా అరుదై పోతున్నాయి. జీవితాల్లో ఎక్కడా 'మనం' అనే కాన్సెప్టే లేదు. అంతా నేను, నాది, అంతే. నేను, నా ప్రైవసీ, నేను, నా కెరీర్, నేను, నా హాలిడే, నేను, నా జీవితం! నేను, ఒక్తినేను!

పిల్లల్ని పలకరిస్తే వాళ్ళకి ఫోన్ తీసేటైమ్‌లేదు. మెయిల్ రాస్తే జవాబిచ్చే వ్యవధి వుండదు. ఎప్పుడో అరుదుగా ఫోన్‌లో దొరికినా, 'అమ్మా! ఊపిరి తీసుకునే టైముకూడా లేదు. నువ్వేమో ప్రపంచంలో తీరికంతా నీదేనన్నట్లుంటావ్. ఏదైనా చెయ్యమ్మా, యు ఆర్ స్టిల్ యంగ్ అండ్ ఎనర్జిటిక్. ఖాళీగా కూర్చుని టైమ్ వేస్ట్ చెయ్యకు. మమ్మల్ని సతాయించకు, బై'

ఇది వినీవినీ పిల్లల్ని పలకరించాలన్న ఆశ కూడా ఆవిరై పోయిందామెకు. ఒక సారి పిల్లలు కెరీర్ మలుచుకునే రోజుల్లో అమ్మనంటూ తనని పూర్తిగా విస్మరిస్తున్నారని ఉక్రోషపడిపోయి, "మీ గురించేనర్రా...కేవలం మీ గురించి మీకు ఎక్కడ ఏమిలోటు చేస్తానో, మీ పెంపకంలో ఏం మిస్ అవుతానో అని కెరీర్ని కూడా వదులుకున్నాను" అంది.

"అమ్మా! నువ్వు కెరీర్ మా కోసం వదులుకున్నానంటే ఒప్పుకోం. మా మానాన మేం చదువుకుంటుంటే నువ్వు కెరీర్ వదిలి ఇంట్లో కూర్చోవడం మా తప్పా!"

"అసలు మా ఫ్రెండ్స్ మమ్మీలు ప్రొఫెషనల్‌గా పెద్ద పెద్ద పొజిషన్స్‌లో ఉంటే చూస్తే జెలసీ అన్పిస్తుంది. నువ్వెందుకు అలా లేవా అని మాకు చిన్నతనంగా కూడా అన్పిస్తుంది తెలుసా..."

పిల్లల అభిప్రాయం విన్నాక తను జీవితంలో ఏం పొగొట్టుకుందో, ఏం పొందిందో అర్థం కాలేదామెకు.

ఒకే ఒక్క జనరేషన్ దూరంలోనే కదా తనూ, పిల్లలూ ఉన్నది? మరి, ఇదేమిటి? అమ్మమ్మకి, అమ్మకి మధ్యవున్న ఆప్యాయత తమ తరంలో అమ్మకీ, తమకీ మధ్య అంతే చిక్కగా ఉండేది. ఎన్నో ఇష్టాలు కామన్‌గా ఉండేవి మూడు తరాలకీ. మరి ఇదేమిటిలా ఉంది ఈ కాలం?

సడన్‌గా ఏదో అయిపోయింది. 'మానవ సంబంధాలు' అంశం మీద ఎన్నెన్నో వ్యాసాలు, చర్చలు, సెమినార్లు జరుగుతున్నది ఇందుకేనా?

జీవితాల్లోంచి జారిపోతున్న అనుబంధాల్ని, ఆప్యాయతల్ని, మనిషితనాన్ని ఒడిసి పట్టుకునే ప్రయత్నమా ఇదంతా? అయితే ఇంకా మానవ సంబంధాలకోసం పాకులాడే జనం ఉన్నట్లేగా....

ఒక్కక్షణం ఆ ఆలోచనతో మాధురి మనసు మురిసింది. చటుక్కున లేచి శ్రీకాంత్ ప్రక్కన చేరింది.

'శ్రీ! నీకు ఆత్మీయులైన స్నేహితుల్ని ఇంటికి ఆహ్వానించు. ఎంత దూరాన ఉన్నా సరే రావల్సిందేనని చెప్పు. వచ్చేందుకు కాస్త టైము మాత్రం ఇవ్వు. నేనూ నా స్నేహితుల్ని ఆహ్వానిస్తాను.

మనలాగా ఒంటరితనపు దిగుళ్ళతో జీవితాన్ని నిస్సారంగా గడిపేస్తున్న మన గ్యాంగ్‌ని మనం ఎందుకు మిస్సవ్వాలి?"

శ్రీకాంత్ మనసు తేలికపడింది భార్య ముఖంలో క్రొత్త కళ చూసి.

**('ఆకాశవాణి'లో జూలై, 2012లో ప్రసారితం)**

# బంపర్ ఆఫర్

ప్రొద్దున్నే న్యూస్‌పేపర్ చూస్తున్న శాంతి ‘క్షీరాద్వాదశి’ గురించిన ఆర్టికల్ చూసింది. ఏదో తెలియని ఆనందం! అక్షరాల వెంట చూపులు పరుగెడుతున్నా మనసు మాత్రం చిన్నప్పటి రోజుల్లోకి వెళ్ళిపోయింది.

క్షీరాద్వాదశి! అమ్మ ఎంత పవిత్రంగా, నియమంగా ఆచరించేది ఈ పూజ! ప్రతి పర్వదినాన్నీ అంతే...ఉత్సాహంగా ప్రత్యేకంగా చేస్తుండేది.

పెరట్లో తులసి మొక్కతో పాటు ఉసిరి కొమ్మని ఉంచి అమ్మ చేసే పూజ, తులసి కోట చుట్టూ పేర్చిన ప్రమిదలు, ఆవునేతితో వెలుగుతున్న ఆ దివ్వెలు చూడడం చిన్నప్పటి నుండీ సరదానే.

కాని అమ్మనుండి ఆ సంప్రదాయాన్ని అంది పుచ్చుకుని పిల్లలకి అందించనే లేదు. ఎందుకు? టైమ్ లేదు. చదువు, పెళ్ళి, పిల్లలు, ఉద్యోగం ఇవన్నీ ఒకదానివెనుక ఒకటి తరుముకుంటూ జొరబడి జీవితాన్ని ఉక్కిరి బిక్కిరి చేసేశాయి. ఏ బాధ్యతా కాదనలేనిదే.

ఎన్నోసార్లు పిల్లల చదువులు దగ్గరగా చూసుకుంటూ తన కనుసన్నలలో పెంచుకోవాలని ఆశగా ఉండేది. తను ఉద్యోగం సరదాగానే మొదలెట్టినా, అది వదిలి పెట్టేందుకు భర్త ఒప్పుకునే వాడు కాదు.

"శాంతీ! వారానికి రెండు రోజులు ఇంట్లోనే ఉంటావు. ఆయా పిల్లల్ని చక్కగా చూసుకుంటుంది. ఉద్యోగం మానడం తెలివితక్కువ తనం. కొన్నాళ్ళు చెయ్, తర్వాత చూద్దాం" పిల్లలు పసివాళ్ళుగా ఉన్నప్పుడు ఇలా చెప్పుకొచ్చేవాడు.

కాస్త పెద్దవుతుంటే,

"వాళ్లంతటవాళ్లు అన్ని పనులూ చేసుకు స్కూలుకి వెళ్ళుస్తున్నారు. నువ్వు ఇంట్లో కూర్చుని ఏం చేస్తావ్?" అనేవాడు.

ఒక్కోసారి జీవితాన్ని తన చేతుల్లోంచి ఎవరో బలవంతంగా లాక్కుంటున్నారని వుక్రోషం, దుఃఖం తోసుకొచ్చేవి. తరచుగా ఉద్యోగాల్ని మార్చే అతని పద్ధతిని మార్చుకోమని, నిలకడగా ఉండమని అతనికి చెప్పి చెప్పి విసిగిపోయింది. ఆర్థిక అభద్రత తనని వుద్యోగంలోంచి బయట పడనివ్వలేదు.

పిల్లలు మరి కాస్త పెద్దవాళ్ళయి కాలేజీ చదువుల కొచ్చాక, "పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. నీ ఉద్యోగం మానేస్తే నా ఒక్క సంపాదనతో వాళ్లకి కావలసిన చదువులు చెప్పించగలమా? నీకు మాత్రం ఏం తోస్తుంది. ఇన్నేళ్ళూ బిజీగా గడిపిన దానివి?"

భర్త మాటలు ఏళ్ల తరబడి వింటూనే వుంది. అతను చెప్పేది నిజమే మరి. అతని బాధ్యతారాహిత్యం తను మాన్పలేకపోయింది.

పిల్లలు వాళ్ళదైన జీవితాల్లోకి వెళ్ళిపోయారు. అదొక శూన్యం. ఆ శూన్యాల్ని భరించడం కష్టమే అన్పించింది. రేపుఏమిటి అన్న ఆసక్తి, నిరీక్షణ లేకుండా పోయింది. తను వదిలేద్దామనుకునే ఉద్యోగ జీవితమే సాంత్వన అయింది.

వయసును గుర్తు చేస్తూ మధ్యమధ్య ఆరోగ్య సమస్యలు. జీవితం నిస్సారంగా అన్పిస్తోందనుకున్నప్పటి నుండీ శక్తి, ఉత్సాహాలు రెండూ తగ్గిపోవడం మొదలైంది.

భర్త నిష్ఠూరాలు వింటూ కూడా వాలంటరీ రిటైర్మెంట్ తీసేసుకుంది తాను. పిల్లలిద్దరూ తన నిర్ణయానికి షాకయ్యారు. కూతురు అడగనే అడిగింది. 'ఇంట్లో కూర్చుని ఏం చేస్తావమ్మా' – అంటూ,

అల్లుడు మరో అడుగు ముందుకేసి, "ఈరోజుల్లో ఉద్యోగాన్ని వదిలేసుకోవడం ఏమిటండీ. ఎంతెంత జీతాలూ సరిపోవట్లేదు."

అతని గొంతులో నిరశన స్పష్టంగానే ధ్వనించింది. నీళ్ళ ప్రాయంగా ఖర్చుపెట్టే అతని నైజం తెలియనిది కాదు.

ఇదేమిటి? తన జీవితం తనది కాదా? తనకి కావలసినట్లు ఈ వయసులో కూడా నిర్ణయాలు తీసుకోకూడదా?

ఫోన్ మ్రోగడంతో లేచింది. కూతురు, అల్లుడు వస్తున్నారన్న కబురువిని సంబరపడి పోయింది. ఉత్సాహంగా ఇల్లంతా సర్దింది. వాళ్ళు ఇష్టంగా తినే వంటల లిస్ట్ తయారు చేసి, ఒకటి రెండు పిండివంటలు సిద్ధం చేసింది.

యంత్రంలా పని చేసుకు పోతూ ఎన్ని సరదాలు మిస్సయ్యింది! పిల్లలతో తీరిగ్గా ఎప్పుడైనా గడిపిందా తను? ప్రొద్దున్నే స్టేషన్‌కి వెళ్ళింది భర్తతో కల్సి. పిల్లలకి ఉత్సాహంగా ఎదుర్కోలు పలికింది. రెండు రోజులు చకచకా గడిచిపోయాయి. 'మావయ్యా! అత్తయ్య కోసం అద్భుతమైన బహమానాన్ని తెచ్చాం?" అల్లుడిమాటలకి ఆశ్చర్యపోయారు దంపతులు.

పెళ్ళయిన అయిదారేళ్ళుగా చూస్తున్నారు అతన్ని. ఎప్పుడు ఏ బహుమానాన్ని అందుకుందామా అని ఎదురు చూస్తూ లెక్కలు వేసుకుంటూ ఉండే అతని ధోరణి వాళ్ళకి అలవాటైపోయింది. ఇంత మెటీరియలిస్టిక్‌గా ఎందుకుంటున్నాడని మనసులో మధన పడుతూంటుంది తను. అలాంటిది అతనేదో బహుమానం అంటే కాస్త సందిగ్ధంలో పడింది మనసు.

"అత్తయ్యా! మీ రిటైర్మెంటు జీవితం డల్‌గా ఉండకుండా మీ మనవణ్ణి మీ దగ్గర వుంచి వెళ్తున్నాం. చక్కగా అమ్మమ్మ తాతయ్యల దగ్గర పెరుగుతాడు. మీకూ టైమ్ పాసవుతుంది".

ఆశ్చర్యంతో నోటమాట రాలేదు. ఇదేమిటిలా సడన్‌గా? భర్తవైపు చూసింది. ఆయనా అదే భావంతో చూస్తున్నాడు. తన తరఫున భర్త ఏదైనా చెబుతాడేమో అని చూసింది. అతనూ మౌనంగా ఉన్నాడు.

తను రిటైర్మెంటు ఎందుకు తీసుకుంది? చిన్నప్పటి అభిరుచులు ఎన్నెన్నో ప్రక్కన పెట్టేసింది ఇన్నేళ్ళూ. వాటిని మళ్ళీ మొదలు పెట్టాలి. గుండె నిండా స్వేచ్ఛావాయువులు పీల్చుకుని, సంగీత సాధన తిరిగి మొదలు పెట్టాలనుకుంది. తీరిగ్గా కవిత్వం చదువు కోవాలనుకుంది. అల్లుడు చెబుతూనే ఉన్నాడు.

"అక్కడ సిటీలైఫ్‌లో ఆ స్పీడ్ జీవితం ఇప్పణ్ణుంచీ వీడికెందుకు చెప్పండత్తయ్యా. కొన్నేళ్ళు ప్రశాంతంగా ఇక్కడ పెరుగుతాడు. మాకూ కాస్త ఊపిరి పీల్చుకుందుకు వ్యవధి దొరుకుతుంది. ఆయా సరిగా వచ్చీరాకా రోజూ టెన్షనే మా ఇద్దరికీ.... అదీకాక మీరు జాబ్ వదిలి పెట్టేసారు. టోటల్‌గా చూస్తే మన కుటుంబ ఆదాయం బోల్డు తగ్గిపోయింది

మీ నిర్ణయంతో. కనీసం మాకు ముందుగా చెప్పినా వద్దని మిమ్మల్ని ఆపేవాళ్ళం". ఇంటి బాధ్యతంతా మోస్తున్న వాడిలా అతనలా మాట్లాడుతూంటే తను విస్తుపోయింది.

ఈ వయసులో తాను ఏడాది చంటివాడితో పరుగులు తియ్యగలదా? చంటిపిల్లలంటే తనకీ ముద్దే. కాని పూర్తి బాధ్యతని ఇప్పుడు తీసుకోగలదా? కనీసం తన దగ్గర ప్రస్తావించి, ముందుగా తన అభిప్రాయం తెలుసుకోనైనా లేదే. అవసరమనిపించలేదా?

కూతురి వైపు చూసింది.

"అవునమ్మా. పిల్లలంటే నీకు ముద్దు. చిన్నప్పుడు మమ్మల్ని దగ్గరుండి పెంచుకో లేకపోయానంటావు కదూ. అందుకే ఈ అవకాశం వచ్చిందేమో నీకు. హాయిగా వాడితో ఆడుకో. అక్కడ ఆయా చేతిలో పెరగడంకంటే నీ చేతుల్లో పెరుగుతున్నాడంటే మాకు బోల్డు ధైర్యం".

"అదీకాక ఆయా కూడా ఇంకో రెండు వేలు జీతం పెంచమంటోంది. నెలకి పదివేలు ఇవ్వాలంటే కష్టమే. ఇంటిమీద, కారు మీద లోను ఎప్పటికి తీరుతుంది? ఇక్కడ నీకు ఇంటి పనులకి మంచి మనిషి చేతిలో ఉంది కదా. ఏ ఇబ్బందీ ఉండదు.

"వసూ! మీ అమ్మకి ఇదో మంచి అవకాశం. రిటైరై కూర్చుని, ఏం చెయ్యాలా అని తల పట్టుకు కూర్చోనక్కర్లేదు. ఆవిణ్ణి రోజంతా ఏక్టివ్‌గా ఉంచుతాడు వీడు. పసిపిల్లలు భగవంతుడి రూపాలంటారు. వీణ్ణి చూసుకుంటే ఆవిడ వేరే పూజలు చేసే పనేలేదు".

"వారం వారం వస్తూంటామమ్మా. మళ్ళీవాడు మమ్మల్ని మర్చిపోతే ఎలా?" రైలెక్కుతూ వసు చెబుతోంది.

"అమ్మా! వాడు అలవాటైపోతే వదిలి పెట్టలేక నువ్వెంత బాధపడతావో నాకు తెల్సు. వాణ్ణి ఇప్పుడప్పుడే పట్టుకుపోనులే. నీ ఇష్టం, నీ ఓపిక ఉన్నన్నాళ్ళు హాయిగా నీ చేతులతో పెంచుకో".

ఏం మాట్లాడాలో తెలియనట్లు ఉండి పోయింది. కొత్త లేకుండా అమ్మమ్మ చేతుల్లోంచే అమ్మా నాన్నలకి వీడ్కోలు చెప్పేడు వాడు.

ఉద్యోగానికి వెళ్ళేప్పటిలా పరుగులెత్తక్కర్లేదు. హాయిగా ఫిల్టర్‌కాఫీ ఆస్వాదిస్తూ, న్యూస్‌పేపర్ చదువుతూ బద్ధకంగా జీవితాన్ని మళ్ళీ మొదలు పెట్టాలనుకుంది.

ఛ! ఏమిటింత స్వార్థంగా ఆలోచిస్తోంది. పసివాణ్ణి పెంచడంలో ఆనందం అనుక్షణం అనుభవిస్తోంది.

ఎప్పుడో ఒక్కోరోజు పిల్లవాడితో చేసుకుని, చేసుకుని అలసటతో ఉక్రోషపడటం ఆనవాయితీ అయిపోతూంది తనకి. తన భర్త ఒక్కమాట చెప్పి ఉండొచ్చుగా.

'ఇన్నేళ్ళూ ఇంటిబాధ్యతలతో అమ్మ అలసిపోయింది. ఆమెకు కొన్నాళ్ళు విశ్రాంతి కావాలని....'

ఆయనెందుకు తన గురించి ఒక్కసారైనా ఆలోచించడు? జీవితం మీద విరక్తి పుట్టేది ఇలాంటి క్షణాల్లోనే, కొన్నాళ్ళు, కనీసం ఒక్క ఆరునెలలు తనని వదిలేస్తే మరింత జీవనోత్సాహంతో తను ఏ బాధ్యతనైనా తీసుకునేది కాదా? కనీసం మానసికంగానైనా తనని సిద్ధపడే సమయాన్నివ్వలేదు.

ఆఫీసుకెళ్తే కనీసం ఆ ఎనిమిది గంటలు సీట్లో కూర్చుని పని చేసుకునేది. ఇప్పుడు క్షణం కూర్చునే వ్యవధే లేదు. ఈ నిట్టూర్పులు తన వరకే. భర్తకి చెప్పినా అర్థం చేసుకునే హృదయం లేదు.

ఎన్నేళ్ళ తర్వాతో శ్యామల, రాజారావులు బెనారస్ వెళ్తూ దారి మార్గంగా వచ్చి కన్పించారు. డోర్‌బెల్ విని చేతిలో పసివాడితో వెళ్ళి తలుపు తీసింది. శ్యామల తన బ్యాచ్‌మేట్.

'ఏమిటే, వీడెవడు చేతిలో?' చొరవగా వాణ్ణి అందుకుంది. కాఫీ త్రాగుతూ రాజారావు అంటున్నాడు.

"శాంతిగారూ, మీకే కాదు మాకూ వచ్చిందీ బంపర్ ఆఫర్. మా అమ్మాయి, అల్లుడు స్టేట్స్ నుండి వచ్చేసి బెంగుళూరులో సెటిలయ్యారు. మనవరాలికి సరైన ఆయా దొరకలేదు. శ్యామల్ని రిటైర్మెంటు తీసుకుని, మా ఇద్దర్నీ వచ్చి వాళ్ళతో ఉండమంటున్నారు.

కుదరదని నిక్కచ్చిగా చెప్పేసాను. ఇన్నేళ్ళుగా ఆవిడ కష్ట పడుతూనేఉంది. ఇంకో మూడేళ్ళ సర్వీసుంది. ఉద్యోగం చెయ్యాలా, వదలాలా అన్నది ఆవిడ ఆలోచించు కుంటుంది. ఆ తర్వాతేం చెయ్యాలో ఆవిడదే నిర్ణయం.

అంతేకాని పసిపిల్ల వెనక పరుగులెత్తి పెంచగల్గే వయస్సా ఆవిడది?! కావాలంటే అప్పుడప్పుడొచ్చి ఓ నాల్గు రోజులుంటాం అని చెప్పేం. వాళ్ళకి కోపాలొచ్చాయని అర్థమైంది కాని రాజీ పడే ప్రసక్తి లేదు. మన పిల్లలు పసివాళ్ళుగా ఉన్నప్పుడు ఈ తిప్పలన్నీ మనమూ పడ్డవే మరి".

ఆయన చెబుతూంటే మనస్ఫూర్తిగా అభినందించాలన్పించింది.

"అవునమ్మా, ఇన్నేళ్ళూ తన వైపూ, నా వైపూ కుటుంబ బాధ్యతలు, ఆ తర్వాత మా కుటుంబం...ఇలా చేస్తూనే ఉంది. ఇప్పుడిక మిగిలిన జీవితం ఆవిడిష్టం. ఆ స్వేచ్ఛ, హక్కు ఆవిడకున్నాయి.

అయినా మన జీవితాలింక ఎంత మిగిలిఉన్నాయో మనకి తెలియదు. ఓపికలూ

ఆట్టే మిగల్లేదు మరి" తేలిగ్గా చెప్పే ప్రయత్నం చేశాడు.

ఇలా తన భర్త ఎందుకు చెప్పడు? కూతురు, అల్లుడు ఏమనుకుంటారో అని సంశయమా? వాళ్ళతో రిలేషన్స్ ఏమవుతాయో అన్న బెంగా? భయమా?

జీవితం పట్ల ఎంత బాధ్యతా రహితంగా గడిపేసాడో భార్యపట్లా అదే ధోరణి.

కళ్ళల్లో కదలిన నీటిపొర ఎవరికీ కన్పించకుండా కాఫీ గ్లాసులు తీసుకుని వంటింటివైపు నడిచింది.

**('ఆకాశవాణి' లో డిసెంబర్ 2011 లో ప్రసారితం')**

# మబ్బుతునక

నిర్మల ఇంకా రాలేదు. మనసంతా మబ్బు పట్టినట్లుగా వుంది. లైబ్రరీ మూసి నెమ్మదిగా ఈ నాలుగు అడుగులూ వేసొచ్చేసరికి అయిదున్నర, ఆరు అవుతుంది. ఆరు దాటి పది నిముషాలు కావొస్తుంది. తనింకా రాలేదెందుకో. బహుశ ప్రభాకర్‌తో ఏవో కబుర్లలో పడి ఉంటుంది. తనీపాటికి ఇంట్లో ఎదురు చూసొస్తాంటాడని కూడా నిర్మలకి తెలుసు. మరి? ఇది నిర్లక్ష్యమనుకోవాలా... స్నేహపిపాస అనుకోవాలా? అయినా తనే ఈ మధ్య ఇలా చికాకుని కొని తెచ్చుకుంటున్నాడేమో. ఒక్కక్షణం ఆలస్యం అయినందుకు తనింతగా ఎందుకు ఆలోచించాలసలు? అర్థంలేని ప్రశ్న. ఈ మనసుని అస్థిమితం చేసే ఆలోచనలకి బానిసత్వం చేస్తూ ఇంకెవరిలోనో తప్పెందుకు పట్టాలి? సడన్‌గా గమనించాడు అప్పుడే గేటుదాటి వరండాలోకి వచ్చి చెప్పులు విడుస్తూ చిరునవ్వుతో పలకరించే నిర్మలని.

"ఏంటిసార్ అంత డల్‌గా కూర్చున్నారు? ఫ్లాస్కులో టీ త్రాగనేలేదా?" పరిశీలనగా టీ పాయ్ వంక చూస్తూ లోనికి నడిచింది. ఏవో చిన్నిచిన్ని పువ్వులున్న అందమైన చీర కట్టుకుంది. అలసటగా ఉన్న ముఖంలో కూడా ఎంత ఆకర్షణో!

పెళ్ళి చేసుకోవడమూ, వెంటనే ప్రమోషన్ మీద ఈ ఊరు రావడమూ ఒక్కసారే జరిగాయి. ఈ ఆరునెలల వైవాహిక జీవితం

ఉత్సాహంగానే ఉంది. అయినా ఎక్కడో, ఏదో దిగులు. తెచ్చి పెట్టుకున్నది కాదుకదా అనే అనుమానమూ ఉంది. నిర్మల నిశ్శబ్దంగా టీ తెచ్చి భర్త చేతికందించి ఎదురుగా కూర్చుంది. శరీరానికి అలసట అన్పిస్తున్నా ఎందుకో ఆ నిశ్శబ్దం మనసుకు నచ్చేదిలా లేదు. తన జీవితంలో ఇంత నిశ్శబ్దాన్ని తెచ్చింది ఇతను కదూ! అవును ఇతనే ముమ్మాటికీ అనుకుంది. ఇద్దరూ ఎదురెదురుగా ఉన్నా ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

"శ్రీధర్...".

ఉలిక్కిపడ్డాడు ఆమె పిలుపుకి.

"ఏమిటంత మౌనం ఏదైనా చెప్పండి" గొంతు నిండా ఆర్ద్రత. కలవర పడ్డాడొక్క క్షణం.

'నిర్మలా...' ఏం చెప్పాలో తోచలేదు. ఒక్క క్షణం ఆగి అన్నాడు. "అలా పార్కు వరకూ వెళ్దామా?"

ఆ క్షణం వదిలితే మరిక రాదన్నట్లు అప్పుడే చెప్పుల్లో కాళ్ళు దూర్చింది. ఇలాంటి చిన్నిచిన్ని సరదాలు మనసుకెంత సేద దీరుస్తాయో అన్పించింది బయలుదేరే నిముషంలో.

❖❖❖

లంచ్‌అవర్‌లో పని ఉండడంతో సీట్లోంచి కదల్లేకపోయాడు శ్రీధర్. లంచ్ రూమ్‌లోంచి సుమిత్ర గొంతు గట్టిగా విన్పిస్తూంది. ఆమె మాటలకి దేనికో అంతా నవ్వుతున్నారు. సుమిత్ర పేరుకి తగ్గట్టే స్నేహశీలి. అందరితో స్నేహంగా, చనువుగా మాట్లాడుతుంది. ఆ అమ్మాయికి కొత్తా పాతా లేదు. అనుకున్నాడు భుజాన చిన్ని ప్లాస్కుతో బయటికి వెళ్లబోతూ చటుక్కున అతని దగ్గరకొచ్చింది సుమిత్ర. 'అవును కాని శ్రీధర్‌గారూ! లంచవర్లో కూడా మరీ ఇలా పనిలో కూర్చుండిపోతే ఎలాగండి. నేను క్యాంటీన్ వైపు వెళ్తున్నాను. వస్తారా?".

ఆమె వాక్ప్రవాహానికి జవాబు చెప్పలేక సీట్లోంచి లేచాడు. క్యాంటీన్ వరకూ నడిచే నాలుగు అడుగులూ ఆమె కబుర్లు చెబుతూనే ఉంది. ప్లాస్కు నిండా తను టీ పోయించుకుని శ్రీధర్ నడిగింది.

"ఏం తీసుకుంటారు మీరు?" పెద్దగా ఆకలనిపించకపోయినా ఓ ప్లేటు ఇడ్లీ తిని కాఫీ త్రాగాడు.

"నేను వసపిట్టలా వాగుతూనే ఉన్నాను. మీరు ఒక్క మాట మాట్లాడలేదు" తిరిగి వస్తూంటే ఆమె అంది.

"నాకు కబుర్లు చెప్పడం అస్సలు రాదండీ" అన్నాడు నవ్వేస్తూ.

లంచ్ రూంలోంచి బయటకు వస్తూ, సీట్లో కూర్చున్న శ్రీధర్ వైపు నడిచాడు మురళి.

'ఏంటి బాస్, ఆడపిల్ల వచ్చి అడిగితే కాని లంచవర్లో సీట్లోంచి కదలవా?"

అతనడిగే తీరుకి శ్రీధర్‌కి కోపం వచ్చింది. ఛీ...ఎందుకిలా మాట్లాడుతారు. మనసులో భావం తెలియనీయకుండా ఓ చిన్ననవ్వు నవ్వి ఊరుకున్నాడు. అసలిలాంటి వాళ్ళు మాట్టాడేందుకు ఆస్కారం ఇచ్చేది ఎవరు? ఎక్కువగా మాట్లాడే సుమిత్రేనా? కానీ అది ఆమె స్వభావమే మరి. అందరూ తనలాగే ఉండరు కదా. చికాగ్గా అన్పించింది మనసంతా. పనిలో నిమగ్నమయ్యే ప్రయత్నంలో పడ్డాడు.

❖❖❖

అనుకోకుండా ఇంటి ముందు రిక్షా దిగిన వసుంధర, మోహన్రావులను చూసి సంబరపడిపోయారు నిర్మల, శ్రీధర్. వసుంధర శ్రీధర్ అక్క. టాటానగర్‌లో మోహన్రావు ఉద్యోగరీత్యా స్థిరపడ్డారు. నెల్లాళ్ళ శెలవు మీద ఆంధ్ర దేశంలోకి వచ్చి అటే తమ్ముడి క్రొత్త కాపురం చూడాలని ఉబలాటపడి వచ్చిందావిడ.

ఇంట్లోకి అడుగుపెట్టూనే ఆరాగా అన్నీ పరిశీలించి చూసింది. సాయంకాలం ఆఫీసు నుండి వస్తూనే ఉత్సాహంగా వచ్చాడు శ్రీధర్. ఇంట్లో తగని సందడి. తమ్ముణ్ణి గుమ్మంలోంచి చూస్తూనే, వేడివేడి కాఫీ గ్లాసు, పకోడీల ప్లేటుతో ఎదురొచ్చింది వసుంధర.

"బావగారెక్కడ అక్కా?" అన్నాడు కాళ్ళు కడుక్కొచ్చి పడక్కుర్చీలో కూర్చుంటూ.

"ఎవరో స్నేహితుల్ని కలుసుకోవాలని మధ్యాహ్నం అనగా వెళ్ళార్రా. ఇంకా అయిపులేరిప్పటికి" అంది ఆవిడ తమ్ముడి ఎదురుగా కూర్చుంటూ.

'నిర్మల ఎన్నింటికొస్తుందిరా?'

'ఆరూ ఆరున్నరకల్లా తనూ వచ్చేస్తుంది. లైబ్రరీ కూడా ఇక్కడికి దగ్గరే' భార్య సంగతి ఎత్తేసరికి చిరునవ్వు కదిలింది అతని పెదవులపైన.

"ప్రొద్దుట్నించీ పిచ్చెక్కినట్టుందిరా ఒక్కదానికీ. మా ఊళ్లో అయితే ఇరుగమ్మల పొరుగమ్మల కబుర్లయినా ఉంటాయి. ఇక్కడెవరూ ముక్కూ మొహం తెలీదు నాకు. అవును కానీ రోజూ యిలా నువ్వు ముందు వచ్చి ఒక్కడివీ కూర్చుంటావా వెర్రివాడిలా" తమ్ముడి మీద ఆప్యాయతతో అన్నా ఆ మాటలు ఏమిటోగా అన్పించాయి శ్రీధర్‌కి.

"అయినా ఇప్పుడు మరదలు ఉద్యోగం చెయ్యకపోతే మాత్రం ఏరా, నాకు తెలీకడుగుతాను" ఆవిడ ధోరణికి ఎలా జవాబు చెప్పాలో తెలియలేదు.

"తను మాత్రం ఒక్కర్తె ఇంట్లో కూర్చుంటే ఏం తోస్తుందక్కయ్యా ఏదో కాలక్షేపం" అనేశాడు. తమ్ముడు మరదల్నే వెనకేసుకొస్తున్నట్లు మాట్లాడే సరికి ఖాళీ అయిన టిఫిను ప్లేటు పట్టుకుని లోపలికి నడిచిందావిడ మరేం మాట్లాడకుండా.

"నిర్మలా!" ఏదో చెప్పబోయి ఆమె ముఖంలోకి చూశాడు శ్రీధర్. స్నానం చేసి వచ్చింది కాబోలు అలసట వదిలేలా. లేత నీలం వాయిల్ చీరలో తేటగా కన్పిస్తోంది ఆమె. తను చెప్పబోయేది విని ఆమె ఏమనుకుంటుందో అన్న సంకోచంతో అతను రెండు క్షణాలు సందేహిస్తూ ఉండిపోయాడు. చేతిలోని పుస్తకంలోంచి తలెత్తి చూసింది. అతను దేనికో తటపటాయిస్తున్నాడని గ్రహించింది. 'చెప్పండి శ్రీ' అంది చిర్నవ్వుతో.

దగ్గరగా వచ్చి ఆమె భుజాలను పట్టుకుని కళ్ళల్లోకి చూస్తూ నిలబడ్డాడు. "నిర్మలా! అక్క ఇంట్లో ఒంటరిగా ఫీలవుతోంది. తను ఉన్న రెండ్రోజులూ నువ్వు లీవ్ తీసుకోరాదూ. నేనూ లీవ్ కోసం ట్రై చేస్తాను. సరదాగా అందరం ఎటైనా వెళ్ళొద్దాం".

నెమ్మదిగా తను చెప్పదలుచుకున్నది చెప్పి ఆమె అభిప్రాయం కోసం చూశాడు. నవ్వొచ్చింది నిర్మలకి. ఈ విషయం చెప్పడానికి అతడెంత ఇబ్బంది పడిపోయాడు. అయినా ఒక్కక్షణం అతన్ని ఆట పట్టించాలనుకుంది. ముఖం గంభీరంగా పెట్టి "అరె, లీవా కుదరదే. ప్రభాకర్ కూడా ఏదో పని మీద నర్సీపట్నం వెళ్ళాలన్నాడు. ఎలా?"

శ్రీధర్‌కామె జవాబు నచ్చలేదు. మౌనంగాఉండిపోయాడు. అతని ముఖ కవళికల్లో వచ్చిన మార్పు ఇట్టే పట్టేసింది.

"అంత కోపమైతే ఎలా సార్? రేప్రొద్దున్నే వెళ్ళి ప్రభాకర్‌కి నా డ్యూటీ అప్పగించి వస్తాను సరేనా?' బుజ్జగిస్తున్నట్లుగా అంది. 'మరి అతను నర్సీపట్నం వెళ్లాలని..." అతని మాట పూర్తి కాకుండానే నవ్వేసింది.

'బొత్తిగా మొద్దబ్బాయ్.ఆ మాత్రం అర్థం చేసుకోలేరా నా చిన్ని జోక్‌ని".

❖❖❖

"ప్రభాకర్ ! మీ మీద నమ్మకంతో చాలా ధైర్యంగా మా వారికి మాటిచ్చేశాను" అర్థం కానట్టు చూశాడామెవైపు.

"ఈ రోజు, రేపు రెండ్రోజులు నేను లీవ్ తీసుకోబోతున్నాను, నా బాధ్యత మీ కప్పగించి"

"అబ్బ. రెండు రోజులు. ఒక్కణ్ణీ ఇక్కడ అరెస్టయిపోతాను కంపెనీ లేక. అవునూ, కారణం తెల్సుకోవచ్చునా?" కుతూహలంగా అన్నాడు.

"బంధువులు....అంటే శ్రీధర్ వాళ్ళ సిస్టర్ వచ్చారు. ఆవిడకి కంపెనీ కోసం. మరి నేను వస్తాను. ఆవిడ చూస్తుంటారు" అనేసి అక్కణ్ణుంచి కదిలింది. ఆమె ఇంటివరకు

వెళ్ళేసరికి ఆఫీసుకి బయల్దేరబోతున్నాడు శ్రీధర్. గుమ్మంలోనే ఎదురయ్యాడు. "హమ్మయ్య, వచ్చేశావు. సాయంకాలం బీచ్‌వైపు వెళ్దాం. మధ్యాహ్నం నువ్వు, అక్కయ్య ఏమైనా షాపింగ్ పనుంటే చేసుకురండి". హడావుడిగా బస్టాపు వైపు నడుస్తున్న అతన్ని కనుమరుగయేవరకు చూసి లోనికి నడిచింది.

ఉద్యోగస్థులతోటి, స్కూలు పిల్లలతోటి బస్సులు తెగ రష్‌గా ఉన్నాయి. ఎలాగైతేనేం ఓ బస్సందుకుని బీచ్ దగ్గర దిగారు. చల్లనిగాలి సేద దీరుస్తానంటూ ఆహ్వానిస్తూంది. ఇసుకలో నడుచుకుంటూ ముందుకు వెళ్తున్నారు. శ్రీధర్ దగ్గర వాగుడుపిట్టలా ఉండే నిర్మల వదినగారి ముందు మూగదైపోయింది. ఒక్కక్షణం ఆపకుండా ఆవిడ ఏదో చెబుతూనే ఉంది. మోహన్రావు కూడా పెద్దగా మాట్లాడకుండా మౌనంగా నడుస్తున్నాడు. సడన్‌గా అన్నాడు "వసూ! నువ్వంత ఫాస్ట్‌గా మాట్లాడేస్తుంటే ఈ సముద్రపొద్దున కూడా తెగ ఉక్కగా ఉంది". ఆయన మాటలకి ఫక్కుమనబోయిన నిర్మల వదినగారి ముఖం చూసి గబుక్కున తనను తాను కంట్రోల్ చేసుకుంది.

"ఆ అమ్మాయి నీ వాగ్ధోరణికి హడలిపోతోంది ఒక్క రోజులోనే" అన్నాడాయన.

"నేనేం మీలా ఉద్యోగాలు చెయ్యకపోయినా అంతో ఇంతో చదువు సంధ్యా ఉన్నదాన్నే. ఏం మరీ అంత తీసిపారేసి మాట్లాడుతున్నారు" ఆవిడక్కోపం వచ్చింది. వాతావరణం మారిపోయింది. నిర్మలకిదంతా ఏమిటోగా ఉంది. ఇప్పుడు చదువు సంధ్యల ప్రసక్తి, ఉద్యోగాల ప్రసక్తి గురించి ఆవిడెందుకంతగా చెప్పటం అన్పించింది.

అలలు అందని దూరంలో కూర్చున్నారు నలుగురూ. పల్లీలతనెవరో అటుగా వస్తే కొని, నెమ్మదిగా వాటిని ఖర్చు చేస్తూ కూర్చున్నారు. ఇసుకలో ఏవో అర్థంకాని గీతలు గీస్తూ కూర్చుండిపోయిన నిర్మల అక్కాతమ్ముళ్ళ సంభాషణ వింటూంది. దూరంగా ఓ నలుగురబ్బాయిలు అలలవైపుగా నడుచుకుంటూ వస్తున్నారు. ఒకతను ప్రభాకర్‌లాగే ఉన్నాడు. అవును అతనే. వాళ్ళను చూసి చెయ్యివూపాడు సంతోషంగా. ఆ జట్టు నుండి విడివడి వడివడిగా నిర్మలవాళ్ళు కూర్చున్నవైపుగా వచ్చాడు.

"హలోసర్, గుడీవినింగ్" అంటూ శ్రీధర్‌ని విష్ చేసి ప్రక్కనే చతికిలబడ్డాడు. 'మీరు శ్రీధర్ సిస్టర్ కదూ' అంటూ వసుంధర వైపు తిరిగి చేతులు జోడించాడు. అతని చొరవ ఆమెకేమాత్రం నచ్చకపోయినా ఆ ధోరణి మోహనరావుని ఆకర్షించింది. అతని ప్రక్కగా జరిగి "మీ స్వస్థలం ఎక్కడోయ్?" అంటూ కబుర్లలోకి దిగాడు. మధ్యమధ్యలో నిర్మల కూడా నవ్వుతూ ఏదో మాట్లాడుతూంది. వసుంధర చికాగ్గా చుట్టూ చూస్తూ కూర్చుంది.

"ఇక వెళ్దాంరా శ్రీ. చీకటి పడుతోంది" అంటూ లేచింది, ఆ వాతావరణంలో

ఎంతోసేపు ఇమడలేక. బట్టల కంటిన ఇసుక దులుపుకుంటూ నలుగురూ లేచారు. బస్టాపులో ఓ పది నిముషాల నిరీక్షణ. ప్రభాకర్ అన్నాడు "నిర్మలగారూ! ఈ రోజు మీరు రాకపోవడం కాదుగానీ భలేబోర్ కొట్టేసిందండీ. ఎంత లోన్లీగా అన్పించిందో మరో తోడులేక" అతని కబుర్లు అలవాటే నిర్మలకి. జవాబుగా నవ్వేసింది. శ్రీధర్ చురుక్కుమంటూ చూశాడు ప్రభాకర్ వైపు. కాని అతనదేం గమనించలేదు. దూరంగా వస్తూన్న బస్‌ని చూస్తున్నాడు. అందరికీ గుడ్‌నైట్ చెప్పి తను ఎక్క వలసిన బస్ ఎక్కాడు.

❖❖❖

ఆరుబయట వెన్నెట్లో చాప పరిచింది నిర్మల. చేతిలోని సన్నజాజుల్ని ఆప్యాయంగా మాలకడుతూంది. శ్రీధర్ ముభావంగా ఉన్నాడు. దిండు మీదికి ఒరిగి మినుకు మినుకుమంటూ వెలవెలబోతున్న నక్షత్రాల్ని చూస్తున్నాడు. అతన్ని ఓరకంట గమనిస్తున్న నిర్మల అతడేదో దీర్ఘాలోచనలో ఉన్నాడనుకుంది. తనేమైనా పలకరిస్తాడేమో, ఈ నాల్గురోజులు ఇంట్లో సందడితో అరుదైన ఏకాంతాన్ని అపురూపంగా ఎలా మొదలుపెడతాడో అని ఎదురు చూసి నిట్టూర్చింది.

శ్రీధర్ నిజంగానే ఆలోచనలో ఉన్నాడు. మధ్యాహ్నం అక్కయ్యకు వీడ్కోలిచ్చేందుకు స్టేషన్‌కి వెళ్ళాడు. ఆమె అన్నమాటలు చెవుల్లో ఇంకా మ్రోగుతున్నాయి. ముందర్నించీ మరదలు ఉద్యోగం చెయ్యడం ఎందుకని నిరసనగా అంటూనే ఉంది వసుంధర. కాని.... "ఎంత ఉద్యోగస్థురాలైతే మాత్రం మగవాళ్ళతో అంతంత స్నేహాలేమిట్రా శ్రీ, మీ ఆవిడకి, ఆవిడ ఒక్కరోజు ఉద్యోగానికి పోకపోతే ఆ కుర్రాడెవరో మన ఎదురుగానే అలా అనటం ఏం బావుంది. అదీ కట్టుకున్నవాడివి నువ్వు ప్రక్కనే ఉన్నావనైనా లేదు. ఇదేం వరస" ఈ నాలుగు మాటలు చాలు అతని బలహీన మనసుకి. మనసంతా బరువుగా అన్పించింది. అక్కయ్య అన్నట్టు నిర్మల ఉద్యోగం చెయ్యవలసిన అవసరం ఏముందసలు? కాని ప్రొద్దంతా ఇంట్లో ఒక్కర్తె తను మాత్రం ఏం చేస్తుంది. తనిలా ఆలోచిస్తూ తల బ్రద్దలు కొట్టుకునే బదులు నిర్మలనే పరిష్కారం చెప్పమంటే...కాని అసలు ఇక్కడ సమస్య ఏమిటి? తనకెలా చెప్పటం? అక్కలాగే నిర్మల గురించి అందరూ ఆలోచిస్తే తను భరించగలడా? అసలు ఆడవాళ్ళకి ఉద్యోగాలు, ఆ పైన ఇలాంటి సమస్యలు ఎందుకు? "శ్రీధర్! ఏమిటంత తెగని ఆలోచన!" నిశ్శబ్దంగా ఆమె వైపు చూశాడు. ఏమని చెప్తాడామెకు?

"శ్రీధర్! నేనొక విషయం చెప్పాలనుకుంటున్నాను" నెమ్మదిగా కళ్ళు వాల్చి ఒక్కక్షణం ఆగి "నేను ఉద్యోగం చెయ్యటం వలన మీకేదైనా ఇబ్బంది కల్గిస్తున్నానా?" ఉలిక్కి పడ్డాడు ఆమె ప్రశ్నకి. తన మనసు చదివినట్లే అడిగింది. ఏమని చెప్పాలి? తడబడ్డాడతను. ఆమె వ్యాపకంవల్ల తనకేం ఇబ్బంది అసలు? ఆఫీసులో తనకెంతమంది లేడీ కొలీగ్స్

లేరూ. మొన్నమొన్న సుమిత్ర అందరితో అంత స్నేహంగా మసులుతూందని మురళి ఎంత తేలిగ్గా కామెంట్ చేశాడు. అది తనకి చాలా అసహ్యమన్పించింది. ఎప్పుడూ ఆడవాళ్ళని అదోరకంగా చూసేవాళ్ళు, మాట్లాడేవాళ్ళు ఎక్కడైనా ఉంటారు కాబోలు. నిర్మలకసలు ఆ సందేహం ఎందుకొచ్చింది. బహుశ అక్క ప్రవర్తన ఆమె మనసుని నొప్పించిందేమో. తను మాత్రం ఇప్పటివరకూ ఎలా ఆలోచించాడు. ప్చ్. దేశం ఎంత ప్రగతి సాధించినా ఈ ఆడ, మగ అనే విచక్షణ తనలాటి వాళ్ళ ఆలోచనల్లోంచి అంత త్వరగా పోదేమో! గబుక్కున లేచి లోపలికి వెళ్ళిపోతున్న నిర్మల చేతిని పట్టుకులాగాడు. ఇటు తిరిగిన ఆమె కళ్ళల్లోని తడి వెన్నెట్లో మెరిసింది.

'నిర్మలా! సారీ నిర్మలా. నీ మనసుకి బాధ కల్గించేట్లు బి హేవ్ చేసిన అక్కయ్యని, నన్నూ క్షమించలేవా?" ఆమెను ఒడిలోకి లాక్కుంటూ ఆమె కన్నుల సహజ కాంతి కోసం వెతుక్కున్నాడు.

**('జ్యోతి' మాసపత్రిక ఏప్రిల్ 1985)**

# దృక్కోణం

ప్రొద్దున్న తొమ్మిది గంటల వేళ.  ఎండ తీక్షత మరీ లేకపోయినా రద్దీగా వున్న ఆ బస్సులో ప్రయాణం  చిరాకు కల్గిస్తోంది. రకరకాల జనం బస్ నిండా. నేనైతే సీట్ దొరకడంతో కూర్చుని వున్నాను. కాని ఆ అమ్మాయి...రోజూ నేనెక్కే స్టేజ్‌లోనే ఎక్కుతూంటుంది.

అమాయకంగా, నిర్మలంగా పసిపాపలా వుంటుంది. ఆమెను చూసినప్పుడల్లా అన్పిస్తుంది. 'ఇంత సున్నితంగా, చూడగానే మనసుకు శాంతిని ప్రసాదించే దేవతలా వున్న ఈమె కెందుకీ నగర వాసపు జంఝాటం' అని. హాయిగా, ప్రశాంతంగా ఎలాంటి వేగంలేని జీవితం ఆమె ఎందుకు అనుభవించకూడదు? రాడ్‌కి ఆనుకుని నిలబడి వున్న ఆమె ముఖంలో అలసట నాకంటికి భరించరానిదిగా కన్పిస్తోంది. ప్రతి రోజూ ఆమె రాకను గమనించడం నేను ఉద్యోగంలో జేరిన ఈ ఏడాదిగా ఓ రొటీన్‌గా తయారైంది. కాని నాకు విసుగు తెప్పించని రొటీన్‌లో భాగం ఈ సన్నివేశమే.

తొమ్మిదిక్కాని బస్ రాదని తెల్సినా ఓ పది నిమిషాలు ముందుగానే బస్టాప్‌కి చేరిపోవడం నాకు అలవాటు. అందులోనూ రూమ్‌లో ఒంటరితనం నన్ను పోపొమ్మంటూ ఈ జన సమ్మర్ధంలోకి తోస్తుంది. నేను వచ్చి నిలబడిన అయిదు నిమిషాలకి ఆమె, ప్రక్కనే

భర్తతో కల్సి వస్తుంది. ఏ రోజూ ఆమె ఒంటరిగా రాదు. అతను భర్త అన్న విషయం అర్ధమవుతూనే వుంది. అంత ప్రేమగా, ఆప్యాయంగా భార్యని బస్టాప్ వరకు దించి, ఓ రెండు క్షణాలు ఆమెకు కబుర్లు చెప్పి మరీ కదులుతాడు. అతని పట్ల నాకు గౌరవభావం రోజురోజుకీ పెరుగుతూనే వుంది. భార్యల్ని హింసించే భర్తలు అని తెగరాసి పారేస్తారు ఈ పత్రికల వాళ్ళు. ఇలాంటి జంటలు వాళ్ళకంటికెందుకు కనపడవో!! ప్చ్.... రోజూ నాకు ఆ సన్నివేశం క్రొత్తగా, అపురూపంగానే వుంటుంది. జాగ్రత్తగా 'నీకు నేనున్నాను సుమా' అని ఆమెను వెన్నంటి వచ్చే ఆ యువకుడు నిజంగా ఆదర్శ భర్త నా దృష్టిలో!

అప్రయత్నంగా ఆలోచనల్లోంచి బయట పడి చూశాను. ఆమె దిగవలసిన స్టేజ్ అదే. నాకే ఆశ్చర్యం వేసింది. నాకు తెలీకుండానే నేను ఆమెకు సంబంధించిన విషయం పట్ల ఎంత ఎలర్ట్‌గా వున్నాను! ఆమె జనాన్ని తప్పించుకు దిగబోతుంటే ఈ జనానికి బుద్ధిలేదేం. తొలగి ఆమెకు దారి ఇవ్వరేం అని విసుక్కున్నాను. ఇదిగో సరిగ్గా ఈ స్టేజ్‌లోనే ఓ బాబ్డ్ హెయిర్ అమ్మాయి బస్సెక్కుతుంది. ఈ అమ్మాయిని చూస్తే నాకెందుకో చిరాకు. నాకే అర్థం కాదు అకారణంగా ఏర్పడే ఈ ఇష్టాయిష్టాలకి మూలమేమిటో! అయితే ఒకటి, ఈమె ప్రపంచంలో ఎలాగైనా బ్రతికెయ్యగలదు అని ఖచ్చితంగా అన్పిస్తుంది. ఆ రకమైన ఆత్మ విశ్వాసం, ధీమా ముఖంలో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. అందుకే నాకు నచ్చుడం లేదా? నాలోని పురుషాహంకారం తట్టుకోలేదా? ఇక ఆలోచించడానికి మనస్కరించలేదు. నేను దిగబోయే స్టేజ్ కోసం ఎదురు చూడడం మొదలు పెట్టాను.

కాలేజ్ చదువూ, స్నేహితుల మధ్య గడిపిన అందమైన రోజులూ అలా చూస్తుండగానే కనుమరుగైపోయాయి. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు, ఆ దిగుళ్ళూ కూడా మరిచి పోయి యాంత్రికంగా జీవితంలో ఇమిడిపోయాను. ఎలాంటి చైతన్యం లేదు. ఎలాంటి ఎదురుచూపులూ లేవు. జీవితం నత్తనడకలు నడుస్తోంది. అసలు ఆగిపోయినట్లుంది జీవన గమనమే. మరి కొన్నాళ్లు పోతే పెళ్ళి...సంసారం. ఆ మార్పుకి, ఆ ఒత్తిళ్ళకి మళ్ళీ అలవాటు పడిపోవడం ...ఓహ్!

ఏమిటీ జీవితం!? తల విదిల్చాను. ఆలోచనల వల తెగింది.

రోజులైతే దొర్లిపోతూ వున్నాయి. అయినా ఢిల్లీ లాంటి మహానగరంలో కాలం దొర్లించడం ఓ సమస్య కనుకనా? ఆమెను బస్టాప్‌లో రోజు అభిమానంగా చూస్తూనే వున్నాను. కొండంత అండలా వెన్నంటి వచ్చే ఆ భర్తని ఆరాధిస్తూనే వున్నాను. ఒక్క రోజు మాత్రం బస్టాప్‌కి వచ్చేసరికి ఆమె ముఖంలో అలసట కన్పిస్తూ వుండేది. ఇక ఆ రోజు నా మనోవ్యథ అంతాఇంతా కాదు. నాకు దొరికే బస్ సీట్ ఆమెకు ఆఫర్ చేద్దామన్న

ఆలోచన ఆచరణలో పెట్టేందుకు తగని ఊగిసలాట. ఎవరైనా ఏమనుకుంటారో! అసలు ఆమె నన్ను గురించి ఏమనుకుంటుందో అని భయం. ఎప్పుడైనా చేతిలో బరువుగా వున్న హ్యాండ్ బ్యాగ్ పట్టుకొమ్మని అందిస్తే మహాభాగ్యంలా, అలాటి సేవ కోసమే వేచి వున్నానన్నట్టు అందుకునేవాణ్ణి సీటులో కూర్చుని.

ఆ రోజు ఆఫీసులో పనేమీ లేక ఏదో మాగజైన్ తిరగేస్తున్నాను. మా సెక్షన్లో అందరూ ఏ 'టీ' లకో, మరే ఇతర రాచకార్యాలకో బయటకి వెళ్ళారు ఒక్క లత తప్ప. ఆమె ఏదో వర్క్ చూసుకుంటోంది తల వంచుకుని. ప్రక్క సెక్షన్లో నయనా వచ్చింది. లత ప్రక్కనే కుర్చీ లాక్కుని కూర్చుంది. తలెత్తి ఓసారి వాళ్ల వైపు చూసి నా ధోరణిలో నేనున్నాను. సడన్‌గా వెక్కిళ్ళు విన్పించి తలెత్తి చూశాను. నయనా ఏడుస్తోంది. అక్కడ నేను కూడా వున్నానన్న ధ్యాస వున్నట్టులేదు. లతతో ఏదో చెప్పి కన్నీళ్ళు తుడుచుకుంటోందామె. కంట్రోల్ చేసుకోలేక వెక్కిళ్ళతో కూర్చుంది. నా మనసు చివుక్కుమంది.

ఆడపిల్లల కళ్ళలో నీళ్ళు చూడలేని బలహీనత నాది. "అయిన దానికి కాని దానికి కన్నీళ్లు పెట్టుకుంటారు ఈ ఆడవాళ్ళు" అని స్టేట్‌మెంట్ ఇచ్చే వాళ్ళతో ఏకీభవించను నేను. స్త్రీ కోమలమైనది. స్నిగ్ధమైనది. అపురూపంగా చూసుకోవలసిన వ్యక్తి అన్పిస్తుంది. ఇందులోనూ సమాజం తరతరాలుగా మా జాతికిచ్చిన ఆధిక్యత స్పష్టమవుతుంది. ఆడ పిల్లని మగవాడెవరో చూసుకోవాలి జాగ్రత్తగా అంటే అస్వతంత్రురాలే ఆమె. నా మనో భావన ఇదే కాబోలు. ఇలాంటి పరస్పర విరుద్ధభావాలతో వాటి విశ్లేషణతో నా బుర్ర ఎప్పుడూ వేడెక్కిపోయి వుంటుంది.

స్టాఫంతా ఒక్కొక్కరే తమతమ సీట్లలోకి వస్తున్నట్టున్నారు. నయానా లేచి ఏమీ జరగనట్లే వెళ్ళిపోబోయి ఎందుకో చటుక్కున నా వైపు చూసింది. నేను 'నా కేం తెలీదు' అన్నట్టు తల తిప్పుకున్నాను. లంచ్ బ్రేక్‌లో లత కల్సింది. ఆమె నాకు సీనియర్, నాకు ఆమె పట్ల గౌరవం, స్నేహభావం వున్నాయి. తన పనేదో తనే, మంచి మనిషి. ఆమె దగ్గరున్న చనువుతోనే 'నయనాకి ఏమైంది' అని అడిగాను. లంచ్ బాక్స్ తెరుస్తూ ఆమె ఉపోద్ఘాతంగా అంది.

'నయనాకి ఈ మధ్యనే మ్యారేజ్ అయింది తెల్సుకదా?"

తెల్సునన్నట్టు తలూపాను.

'అతనికి అంటే మిస్టర్ షాకి భార్య అంటే అనుమానం. అనుక్షణం తను వెంట వుండాలనుకుంటాడట. ఆఖరికి ఆఫీస్‌కి బయల్దేరుతుంటే తను బస్టాప్ వరకూ వచ్చి బస్సెక్కించి వెళ్తాడట. సాయంత్రం ఇంటి దగ్గర బస్టాప్‌లో ఎదురు చూస్తూంటాడట.

తలుపులన్నీ బిగించిన ఇంట్లో కూడా అనుమానపు కళ్ళతోనే చూస్తాడు. నయన సంగతి మన అందరికీ తెల్సు. ఎంత కల్మషం లేని అమ్మాయి!" లత చెబుతూంది.

నా కళ్ళ ముందు ఆ బస్టాప్‌లో అమ్మాయీ...ఆమె వెనుక అతనూ...అతనూ అంతేనా? ఇన్నాళ్ళు అతని కళ్ళలో నాక్కనిపించే చూపుల వెనుక అంతరంగంలో అనుమానం దాక్కుందా? బాప్...రే....నాకు బుర్ర పని చేయడం మానేసింది.

**('ఆంధ్రజ్యోతి' వీక్లీ, 16 డిసెంబర్, 1991)**

# పెళ్ళంటే ...?

దివ్య నాతోపాటే మా స్కూల్లో ఒక ఆరు నెలలుగా పని చేస్తోంది. ఆమె తండ్రి రామ చంద్రం ఇదే స్కూల్లో క్లర్క్‌గా చేస్తూ అనారోగ్యంతో సెలవు కోసం అప్లయ్ చేసుకుంటూ, ఉద్యోగం దివ్యకి ఇప్పించమని ప్రిన్సిపాల్‌ని అడగడం, ఆయన ఆర్థిక పరిస్థితులు తెల్సున్న ప్రిన్సిపాల్‌గారు ఆమెకి ఉద్యోగం ఇవ్వడం జరిగింది.

దివ్య డిగ్రీ పూర్తి చేసి, అప్పుడే బి.ఇ.డి. పరీక్షలు పూర్తి చేసింది. ఆరు నెలలు క్లరికల్ జాబ్‌లో ఉంది.

హయ్యర్ క్లాసెస్‌కి, ముఖ్యంగా టెన్త్ క్లాస్‌కి మాథ్స్ టీచర్‌గా చేస్తున్న మృదుల భర్తకి ట్రాన్స్‌ఫర్ అవడంతో హైదరాబాదు వెళ్ళిపోయింది. ప్రిన్సిపాల్‌గారు దివ్య చురుకుదనాన్ని గమనించి ఆమెని మృదుల వదిలివెళ్ళిన వేకెన్సీలో భర్తీ చేస్కున్నాడు.

మా స్కూలుకి మంచి పేరున్నా జీతాలు చెప్పుకోదగ్గవిగా వుండకపోవడంతో టీచర్లని వెతుక్కోవడం కొంచెం ఆలస్యం అవుతూవుంటుంది. ప్రిన్సిపాల్‌గారు ఆర్థికంగా బలహీన వర్గాల పిల్లల్ని దృష్టిలో పెట్టుకుని ఒక యజ్ఞంలా ఆ స్కూల్‌ని ప్రారంభించారు. పిల్లల ఫీజులు తక్కువే. ప్రిన్సిపాల్ సదాశయాన్ని సపోర్టు చేస్తూ నాలాంటి మరి కొందరు వాలంటరీగా పాఠాలు చెప్పడం మొదలుపెట్టాం.

దివ్యపట్ల క్రమంగా నాకొక దగ్గరతనం ఏర్పడుతూ వస్తోంది.

పెళ్ళయి దూరంగా వెళ్ళిపోయిన నా కూతుర్ని బహుశా ఆమెలో చూసుకుంటున్నానేమో! అసలైనా దివ్యని అందరూ అభిమానించేవారు. ఇరవై ఏళ్ళ వయసులో ఇంటి పరిస్థితుల్ని అర్థం చేసుకుని, కుటుంబ బాధ్యతల్ని చిరునవ్వుతో మోస్తున్న ఆమె యువతకి ఆదర్శం అనిపిస్తుంది. ఆమె అన్నయ్య మెరిట్ మీద సీటు తెచ్చుకుని ఇంజనీరింగ్ చేస్తున్నాడు. ఈ సంవత్సరం పూర్తయితే అతని చదువు అయి ఉద్యోగస్థుడవుతాడు. ఇంటి బాధ్యతని అతనూ పంచుకుంటాడని రామచంద్రం ఎదురు చూస్తున్నాడు.

ఆ రోజు క్లాసులయ్యాక దివ్య నాతో మాట్లాడాలంటూ ఇంటి వరకూ వచ్చింది.

డబ్బాలో జంతికలు తీసి ఆమె ముందు పెట్టాను.

కాఫీ చేస్తున్న నా వెనుకే వంటింట్లోకి వచ్చింది.

“మేడమ్... నేను వేరే స్కూల్‌లో జాబ్ కోసం అప్లయ్ చేశాను. ఈ ఆదివారం ఒక ఇంటర్వ్యూ ఉంది. వస్తుందన్న నమ్మకం ఉంది. ప్రస్తుతం చేస్తున్న ఈ ఉద్యోగం నాకు సంతృప్తికరంగానే వుంది. కాని ఫైనాన్షియల్‌గా ఇబ్బందిగా వుంది. నాన్నకి సరైన వైద్యం చేయించలేకపోతున్నాను. అన్నయ్య చదువు పూర్తయేందుకు ఇంకా టైముంది. ఇంటర్ మీడియట్ అయ్యాక అనారోగ్యంతో వాడికొక సంవత్సరం వృధా అయింది. వాడి చదువు నాన్నకి తలకి మించిన భారం అయింది. కొన్ని అప్పులు తప్పలేదు. అందుకే శాలరీ బావుంటుందని పెద్దపెద్ద ప్రైవేటు స్కూల్సుకి అప్లయ్ చేశాను. ఇది రైటో కాదో అని ఆలోచన. అవసరంలో మా కుటుంబాన్ని ఆదుకున్న ప్రిన్సిపాల్‌గారంటే నాకు గౌరవం వుంది. ఆయన ఆశయాలు ఉన్నతమైనవి. వేరే స్కూల్‌లో చేరినా సాయంత్రాలు, ఆదివారాలు ఇక్కడి స్టూడెంట్స్‌కి టీచ్ చేసేందుకు నిర్ణయించుకున్నాను. నేను చేస్తున్నది సరైనదేనా మేడమ్?!”

కాఫీ కప్పుల్లో పోసి ఒకటి ఆమె కందించి పెరటి తలుపు తీసి మందార మొక్కముందు గచ్చు మీద చతికిల పడ్డాను.

ఇంతచిన్న పిల్ల! చూస్తే సుకుమారంగా, ముగ్ధలా ఉంది. ఎంత ఆలోచిస్తుంది! కుటుంబం పడుతున్న ఇబ్బందులకీ, ఆశయాలకీ మధ్య నలుగుతోంది.

“దివ్యా! ఎవరైనా ఉన్న స్థితి కంటే మెరుగైన స్థితికోసం ప్రయత్నించడం సహజం. అందులోనూ ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు ఎదురుగా కన్పిస్తుంటే కేవలం ఆశయాలు పట్టుకుని కూర్చోవడం సాధ్యం కాదు. గో ఎ హెడ్’ అన్నాను నిశ్చయంగా.

“థ్యాంక్యూ మాడమ్. నాన్నని అడిగితే ఉద్యోగం మారడం ఎందుకంటారు. ఆయనకి మన స్కూల్ పట్ల ఉన్న మమకారం నాకు తెల్సున్నదే! అమ్మకి ఏమీ తెలియదు. అందుకే...”

“ఆర్థికంగా నిలదొక్కు కున్నాక నువ్వు ఎన్నో మంచి పనులు చెయ్యచ్చు” అన్నాను ఆమె భుజం తట్టి.

ఆమె ముఖంలో సహజమైన మెరుపు తళుక్కుమంది.

దివ్య క్రొత్త ఉద్యోగంలో చేరడం, ఇంటి ఆర్థిక పరిస్థితులు క్రమేపీ మెరుగవడం గమనిస్తూనే ఉన్నాను. రామచంద్రం ఆరోగ్యం కూడా కుదుట పడటంతో తిరిగి ఉద్యోగంలో చేరాడతను.

ఆ రోజు స్కూలు నుండి వచ్చి రిలాక్స్‌డ్‌గా మాగజైన్ ఏదో తిరగేస్తున్నాను. రామచంద్రం, ఆయన భార్య సుగుణ వచ్చారు. ఇద్దరిలోనూ ఒక క్రొత్త ఉత్సాహం.

"మంజులగారూ, మీతో ఒక విషయం చెప్పాలని వచ్చాం. ఒకరకంగా మీ అభిప్రాయాన్ని అడిగేందుకు అనుకోండి, మీకంటే మాకు మంచి మిత్రులు ఎవరూ లేరు" – ఉపోద్ఘాతంగా అన్నాడు.

వింటున్నాను.

"దివ్యకి ఇంకో ఏడాది వరకూ పెళ్ళి చెయ్యద్దనే అనుకున్నాం. కాని మా ప్రక్కింటి వాళ్ళ బంధువులబ్బాయి దివ్యని చూసాట్ట. పెళ్ళి చేసుకుంటానని కబురు పంపించాడు. దివ్యని అడిగితే, 'చదువుకోవాలని ఉంది. రెండేళ్ళాగండి నాన్నా' అంటోంది. ఏం చెయ్యాలో తోచట్లేదు."

"మీరనుకున్నట్లు ఇంకో ఏడాది, రెండేళ్ళు ఆగి చేస్తే బావుంటుంది. ఎటూ దివ్య కూడా అదే అభిప్రాయంతో ఉంది కనుక, ఆ పిల్లవాడిక్కూడా అదే చెప్పండి. ఏడాది రెండేళ్ళ కాలం ఎంతలో గడిచి పోతుంది".

రామచంద్ర భార్య సుగుణ నోరు విప్పింది.

"వాళ్ళంతట వాళ్ళు వచ్చి పిల్లని అడుగుతున్నారు. ఏడాది వరకు ఆగడం ఎందుకు? అప్పటి వరకూ ఆగేందుకు వాళ్ళు ఇష్టపడతారో లేదో...!వచ్చిన సంబంధాన్ని చేజార్చుకోవలసి వస్తుందేమో!" సంశయంగా అందావిడ.

కాలం, సొసైటీ ఎంత మారుతోందనుకున్నా ఆడపిల్ల పెళ్ళిపట్ల ఈ అభద్రత ఇలాగే ఉంది. ఉసూరు మన్పించింది.

'ఈ కాలానికి ఇరవై రెండేళ్ళ వయసు పెద్ద వయసేం కాదు. దివ్య ఎమ్మెస్సీ చేస్తాననంటోంది. ఒకటి, రెండేళ్ళు ఆగితే అభ్యంతరం ఏముంది?"

నా అభిప్రాయం ఆ తల్లి మనసుకు అంతగా నచ్చలేదని స్పష్టంగా అర్థమైంది.

"ఒక పని చెయ్యొచ్చు. దివ్యని, ఆ అబ్బాయిని పరస్పరం మాట్లాడుకొమ్మంటే ఒకరి అభిప్రాయాలు ఒకరికి క్లియర్‌గా తెలుస్తాయి. ఆ ప్రయత్నం చెయ్యండి" అన్నాను చివరికి.

❖❖❖

సాయంత్రం కాస్త రిలాక్స్ అయి కూర్చున్నాను. ఆదిత్య ఫోన్...

"మామ్ ! జాబ్ మారబోతున్నానని చెప్పాను కదా. ఇక త్వరలో బాంబే లైఫ్‌కి బై బై చెప్పి బెంగుళూరు వెళ్ళిపోతున్నాను. నేను అక్కడికి వెళ్ళగానే నువ్వు నా దగ్గరకి వచ్చి కొన్నాళ్ళుండమ్మా ప్లీజ్. స్కూల్, ఎగ్జామ్స్ అంటూ చెప్పకు. నేను కొంచెం సెటిల్ అయ్యేవరకూ నా దగ్గర ఉండి వెళ్లమ్మా! నాన్నగారెప్పుడూ ఆఫీసు పనులంటారు. నన్ను పట్టించుకోరసలు"

వాడి గొంతులో తండ్రి పట్ల బెంగ, అది కప్పి పుచ్చేందుకు ఏవేవో కంప్లయింట్స్... నవ్వుకున్నాను.

"ఇంతకీ గీత రీసెర్చి ఎంత వరకూ వచ్చింది?"

గీత రీసెర్చి పూర్తి అయ్యాక మ్యారేజ్ చేసుకునే ఆలోచనలో ఉన్నారిద్దరూ. అందుకే ఆదిత్య బెంగుళూరు వచ్చి సెటిలవ్వాలని చాల్రోజుల్నుండి ఎదురు చూస్తున్నాడు.

"నాకు తెలీదమ్మా. ఇప్పటివరకూ చదివింది, చేసింది చాలని చెప్పమ్మా. ఇంకా ఎన్నాళ్ళూ వెయిట్ చెయ్యాలట" – బాగా ఉడుక్కుంటున్నాడు.

'మేడమ్" అంటూ వచ్చింది దివ్య.

"మేడమ్! ఎలా ఉన్నారు మేడమ్. మీ లీజర్ టైమ్‌ని ముందుగా చెప్పకుండా ఇలా నాకోసం తీసేసుకుంటున్నాను" మొహమాటంగా అంది.

"ఏం ఫర్వాలేదు దివ్యా... నిన్ను చూసి చాల్రోజులైంది. జాబ్ ఎలా ఉంది?!"

'బావుంది మేడమ్!'

ఆమె మౌనంగా కూర్చుని ఉంది. కాని ఏదో మాట్లాడాలని వచ్చిందని గ్రహించాను.

"చెప్పు దివ్యా, ఈ 'మేడమ్' వదిలేసి హాయిగా 'ఆంటీ' అని పిలు."

"మేడమ్ సారీ, ఆంటీ! నా కైతే చదువుకోవాలని ఉంది. కాని అతనేమో పెళ్ళి చేసుకుని, చదువుకో అంటున్నాడు. అమ్మ పెళ్ళి చేసుకోమని గొడవ చేస్తుంది. నాన్నేమో నా అభిప్రాయం ఎలా ఉంటే అలా జరగనీ అంటున్నారు. ఏం చెయ్యను?"

ఈ కాలంలో చదువులకున్న ప్రాముఖ్యత, కెరీర్ కోసం యువతరం చేస్తున్న కృషి తక్కువది కాదు.

"ఆంటీ, రవిని ఈ పూట ఇక్కడికి వచ్చి మిమ్మల్ని కలవమని చెప్పాను. అతనిపుడు ఇక్కడికి వస్తాడు".

ఆమె మాట పూర్తవకుండానే ఇంటి ముందు బైక్ ఆగింది.

'నమస్తే ఆంటీ' అంటూ లోపలికొచ్చాడు.

"ఆంటీ, మీరంటే దివ్యకి చాలా గురి అనుకుంటున్నాను. మా పెళ్ళి విషయం మీతో మాట్లాడదామంది" – ఒక్కక్షణం ఆగాడు.

పిల్లవాడు చురుగ్గా ఉన్నాడు. అతన్నే పరిశీలనగా చూస్తూ కూర్చున్నాను.

'ఆంటీ! మా ఇంట్లో నాకు పెళ్లి సంబంధాలు సీరియస్‌గా చూస్తున్నారు. మా తమ్ముడు నా కంటే ఒక్క సంవత్సరం చిన్నవాడు. వాడు జాబ్‌లోచేరి మూడేళ్ళయింది. ఇద్దరికీ ఒకేసారి చేద్దామని మా వాళ్ల ప్లాన్. తమ్ముడికి సంబంధం కుదిరింది కూడా. నేనే ఇంకా ఏదీ నిశ్చయించుకోలేకుండా ఉన్నాను. నా లాగా ఇంజనీరింగ్ చేసి ఉద్యోగం చేసే అమ్మాయి కోసం నాన్న చూస్తున్నారు. నాకు దివ్య నచ్చింది. అందుకే మా వాళ్ళతో కబురంపించాను..." ఒక్క క్షణం ఆగాడు.

"పెళ్ళిచేసుకుని చదువుకోవచ్చు కదాంటీ! దాని కోసం పెళ్లి వాయిదా వెయ్యడం ఎందుకు. మీరే చెప్పండి"

'రవీ, పెళ్ళి అయ్యాక కూడా చదువుకోవచ్చు. కాని ఇల్లాలి బాధ్యత కూడా ఒకప్రక్క చూసుకోవాలి కదా – కొంచెం ఎక్కువ శ్రమ పడాలి" దివ్యకేసి చూస్తూ నవ్వుతూ అన్నాను.

"తమ్ముడు పెళ్ళి చేసుకుని స్టేట్స్ వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు. పెద్దవాణ్ని నాకు ముందు చెయ్యాలని అమ్మా నాన్న ప్రయత్నం."

అతని తల్లిదండ్రుల ఆలోచన సబబే! కానీ అది కాస్త సడలించడం కూడా ఈ కాలానికి పెద్ద అభ్యంతరం కాకపోవచ్చు.

"అయినా దివ్యకి పెళ్లికి అభ్యంతరం లేనప్పుడు వాయిదా వెయ్యడం ఎందుకాంటీ, పెంకితనం కాకపోతే!"

ఉలిక్కిపడ్డాను. ఇదేమిటితను, ఇలా మాట్లాడుతున్నాడు!?

దివ్య వైపు చూశాను. ఆమె అయోమయంగా చూస్తోంది.

"మేమేమైనా కట్నాలు, కానుకలు అడిగామా? పెళ్లి చెయ్యమనే కదా అడిగింది"

అతని ధోరణికి ఆశ్చర్యం వేసింది. దివ్యకి ఇతను సరైన వ్యక్తేనా?

"ఏమో ఆంటీ, తనని పెళ్ళికి ఒప్పించే బాధ్యత మీదే" ఒక్కక్షణం ఆగి లేచాడు.

"వెళ్లాలి ఆంటీ, ఆఫీస్‌లో పని కొంచెం చూస్కోవాలి. దివ్యా, వస్తావా? ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను"

దివ్య అతని ధోరణికి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆమె మరికాస్సేపు ఉంటాననడంతో అతను వెళ్ళిపోయాడు.

కట్నకానుకలు అడక్కుండా పెళ్ళి చేసుకుంటానన్న తన ప్రపోజల్‌కి ఒక గొప్పదనాన్ని ఆపాదించుకుంటున్నాడా? ఇష్టపడిన వ్యక్తి పట్లా నిష్ఠూరాలేనా? తన ధోరణే కాని కోరుకున్న వ్యక్తి మనసేమిటో అర్థం చేసుకునే సహనం లేదా?

తరతరాలుగా సమాజం పోషిస్తున్న మగవాడి అహంకారమా? అలా అనుకుందుకు

మనసొప్పలేదు. ఈ కాలంలో ఆడపిల్లలు, మగపిల్లలు సమానంగా చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూ ఇంకా ఈ రకమైన అభిప్రాయాలతో ఉందా యువతరం?!

"నా కసలు పెళ్ళి వద్దాంటీ" – సడన్‌గా అంది దివ్య.

"దివ్యా! అతను మాట్లాడిన పద్ధతిని బట్టి నువ్విలాంటి నిర్ణయం తీసుకోనవసరం లేదు. కాని అతనలా మాట్లాడటమూ సరైనది కాదు. అతనిది కాస్త దుడుకుస్వభావం అన్పిస్తోంది"

"ఏమో, అతని గురించి మనకేమీ తెలియదు. పెళ్ళి ఆలోచన లేనప్పుడు అతను చేసుకుంటానంటున్నాడని మనం ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోవడం ఎందుకు ఆంటీ".

నిజమే. అతనిది ఒట్టి తొందరపాటు తనమే అయితే ఆలోచించవచ్చు. కాని అతనేదో ఈ పెళ్ళితో దివ్యకి ఫేవర్ చేస్తున్నాననుకునే అభిప్రాయంతో ఉంటే మాత్రం ఈ సంబంధాన్ని వదులుకోవడమే మంచిది. నా ఆలోచనలు దివ్యతో అనలేదు.

"చూద్దాం దివ్యా, వాళ్ల పేరెంట్స్, మీ పేరెంట్స్ ఒకసారి డైరెక్టుగా మాట్లాడుకుంటే వాళ్ళ కుటుంబం, అతని వివరాలు మరిన్ని తెలుస్తాయి. అంతగా మనకి నచ్చకపోతే వద్దని చెప్పేయవచ్చు".

❖❖❖

ఆ రోజు దివ్య విషయం శ్రీధర్‌తో చెప్పాను. అతను న్యూస్ పేపర్‌లోంచి తల తిప్పకుండానే శ్రద్ధగా విన్నాడు.

"నీలాగే దివ్యక్కూడా కోరి చేసుకుంటానంటున్న మంచి భర్త దొరకబోతున్నాడన్నమాట"

తేలిగ్గా అంటున్న శ్రీధర్‌ని విసుక్కున్నాను.

"శ్రీధర్, సీరియస్‌గా వినండి. ఆ అమ్మాయి చక్కనిది, తెలివైనది. ఇంకా చదువుకుని మంచి భవిష్యత్తులోకి వెళ్ళాలని ఆశతో ఉంది. ప్రస్తుతం ఆమె చదువుకుందుకు అవరోధాలేం లేవు. రవి పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. కాని ఇలా మాట్లాడడం మాత్రం నాకు నచ్చలేదు!"

శ్రీధర్ ప్రశాంతంగా విన్నాడు.

"మంజూ, నువ్వు కొంచెం సీరియస్‌గా ఆలోచించు. వాళ్ళు చిన్నపిల్లలు. ఆవేశం వాళ్ళ లక్షణం. అతను తనకు నచ్చిన విషయాన్ని నిజాయితీగా చెప్పాడు. ఆమె చదువుకుందుకు అభ్యంతరం చెప్పలేదు. పెళ్ళి చేసుకుని, చదువుకోమన్నాడు. ఇంట్లో పెళ్ళి గురించిన ఒత్తిడి గురించి కూడా వివరంగా చెప్పాడు. చదువు పేరుతో దివ్యనెక్కడ చేజార్చుకోవలసి వస్తుందో అన్న భయంతో అలా మాట్లాడి ఉండొచ్చు. ఆ మాటల్లో మరేవో ఉద్దేశ్యాల కోసం మనం వెతకనక్కరలేదు. దివ్య కంగారుపడి పెళ్ళే వద్దంటోందంటే

ఆమె తప్పుకాదు. సడన్‌గా తన జీవితంలోకి వచ్చిన, రాబోతున్న మార్పుల్ని ఎలా అర్ధం చేసుకోవాలో తెలియని వయసు. మనం పెద్దవాళ్ళం కదూ. కొంచెం సవ్యంగా ఆలోచించి గైడ్ చెయ్యాలి వాళ్ళని"

శ్రీధర్‌ని విన్నాక కాస్త సర్దుకున్నాను. అతని ఆలోచనలు ఎప్పుడూ పాజిటివ్ దృక్పథంతో ఉంటాయి. నాకు ధైర్యాన్నిస్తుంటాయి.

వీలైతే దివ్య తల్లిదండ్రులతోపాటు వెళ్ళి రవి పెద్దవాళ్ళని కలవాలని నిర్ణయించుకుని నిద్రకుపక్రమిచాను.

❖❖❖

మధ్యతరగతి స్థాయికి ఒక మెట్టు పైనే ఉన్నారనిపించింది, ఆ ఇంటి వాతావరణం చూస్తే.

రవి తల్లి భవాని ఇల్లంతా తిప్పి చూపించింది. స్వంత ఇల్లు. రవి తండ్రి సర్వీసులో ఉన్నారు. వాళ్ళిద్దరి మాటల్లోనూ పెద్దగా అభ్యంతరం పెట్టేందుకు ఏమీ కన్పించలేదు.

"మా రెండో అబ్బాయికి సంబంధం ఖాయం అయిందండీ. ఇద్దరికీ ఒకేసారి చెయ్యాలని ఒక్కసారే చూడడం మొదలు పెట్టాం. మా మోహన్‌కి కుదిరిన అమ్మాయి బంధువుల అమ్మాయి పెళ్ళికి ఉందన్నారు. కాని దివ్యని చూసి ఆమెనే చేసుకుంటానని రవి చెప్పాడు. మా రవి ఒఠ్ఠి అమాయకుడు. బోలెడు కట్నంతో సంబంధాలు వస్తున్నా ఒక్కటీ నచ్చుకోలేదు".

రామచంద్రం, సుగుణ ఏం మాట్లాడాలో తెలియనట్లు కూర్చున్నారు.

నేను కల్పించుకుని అన్నాను.

"దివ్య చాలా మంచి అమ్మాయ. పరిస్థితుల్ని అర్ధం చేసుకుని, అవసరం అయినపుడు ఇంటి బాధ్యతని తీసుకుంది. ఇప్పుడు మళ్ళీ చదువుకోవాలని, రెండేళ్ళాగి పెళ్ళి చేసుకోవాలని అనుకుంటోంది"

"అర్ధం చేసుకునే అమ్మాయి అయితే మరీ మంచిది. మా వాడు కాస్త దుడుకు. ఇక చదువంటారా? వాళ్ళ ఓపిక. పెళ్ళి చేసుకుని చదువుకునేందుకు మా అభ్యంతరం ఏమీలేదు."

వాళ్ళని విన్న తర్వాత సంతృప్తి కరంగానే అన్పించింది.

❖❖❖

పెళ్ళయిన నెల రోజులకేమో రవితో కల్సి వచ్చింది. ఇద్దరూ సంతోషంగా కన్పించారు. నా మనసు కుదుటపడింది.

మోహన్ భార్య శృతి కూడా అత్తవారింటికి వచ్చింది. దివ్యకి తన వయసు అమ్మాయి

ఒక తోడు దొరికింది.

ఉన్న ఊళ్ళో యూనివర్సిటీ ఉంది. పి.జి. ఎంట్రన్స్ రాసింది దివ్య. రామచంద్రం, సుగుణ కూతురి సంసారం చూసి పొంగిపోయారు. కూతురి పెళ్ళి విషయంలో సరైన నిర్ణయం తీసుకున్నామన్న విశ్వాసం కలిగింది వాళ్ళకి.

సంక్రాంతి పండుగ తర్వాత సుగుణ మార్కెట్‌లో కల్సింది. పండక్కి కూతురు, అల్లుడు వచ్చి వెళ్ళారని సంబరంగా చెప్పింది.

అల్లుడి కోసం తాను ఏమేం పిండివంటలు చేసిందీ, కూతురూ, అల్లుడూ ఎంత సరదాగా ఉన్నదీ వివరించి, వివరించి చెబుతూనే ఉందావిడ. దివ్య అదృష్టవంతురాలని మురిసిపోయింది.

చదువు, సంసారం, ఉమ్మడి కుటుంబపు బాధ్యతల్లో బిజీగా ఉండి ఉంటుందను కున్నాను.

❖❖❖

చదువులో వెనుకబడిన పిల్లలకి సాయంకాలాలు కూడా స్పెషల్ క్లాసులు తీసుకో వడంతో స్కూలుపని తెమలకుండా ఉంది.

ఆ రోజు షాపింగ్ ముగించి బైటపడే సరికి బాగా చీకటి పడింది. సడన్‌గా ఎదురు పడిన దివ్యని చూసి సంతోషంగా కేక వేశాను.

"ఆంటీ!" అంటూ నన్ను చుట్టుకుంది పసిపిల్లలా. ఆమె కళ్లనిండా నీళ్ళు, అప్రయత్నంగా నా కళ్లూ చెమర్చాయి.

"ఏం దివ్యా! రవి మమ్మల్నందర్నీ మురిపించేశాడు కదూ!"

దివ్య ముఖంలో సిగ్గు, మొహమాటం బదులు ఒక ఉదాశీనత, ఒక బాధావీచిక నా కంటికి తోచాయి. ఆశ్చర్యపోయాను. కోరి చేసుకున్న భర్త, అర్థం చేసుకున్న అత్త మామలు.

దివ్య మౌనంగా ఉండిపోయింది. రోడ్ మీద నిలబడిపోయామన్న స్పృహ వచ్చి పక్కన కాఫీ షాప్‌లోకి తీసుకెళ్ళాను.

కాఫీ చెప్పి, 'ఏం దివ్యా, డల్‌గా ఉన్నావేం? చదువెలా సాగుతోంది?" ఆమెని మామూలు మూడ్‌లోకి తెచ్చే ప్రయత్నం మొదలుపెట్టాను.

"ఎమ్మెస్సీలో జాయినవలేదు ఆంటీ!"

"ఏమైంది?" నా నోటి వెంట అప్రయత్నంగా ప్రశ్న. తను ఎంట్రెన్స్ రాయడం, మంచి ర్యాంకు తెచ్చుకోవడం నాకు తెలుసు.

"కుదర్లేదాంటీ. రవి నానమ్మ కాలు జారి పడ్డారు. లేవలేని పరిస్థితి ఆవిడది. అదీ కాక రవి చెల్లెలు వాణి డెలివరీకి వచ్చింది. అత్తయ్యగారు సాయంగా ఉందువుగాని,

వచ్చే ఏడు చదువుకోవచ్చు అన్నారు".

"కాఫీ తీసుకో దివ్యా" – ఏం మాట్లాడాలో తెలియక నేనూ మౌనంగా ఉండి పోయాను.

కొత్తగా పెళ్ళయిన పిల్ల. ఉమ్మడి కుటుంబం. తనని డిస్టర్బ్ చెయ్యకూడదని నేనూ కలవలేదు. దివ్యలో మార్పు కన్పిస్తోంది. ఎప్పుడూ మిలమిలమంటుంటే ఆ కళ్ళు, ముఖం ఒక దైన్యాన్ని ప్రతిఫలిస్తున్నాయి.

"రవి ఎలా ఉన్నాడు?"

ఆ ప్రశ్నకి తలెత్తి నా వైపు చూడను కూడా లేదు.

"బావున్నాడు"

నా కెందుకో ఖంగారుగా ఉంది. దివ్య ఏదైనా సమస్యలో పడిందా?

"ఇంటికెళ్దాం పద దివ్యా" అన్నాను ఏమీ తోచక.

"లేదాంటీ. మళ్ళీ వస్తాను. ఇంటికి వెళ్ళాలి. ఇప్పటికే లేట్ అయింది" అంది లేస్తూ.

రామచంద్రం దంపతులను ఒకసారి కలవాలనుకున్నాను.

❖❖❖

ఆదిత్య బెంగుళూరు వచ్చి జాయినవడం, వాడికి సాయంగా అన్నీ అమర్చి పెట్టేందుకు నేనూ బెంగుళూరు వెళ్ళి, దాదాపు రెండు మూడు వారాల తర్వాత ఇల్లుచేరాను. శ్రీధర్ తనకు తోచినంతలో ఇంటిని బాగానే మ్యానేజ్ చేశాడు. ఇంటి పని, స్కూలు పని ఊపిరి సలపనివ్వలేదు ఒక రెండు వారాల పాటు.

సడన్‌గా దివ్య జ్ఞాపకం వచ్చింది. స్కూల్లో రామచంద్రని కల్సి మాట్లాడడం అస్సలు కుదరదు. అదీగాక ఆయన క్రితం నెల రిటైరయ్యాడు. వాళ్ళ కబుర్లు బొత్తిగా తెలియడం లేదు.

సాయంత్రం పనులు ముగించుకుని వాళ్ళింటివైపు బయల్దేరాను.

"రండి మంజులగారూ! మేమే మిమ్మల్ని కలవాలనుకుంటున్నాం. మీరు ఊరు వెళ్ళారని తెలిసింది"

రామచంద్రం ముఖం కళావిహీనంగా తోచింది. సుగుణ కాఫీ తీసుకు వచ్చి పక్కనే కూర్చుంది. ఆవిడ ముఖం వాడిపోయి ఉంది.

"దివ్య ఎలా ఉంది?"

నా ప్రశ్నకి ఆవిడ చటుక్కున నా చెయ్యిపట్టుకుంది.

"ఈ పెళ్ళి చేసి ఉండాల్సింది కాదు" – దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది.

భయంతో ఒక్కసారి మనసు మొద్దుబాయి పోయినట్లయింది. అన్నీ సవ్యంగా జరుగుతున్నంత సేపూ ఏదో కబుర్లు చెప్పుకోవడం వేరు. తీరా ఏదైనా సమస్య ఎదురైతే

ఏం మాట్లాడాలి? ఎలా పరిష్కరించుకోవాలి?

"దివ్య ఇక్కడే ఉంది. స్నేహితురాలెవరో వస్తే బయటకెళ్ళింది".

మనసు ఉగ్గపట్టుకుని వాళ్ళని వినేందుకు సిద్ధపడ్డాను.

దివ్య సంసారం ఆనందంగానే మొదలైంది. తోటి కోడలు శృతి కూడా సమవయస్కు రాలు కావడంతో కొన్నాళ్ళు అంతా సరదాగా, సవ్యంగానే ఉంది. కాని శృతి తాను పెద్ద కట్నంతో వచ్చానన్న భావాన్ని ఏదో రకంగా వ్యక్తపరుస్తూనే వుండేది.

ఆ రోజు శృతి పేరెంట్స్ కూతుర్ని చూసేందుకు వచ్చారు.

అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో శృతి తల్లి అంది –

"మా మరిది కూతురు రవికి ఈడు జోడుగా ఉంటుందనుకున్నాం. ఇంజనీరింగ్ చేసి, సాఫ్ట్‌వేర్‌లో చేస్తోంది. మా పిల్లలిద్దరూ ఒకే ఇంట్లో పడతారని ఆశపడ్డాం"

ఆవిడ మాటలకి దివ్య మనసు చివుక్కుమంది. పెళ్ళికి ముందు ఇలా మాట్లాడుకోవడం వేరు. పెళ్ళయిన తర్వాత ఇలాంటి చర్చలు...

"ఏం రవీ! మోహన్‌తోపాటు నువ్వూ స్టేట్స్ వెళ్ళేవాడివి. మా మరిది కూతురి పెళ్ళి చేసి, కూతుర్ని అల్లుణ్ణి స్టేట్స్ పంపాలనే ఆలోచనలో ఉన్నాడు!"

రవి మౌనంగా ఉండిపోయాడు. అక్కడున్న అందరికీ అది అసందర్భం అనిపించిందో లేదో తెలియదు కాని దివ్య మనసు మాత్రం గాయపడింది. అది మొట్టమొదటి చేదు అనుభవం అత్తవారింట్లో.

రవి పెళ్ళి ముందు సంబంధాలు వెతుకుతూ మ్యారేజ్ బ్యూరోల్ని కన్సల్ట్ చేసి ఉండడంతో పెళ్ళయిన ఆరు నెలలక్కూడా ఏవేవో సంబంధాలున్నాయని ఎంక్వయిరీ చేస్తుండేవారు.

అలాటి ఓ సందర్భంలో రవి వేళాకోళం చేశాడు దివ్యని.

'దివ్యా! చూడు, నాకు ఎంత సేలబిలిటీ ఉందో. నీకు భలే సులువుగా దొరికి పోయాను. బ్యాడ్‌లక్"

ఇలాంటి వేళాకోళాలు రాన్రాను ఒఠ్ఠి వేళాకోళాలేనా అన్న సందేహంలో పడేసేంత తీవ్రమవుతూ వచ్చాయి. దివ్య మౌనంగా వింటూ వచ్చింది.

అత్తగారు కూడా శృతిని ప్రత్యేకంగా చూస్తోందన్న వాస్తవం ఆమెకు అర్థం అయ్యేందుకు ఎక్కువ కాలం పట్టలేదు.

రవి ఆఫీసునుండి వచ్చి రిలాక్సయ్యాడు. అతను ఇదివరకటిలా లేడని గమనించింది దివ్య. అతని అల్లరి, ప్రేమ ఏమైపోయాయో!

ఎనిమిది దాటింది. టెర్రస్ మీంచి తిన్నగా వంటింట్లోకి వచ్చాడు.

"దివ్యా! నువ్వు నాక్కనిపిపించకుండా వుండాల్సింది."

ఉలిక్కిపడింది చపాతీ చేస్తున్నదల్లా, ఏమైందతనికి?

"అసలు నాతో పెళ్ళికి ఎందుకొప్పుకున్నావ్ దివ్యా? చెప్పు"

సమీపంగా వచ్చి స్టవ్ కట్టేసి, ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు.

దివ్యకి భయం వేస్తోంది. ఇతని మానసిక పరిస్థితి సరిగానే ఉందా? ఇలా మాట్లాడుతున్నాడేమిటి సడన్‌గా?

అతనేదో ఆలోచిస్తున్నట్లు పెరట్లో తచ్చాడుతున్నాడు.

దివ్య తనకి తనే క్రొత్తగా అన్పిస్తోంది. ఎందుకో ప్రతిక్షణం భయం భయంగా వుంటోంది.

పెళ్లి కాకముందు ఎంత ధైర్యంగా ఉండేది తను! తనకేమైంది? ఎవరితోనన్నా ఈ భయం గురించి చెప్పాలని ఉంది. కాని భయం దేనికంటే ఏం చెప్పాలి?

క్రొత్త జీవితానికి, క్రొత్త పరిసరాల్లో అలవాటు పడేందుకు తన ప్రయత్నాలు తను చేస్తూనే ఉంది. చదువు పోస్ట్‌పోన్ అయినందుకు కాస్త డిసప్పాయింటింగ్‌గా అన్పించినా నెక్స్ట్ ఇయర్ చదువుకోవచ్చున్న ఆశ ఉంది. మరెందుకు భయం?

ఒక్కసారి అమ్మా నాన్నల దగ్గర కెళ్దాం అన్పించింది. కాని తనెప్పుడు వెళ్ళాలనుకున్నా రవి కూడా వస్తాడు. ఒక్క అరగంట కూర్చుని పదమంటూ బయల్దేరదీస్తాడు. మనసారా అమ్మానాన్నలతో మాట్లాడి ఎన్ని రోజులైంది?

ఎప్పుడైనా తనంతట తనే రవి అమ్మ నెంబరు డయల్ చేసి మాట్లాడమంటాడు. 'సుఖంగా ఉన్నానని చెప్పు మీ వాళ్ళకి' అంటూ రెట్టిస్తాడు...ఏమిటిదంతా?

❖❖❖

రోజులు అస్సలు జరగనట్లనిపిస్తోంది. పగటిపూట రవి, మామగారు ఆఫీసుకు వెళ్ళాక రవి నానమ్మకి కావల్సినవన్నీ అమర్చి, వంట ముగించి, వాణి కూతురుతో కాస్సేపు కాలక్షేపం చేస్తుంది. సాయంత్రం అవుతోందంటే ఎందుకో బెంగ.

ఆ రాత్రి నిద్రపట్టక ఆలోచిస్తూనే ఉంది. సడన్‌గా రవి లేచి కూర్చుని, "చచ్చిపోతే బావుణ్ణు" అంటున్నాడు.

చచ్చిపోవడం ఏమిటి? ఎవరు? ఎందుకు? ఇప్పుడేమైంది? తనతో నోరిప్పి మాట్లాడడం మానేశాడతను పూర్తిగా. తనేదైనా మాట్లాడాలనుకున్నా సీరియస్‌గా ఉన్న అతని ముఖం చూసి దూరం దూరంగా మసలుతోంది. ఎందుకో మనసంతా తెలియని దుఃఖం.

అప్రయత్నంగా ఆ మధ్య ఎప్పుడో వాణి అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

'మా బావగారమ్మాయిని రవి అన్నయ్యకోసం అడిగారొదినా. వీడు వింటేగా. బోలెడు

ఆస్తి. ఒక్కత్తే కూతురు. బోలెడు కట్నం ఇస్తాం అన్నారు. పడనివ్వందే వీడు. నిన్ను చేసుకుంటానని కూర్చున్నాడు. వాడికి కట్నం మాటెలా ఉన్నా నాకొచ్చే ఆడపడుచు కట్నం కూడా పోయింది. నేనూ ఈ ఇంట్లో ఒక్క ఆడపిల్లనే మరి' ఒళ్ళో పాపాయిని పెట్టుకుని యధాలాపంగా చెబుతోందామె.

మళ్ళీ మళ్ళీ ఇవే మాటలు. పెళ్ళి కావాలసిన అబ్బాయో, అమ్మాయో ఉన్నారంటే ఎందరెందరో, ఎన్నెన్నో సంబంధాలు తెస్తుంటారు. ఇన్నాళ్ళ తర్వాత వీళ్ళంతా ఇంకా ఇంకా చెప్పుకుంటారెందుకు?

తను ఎక్కువ ఆలోచిస్తోందా? తను ఈ ఇంట్లోకి అడుగుపెట్టే ముందు వీళ్ళివన్నీ ఆలోచించుకుని అసంతృప్తితోనే తనను ఆహ్వానించారా? ఇప్పుడు మాటలు, చర్చలు ఎందుకు? అత్తగారైనా కూతుర్ని ఖండించదెందుకు? పెళ్ళి ముందు కట్న కానుకల గురించి మాట మాత్రంగానైనా అనలేదు.

తండ్రి తన స్థాయిలో చెయ్యగల్గినంత ఘనంగానే చేశాడు. ఇప్పుడు రవి అన్న మాటలకి అర్థం ఏమిటి? ఎందుకంత డెస్పరేట్‌గా చావు గురించి మాట్లాడుతున్నాడు. ఎవరి గురించి? చావు పుట్టుకలు సహజమైనవే అయినా 'ఈ మాట' పుట్టుక అంత సహజంగా ధ్వనించదేం?

తనెందుకీ రాత్రి ఇలా నిద్ర రాక ఇవన్నీ ఆలోచిస్తుంది?

అమ్మా నాన్నల దగ్గరకెళ్ళి నాల్గు రోజులుండి వస్తే...? కాని తను మామూలుగా వుండగలదా? కాని మళ్ళీ వెనక్కి వచ్చాక పరిస్థితి ఇలాగే ఉంటే ఎలా ఫేస్ చెయ్యాలి? ఏం చెయ్యాలి?....

తెల్లవారింది అన్యమనస్కంగానే రొటీన్‌లో పడిపోయింది. బ్రేక్‌ఫాస్ట్ అయి రవి, మామగారు వెళ్ళి పోయారు.

వంట ప్రయత్నంలో ఉంది. కూరలు తరిగి పెట్టి భవాని పొరుగింటికి వెళ్ళింది.

ఫోన్ రింగవటంతో డ్రాయింగ్ రూమ్‌లో కొచ్చింది. ఆ ప్రక్క రవి.

"దివ్యా!" – అతను తనని పేరు పెట్టి పిల్చి చాల్రోజులైంది.

"దివ్యా! నువ్వు...నువ్వు చచ్చిపోకూడదూ. ఈ పెళ్ళితో నా జీవితం నాశనం అయిందనిపిస్తోంది" – అతనేం చెబుతున్నాడో అర్థం అయ్యేందుకు రెండు క్షణాలు పట్టింది. అవతల ఫోన్ పెట్టేసిన శబ్దం.

గత కొన్నాళ్ళుగా ఇంట్లో వాతావరణంతో బిక్కు బిక్కుమంటున్న దివ్యకి రవి మాటలతో మెదడు మొద్దుబారి పోయింది. దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోలేక పోయింది. తనను తాను కంట్రోల్ చేసుకుని వంట ముగించింది. తానేం వింది? సరిగానే విందా? ఎవరి ముందూ బయట పడకుండా తనని తాను నియంత్రించుకుంటోంది.

రోజులు గడుస్తున్నాయి. రవి తల్లిదండ్రులతో చెబితే? అమ్మా నాన్నలకి చెబితే? ఎవరికి చెప్పాలి? ఎలా పరిష్కరించుకోవాలి? అతనితో మాట్లాడాలంటే అవకాశం ఇవ్వడం లేదు.

❖❖❖

ఆ సాయంత్రం వస్తూనే, "దివ్యా! బయటకు వెళ్దాం, పద" అంటూ బయల్దేర దీశాడు.

గుడి ఆవరణ ప్రశాంతంగా ఉంది. ఆమె ముఖంలో ఆందోళన.

"దివ్యా! నాకెందుకో ఈ లైఫ్ నచ్చడం లేదు. తొందరపడి నిన్ను చేసుకుని, జీవితంలో మంచి అవకాశాలు పోగొట్టుకున్నాను. నాకు నువ్వు వద్దు. నువ్వు బ్రతికుండగా ఇంకొక పెళ్ళి చేసుకోవడం సాధ్యం కాదు. నువ్వు చచ్చిపో. కాని కాస్త సహజంగా చచ్చిపో. మా ఇంట్లో మాత్రం వద్దు. మీ అమ్మ ఇంటికి వెళ్ళిపో. ఒక వారం రోజులు నేను ముంబయి వెళ్తున్నాను ఆఫీసు పనిమీద. రేపే నువ్వు మీ ఇంటికి వెళ్ళిపో?"

గత కొన్ని రోజులుగా, నెలలుగా అతని ధోరణి చూస్తోంది, వింటోంది. తను చెయ్యని తప్పుకి శిక్ష వేస్తున్నాడు. నిండా ఏడాది అవలేదు పెళ్ళి చేసుకుని. ఇతని మనస్తత్వం ఇలా ఉంటుందని ఊహించలేదు. ఏదైనా సైకలాజికల్ ప్రోబ్లమ్ అయి ఉండొచ్చన్న ఆలోచన వచ్చింది. కాని ఇతను అన్నీ తెలిసే ఇలా ప్రవర్తిస్తున్నాడు. అతనితో మాట్లాడే అవకాశం ఇన్నాళ్ళకు దొరికింది. అతనంతట అతనే కల్పించాడు.

తను మాట్లాడవలసిన టైము వచ్చింది.

"రవీ..." గొంతు పెగల్చుకుంది. తనకు తనే ధైర్యం చెప్పుకుంది తను మాట్లాడవలసిన మాటలు మననం చేసుకుంటూ...

"రవీ! మీ ధోరణి గత కొన్నాళ్ళుగా విచిత్రంగా మారిపోయింది. ముందు షాకయ్యాను. నన్ను నేను కూడదీసుకుందుకు ఇంత సమయం పట్టింది. మీరై నా జీవితంలోకి వచ్చారు. ఇప్పుడు నన్ను బ్రతికేందుకు వీల్లేదని శాసిస్తున్నారు. అలా శాసించేందుకు మీరెవరు? మన మధ్య ఎలాటి స్నేహం, సాన్నిహిత్యం ఉన్నాయని నేను మిమ్మల్ని మన్నించాలి? ఇంకా కొన్నాళ్ళు మీతో కల్సి ఉంటే నేనేమిటో పూర్తిగా మర్చిపోతాను. మీ మానసిక చాపల్యంతో విసుగెత్తి ఆత్మహత్య చేసుకుంటానేమో! అలా నన్ను కండిషన్ చేసేస్తారేమో అని భయంగా ఉంది..." ఒక్క క్షణం ఆగింది ఊపిరి తీసుకునేందుకు – "నేనెందుకు చచ్చిపోవాలి? ప్రాణంలా పెంచుకున్న అమ్మా నాన్నల్ని వదలి భవిష్యత్తు మీద నాకున్న ఆశలన్నీ చంపుకుని నన్ను నేనెందుకు చంపుకోవాలి? మీమీద ఎలాటి ఇన్ఫ్లూయన్సెస్ పని చేస్తున్నాయో నాకు అర్థం కాలేదు. ఇక అర్థం చేసుకోవాల్సిన అవసరమూ లేదు.

తెల్లవారి నేను వెళ్లిపోతాను. గడిచిన ఈ ఏడాదికాలం నా జీవితంలో జరగనే

లేదనుకుంటాను?” – చెప్పదలుచుకున్నది స్పష్టంగా చెప్పింది.

అతని ముఖంలో కాఠిన్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

❖❖❖

దివ్య గురించి చెప్పింది విని మనసంతా మొద్దు బారిపోయింది. ఈతరం తమ తరం కంటే మరింత విశాలంగా ఆలోచిస్తారని, వాళ్ళ ప్రపంచానికి హద్దులు, ఆంక్షలు లేవని నమ్ముతున్న దాన్ని. ఇదొక షాక్ నాకు.

శ్రీధర్‌కి చెబితే ఎలా రిసీవ్ చేసుకుంటాడు? ఈ తరంమీద పెట్టుకున్న నమ్మకానికి అతి పెద్ద దెబ్బ. ఎప్పుడొచ్చి కూర్చుందో దివ్య పక్కనే ఉంది.

“దివ్యా! ఇదంతా నువ్వు ప్రత్యక్షంగా అనుభవించావన్న వాస్తవం జీర్ణించుకోలేక పోతున్నాను. అతనికేదైనా సైకలాజికల్ ప్రోబ్లమ్ ఉందేమో ముందునుండీ.”

“ఆంటీ! అతను అన్నీ తెల్సి చేస్తున్నాడు. లేకపోతే నన్ను సహజంగా చచ్చిపొమ్మనగలడా? ఎంత పెద్దప్లాన్! మీరింకా అతని పట్ల సానుభూతితో ఆలోచిస్తున్నారా?” – సూటిగా అడిగింది.

ఆమె మనసు ముక్కలైంది. రామచంద్రం దంపతులతో కల్సి వెళ్ళి అతని ధోరణి గురించి ప్రశ్నించేందుకు నిర్ణయించుకున్నాను.

❖❖❖

“వాడు తొందరపడి ఆ అమ్మాయిని చేసుకున్నానని అంటే అన్నాడేమో! వాడి మనసుకల్లా తోచింది కాబోలు. ఎంతో మంచి మంచి సంబంధాలు చేజేతులా కాదనుకున్నాడు. పెళ్ళయి ఏడాదైంది. ఈపాటికి భార్యాభర్తలు ఎంత దగ్గరవ్వాలి?! అది లేదు. పైగా వాడి మీద నేరాలు చెబుతుందా పుట్టింటికొచ్చి” – భవాని కాస్త తీవ్రంగానే అంది.

“పుట్టింటికి రవి స్వయంగా ఆమెను పంపించాడని, బ్రతికి ఉండేందుకు వీల్లేదని శాసించా”దని ఆవిడకి చెప్పే ప్రయత్నంలో  ఆవిడ మరింత తీవ్రంగా మాట్లాడింది.

తన పెంపకంలో పిల్లల్ని చక్కగా పెంచుకున్నానని, అలాంటి బుద్ధులు తమ ఇంట ఎవరికీ లేవని గట్టిగా చెప్పింది.

“అసలైనా కోరి చేసుకున్నాడని వాణ్ణి బాగా లోకువ కట్టేశారు మీరూ, ఆ పిల్లా కూడా. పెళ్ళయింది కాని ఒక ముద్దూ ముచ్చటా లేదు. ఇలాంటి సంబంధం అని తెలిస్తే వాడి బ్రతుకు నాశనం అవకుండా జాగ్రత్త పడేవాళ్ళం” – ఇంక మాట్లాడేందుకు ఏమీ లేదన్నట్లు లేచి లోపలికి వెళ్ళిపోయిందావిడ.

రవి తండ్రి ఒక శ్రోతలా కూర్చున్నాడు.

ప్రపంచం ఎటు వెళ్తోంది? ఒక అబ్బాయి, అమ్మాయి పెళ్ళిచేసుకుని ఒక చక్కని కుటుంబంగా ఎదిగేందుకు పెద్దవాళ్ళు తల్లిదండ్రులు తమ అనుభవంతో వాళ్ళకి ఎలాంటి సపోర్టు ఇవ్వాలి?!

క్రొత్తదనం వదిలి ఒకరికోసం ఒకరు అన్న సాన్నిహిత్యం, నమ్మకం పరస్పరం ఏర్పడేందుకు దోహద పడాల్సిన పెద్దవాళ్ళు, సమాజం వారికి ఏ విధమైన గైడెన్సు ఇస్తున్నారు?

తమకంటే తమ బిడ్డలు మరింత సుఖమయ జీవితాన్ని అనుభవించాలని కోరుకునే పెద్దలు అందుకోసం ఏం చేస్తున్నారు? తమ జీవితానుభవం, విజ్ఞత బిడ్డల జీవితాన్ని సవ్యమైన బాటలోకి నడిపించేందుకు తోడ్పడకపోతే ఎందుకు?

అన్నీ ప్రశ్నలే....?

పెళ్ళి అనేది ఒక ఆరోగ్యకరమైన వ్యవస్థగా తరతరాలకి అందించేందుకు సమాజం ఎంత నిబద్ధత చూపిస్తోందో అనుమానించాల్సిన పరిస్థితులు చాలా తరచుగా ఎదురవుతున్నాయి.

ఇలాటి చేదు అనుభవాలతో కోల్పోయిన ఆత్మ విశ్వాసాన్ని తిరిగి పోగు చేసుకునేందుకు ఎంత ఘర్షణ! ఎంత సమయం పడుతుంది! ఎంత జీవితం వృధా అవుతుంది! నా మనసంతా చెదిరిపోయింది.

**('రచన' కథాపీఠం నవంబర్ 2008)**

# తోడు

సొంతపనిమీద నారాయణ గ్రామం వెళ్ళడం, వెంటనే రమ్మంటూ అతని వెనుకే కబురందడం, నారాయణ వెనక్కి రావడం వెంటవెంటనే జరిగిపోయాయి.

వస్తే ఏముంది?... ఇంటి పెద్ద ఇంటి బయట అరుగు ప్రక్కన, ఇంటావిడ గదిలో చీకట్లో, ఇల్లంతా ఎవరెవరో క్రొత్త ముఖాలతో...ఒక్క క్షణం ఊపిరాడనట్లయింది అతనికి.

తన మీద పడిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తున్నాడనేకానీ, మనసంతా తట్టుకోలేని బరువుతో కృంగిపోయి వుంది. మాణిక్యమ్మ గొంతు వినపడక ఆ పరిసరాలన్నీ మూగబోయినట్లున్నాయి.

జరగాల్సిన కర్మకాండంతా పూర్తయింది. ఒక్కొక్కరోజు ఎంత నిదానంగా వెనక్కి మళ్ళాయి అన్పించింది ఆ ఇంట్లో సభ్యులందరికీ. ఒక్కొక్కరే తమ గమ్యాలవైపు బయల్దేరేందుకు సిద్ధమవుతున్నారు.

పెద్దకొడుకు రామం, భార్య, చిన్నకొడుకు, భార్య, కూతురు లత అందరూ ప్రయాణపు సన్నాహాలలో వున్నారు.

మాణిక్యమ్మ ఇన్ని రోజులుగా ప్రపంచంతో నిమిత్తం లేనట్లు జరుగుతున్న కార్యక్రమం అంతా మౌనంగా గమనిస్తోంది. పెదవి విప్పి ఒక్క మాట కూడా మాటాడటంలేదు. పగలూ, రాత్రీ ఘనీభవించిన నిశ్శబ్దంలా కూర్చుని వుందావిడ. ఆ మనసులో ఏముందో ఎవరికీ అంతుబట్టడంలేదు. కొడుకులూ, కోడళ్ళూ,

కూతురూ ఎవరికి వారే ఆవిణ్ణి, ఆవిడ వైఖరినీ విచిత్రంగా చూస్తున్నారు. 'ఈవిడకేమైంది ఆకస్మాత్తుగా ఇలా మాటా పలుకూ లేనట్టు కూర్చుందేం' అని ఆశ్చర్యం, కాసింత దిగులూ.

ఇన్నేళ్ళుగా ఆవిడ నోటికి జడిసి ఆవిడ ఎదుట నోరిప్పని వాళ్ళు ఇప్పుడు ఆమె వైఖరికి తెల్లబోతున్నారు. ఏదో లోటుగా, జరగవలసిందేదో వున్నట్టు నిరీక్షిస్తున్నారు.

కూతురు చనువుతో దగ్గరికి వెళ్ళి పలకరించింది... "అమ్మా! ఒక్క మాటైనా లేకుండా ఇలా కూర్చున్నావేమిటమ్మా! మెల్లగా మనసు తిప్పుకోవాలి. ఇన్నాళ్ళూ నాన్నకి ఎవరూ చెయ్యలేనంత సేవ చేశావు. ఆయన ఏనాడూ దేనికి వెలితి పడకుండా కంటికి రెప్పలా కాచుకున్నావ్. ఆయనకీ, మనకీ రుణం తీరిపోయిందమ్మా!" తండ్రి జ్ఞాపకానికొచ్చి గొంతు రుద్ధమైంది. నిర్జీవమైన చూపులతో ఆవిడ అలాగే కూర్చుని వుంది. కోడళ్ళిద్దరూ విస్మయంగా చూస్తున్నారు.

పెళ్ళయి అత్తవారింటికొచ్చిన ఆ కోడళ్ళిద్దరూ...మామగారు లేవలేని స్థితిలో మంచంలో వుండటం, అత్తగారు ఇంటి చుట్టుప్రక్కల జనాన్ని ఇంట్లోవారిని కూడా నోటి కస్సుబుస్సులతో అదుపులో పెట్టుకున్న తీరు చూసి ముందు కాస్త జంకారు.

పెద్దకోడలు వత్సలకింకా జ్ఞాపకం...అత్తవారింటికి వచ్చిన క్రొత్త రోజులు... రెండిళ్ళవతల పేరంటం వుందని, వెళ్ళి రమ్మని అత్తగారు తననొక్కర్తినే పంపడం... ఇంటినీ, లేవలేని భర్తనూ కనిపెట్టుకు వుండిపోయిందావిడ.

"ఏమమ్మా! నువ్వే కదూ మాణిక్యమ్మ కోడలివి, పేరేమిటి?" అని, "అమ్మో! మీ అత్తగారు మహాగండ్ర మనిషి, ఎలా వేగుతావో కానీ" అని, "మీ మామగారు బావున్న రోజుల్లో ఎలా వుండేదోగానీ, ఇప్పుడంత నోరు దేనికో మరి" అంటూ ఒక్కొక్కరూ చేస్తున్న వాఖ్యలకు వత్సల మనసంతా భయాందోళనలతో నిండిపోయింది.

కోడల్ని గుమ్మంలోనే ఎదుర్కొంది మాణిక్యమ్మ... "ఇలా గంటల తరబడి కబుర్లు పెట్టుకుంటే పనులెలా అవుతాయి? ఇప్పటిదాకా ఏం చెప్పుకుంటున్నారేం?" ఆవిడ గొంతులో కోపమో, హేళనో అర్థంకాలేదు.

నిలబడితే 'నిలబడ్డావా?' అని, కూర్చుంటే 'కూర్చున్నావా?' అని గుక్క తిప్పుకోకుండా చేసేది.

పోనీ, కొడుకును అయినా ప్రేమగా చూసేదా అంటే ఉహూ, వాళ్ళనీ అంతే, పెందరాళే వస్తే... "పెళ్ళాంతో కబుర్లకి ఆఫీసు పని కట్టి పెట్టివచ్చావా" అని దెప్పిపొడిచేది. పొద్దుపోయి వస్తే... "ఆమాత్రం మొగుడికి చెప్పుకోలేవా" అని తనను సాధించేది.

భార్యమీద ఆధారపడిన నిస్సహాయత మాణిక్యమ్మ భర్తని ఇంట్లో జరిగే ప్రతి విషయంలోనూ నిమిత్తమాత్రుణ్ణి చేసింది.

ఉద్యోగరీత్యా అత్తవారిల్లు దాటి పొరుగూరు వెళ్ళడంతో ఒక రకంగా నిత్యం ఆవిడతో ఘర్షణ పడాల్సిన అవసరం తప్పింది ఆ ఇంటి కోడళ్ళకి. చిన్న కొడుకు నాగేంద్ర తల్లితో ఎక్కువ చనువుగా వుండేవాడు. అయినా ఆవిడ అతణ్ణీ విడిచి పెట్టేదికాదు.

యూనివర్శిటీలో చదువుకుంటూ ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానంటూ తల్లిమీద తిరుగుబాటు చేశాడు. ఆ ప్రయత్నాలు విఫలం చేసేందుకు ఆవిడ చెయ్యాల్సిన గొడవ అంతా చేసింది.

చిన్నకోడలు రమణికూడా ఊరుకునేదికాదు. "నేనిలాగే వుంటాను, నా పద్ధతులింతే. నామీద పెత్తనం చేస్తే ఊర్కోను" అంటూ మాణిక్యమ్మనింకా కవ్వించేది. ఆవిడ ఎదురు సమాధానం వినడానికి అస్సలు సిద్ధంగా వుండదని అందరికీ తెలుసు.

ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో వున్నా ఏడాదికో, రెండేళ్ళకో ఓసారి తొంగి చూసి కలతపడిన మనసులతో ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయేవాళ్ళు.

మాణిక్యమ్మ మనస్తత్వం పిల్లలకే అంతుబట్టడంలేదు. తల్లిగా చెయ్యాల్సిందేమీ తక్కువ చేయదు. కానీ, తల్లి ఒడిలాంటి హాయైన వాతావరణం మాత్రం ఆ పిల్లలకు దక్కనివ్వలేదావిడ. భర్తకు చెయ్యవలసిన సేవ అంతా చేస్తుంది. నోరెత్తే అవకాశం ఆయనకెటూ లేదు. ఇరుగూ పొరుగూ ఆవిడ వల్ల కావాల్సిన సాయం పొందినా అనవసరంగా ఆవిడ కళ్ళెదుట మాత్రం పడరు. ఆవిడ అంతో ఇంతో ఆదరించిన వ్యక్తెవరైనా వుంటే నారాయణ ఒక్కడే. ఎప్పుడో భర్త ఉద్యోగంలో వుండగా ఆయన ఊరి మనిషినంటూ వచ్చాడు. ఆదుకునేందుకు 'నా' అన్నవాళ్ళెవరూ లేరని, ఉపాధి చూపించమని ఆ గడప తొక్కాడు. ఆ క్షణం ఎలాంటిదోగానీ, ఆ ఇంట్లో అతనికి స్థానం దొరికింది. చెప్పినపనీ, చెప్పని పనీ అని కాకుండా అన్నీ తనంత తానుగా అల్లుకు పోయాడా ఇంట.

అయితే మాణిక్యమ్మకి నచ్చిన అంశం ఒకటుంది నారాయణలో. అందరూ తనని తప్పించుకు తిరుగుతుంటే నారాయణ మాత్రం 'పిన్నీ' అంటూ ఆమె వెనుకే తిరుగుతుండేవాడు. ఆవిడ మాటలన్నీ మౌనంగా భరించేవాడు. తిట్లు దీవెనల్లా స్వీకరించేవాడు. పెట్టింది తినేవాడు. మొత్తానికి తనకంటూ ఏదో ఒక ఆధారం చూపించిందన్న కృతజ్ఞత, యేళ్ళ తరబడి ఇంట్లో సభ్యుడిలా మసలుతూ రావడంతో తోడైన ఆత్మీయత ఏమోగానీ, మొత్తానికి అతడ్ని ఆ ఇంటికి కట్టిపడేశాయి.

❖❖❖

వచ్చిన చుట్టాలకు, బయటవాళ్ళకు కావాల్సినవన్నీ నారాయణే చూస్తూ, అన్నింటా తానై తిరుగుతున్నాడు. కానీ, అతని మనసుమాత్రం మాణిక్యమ్మ చుట్టూ తిరుగుతోంది.

అన్యమనస్కంగా తిరుగుతున్న నారాయణ చెవిన పెరట్లో చేరిన మాణిక్యమ్మ పిల్లల మాటలు పడుతూనే వున్నాయి.

"మళ్ళీ ఎప్పుడూ కలుస్తాం మనమంతా? ఆ ఇచ్చేదేదో ఇప్పుడే తేల్చి చెబితే బావుంటుంది పెద్దొదినా!" లత మాటలకు వత్సల భర్తకేసి చూసింది. అతడు తమ్ముడ్ని చూశాడు ప్రశ్నార్థకంగా.

నాగేంద్రకు ఇదంతా చిరాగ్గా వుంది. అదో పరాయి ఇల్లులా, ఆ మనష్యులంతా తనకేమీ కానట్లుంది. పైగా ఈ ఆస్తి గొడవ ఒకటి...

"మా ఆయన ఆదర్శం అంటూ కూర్చుని పైసా ముట్టుకోలేదు అత్తవారింట. ఈ ఇల్లు తాతగారి నుంచి వచ్చిందే కదా! నాకూ భాగం వస్తుంది. మీకు మాత్రం తెలియందేముంది?" లత తన మనసులో మాట అన్నయ్యలకు నిస్సంకోచంగా చెప్పింది.

అన్నదమ్ములిద్దరికీ కూడా ఆ క్షణాన ఆ ఇల్లు అమ్మి ఆ ఊరితో సంబంధాలు తెంచుకుందామని వుంది. అయితే తండ్రి కర్మకాండలై నాలుగురోజులు కూడా కాలేదు. లోకం ఏమనుకుంటుందో! అని లాగుతోంది. పోనీ, చెల్లెలు పేరు చెప్పి త్వరగా తెమిల్చి పారేద్దామన్నా ఆమెకూ వాటా అనడం ఒక తలనొప్పిగా తయారైంది.

అసలు తల్లేమంటుందోనన్న భయం ఇద్దరిలోనూ వుంది. ఆవిడ మౌనం వాళ్ళను కాస్త అయోమయంలో పడేసింది. ఆవిడ అభిప్రాయం ఏమిటో తెలియడం లేదు.

సడన్‌గా అక్కడున్న అందరూ "నువ్వే చెప్పు" అంటే "నువ్వు చెప్పు" అనుకోవడం నారాయణ దృష్టిన పడింది.

"నారాయణా! ఒక్కసారి  ఇటు రావోయ్!" రామం పిలుపుకు నారాయణ వాళ్ళకు సమీపంగా వెళ్ళాడు.

"నారాయణా! అమ్మని ప్రస్తుతం ఇక్కడే వుంచుదామనుకుంటున్నామోయ్! నేను ఇప్పుడున్న ఇల్లు మరీ చిన్నదిగా వుంది. అమ్మ వచ్చినా ఇబ్బంది పడుతుంది. నాగేంద్రకేమో ట్రాన్స్‌ఫర్ వచ్చే టైం అంటున్నాడు. లతా! నీ సంగతేంటి?" అంటూ చెల్లెలువైపు చూశాడు రామం.

"మీరిద్దరు కొడుకులుండగా నా దగ్గరకెందుకొస్తుంది అమ్మ! అదీకాక మా ఇంటి గృహప్రవేశం చేసుకుని ఇంకా రెణ్ణెల్లయినా కాలేదు. ఆ క్రొత్త ఇంటికేం తీసుకెళ్ళను అమ్మను? నాకు వీలుకాదు బాబూ!" అంటూ తప్పించుకుందా ఇంటి ఆడపడుచు.

"సర్లే నారాయణా! నువ్వు కొన్నాళ్ళు అమ్మను కనిపెట్టుకుని వుండు. నీ భార్యను పురిటికి పంపావట కదా! సాధ్యమైనంత త్వరగా తీసుకొస్తే అమ్మకు తోడుగా వుంటుంది. వీలు చూసుకుని త్వరలోనే ఇంటి వ్యవహారం పూర్తి చేయిస్తాం. అమ్మ ఎక్కడో ఒకచోట

కాలక్షేపం చేసుకుంటుందిలే!"

ఆ ఇంటి పెద్దకొడుకు మాటలు విని నారాయణ ఒళ్ళు జలదరించింది. ఆ ఇంట పుట్టిన పిల్లలేనా? కన్నతండ్రి పోయి, తల్లి దిక్కులేనిదానిలా వుంటే వీళ్ళిక్కడ చేసే ఆలోచనలివి! వీళ్ళ మధ్య తల్లీపిల్లల అనుబంధం ఏమైందీ?

నారాయణ ఆలోచనల్లో అప్రయత్నంగా ఓ జ్ఞాపకం మెదిలింది...

పొరుగున్న వున్న ఇంటివాటాలో విశాలక్షమ్మగారుండేవారు. ఆవిడ కొడుకులిద్దరూ ఉద్యోగరీత్యా దూరంగా వున్నారు. వృద్ధాప్యంలో అంతంత దూరాలు వెళ్ళడం ఇష్టంలేక విశాలక్షమ్మ, ఆమె భర్త ఒకరికొకరుగా గడుపుకొస్తుండేవాళ్ళు.

ఆ వృద్ధుడు అనారోగ్యంతో హాస్పిటల్‌లో జాయినై ఓ తెల్లవారుఝామున అక్కడే పోయాడు. విశాలక్షమ్మ ఇంత ముంచుకొస్తుందనుకోలేదు. సమయానికి పిల్లలూ లేరు.

భర్త శవాన్ని రిక్షాలో వేసుకుని ఇంటికొస్తే ఆ ఇల్లుగల ఆసామి ససేమిరా శవాన్ని ఇంటి ఆవరణలోకి తీసుకువచ్చేందుకు వీల్లేదన్నాడు. కొడుకులొచ్చే వరకు భర్త శవాన్ని అక్కడే వుంచేందుకు అనుమతించమని ఆమె వెక్కిళ్ళ మధ్య ప్రాధేయపడింది.

స్నానం ముగించి, పూజకు పూలు కోసుకునేందుకు బయటకొచ్చిన మాణిక్యమ్మ విషయం గ్రహించింది. మరుక్షణం సొంత తోబుట్టువులా విశాలక్షమ్మని దగ్గరకు తీసుకుని ఆశ్రయం ఇచ్చింది. కొడుకులొచ్చే దాకా తనే ఆదుకుంది.

మాణిక్యమ్మ మాటే కాక, మంచి మనసునూ చూసిన ఇరుగు పొరుగు ఇప్పుడు పెరట్లో జరుగుతున్న ఈ చర్చలు కొంచెం కొంచెంగా అవగాహన చేసుకుంటున్నారు. కానీ, పరాయి ఇంటి వ్యవహారంలో ఏమని తలదూర్చగలరు?

❖❖❖

"మీరిలా బాధపడుతూ కూర్చుంటే ఎలాగమ్మా?" నెమ్మదిగా ధైర్యం కూడదీసుకుంటూ అన్నాడు నారాయణ.

పాలిపోయి, జీవకళ కోల్పోయిన ఆవిడ ముఖం చూడలేక నారాయణ తలదించుకున్నాడు. అతనికి దుఃఖంగా వుంది. ఓదార్చవలసిన తనే ఇలా ఉంటే... అందుకే తమాయించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

"చూశావురా నారాయణా!... " ఇన్ని రోజుల మౌనాన్ని ఛేదిస్తూ నోరు విప్పిన మాణిక్యమ్మ ధోరణికి స్థిమితపడ్డట్లు తలెత్తాడు.

"ఎన్నాళ్ళయింది? అసలు జ్ఞాపకమేలేదురా, మీ బాబుగారు లేచి తిరగడం. ఎన్నేళ్ళు?...ఎన్నేళ్లు?! పసిపిల్లాడిలా నా చేతులమీద చెయ్యాల్సిందే కదా ఆయనకంతా!

అప్పుడే కాలేజి చదువులకొచ్చిన పిల్లలు. ఆవేశం తప్ప ఆలోచన తెలియని వయసు. నేను మెతకదనం చూపిస్తే వాళ్ళెక్కడ గాడి తప్పుతారో అని నాలోని తల్లి మనసును చంపుకుని గయ్యాళిలా వాళ్ళను వెంటాడేదాన్ని.

చదువులో వెనకబడుతున్నారేమో, ప్రవర్తనలో దారి తప్పుతున్నారేమో అని అనుక్షణం వాళ్ళనుకళ్ళల్లో పెట్టుకుని పెంచుకొచ్చాను. వాళ్ళ భవిష్యత్‌కోసం ఆరాటపడ్డాను. అయినా వాళ్ళకు నేనేమిటో తెలియదు. తండ్రి అసహాయంగా మంచంలో వుండటం, తల్లి గయ్యాళితనం వాళ్ళనెంత మూగబాధకు గురిచేశాయో!

చూశావురా! నా పిల్లలు ఈరోజు సుఖంగా వున్నారు. వాళ్ళను సరైన దారిలోకి మళ్ళించానన్న తృప్తి వుంది. నోటిమాట, శరీరంలో కదలికా పోగొట్టుకున్నా, నాకెదురైన ప్రతీ సమస్యా, కష్టం ఆయనకు చెప్పుకున్నాను. ఆయన చల్లని చూపు నాకెంత ధైర్యం ఇచ్చేదని!" ఆమె ఒక్క క్షణం ఆగింది. గతమంతా కళ్ళముందుకొచ్చినట్లుంది. మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"మా కడుపున పుట్టినందుకు ఆ పిల్లలు దేనికీ వెలితి పడకూడదనేరా నా తాపత్రయం. కోడళ్ళొచ్చాక ఇంటి బాధ్యత వాళ్ళకు అప్పగిద్దామన్నా లేవలేని మీ బాబుగారిని, ఆయన్నంటివున్న నన్ను ఎక్కడ లోకువ చేస్తారోనని భయపడ్డాను. నేను మనసు లేని మనిషిని అనిపించుకున్నా బాధపడలేదురా! కానీ...

ఒరేయ్ నారాయణా! ఇంక నాకిప్పుడు తోడెవర్రా? నేను ఎవరికోసం బ్రతకాలి? ఎందుకోసం బ్రతకాలి? పిల్లలు రెక్కలొచ్చి వెళ్ళి పోయినా పసి పిల్లాణ్ణి సంరక్షించుకున్నట్టు నాకంటూ ఆయన వుండేవారు. మరి ఇప్పుడు...?"

భర్త పోయిన క్షణం నుంచి ఆవిడ మనసులో పేరుకున్న అంతులేని దుఃఖం కట్టలు తెగిన ప్రవాహంలా ముందుకురికింది. అశక్తుడే అయినా భర్త తన వెంట వున్నాడన్న భావం ఎంత శక్తిని ఇచ్చేది? తానిక ఒంటరిది! ఒట్టి అనాథ...ఈ ఆలోచనలతో మాణిక్యమ్మ భోరున ఏడ్చేసింది.

"మీ చేతుల్లో ఇంతవాడినయ్యాను. నేనున్నానమ్మా మిమ్మల్ని చూసుకునేందుకు! మీరు ఒంటరి కాదు' అని చెప్పాలని నారాయణ యత్నం. కానీ దుఃఖంతో నిండిన గొంతు పెగలడం లేదు!

**('ఆంధ్రజ్యోతి' నవీన – 11 నవంబర్, 1991)**

# నోస్టాల్జియా

ఇసుకలో కూరుకుపోతున్న పాదాల్ని తేలిగ్గా లేపే ప్రయత్నం చేస్తూ... లయబద్ధంగా అడుగులు. లయ... ప్రక్కనే కడలి అలల ప్రేరణ. దాదాపు ఏడెనిమిదేళ్ళ తర్వాత...

ఈ పరిసరాలు, ఈ సంద్రతీరం!

అదే ఇసుక, అవే కడలి తరంగాలు, అదేగాలి మృదు స్పర్శ...

కాని ఏదో అనీజీనెస్...

గుండె మండువాలో అస్పష్టమైన ఆరాటం...

ఇన్నేళ్ళుగా చదివిన చదువుకు సార్థకత పేరుతో ఆ నగరపు కోలాహలం మధ్య బందీ జీవితానికి అలవాటు పడిన తర్వాత అప్రయత్నంగానే గుండెసవ్వళ్ళు విన్పించుకోకుండా తిరిగేస్తున్న నేను...

కనీసం తీరిగ్గా పాత జీవితపు కలల్ని, ఆ జ్ఞాపకాల్ని నెమరువేసుకుందుక్కూడా సమయం లేని యాంత్రిక జీవితం!

ఇలా.... ఉద్యోగ బాధ్యతలో భాగంగా ఈనాడు ఈ పరిసరాల మధ్య మళ్ళీ మసలే అవకాశం....

కాని.... ఏదో శూన్యం నన్ను వెన్నాడుతోంది.

చిక్కని అడవి మధ్యలో ఒంటిగా నిలబడి, మత్తయిన

పరిమళాలను ఆస్వాదిస్తూంటే చటుక్కున ఊపిరాడని ఫీలింగ్!...

ఏమిటిది? ఏమిటిది?

మస్తిష్కానికి అందనిది, ఆ క్షణాన ఏమిటది?

ఒక్క క్షణం మనసంతా.... మనసు చెదిరిన పిచ్చివాడి తీరున....

ఆలోచనల కందనిది, ఏమిటది?

ఈ ఆలోచనలు వదలవు. మెలకువలోనూ, నిద్రలోనూ వెంటాడి, వేటాడే క్రూర మృగాల్లా...

ఆలోచనలు ఎగసిపడే అలలకు పోటీగా...

తలెత్తి ఆకాశంలోకి చూశాను. చంద్రోదయానికి ఇంకా సమయం ఉన్నట్లే ఉంది.

అందులోనూ నడి 'మే' మాసపు గ్రీష్మతాపంతో, పొగరుగా ఒళ్ళు విరుచుకుంటున్న ఆంధ్రదేశం...

కాస్త దూరంలో సిమెంటు బెంచీ మీద కూర్చున్న కాటన్ చీరల ఫెళఫెళలు.

ఎవరిదో, ఒక గొంతు...

'జిందగీ ఇక్ ప్యాస్ బన్‌కర్ రెహగయీ'

సల్మా ఎక్కడా అందనంటోంది.

అప్రయత్నంగా అడుగులు తడబడ్డాయ్. నిలబడి పోయాను. ఎదురుగా 'సీగల్', చిన్న 'టీ' బంక్.

పాత జ్ఞాపకాలు... సంద్రం మీంచి వచ్చే గాలి అల్లరికి బిక్కమొహం వేసుకుని చెల్లా చెదరైన క్రాఫు...

ఇక్కడే.... ఇదిగో సరిగ్గా ఇదే స్పాట్‌లో ఆనాటి సాయంత్రం...

ఒఠ్ఠి ఓ నాటి సాయంత్రమేనా?

అలా ఎన్ని సాయంత్రాలు 'తన' తో 'టీ' షేర్ చేసుకోలేదూ!

షాహీన్!

సడన్‌గా జ్ఞాపకాల మూల బిందువు ప్రత్యక్షం. సడన్‌గానా? అదీ జ్ఞాపకాల్లోంచి బయట పడిందా? ఎంత హిపోక్రసీ నేర్చాను ఈ నాగరికపు బ్రతుకు సమాధిలో?!

ఈ గుండె చప్పుళ్ళు ఊహ తెలిశాక ఆగిందెప్పుడు?

యూనివర్శిటీ క్యాంపస్‌లో తొలి చూపులో ఖైదై పోయిన వెర్రి మనసు. దానికి

మరుపెక్కడ? అసలు మరుపు తెరపడని చోట జ్ఞాపకపు పొర ఏమిటి మళ్ళీ ప్రత్యేకంగా?

హిపోక్రసీ! ఆ పదం షాహీన్ నోటి వెంట...

ఆ సాయంకాలం ఇలాగే ఎర్రెర్రని సూరీణ్ణి, సాయంకాలపు విశాఖ గాలుల్ని పంచుకుంటూ లైబ్రరీ వైపుగా తమ అడుగులు...

'మీరింత హిపోక్రయేట్ అనుకోలేదు'.

అకారణంగా ఆమె కోపం తనకు తెల్సున్నదే.

తప్పేమిటో చెప్పకుండా కోప్పడుతున్న టీచర్‌లా...

జారే స్పెక్ట్స్ లోంచి నా ప్రశ్నార్థకం.

'పుట్టిబుద్ధెరిగాక తెలుగు సిన్మా చూడలేదు, చూడబోను' అని స్టేట్‌మెంటిచ్చి నిన్నగాక మొన్న వసుంధరకి 'చిత్రాలయ'లో, నిన్నంటే నిన్న శోభకి 'సంగమ్'లో....'

ఆ వాక్యాన్నలా అసంపూర్తిగా.... తనేమని చెప్పాలి? నిజమే. గత రెండ్రోజులు వరుసగా తను రాంబాబు వాళ్ల చేతుల్లో పడ్డాడు. తప్పించుకోలేని మొహమాటస్థుడు తను. తన ప్రమేయం ఏమీ లేకుండా దాదాపు మోసుకెళ్ళి థియేటర్‌లో పడేశారు తనని. ఇలా చెప్పి తను కన్విన్స్ చెయ్యగలడా? వ్యర్థ ప్రయత్నం.

చురచురా చూసింది తన మౌనాన్ని.

ఎంత మితభాషిగా సౌమ్యంగా కన్పిస్తుందో అంత కఠినంగా గాయపరుస్తుంది. నిజమేనేమో!

సృష్టికర్త అందమైన బొమ్మను చేసి, ఆ బొమ్మ మరీ చక్కెర బొమ్మ అవుతుందని భయపడి, చురుకైన మాట ఇచ్చేడేమో!

మాట చూస్తే ఇంత కఠినం. చూపు సరే, అది చూపు కాదు, గ్రుచ్చుకోనిదెప్పుడు?

'పైగా ఒక్కమాట కూడా మాట్లాడరు. అంతేలే. దోషి వైపు ఆర్గ్యుమెంటు ఏముంటుంది?'

ఆ కవ్వింపు... అదే నన్ను వెర్రివాణ్ణి చేసేది. ముక్కు కొసవరకూ జారిన స్పెక్ట్స్ వెనక్కి తోశాను ఆవేశంగా.

తనని విమెన్స్ కాలేజీ వరకూ చేరేసే బస్! అదిగో, నా పాలిట శత్రువు శరవేగంతో వస్తోంది. అల్‌విదా...

'కభి అల్‌విదా నా కెహనా...'

మనసు కూనిరాగం. వెర్రి దిగులు. ఎందుకు?

ఆమె జ్ఞాపకాలు.... అదోవెల్లువ.

చుట్టూ అదో రకపు నిశ్శబ్దం... ఆమె జ్ఞాపకాలు మృదుమంజీర నాదాల్లా చెవిన పడుతున్నాయి. ఒక్కసారి ఒళ్ళు జలదరించింది. నన్ను నిస్సత్తువలో పడేసే జ్ఞాపకాలు.... నిర్వీర్యుణ్ణి చేసే జ్ఞాపకాలు... అడుగు ఇంత బరువుగా పడుతుందేం?

విమెన్స్ హాస్టల్ మీంచి కాసిని అడుగులు కొలిచినట్లుగా వేస్తే అనంతమైన చేతులు చాచి ఆహ్వానిస్తూ...

ఆ కాసిన అడుగులు ఎప్పటికప్పుడు నూతన అనుభవమే. సంభాషణంతా ఆమెకూ, తనకూ మధ్య మౌనమే. తనని చూడగానే పలకరింపుగా విచ్చుకునే ఆ లేత గులాబీ మొగ్గలు...

ఆ పరవశం తాలూకు సడి, అది గుండెలో చేసే చిరు అలజడి. మౌనంగా ఆమె ప్రక్కనే...

ఆ చీర కుచ్చెళ్ళు జీరాడే పలుచని పాదాల మెరుపు. ఆ మెరుపుల వంక దొంగ చూపులు చూస్తూ... నిత్య నూతన అనుభవమే తనకది.

ఏదో చెప్పబోయి, చటుక్కున తల త్రిప్పి తన చూపులు గమనించి చిర్నవ్వుతో తల త్రిప్పుకున్న ఆమె రూపం!... దొరికిపోయిన దొంగలా సిగ్గుపడిపోయి ముడుచుకు పోయే తను...!

ఆ రోజు...

సీగల్ సమీపంగా నడిచివచ్చి, చెరో కప్ చాయ్‌ని సమోసాతో షేర్ చేసుకుంటూ ఏవేవో కబుర్లు.

తిలక్ కవిత్వం దగ్గర మొదలై అలా సాహిత్యం, రచయితల వైపుగా పయనించింది.

'అసలు మా వార్డెన్‌ని చూసిన ఏ రచయితైనా ఇట్టే ఓ కథ గిలికి పారేయగలడు'

చిర్నవ్వుతో చూశాడతను.

'నాకు తెల్సు మీ కుతూహలం. మగబుద్ధి! .... ఆవిణ్ణి చూసి అంటే ఆవిడ నేచర్ చూసి అని' కందిన ముఖంతో అంది.

'ఏంటా నవ్వు? ఏవో నాల్గు కవితలంటూ గిలికేరో లేదో పెద్ద కవి, రచయిత అయిపోయినట్లు ఆ పోజ్ చూడు' చిరుకోపంతో ముఖం వింత అందాన్ని తెచ్చుకుంది.

ఓ పది నిముషాలు అలా నిశ్శబ్దంతో సంభాషించేక తనే అంది –

'శ్రీ, ఏదైనా పాడు' సడన్‌గా మారిపోయే ఆమె మూడ్ చూసి తనకెప్పుడూ వింతే.

అరచేతిలో గీతలు చూసుకుంటున్న నేను సమోసా మోసుకొచ్చిన కాగితమ్ముక్క వైపు అప్రయత్నంగా చూశాను. రాజ్‌కపూర్ ఫోటో. అంతటి కళాకారుడు మనల్ని దాటి ఎటో మహాప్రస్థానం వైపు కదిలి అప్పుడే... ఎందుకో 'మేరా నామ్ జోకర్' లో ఆకాశమంత ఆవేదన గొంతులో దర్శింపచేసిన ముఖేష్ పాట అందుకున్నాను.

ఆ పాట పాడాలని ముందుగా నేనేం అనుకోలేదు. స్పాంటేనియస్‌గా అలా పెదవులు దాటి ఆ అలల నేపథ్యంలో ...

నా కళ్ళు తెరిచే ఉన్నాయో, అరమోడ్పులయ్యాయో ప్రక్కన భౌతిక ప్రపంచపు స్పృహ నాకు లేదాక్షణాల్లో.

సడన్‌గా పాట ఆగిపోయింది. ఆగిపోవడం కాదు, పూర్తయిపోయింది. మరింక లేదు పాడేందుకాపాట.

ఆమె వైపు చూశాను. ఎటో దూరంగా సారించిన చూపుల కొనలు తళుక్కున మెరుస్తున్నాయ్ చెమరించి. ఈ అమ్మాయి ప్రకృతి నా కసలు అర్థంకాదు. ఆమె ఓ పజిల్. ఓ క్షణం కసురుతుంది. మరోక్షణం లాలన. మరోక్షణం బేలగా ... ఎంతో వైరుధ్యం!

ప్రతి చిన్న అనుభవానికీ చెమర్చేకళ్ళూ, ప్రతి చిన్న అసందర్భ విషయానికీ స్పందించేసి ఆ క్షణంలో పూరించే విప్లవశంఖం. ఇదేమిటి? సున్నితమైన పొయెట్రీ ఇష్టం అంటుంది. అంతలోనే పోరాటానికి రెడీ.

ఒక్కోసారి ఆ కోపంతో ఏక వచన ప్రయోగం చేస్తుంది. అది తనకొక ఎగ్జయిట్‌మెంట్! జలపాతాలన్నీ ఏకమై ఉరుకుతున్న సంచలనం.

ఈ అభిమానాలు, అభిప్రాయ కలబోతలు, పంచుకునే సంభాషణలు, కల్సివేసిన ఈ అడుగులు, కన్నుమూసి తెరిచేలోగా కదిలిపోయిన ఎన్నెన్ని గంటలు... ఏమిటి వీటికర్థం?

ఇదేనా ప్రేమంటే?

షాహీన్! నీ ఫీలింగ్స్ ఏమిటి? నువ్వూ నాలాగే ఆలోచిస్తున్నావా?

మనసులో ప్రశ్నలు బయటకి రావు ఎట్టి పరిస్థితిలోనూ. నేనేం చెయ్యను? నాకే ఎందుకు ఈ బలహీనత?

భీమిలి! ఎన్నాళ్ళుగానో వెళ్ళాలన్న 'ఆశ' ! సముద్రాన్ని, ఏ భేషజాలు ఎరుగని ప్రకృతిని చూడాలని ఎన్నేళ్ళుగానో మనసులో గడ్డకట్టుకుని ఉన్న ఆశ.

భీమిలి వెళ్ళి ఆ పాత కట్టడాల మధ్య తిరుగుతూ మధ్యలో ఓ మారు ఊళ్లోకి తొంగి

చూసి, ఆ పెద్ద చెట్టు నీడన 'టీ' బంక్ దగ్గరకి ఆశగా నడిచారు మిత్రబృందం అంతా.

ఒడ్డున ఉన్న ఆ చిన్న చిన్న పడవల సమీపంలో... అలా కబుర్లు ఏవేవో నోటికొచ్చిన కూనిరాగాలు...

ఆమె అందరితోనూ సరదాగా కబుర్లు చెబుతుంది. ఓ చైతన్య ప్రవాహం ఆమె వంకే చూస్తూ కాస్త దూరంగా, ఒంటిగా నేను. ఆ జనంలోంచి విడివడి ఓ సారి సమీపంగా వచ్చి కూర్చోరాదూ?

ఛ.... తనెంత స్వార్థపరుడైపోతున్నాడు! కాని ఈమె విషయంలోనే ఎందుకు?

ఒంటిగా, దూరంగా ఉన్న తననే చూస్తూ ఆమె ఏదో అంటోంది. అందరూ గొల్లుమన్నారు. ఆలోచనలు చెదిరి కోపం వచ్చింది. ఎందుకో అర్థంకాదు. బహుశా సున్నితంగా ఆమె గురించి ఆలోచిస్తూంటే ఆ అల్లరి, డిస్టర్బెన్స్ భరించలేను.

తలవిదిల్చి స్పెక్ట్స్ సర్దుకుని లేచి ఇంకా దూరంగా నడిచాను. ఒక్కసారి బిక్కమొహంతో స్పష్టాస్పష్టంగా ఆమె.

తిరుగు ప్రయాణంలో అక్కసు కొద్దీ మదన్ ప్రక్కసీట్లో కూర్చుని అర్థంలేని సంభాషణలోకి దిగింది. జస్ట్ తన ముందు వరుసలో, రెండు మూడుసార్లు తల త్రిప్పి తన భావాలు చదివే యత్నం చేసినా తను గమనించనట్లే ఉండిపోయాడు.

ఇంతలో ఇట్టే పరీక్షలైపోయాయి. ఎవరిగమ్యాలవైపుగా వాళ్ళు. మనసంతా శూన్యం. ఉన్నదంతా ఎవరో బలవంతంగా దోచుకున్న అనుభూతి. మనసు ఖాళీ అయిన ఫీలింగ్.

వీడ్కోలు సన్నివేశం.

ప్లాట్‌ఫాం మీద కల్సిన ఆ క్షణాలు. ఆ జన ప్రవాహంలో, గార్డు చేతిలో పచ్చజెండా అంతకంతకూ రక్తప్రసరణ వేగాన్ని పెంచేస్తూంటే, మాటలు ఒక్కటీ రావే. అసలు జీవితంలో మాటే నేర్వని ఫీలింగ్.

తమ మధ్య అంతస్థుల అగాధాలు, సమాజమేర్పరచిన వైరుధ్యాలు. కాని తల్చుకుంటే అవి అడ్డుగోడలేం కావు. పెంచి పెద్ద చేసిన పరిసరాలు వీడి బయటపడలేని బలహీనత. ఒకింత కమ్యూనికేషన్ గ్యాప్. కాసింత అహంకారపు తెర – ఇనీషియేటివ్ విషయంలో.

అప్పటికి ఆలోచించనీయలేదు జీవితపు విలువలు. ఆ ఇగో అలాంటిది. అంతే, కోల్పోయిన మరుక్షణం నుంచి....

ఎక్కడో జీవితం నుండి విడివడిన భావం. బ్రతకడం నేర్పీయకుండా బ్రతుకులోకి తోసిన ఎవరిమీదో కసి, కోపం. బ్రతకడం అనే కళ తానెన్నడు తెల్సుకున్నాడసలు, పోగొట్టుకుందుకు?

అసలు బ్రతికిన క్షణాలెన్ని? బ్రతుకులోంచి ఎప్పుడు జారిపోయింది భవిష్యత్తును నిర్ణయించాల్సిన ఆ క్షణం.

గుండెలోగిట్లో అస్పష్టంగా కదలాడుతున్న రూపం స్పష్టంగా వెక్కిరించిందీ క్షణం. నేనేం కోల్పోయానో ఈ క్షణాన అర్థం అయిందనిపిస్తోంది. నిజమేనా? కాని...

ఎదురుగా, విశాలంగా పరుచుకున్న సంద్రం ఇంకా దేనికోసమో ఆరాటంగా అన్వేషిస్తూన్నట్లు అలల పోరాటం సాగిస్తోనే ఉంది. దాని లోతైన గుండెలో ఎన్ని గుబుళ్ళున్నాయో మరి!

❖❖❖

MANAM MINUS NUVVU
IS EQUAL TO OTTI NENU



Nadella Anuradha